భారతి

జూలై 1970

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒక రూపాయి

భారతి

మాసపత్రిక

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

జూలై 1970

★

సంపుటము : 47 : సంచిక : 7 :

విడిప్రతి వెల ఒక రూపాయి

వి ష యా ను క్ర మ ణి క

జూలై 1970

ఊర్మిళా తపస్సు

శ్రీ వావిలాల రామమూర్తి

1

సూర్యోదయము లేక సుఖమెఱుంగనియట్టి
కలికి తామరమొగ్గ తలఁపు నెఱిఁగి,
యామినీనాథు సమ్యగ్దర్శనముఁ గోరు
తమి గుహా యోగనిద్ర గలిఁ దలఁచి,
యోగనిష్ఠురిలోన, భాగంబుఁగొని, పాగు
నిర్గంధవాతి సన్నియము మెంచి,
క్షీరనీరంబుల సారంబు గుర్తించి,
యాత్మఁ గ్రోలెడు, రాజహంసఁ గాంచి,
పగలనక, రాత్రియనక, నెవ్వగ హరించి,
నిర్మలానంద ఘనసీమ నిలచి, భర్త
నుభయతారకంబుగఁ గొల్చు, నూర్మిళసతి
యామె; పావనప్రేమ రసాబ్ధియూర్మి!

2

ఐహికాముష్మిక శ్రీ హితావన్య పా
తివ్రత్యమహిమ, చంద్రికలుగాయు;
నార్షధర్మ వినిర్మితామలరాగ సం
స్థాన రూపమ్ము, వాసనలఁ జింద;
మానితోద్వేల మహానంద జలనిధి
వ్యాకీర్ణరవము, మదశ్రులోలుక;
అతిపోఽథసికృత తతకంకణోర్మికా
మంజీరములు, హ్రీని, మనికి విడఁగ;
తనదు తపమంతయును శుభోదర్కమగుట,
లలిత జాగ్రత్స్వప్నంబు కలిమిఁ గొనక—

ముగ్ధమోహానరుచులు తన్ముఖమునింప—
రాజబింబాస్య నల్పు, దుర్భరతపమ్ము—

3

రాగమ్ము బంధించె, యోగిని విబోధక
కలికించితమ్ము, లే క్రియ వెలుంగు?
భోగమ్ము వెలివెట్టె, నేగతి చెలువొందు
మకరికాపత్రి సంబంధి రదన?
భర్తృశుభాగమభాగ్య నిర్వర్తిత
వ్రత, తను పోషణాగరిమ పొల్పగునె?
పతివియోగగృహీత భవ్యమానవికాం,
మధుర వాగ్విలసన మార్గ మెట్లు?
రాజసమ్మొకవంక, ధీరత్వ మొకట,
వరతపోనిష్ఠ, కార్యతత్పరత, వెరసి,
మూర్తిగొన్నట్టి యామెలో, మురువుసూపు,
నొక సుమిత్రాసంబంధి భావోదయమ్ము—

4

తనసేవ, దూరీకృత సమస్త సద్భోగ
నిదయు విభ్రాజిత నిశ్చలమతి;
తన భర్త, జీర్ణపత్రికలాబు నీవార
కందమూల మధు మాకంద భోక్త;
తన పాను, గిరివక్రితతి నైశితస్థండి
ల గ్రావ శార్కరిల తలశాయి;
తన పతి, విగతనిద్రా జాగ్ర దగ్రజ
సేవావిలగ్న సౌశీల్యమూర్తి;
తనకు రాజోపభోగ సంతతులవె! యట
తనకు ధృతసూత భక్త్యమాత్యాదిక లవె!
తనకు వరహంసతూలికాతల్పము లవె!
తనకు విశ్రాంతివిహితనిద్రాసుఖ మవె!

5

మాయయునో మాయయుదో మాదిరి కిన్నవ యువతి.
గోళమ్ములవి, కనుగొవు జగము;
విప్పనో విప్పదో వెలఁది యాస్యము దంతి
రసనాదిభాసి, పల్కదు వదన్ను;
కదపునో కదపదో కలికి చేతులు తూఁగ్ల
జంటను హసియించు నల్పవునవి;
సల్పునో సల్పదో, నలిబుద్ధి, యాలోచ
నం, బన్యవృత్తిలోలంబు కాదు;
ఆమె చూపులుచూడ దివ్యములు, వెలుఁగు
నామె గంభీరవాక్కు, దివ్యము, వెలుంగు
నామె బద్ధకరాలు, దివ్యములు, వెలుఁగు
నామె బుద్ధివైభవము దివ్యము, వెలుంగు—

6

రాజబింబ తిరస్కరణదక్షక ముఖానఁ,
తీరుగాఁ దిలకంబు దిద్దునేమొ!
మేరుసానుసమాన సార సద్వక్షాన
హీరముక్తాఫలహార మిడునొ!
హైమాబ్జరాజ దినవ్య పాదయుగాన
లాక్షారసానఁ బారాణి యిడునొ!
సర్వాంగసుందరత్వాని శరీరాన
నాశ్లిష్టబాహుమాల్యము నెఱపునొ!
యెవ్వరెఱుఁగుదు రామెలో నెలమిఁ బ్రోది
గొన్న భర్తృపూజనములు, మిన్నుమన్ను
తిల్ల క్రిందైన తోఁణకని ధర్మమేదొ
తెక్కలీనెడి పలిదేవతా తిలకము—

7

పలిదివ్యవదనాబ్జ బహిరాగత స్మితమరంద
తుందిల బంధురోష్ఠలత, నవ్వు;

పత్యహార్చికలగ్న భ్రాతృనిష్ఠితభవ్య
సేవైక నిరతనస్థితికి, వెలుచు;
పతిసమాగతిదైత్యభామారిరంసా వి
హారసక్రియకు నానందమునడు;
పతి పథూనీపాదపద్మ సంరచిత సా
ష్టాంగ నమస్కృతి, కాత్మఁబొంగు;
నద్ది కలగాఁగఁ దోచు మదాంధులకును,
అద్ది సంయమనంబుగ నాత్మవిదుల,
కద్ది యున్మాదముగఁ దోచు, బుద్ధి సెడిన
వారలకు, నా పతివ్రతా ప్రకటవృత్తి—

8

తన బాష్పజలము నాథునకుఁగా నిచ్చు పా
దోదకంబై, కశ్మలాది తొలఁగఁ;
దన తనూకాంతి నాథునకుఁగా నిచ్చు నీ
రాజనంబై తమోరాశి తొలఁగఁ;
దన హృదయంబు, నాథునకుఁగా నిచ్చు నై
వేద్యమై, సత్పుణ్య వితతి వెలయఁ;
దన మోవితేనె, నాథునకుఁగా నిచ్చు పా
నీయమై గార్హస్థ్య నియతి నెగడఁ;
బతికి షోడశపూజలు మతిని సల్పు
సతి యనఁగఁ, బతిదేవతా సరణిదిద్ది,
మార్గదర్శక ధ్రువతార మహిమఁగొన్న
రాజబింబాస్య, సల్పు, తీవ్రతర తపము.

9

రమణీయ ప్రభుమూర్తి మోహన శరీర స్ఫారలావణ్య భా
గ్యము, భోజ్యంబుగ, నామె సల్పు తప మవ్యాజోర్జితసత్ప్రమత్తా—
అమరశ్రేణి, సఖీవియోగ జనితాయాసమ్ము పీనమ్ము, స్వాం
తమునన్ భర్తకు రాముకై, వలపు తత్ ధ్యానమ్ము, హర్షింపఁగన్.

—

ఆముక్తమాల్యద - కర్తృత్వనిర్ణయము

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

1

ఆముక్తమాల్యదను రచించినది శ్రీ కృష్ణదేవ రాయలా, పెద్దనయా, మరియొకరా అను వివాదముతో ఆంధ్ర విమర్శకలోకము బహుకాలము నుండి తర్జనభర్జనలు చేయుచున్నది. మరల దానినే పునరుక్తము చేయుటకు దీని నుపక్రమించుటలేదు. వెనుకటి వివాదము లన్నియు నప్పటి కున్న అధారములమీద నిటు నటు నడచినవి కాని అందులో జాంబవతీపరిణయము ప్రస్తావనకు రాలేదు. తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయములో దాని వ్రాతప్రతి కలదని చెప్పినవారేకాని దాని వివరము లీ వివాదములోనికి తెచ్చినవారు లేరు. అదృష్టవశమున నిటీవల శ్రీకృష్ణదేవరాయ విరచిత మగు జాంబవతీపరిణయమును ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడెమీవారు డా. బి. రామరాజుగారి సంపాదకత్వమున ప్రచురించినారు గనుక దాని నిప్పుడు సాహిత్యాభిమానులు పరిశీలించు నవకాశము లభించినది. రాయలు రచించినా రను సంస్కృత గ్రంథములలో ఇది తప్ప మరేదియు ఎక్కడను ఉన్న జాడ మన కింతవరకు లభింపలేదు. ఇప్పు డీ సంస్కృత నాటకము నాధారము చేసికొని సత్యనిరతులగు విమర్శకులు మరియొకమారు ఆముక్తమాల్యదా కర్తృత్వమును గూర్చి విచారణ చేయుట యవసరమగుచున్నది.

2

భరత ఖండములో స్థపతులు శిల్పులు చిత్రకారులు అద్భుతములైన భవనములు నిర్మించి విగ్రహములు భాస్కరించి చిత్ర రచనలు చేసినారు. వారి పేరులు మాత్ర మెవరివో నూటికి కోటి కొకటి తప్ప మన కిప్పుడు తెలియరాకున్నది. వారి ప్రధానాదర్శము ఉత్తమ కళాసృష్టి చేయుటేకాని వానితో పాటు తమ నామము నిలుచుటకాదు. ప్రాచీనకాలము నుండి లలిత కళలు మహాసామ్రాజ్యాలముగా విలసిల్లిన చీనా, జపానువంటి ప్రాచ్య దేశములలో నట్లు కాక శిల్పులయు, చిత్రకారులయు నామములు ప్రసిద్ధముగా తెలియవచ్చుచున్నవి. పాశ్చాత్య దేశముల సంగతి చెప్పనే అక్కరలేదు.

శిల్పాదులందేకాక మన దేశములో కావ్యనిర్మాణమందు గూడ కావ్యకర్తలకు తమ రచనలు నిలువవలెననే ఉద్దేశమేకాని వానితో తమ పేరులు శాశ్వతములు కావలెనను కోరిక విశేష మున్నట్లు తోపదు. వేదర్షులు మంత్రద్రష్టలుగా భావింపబడుచున్నారుగాని మంత్రకర్తలుగా కాదు. ఇప్పుడు వాల్మీకములో షుమారు 24000 శ్లోకము లున్నవి కాని వాల్మీకి రచించినవి 8,000 మాత్రమే యని పరిశోధకుల యభిప్రాయము. అది సత్యమైనచో అందులో 16000 శ్లోకములు రచించిన కవులు తమ పేరు కొరకు శ్రద్ధ వహింపలేదని స్పష్టపడుచున్నది.

ఇక మహాభారత మున్నది. దాని కర్త వ్యాసుడని ప్రసిద్ధి. వ్యాస శబ్దమునకే కూర్పరి, సంపాదకుడు అను నర్థమున్నది. మూలగ్రంథము 24000 కాగా నది నేడు 1,25,000 గ్రంథముగా విస్తరించినది. ఇట్లు ప్రక్షిప్తములైన భాగము లెన్నో అద్భుతమైన కావ్య భాగములు. ఆ మహాకవులందరు వ్యాస నామములో నంతర్హితులైనారు. ఇక మహాపురాణములును, ఉపపురాణములును శతాబ్దములపాటు పెరిగిపోయినవి. అవి రచించిన వారిలో మహాకవులే కాక కుకవులును ఉన్నారు. వారందరు వ్యాస నామములో అంతర్హితులైనారు.

ఉపనిషత్తులకు గూడ నిట్టి యవస్థయే సంభవించినది. నేడు మనకు ఉపలభ్యమగుచున్న ఉపనిషత్తులన్నియు అనాదిగా ఉన్నవికావు. వానిలో పది

పం(డెంటిని మా(తమే (శీమలాచార్యులు (పమాణముగా (గహించిరి. తక్కిన వానిని ఎవరి యభిమానము కొలది వారు కొన్నిటిని (పమాణీకరించుచున్నారు. ఆ ఉపనిషత్తులలో పెక్కింటిలో ఉత్తమమైన ఉపాసనలు భావనలు కలవనుటకు సందేహము లేదు. ఆ ఉపనిషత్కర్తలందరు వేదర్షి నామములలో లీనమైనారు. అక్బరు పాదుషా కాలములో అల్లోపనిషత్తు పుట్టినది. దానికి ఋషినామము కలపడలేదు.

భాస కాళిదాసుల కాలముల నాటికే కావ్యము కవికి యశస్సు కలిగించుననుభావము వ్యాపించినది. ఐనను నేడు భాస నాటక చ(కమనుపేర (పచారములోనున్న రూపకముల కర్త ఎవరో సందేహాస్పదముగానే ఉన్నది. మహాకవి కాళిదానుది సొంత పేరా బిరుదమా అనునది సందేహ విషయమే. (శీ శంకర భగవత్పాదుల పేర ఎందరెందరు కవులు (గంథకర్తలు తమ రచనలు చెలామణి చేసినారో ఆ భగవంతునికే ఎరుక! 14 వ శతాబ్దమువారైన (శీ విద్యారణ్యుల పేర ఇప్పటికి రెండు శతాబ్దముల (కిందటివరకు (గంథ జాతము పుట్టుచుండినట్లు తెలియుచున్నది.

పూర్వ లాక్షణికులు కావ్య (పయోజనములలో ధనము కూడ చేర్చి అందుకు ఉదాహరణముగా '(శీ హర్షాదులవలన ధావకాదులు ధనము పొందినట్లుగా' అని చెప్పియున్నారు. కాని అట్టి ధనాపేక్ష కూడ లేకుండ తమ రచనలను ఇతరుల పేర్లతో (పచారము చేసిన (గంథకర్తలు మన దేశములో శతములుగను సహ(సములుగను ఉన్నారని మనము గుర్తుంచుకొనవలెను. కవులు తమ (గంథములను ఇతరుల పేర పెట్టేరా యను విషయము విచారించునప్పుడు మన దేశములో అనూచానముగా వేద మం(త (దష్టలవద్దనుండి నేటివరకు వచ్చుచున్న సం(పదాయము గూడ మనస్సులో నుంచుకొనుట యుక్తము!

3

ఆం(ధులు రచించిన సంస్కృత (గంథముల కర్తృత్వమును గూర్చిన వివాదములను వదలి ఆం(ధ (గంథములను గూర్చిన వివాదములనే (గహించినచో వానిలో ముఖ్యమైనవి ఇవి:

1. నన్నయ భారతమును రచించెనా? రాజరాజ నరేం(దుడే రచించెనా? రాజరాజనరేం(దుడే రచించెనని డా. చిలుకూరి నారాయణరావుగారివాదము.

2. అరణ్య పర్వ శేషములో ఎ(రయ శిథిల భాగములు పూరించెనా, రచనచేసెనా?

3. రంగనాథ రామాయణమును రచించినది గోన బుద్ధారెడ్డియా, రంగనాథుడా?

4. భాస్కర రామాయణము రచించినది మం(తి భాస్కరుడా, హుళక్కి భాస్కరాదులా?

5. (కీడాభిరామము రచించినది వల్లభరాయుడా, (శీనాథుడా?

6. భాగవత భాగములు ఎంతవరకు స్వతం(తములు, ఎంతవరకు శిథిల పూరణములు?

7. ఆముక్తమాల్యద రచించినది (శీకృష్ణదేవరాయలా, పెద్దనయా, మరియొకరా?

8. ఉత్తర రామాయణము రచించినది కంకంటి పాపరాజా, అతని మి(తుడు పుష్పగిరి తిమ్మనయా?

9. బిల్హణీయము రచించిన దెవరు?

పై తొమ్మిదింటిలో నన్నయ భారతము రాజరాజ నరేం(దుడే (వాసినాడన్న వాదమును విమర్శకులు పట్టించుకొనక చిరునవ్వుతో వదలివేసినారు. బిల్హణీయములోని చ(కబంధమువలన అసలు (గంథకర్త నామమును ఉద్ధరించినారు. తక్కిన ఏడు (గంథముల విషయము వివాదములును ఏడు రావణ కాష్ఠములుగానే కొనసాగుచున్నవి.

కాని ఆ వివాదములు సాగుచున్న తీరులో ఎంతో భేదమున్నది. రంగనాథ రామాయణ ఆముక్తమాల్యదల కర్తృత్వ విషయములో (పభు కర్తృత్వ పక్షమువారు పరపక్షమువారిని కొంతవరకు అసభ్యముగా కూడ అనదగినట్లు నిందించుచుండుట విశేషము. తక్కిన వాదములలో ఎంత తీ(వతఉన్నను, జుగుప్సాకరమైన నిందలకు దిగలేదు. పూర్వ (పభువులను వా రాదరించిన కవులను చిన్నచూపుతో చూచే ఈ కాలములో, మరి యా యిద్దరు (పభువుల విూదను కొందరు చూపే దురభిమానమునకు మూల

కారణమేమో బుద్ధిమంతులకు ఊహింపసాధ్యము కాకున్నది. సత్యా సత్య విచారణకు అతీతమైన కారణ మేదో ఉండదగును. ఆ ప్రభువుల పక్షము వాదించు వారి నిప్పుడా ప్రభువులు ధనాదిక సమ్మానము చేయలేరుగదా!

ప్రస్తుతము రంగనాథ రామాయణ కర్తృత్వ వివాదమును వదలి ఆముక్తమాల్యదా కర్తృత్వ వివాద ములనే పరిశీలింతము.

4

పై మాటలకు ఉదాహరణముగా ఆముక్త మాల్యదను రాయలే వ్రాసిరని సమర్థించిన వారిలో నిద్దరి మాటలే ఉదాహరింతుము. అందులో ఒకరు యువకులుగా నున్నప్పుడు వ్రాసిన మాటలు. రెండవ వారు పెద్దలు, లబ్ధ ప్రతిష్ఠులు, నేడు కీర్తిమాత్ర శేషులు.

మొదటివారు శ్రీ వెల్దండ ప్రభాకరామాత్యులు- వారు ఆముక్తమాల్యద అను గ్రంథము 1945 లోను మరల 1958 లోను ప్రచురించినారు. రెండవ ముద్రణమునుండి కొన్ని భాగములు ఉదాహరించు చున్నాము.

"ఈ గ్రంథమున కొక గ్రహచారము పట్టి నది. కృష్ణరాయ లీ గ్రంథమును రచించినను వ్రాయ లేదని.....ఇట్టి యసందర్భ ప్రలాపములను లేవదీయు టకు కారకులైన ప్రాజ్ఞుల యాదర్శ మేమిటో తెలియ రాకున్నది. ఇవి వారి యభూత కల్పనలై యుండును. ఇట్టి యభాండములు వేయుట ప్రాజ్ఞుల లక్షణము కాదు. ఇట్టి యభాండములు, యసంబద్ధ ప్రలాపములు నాధునిక సాహిత్య యుగమున విమర్శనలు బయలు దేరిన పిదప పెక్కు బయల్వెడలినవి. బాణు డుల్లేఖిం చిన విధమున ప్రతి గృహమున నపరిణత విజ్ఞా నము, ప్రతిభావ్యుత్పన్నతలు గల కవులు విమర్శకులు "శ్వాన ఇవ సంతి గృహే గృహే" యున్నప్పు డిట్టివి రాకతప్పదు". (పేజీలు 20—21)

వారి మాటల సారాంశము అచ్చ తెనుగులో అను వాదము చేసినచో, రాయల కర్తృత్వమును కాదను వారు కుక్కలవంటి వారన్నమాట. శ్రీ వెల్దండను గూర్చి వారి గురువులు శ్రీ కురుగంటి సీతా రామయ్యగారు, "పిన్నవాడగుటచేతను, అనుభవము తక్కువ యగుటచే ననేక శబ్దార్థ దోషములు దొరలి నవి. బాల్య చాపల్యమును, గ్రంథకర్త కావలెనను ఔత్సుక్యమును గ్రంథముద్రణమునకు పురికొల్పినవి. సహృదయులు దోషగులను పాటింపక గుణలేశము లనే పాటించి చిరంజీవి నాశీర్వదింపవలెనని వేడు చున్నాను" అని వ్రాసిన దానిని గౌరవించి రాయం కర్తృత్వము కాదన్నవారు పట్టి కుక్కలుకారు, కాలభైరువునివలె జగన్మాన్యులని అన్వయింతము. మరి డా. చిలుకూరి నారాయణరావు స్థవిరులుగదా! "ఆముక్త మాల్యద కర్త కృష్ణరాయుడే" అని వారు వ్రాసిన వ్యాసములో ఏమనిరో విందాము. అది 1941 లో భారతి సంపు. 18 సంచి. 5 లో మొదట వెలువడినది. ఈమధ్య డా. జి. వి. సుబ్రహ్మణ్యంగారి సంపాదకత్వమున సారస్వత వ్యాసములు (ప్ర. సం.) అను పేర ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడెమీవారు ప్రచురించిన మంచివ్యాసముల సంపుటిలో పునర్ముద్రిత మైనది. దానివల్ల దాని విలువ యినుమడించినది. ఆ సంపుటిలోనుండి ఉదాహరిస్తున్నాము.

"ఆముక్త మాల్యదా కర్తృత్వమును గురించి సందేహము లెందుకు కలుగుతవో నాకు బోధపడ కుండా ఉన్నది. "నేను వ్రాసినానయ్యా!" అని కృష్ణరాయుడు నోరు విడిచి చెప్పుకుంటూ ఉండగా, "ఛా! ఊరుకో! నీవు ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు ఏ సందర్భములో వ్రాసినావు? నీవు యుద్ధాలుచేస్తావా రాజ్యాలే ఏలుతావా?....కావ్యాలు వ్రాయడానికి నీకు తీరిక ఎక్కడ ఉంది? అసలు నీ వేమి చదువుకొన్నావు?" అని అతనిని నిలబెట్టి సాగదీసి అడగడమేమి బాగుం టుంది? అతని పరోక్షములో అతని సమకాలి కుల పరోక్షములో ఇటువంటి ప్రశ్నలు వేస్తున్నారు గనుక సరిపోతున్నదిగాని?—" (పే. 206)

చివరి ప్రశ్నకు తర్వాత నున్న డాషుకు అర్థము బహుశః అప్పాజీకి అంత్యకాలములో జరిపిన శాస్తియే అధమ పక్షము అట్టి వారికి జరిగి ఉండెడిదని భావము కావచ్చును. నన్నెచోడుని కుమార సంభ వము లోని,

"మును మార్గ కవిత లోకం
బున వెలయఁగ దేశి కవితఁ బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"

అను పద్య మొక్కటి ఆధారము చేసికొని ఆంధ్ర భారతమును వ్రాసినది నన్నయకాదు, రాజరాజ నరేంద్రుడే యని ఈ శ్రీ నారాయణరావుగారే నిశ్చయించి తమ రాజభక్తి ప్రకటించిరని మనము ఈ సందర్భములో గుర్తించుకొనవలెను. ఆ వ్యాసములో మరికొన్ని భాగాలు చూతము.

"కవి ననుకొని అప్పకవినని పేరు పెట్టుకొన్న అప్పన్న వ్రాసిన తప్పుడు వ్రాత నాధారముగా చేసుకొని ఇటీవలివారు ఆముక్తమాల్యదను పెద్దన్నకు తగిలిస్తే నిలుస్తుందా? ఆముక్తమాల్యద వంటి ప్రబంధమును వ్రాయడానికి మెరుగుల మేనత్త పని చేసిన పెద్దన్నవంటి వా డెన్నాళ్ళు తపస్సు చేయవలెను? పెద్దన్న కవిత్వాని కా కటుత్వమూలేదు, ఆ పటుత్వమూ లేదు. అతని కా పాండిత్యమూలేదు... ఆ లోకానుభవమూలేదు....ఆ వినయ సంపదా లేదు: అల్లసానివా డల్లా ఇల్లా అల్లుకుపోయినాడు......" (పే. 206—207)

మూడు వందల సంవత్సరాల పైకాలము నుండి ఆంధ్ర భాషలో పండితులకు, కవులకు భిక్ష పెట్టిన ఆ ఛాందస బ్రాహ్మణుడైన అప్పకవిని నేటి విమర్శకులు దూషించుట పరిపాటి యయినది. అయువేకాక, రాయలచేత ఆంధ్ర కవితా పితామహుడని సంబోధింపబడుచు, నిండు పేరోలగములో ఆయన చేతనే కవి గండ పెండేరమునకు తగుదువని పాదమున తొడిగించుకొన్న పెద్దన కూడ శ్రీ నారాయణరావుగారి చీవాట్లు తినవలసి వచ్చినది. వారేకాదు ఈ కాలపు పండితులుకూడ వారిచేత మాట పడవలసి వచ్చినది.

"పులిమీద పుట్ర అన్నట్టు ఇప్పుడు జగద్గురువు లొకరు బయలుదేరినారు. ఆముక్తమ కృష్ణరాయడూ వ్రాయలేదట, పెద్దన్నా వ్రాయలేదట! ఎవడో అనామధేయ సాతాని వైష్ణవుడు వ్రాసినాడట! ఏమి విడ్డూరము! ఆ పేరులేని సాతాని వైష్ణవునికి విశిష్టాద్వైత సంప్రదాయములెట్లు సమగ్రముగా ఎక్కడ పట్టుపడినదో!.....సంస్కృతాంధ్రముల యందంతటి కూలంకష పాండిత్య మెట్లబ్బినదో!.......పిచ్చి మాటలు!....

".......కృష్ణుని సార్వభౌమునిగా దిద్ది తీర్చి వెంచి కృతకృత్యుడైన అప్పాజీ అతడు కవి సార్వభౌము డౌతేనేకాని అతని సార్వభౌమత్వానికి వన్నె రాదని ఊహించకుంటాడా?" (పే. 207)

పిచ్చి మాట లెవరివి? గత శతాబ్దములో సంస్కృతాంధ్ర పండితులలో అగ్రస్థానమువహించి సూరి బిరుదము పొందిన చిన్నయసూరి సాతాని (చాత్తాద) వైష్ణవుడని వ్యాసకర్త మరచినారా? చాత్తాద వైష్ణవులది కూడ విశిష్టాద్వైత సంప్రదాయమే. ఈ విషయము జగద్గురువులకే తెలియ తగునుగాని శ్రీ నారాయణరావుగారికి కాదు. చాత్తాద వైష్ణవ శాఖలో నేటికిని శిష్టాచార మవలంబించువారు పలువురున్నారు.

ఆ జగద్గురువుల వారెవరో ఏమనిరో అనుమాన ప్రమాణముచేత తప్ప మనకు ప్రత్యక్షముగా నిప్పుడు తెలియదు. వారెట్టి వ్యాసమును రచించి నట్లులేదు. వారు బహుశః వైఖానస వైష్ణవుడు ఆముక్తమాల్యద రచించి యుండునని చెప్పి యుందురు. వైఖానసులే శ్రీకాకుళములో ఆంధ్ర విష్ణువు ఆలయములో అర్చకులు. వైఖానసులకును ఊర్ధ్వపుండ్రముండునేకాని శ్రీవైష్ణవుల పుండ్రము వంటిదికాదు. వారికి తప్తచక్రాంకణము నిషిద్ధము. వారి పూజా విధానములు, వారి యాచార వ్యవహారములు భిన్నములు. వారికి ద్రావిడ వేదమందుగాని ఆళ్వారులయందుగాని ప్రామాణ్యములేదు. వారు స్మార్తులకే ఎక్కువ సన్నిహితులు. ఆముక్తములోని శ్రీవైష్ణవ సంప్రదాయమును గూర్చి ముందు కొంత విపులముగా విచారింతుము. ప్రస్తుతమునకు అందు లోని గోదా విరహ వర్ణనములో "వాచ్చియార్ తిరుమొళి" యని ప్రసిద్ధమైన స్తుతి, స్వయముగా గోదాదేవి ఆరవములో చేసిన స్తుతిలోని వాక్యము లయు విరహవేదనయు స్పర్శ కూడ ఆముక్తమాల్యదలో లేకుండుట విజ్ఞులకు వింతగా తోచక

మానదు. ఆముక్తకర్తకు దాని స్వరూపమైన తెలియునా యను సందేహము కూడ కలుగును.

సార్వభౌమత్వానికి 'కవి సార్వభౌముడౌతేనే' కాని వన్నెరాదా? షట్చక్రవర్తులుగా పురాణ ప్రసిద్ధులైన వారెవరూ కవులుగాని కవిసార్వభౌములుకాని కాదు గదా! మరి రాయలకే అది యవసరమైనదా? ఏమి మాటలవి?

5

ఏ విషయమైనను విచారణ చేయునపుడు వాద బలము చూచుకొనవలెను. పరవాదము ఖండింపక దూషణమునకు దిగుచో మన వాదమే దుర్బల మని బుద్ధిమంతులకు తోచును. కాబట్టి ఆముక్త మాల్యద కర్తృత్వము రాయలదే యని సమర్థించు వారికిని కాదనువారికిని గల ముఖ్యాధారములను శాంతముగా విచారింతము. ఉభయ పక్షముల వారికిని రాయలయందు హిందూరాజ్యరమాధురంధరుడుగా, మహావీరుడుగా, కవి పండిత కళా పోషకుడుగా విశేష గౌరవము కలదనియే గ్రహింపవలెను. అట్టి వాడు తప్పక పండితుడై యుండును. కవియు గావచ్చును. "కవిత్వపు పిచ్చి" యున్నవారు ఎంత కార్యాంతరవ్యగ్రులైనను కావ్యరచన చేయకుండ నుండరనుట అనుభవైకవేద్యము. ఇప్పుడు ఉభయ వాదములను ప్రదర్శింతుము.

రాయలే ఆముక్త కర్త యనువారి యుక్తులివి:

1. అన్ని వ్రాత ప్రతులలోను ఆముక్త మాల్యద కృష్ణరాయ ప్రణీతముగానే ఉన్నది.

2. గ్రంథములోనున్న ఏడాశ్వాసములలో (కొందరి మతమున ఆరాశ్వాసములే) చివర "కృష్ణరాయ మహీభృన్నామాస్మదాముక్తమాల్యద" అని యిత్యాదిగా రాయలు తానే గ్రంథ రచన చేసితి నని కంఠోక్తిగా చెప్పికొనెను.

3. అవతారికాభాగములో రాయలు తాను కళింగ విజిగీష మహిషన్ దండెత్తిపోయి శ్రీకాకుళ నికేతనుండగు నాంధ్రమధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసంబు గావింపగా ఆర్రాతి చతుర్థయామమున కలలో స్వామి ప్రత్యక్షమై 'నీ వెన్నో సంస్కృత గ్రంథములు రచించితివి. ఆంధ్రములో ప్రియా పరిభుక్త భాక్కథను ఇష్ట దైవమైన వేంకటపతి కంకితముగా చెప్పు'మనుటయు మరునాడు విద్వజ్జనులా వృత్తాంతము విని శుభ పరంపర కలుగునని యగ్గించి కావ్య రచనకు ప్రోత్సహింపగా 'ప్రహృష్టాంతరంగుడై వేంకటాచలపతికి నా విన్నవింపంబూను నాముక్తమాల్యదా మహా ప్రబంధమునకు కథా క్రమం బెట్టిదనిన' ఇత్యాదిగా తెలిపి యుపక్రమించినట్లున్నది.

4. ఇందలి చతుర్థాశ్వాసములో యామునాచార్యుడు కుమారున కుపదేశించిన రాజనీతి రాయరాజ్యములో పాలింపబడుచున్న రాజనీతియే.

5. ఆముక్తలో విపులముగా వర్ణితమైన చేప వేపుడువంటి వర్ణన పెద్దనవంటి బ్రాహ్మణుడు చేయునా?

6. రాయలు వైష్ణవుడు, వైష్ణవాచారములు వైష్ణవ మత రహస్యములు నెరిగినవాడు. అది ఆముక్తమాల్యదలో విక్షేపించినాడు.

7. పెద్దన మనుచరిత్రములోని శైలికి, ఆముక్తమాల్యద శైలికి ఎంతో తారతమ్యమున్నది.

పైని చెప్పిన కారణములలో 1, 3 కారణములు శ్రీకృష్ణదేవరాయలే రచించెననుటకు బలవత్తర కారణము లనుట కెట్టి సందేహమును లేదు. 4, 5, 6 కారణము లంత పాటింపదగినవి కావు. 7 వది శైలికి సంబంధించిన దగుటచే కొంత విచారింప దగినది. ఏడు ఆశ్వాసాంత పద్యములును లభించినవి. వ్రాత ప్రతులలో వాని వరుస భేదించుచున్నదని డా. నేలటూరి వెంకటరమణయ్యగారు భారతి వికృతి జ్యేష్ఠ సంచికలో 'రాయల కళింగ జైత్రయాత్ర' అను వ్యాసమున కనుబంధములో వివరముగా నా భేదము లెట్లున్నవో 13 వ్రాత ప్రతులనుండి విశేషము లిచ్చినారు. ఆంధ్ర కవుల యాచారము గద్యములో గ్రంథకర్త పేరుండుట. దానిని వదలి పద్యముతో గ్రంథ కర్తృత్వము చెప్పుట క్రొత్త. ఇందులో శ్రీహర్షుని నైషధీయ చరితము పద్ధతి నవలంబించి యుండవచ్చును. శ్రీహర్షుడు నైషధ సర్గాంత

శ్లోకములలో మొదటి రెండు పాదములు నొకే విధముగా నుంచి చివరి రెండు పాదములలో చిన్న మార్పులు చేసినాడు. కాని ఆముక్తలో రాయల దిగ్విజయములు కొంతవరకు నొక వరుసలో వేరు వేరుగా ఉదాహరింపబడినవి. 7 పద్యములలో ఐదింటి యందు 'కృష్ణరాయ మహీభృన్నామాస్మదాముక్త మాల్యదన్, కృష్ణరాయ నృప సంజ్ఞాస్మత్కృతా ముక్త మాల్యదన్, కృష్ణరాయనృప సంజ్ఞాస్మత్కృతాముక్త మాల్యదన్, కృష్ణ మహీభృత్సంజ్ఞాస్మదాముక్తమాల్యదన్, కృష్ణరాయ మహీభృత్సంజ్ఞాస్మదాముక్తమాల్యదన్'—అని 2—6—ఆశ్వాసాంతములందును, ప్రథమాశ్వాసాంతమందు 'కృష్ణరాయ వసుధాధ్యక్షోదితాముక్తమాల్యదన్' అనియు, సప్తమాశ్వాసాంతమందు 'కృష్ణరాయ మహిజాన్యుత్పాదితాముక్త మాల్యదన్' అనియు ఒత్తి ఒత్తి వాది వాది యని ఐదు మార్లు చెప్పుటయే ఆయన కర్తృత్వమునకు సందేహ మాపాదించునదిగా నున్నది. సందేహించు వారికి 'సంజ్ఞా' శబ్దము మూడు మారులు వచ్చుట సంకేతార్థమునే సూచించునేమో యని సందేహమును బలపరచునదిగా నున్నది.

ఏమైనను రాయలు రచింపలేదనువారు 1, 3 కారణములను కాదనుటకు బలవత్తర కారణములు చూపవలసియున్నది. లేనిచో ప్రతి కవి కావ్య కర్తృత్వమును గూర్చియు సంశయింపవలసిన అవ్యవస్థ ఏర్పడును.

6

ఇప్పుడు ఆముక్త మాల్యద రచించినది పెద్దనయేగాని రాయలు కాదనువారు ప్రదర్శించు కారణములు విచారింతము. అవి యివి:

1. రాయల యష్ట దిగ్గజ కవులలో నొకడగు తెనాలి రామకృష్ణకవి చెప్పినట్లు రెండు చాటు పద్యములు ప్రచారములో నున్నవి. ఆ రెండును పెద్దనయే ఆముక్తమాల్యద రచించినట్లు స్పష్ట పరచుచున్నవి. ఒక దానిలో,

"వాని తల్లిగ నల్లసాని పెద్దన తెప్పి
ముది మది దప్పి యాముక్తమాల్య(న్)"

అని యున్నది.

2. కొద్ది కాలము తర్వాతివాడైన అప్పకవి ఈ గ్రంథమునుండి యుదాహరించుచు 'ఆంధ్ర కవితా పితామహుని విష్ణుచిత్తీయమునుండి' యని వ్రాసెను.

3. అహోబల పండితుడు గూడ తన కవి శిరోభూషణమున "అల్లసాని పెద్దన కవినా ఆముక్త మాల్యదాయామ్' అని 'అద్యాం వాగ్విబుధమ్' ఇత్యాది పద్యము నుదాహరించెను.

4. ఆముక్త మాల్యదకు పూర్వకాలమున వ్యాఖ్యానములు రచించిన శ్రీనివాసకవియు, మడిపాటి వేంకట కవియు వరుసగా "విష్ణు చిత్త తనయోద్వాహంబును....పెద్దనార్య దుర్ధర ఫణితిన్ రచించె" ననియు, "పేర్మి నల్లసాని పెద్దన యాముక్తమాల్యదాఖ్య కృతి సమంచితముగ జేసె"ననియు వ్రాసిరి.

5. శ్రీ సి. పి. బ్రౌను తన నిఘంటువు మొదట ఉదాహృతగ్రంథముల పేర్లిచ్చుచు నిట్లు వ్రాసెను.

"A. The Amukta Malyada ఆముక్త మాల్యద or Vishnu Chittiyam విష్ణుచిత్తీయం written by అల్లసాని పెద్దన్న Allasani Peddanna. It is in six cantos containing about 950 stanzas or 3,800 lines."

6. వావిళ్ల రామస్వామిశాస్త్రిగారు ప్రకటించిన ఆముక్తమాల్యద ప్రథమ ముద్రణ పీఠిక యందును పెద్దన విరచితమని పేర్కొనబడినదని తెలియవచ్చుచున్నది.

7. రాయల వంశమును చంద్రునినుండి ప్రారంభించి వర్ణించిన అవతారికాభాగములోనే గాక దశావతార వర్ణనాదికములలో గూడ మనుచరిత్రలోని పద్యములే చిన్న మార్పులతో ఆముక్తలో నున్నవి.

8. మనుచరిత్రలోని పద్యముల కెన్నిటికో అనుకరణములు ఆముక్తలో కలవు.

9. ఆముక్త మాల్యద అవతారికను బట్టి రాయలు అంతకుముందే సంస్కృతములో మదాలస

చరిత్ర, సత్యావధూప్రీణనము, సకల కథాసార సంగ్రహము, జ్ఞాన చింతామణి, రసమంజరి అను కావ్యములు రచించినట్లున్నది. వాని తర్వాత ఆముక్తమాల్యద రచన జరిగియుండవలె. ఇవి గాక జాంబవతీ పరిణయమును రచించినట్లు రెండు వ్రాతప్రతులు దొరికినవి. అది ఇప్పుడు ప్రకటితమైనది. ఉషా పరిణయమనే నాటకము కూడా రాయలు రచించినట్లు సంస్కృత సాహిత్య చరిత్రలో శ్రీ కృష్ణమాచార్యులు వ్రాసినారు. ఇన్ని గ్రంథములు రచించియున్నప్పుడు రాయువాచకములోగాని శ్రీ కృష్ణరాయ విజయములోగాని, రాయల సమకాలీన విదేశీయుల వర్ణనలలోగాని దాని ప్రస్తావమేల లేదు? మనుచరిత్రము, పారిజాతాపహరణము అవతారికలలోగాని ఆశ్వాసాద్యంతపద్యములలోగాని—'కవితా ప్రావీణ్యఫణీశ' అను సందిగ్ధార్థకమైన సంబోధనలో తప్ప—రాయల కావ్య రచన యేల ప్రస్తావింపబడలేదు?

10. ప్రపంచదర్పణ మను సంకలన గ్రంథములో రసమంజరి సత్యావధువులనుండి రెండు శ్లోకము లుదాహరింపబడినవి. కాని యవి కూడ పెద్దన రచనలుగానే పేర్కొనబడియుండుట విచిత్రము.

11. భానుదత్తుడను సంస్కృతకవి మైథిలీయుడు నానారాజసందర్శనము చేసి రాయల యాస్థానమునకు గూడ వచ్చి కొంతకాలముండెను. అతని కృతులలో 'రసమంజరి' యనున దొకటి. దానికిని రాయల రసమంజరికిని ఏమైన సంబంధ మున్నదా?

12. జాంబవతీపరిణయ ప్రస్తావనలోగూడ రాయల ఇతర గ్రంథములేవియు పేర్కొనబడలేదు. కాని 'శ్రీ కృష్ణరాయః కవిః' ఇత్యాదిగానున్న శ్లోకమునకు ముందు 'ఇతఃపరం మహాన్ గ్రన్థపాతః' అని సంపాదకులు అథస్సూచికలో తెల్పిరని గమనింపవలెను.

ఈ పై పన్రెండు కారణములలో నేవియు రాయల గ్రన్థకర్తృత్వమును సమర్థించు వానిలో 1,3 కారణములుగా పేర్కొనబడిన వానివలె బలవత్తరమైనవి కావు. కాని బహుముఖముల నుండి వచ్చిన పై పన్నెండు కారణములును కలిపి చూచినపుడు బుద్ధిమంతులకు సంశయము కలుగక మానదు. కవి తన కావ్యమును మరొకరి పేర ప్రచురించుచున్నప్పుడు ఆయన పేరు పెట్టక తన పేరు పెట్టడు గదా! దానివలన ఆ 1, 3 కారణములుకూడ కర్తృత్వ వాదమునకు బలవత్తరములు కావనవచ్చును.

7

ఇప్పుడు శ్రీ నీలకంఠశాస్త్రి భారతిలో వ్రాసిన విషయమును ప్రస్తావింతుము. ఆ వ్యాసమే డా. చిలుకూరి నారాయణరావుగారికి ఆగ్రహావేశము కలిగించినది. వారే అథస్సూచికలో "ఏమో ఆ వ్యాసమును చదువగానే మనస్సునకు చురుక్కు మన్నది' అని వ్రాసినారు. ఎవరికెంత చురుక్కుమన్నను ఆ వ్యాసములో శ్రీ నీలకంఠశాస్త్రి ప్రదర్శించిన మార్గము అపూర్వమైనదియు, కర్తృత్వ విషయమున వివాదము వచ్చినప్పుడు అవలంబింపవలసిన ప్రధాన మార్గమును అనుటకు సందేహము లేదు. దానినే సద్విమర్శకులు అంతస్సాక్ష్యము (Internal evidence) అని పేర్కొందురు. అందువలన వారి వాదమును ప్రత్యేకముగా విచారణ చేయుచున్నాము. సూత్రప్రాయముగా అనువాదము చేసినచో వారి వాద సారాంశ మిది.

"అముక్తమాల్యదను రచించిన దెవరో వీర వైష్ణవుడు. శ్రీ కృష్ణదేవరాయల జీవిత విశేషములు ఎన్నో తెలియ వచ్చుచున్నవి. వానిని బట్టి రాయ లట్టి వీరవైష్ణవుడు కాదని నిరూపితమగుచున్నది."

శ్రీ నీలకంఠశాస్త్రి ప్రతిపాదన యుక్తిసహమైనచో పెద్దన కర్తృత్వవాద మెట్లున్నను ఆముక్తమాల్యదను రాయలు రచించలేదనువాదము ధ్రువపడును గదా! పై మాటలలో వీర శబ్దము శ్రీ నారాయణరావుగారి ఆగ్రహమునకు కారణమైనది.

"ఆముక్తమాల్యదలో ప్రతిపాదింపబడినది వీర వైష్ణవము కాదు. విశిష్టాద్వైత సిద్ధాంతము. అది శ్రుతి నిబద్ధము" అని ఖండించినారు.

"అముక్తలో విష్ణుభక్తి మహిమ వివరింపబడినదేకాని శివనింద యెచ్చటనైనను నున్నదా?" అని కూడ నడిగినారు.

శ్రీ నీలకంఠశాస్త్రి స్మార్తుడు గనుక విశిష్టాద్వైత సిద్ధాంతమునే శ్రుతి నిబద్ధమని యంగీకరింపరు. వారేకాదు. శ్రీ నారాయణరావుగారి గురువులైన మాధ్వ పీఠాధిపతులును ఒప్పుకొనరు. రాయలు రచించి రను సకలకథాసారసంగ్రహములో నుండి శ్రీ వేటూరు వా రుద్ధరించిన శ్లోకములలో ఒక దానిలో 'ఉత్సాహం మమ వీక్ష్య మద్గురు రథ శ్రీ వ్యాసతీర్థోమునిః" అని ఉండుటచేత శ్రీ వ్యాసతీర్థులు రాయల గురువు లని తెలియవచ్చుచున్నది. వారుకూడ విశిష్టాద్వైతమును శ్రుతి సమ్మతమని అంగీకరింపరు. అందువలన ఈ మత భేదములను వాదములను తలపెట్టక శ్రీ శాస్త్రిగారు వీర వైష్ణవ శబ్దము ప్రగాఢ వైష్ణవాభిమాని యను సామాన్యార్థములో ప్రయోగించిరని సందర్భమునుబట్టి గ్రహించుట ఉచితము. ఆముక్తమాల్యదాకర్త అట్టివాడనుట కెట్టి సందేహమును లేదు.

అందులో శివ దూషణము లేదను శ్రీ నారాయణరావుగారి మాటయు నిరాధారమైనది. ఆముక్తమాల్యదలో శివదూషణమేకాక విష్ణ్వితర సర్వ దేవతాదూషణమును స్పష్టముగా కలదు. దానిని వివరించుటకుముందు శ్రీ కృష్ణదేవరాయలు ఎంత వరకు వైష్ణవుడో కొంత విచారణ చేయవలసి యున్నది. గతానుగతికముగా, ఆయన తాతాచార్యుల శిష్యుడనియు, అంతకంతకు 'మధ్య వైష్ణవమునకు' నామాలు మెండన్నట్లు వైష్ణవాభిమానము పెరిగిన దనియు వ్రాయుట యాచారమైనందున నాయన మత స్వరూప మెట్టిదో చారిత్ర కాధారములనుబట్టి కొంత స్థూలముగా విచారింతము.

పది పదకొండవ శతాబ్ద ప్రాంతముల నుండి మన దేశములో గొప్ప రాజులు తమ రాజ్యమును ఇష్ట దైవమునకు అర్పించి ఆయన పాద పద్మారాధకులుగా రాజ్య పరిపాలనము చేయుటయు, నాణెములు కూడ స్వామి పేరనే ముద్రించుటయు నాచారమైనది. దీనివలన రాజులు రాజకోశమును తమ భోగాదులకు ఉపయోగించుకొనక దేవద్రవ్యమును భయభక్తులతో ప్రజాపరిపాలనమునకు ఉపయోగించుట సాధ్యమైనది. తిరువాన్కూరు పాలకులు అనంతపద్మనాభస్వామి పాద పద్మారాధకులు. కొప్పెరుం జింగడు కనకసభాపతి పాదపద్మారాధకుడు. శ్రీ విద్యానగర ప్రభువులు శ్రీ విరూపాక్షస్వామి పాద పద్మారాధకులు. హరిహర బుక్కరాయాదులు ముసల్మాన్ ప్రభువుల నెదిరించి రాజ్య స్థాపన చేయుటకు వారికి శ్రీ విరూపాక్షస్వామి గుప్త ధనమంతయు శ్రీ విద్యారణ్యస్వామివారు అర్పించి రాజ్యమును స్వామికి అంకితము చేయించిరి. శ్రీకృష్ణదేవరాయల వారి వరకు అట్లే జరిగినది. ఆయన తరువాతి కాలములో శ్రీ విరూపాక్షస్వామి పాదపద్మారాధనము చక్రవర్తులు వదలిన తరువాతనే శ్రీ విజయనగరరాజ్యము క్షీణించినదని శ్రీ మల్లంపల్లివారు వ్రాసియున్నారు.

శ్రీ విద్యారణ్యుల నాటినుండి శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠ స్వాములు విరూపాక్షములోనే ఉండి చక్రవర్తులకు తమ శ్రీహస్తములతోడనే పట్టాభిషేకము చేయుచుండిరి. అట్లు పట్టాభిషిక్తుడైనవాడే శ్రీ కృష్ణదేవరాయలు. ఆయన పట్టాభిషిక్తుడైన వెంటనే ఆయన కావించిన బృహత్కార్యము శ్రీ విరూపాక్షస్వామి ఆలయమునకు మహా గోపురము నిర్మించుట. అది నేటికిని రాయల శివభక్తి చిహ్నముగా నిలిచియున్నది. ఒక్క విరూపాక్షములోనేకాదు. ఆయన కంచిలో శ్రీకాళహస్తిలో శ్రీశైలములో మరియు నెన్నియో శివక్షేత్రములలో మహాగోపురములు తన కీర్తిధ్వజములుగా నిర్మించినవి నేటికిని నిలిచియున్నవి.

జాంబవతీ పరిణయ నాటకము ప్రస్తావనలో ఇట్లున్నది:

"అద్యఖలు భగవతః చరాచర గురోః అపార కరుణాపారావారస్య నమ దమర శిరో మందార కుసుమ వాసిత పాదారవిందస్య విజయనగర నివాస వాసనావధీరిత ధనద నగర విహార దోహలస్య హేమ కూట గిరికటక వాస్తవ్య కుటుంబినః కర్ణాట రాజ్య రక్షామణేః శ్రీ విరూపాక్ష దేవస్య చైత్రోత్సవావ లోకనాయ సంగతాం పరిషత్; య్యైషా [illegible]

"నాట్యామ్నాయ మహా రహస్య పదవీ పాణింధమ ప్రక్రమా
నానా నాటక భేదశాలి కవితా నాసీర సారస్వతా
నిత్యం శాస్త్ర విచార చారుధిషణా వైశద్య విద్యోతితా
సారస్యాంబుధి కౌముదీ లహరికా భవ్యా పురోవర్తతే"

ఇట్టి పరిషత్తును రంజింపజేయుటకు ఏ నాటకము ప్రదర్శింపవలెనని నటియు సూత్రధారుడును ఆలోచించి శ్రీ కృష్ణరాయ కవి విరచితమైన జాంబవతీ పరిణయ నాటకమే యోగ్యమైనదని నిర్ధారించిరి.

ఆముక్తమాల్యదలో ప్రస్తావించిన కృతులలో నీ నాటకము లేనందున ఇది అనంతర రచన యనుట సాధారణ న్యాయము. వైష్ణవము ముదిరిన వాని ప్రస్తావన కాదుగదా ఇది!

శ్రీ కృష్ణదేవరాయలు వేంకటేశ్వరస్వామి భక్తుడని అందుకు సాక్ష్యముగా ఆయనయొక్కయు ఇద్దరు దేవేరులయు విగ్రహములు కూడ నక్కడ నిప్పటికిని కానవచ్చుచున్నవనియు చెప్పెడు మాట సత్యమే. ఆయన ఏడెనిమిది మారులైనను తిరుపతికి వెళ్లి స్వామిని సేవించి కానుక లిచ్చినట్లు శాసనాధారములున్నవి. ఐనను ఆయన ఎప్పుడు వేంకటేశ్వరస్వామిని సేవించినను, ఆ వెంటనే శ్రీ కాలహస్తీశ్వరస్వామిని దర్శించి కానుక లర్పించినట్లును శాసనాధారము లున్నవి. శ్రీ కాలహస్తీశ్వరాలయమును ఈ శతాబ్దములో నిర్మించిన నాటుకోటిచెట్టియారులు అక్కడి శాసన సంపదను తారుమారుచేసి పూర్వాలయస్వరూపమును గుర్తింపలేకుండజేసినను ఇప్పటికిని ఎన్నో శాసనము లున్నవి.

శ్రీ కృష్ణదేవరాయలేకాదు; ఆయన యువ సాన కాలములో చంద్రగిరి చెరసాలనుండి విద్యానగర సింహాసనమునకు రావింపబడిన అచ్యుత దేవరాయలు గూడ చంద్రగిరిలో బయలుదేరి వెంకటేశ్వర సన్నిధానమున నభిషిక్తుడై, పిమ్మట శ్రీ కాలహస్తీశ్వరస్వామి సన్నిధానమున నభిషిక్తుడై, ముప్పటగా మూడవమారు హంపీ విరూపాక్షస్వామి సన్నిధానమున నభిషిక్తుడైనాడు. శ్రీ వెంకటేశ్వర స్వామి వైష్ణవులకుకంటె స్మార్తులకే ఎక్కువ యిష్ట దైవము. అక్కడి ప్రధానార్చకులు వైఖానసులు. స్వామిపేరే ఈశ్వర శబ్దాంతముగా నుండుట విశేషము. వెంకటేశ్వరాలయ మెక్కడ నున్నను మహారాష్ట్రులును ఔత్తరాహులును 'బాలాజీ' నామముతోడ నేటికిని వ్యవహరించుచున్నారు. నేటికి కూడ ఆంధ్ర స్మార్త బ్రాహ్మణుల ఇళ్లలో వివాహాది శుభకార్యము లేవి తలపెట్టినను ముందు శ్రీ వెంకటేశ్వరునకు దీపారాధనముచేసి అర్చించికాని ప్రారంభింపరు. వెంకటేశ్వరస్వామిని వైష్ణవులు గుత్తకు కొనలేదు.

తాతాచార్యులకో మరియొక శ్రీవైష్ణవాచార్యులకో రాయలు శిష్యుడనికదా అందరు విశ్వసించుచున్నది. మరి ఆముక్తమాల్యదలో నెక్కడనైనను ఆయన గురునామమైన ప్రస్తావింపలేదేమి? మధ్య వైష్ణవుడని చెప్పబడుచున్న పెద్దన మనుచరిత్రములో గురువైన శఠకోపయతిని స్మరించెను.—

ఐనను పెద్దన కూడ శివభక్తి మరచిన శ్రీవైష్ణవుడుకాడు. మనుచరిత్ర అవతారికయే దానికి సాక్ష్యము. అంతేకాక ఆయన రాయలు తన కగ్రహారముగా నిచ్చిన కోకట గ్రామములో కొంత భూమిని అక్కడి శివాలయమున కిచ్చినట్లు (1518) శిలా శాసనమున్నది. అసలు పెద్దనకు కోకట గ్రామమును అగ్రహారముగా నిచ్చినది రాయలు కళింగ యాత్ర నుండి రాజధానికి పోవుచు దారిలో బెజవాడలోని మల్లేశ్వరస్వామిని అర్చించిన సమయములో. ఆ పిమ్మట నమరావతిలో అమరేశ్వరు నర్చించి తులా పురుష దానము చేసెను.

రాయల యాస్థాన కవులలో పెద్దనతో దాదాపు సమాన గౌరవ మందిన నంది తిమ్మనార్యుడు అఘోర శివాచార్యుల శిష్యుడును, శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధ సారస్వతుడును. వారిద్దరితోపాటు రాయవాచకములో ప్రస్తావింపబడిన

మాదయగారి మల్లయ కూడ శ్రీ మదఘోర శివాచార్య గురుకరుణా విశేష లబ్ధ సారస్వతుడు. అష్ట దిగ్గజ కవులలో నుత్తమతియనియు, పలుకులలో అతురితమాధురీ మహిమ కలవాడని రాయల మెప్పుపొందిన కవి ధూర్జటి 'నీకుం గాని కవిత్వమెవ్వరికి నేనీనంచు మీఁదెత్తితిన్, జేకొంటిన్ బిరుదంబు, కంకణము ముంజేగట్టితిన్' అని శ్రీ కాళహస్తీశ్వరస్వామి సన్నిధిని ఉద్ఘోషించిన శివభక్తాగ్రేశ్వరుడు. ఆయన ముమ్మనుమడు తన పెదకాళహస్తి మాహాత్మ్యములో నాతనిని 'కృష్ణరాయ కిరీట కీలిత మణి గణార్చిత పదాబ్జ శ్రీవహించిన'వాడని వర్ణించినాడు. పైగా అతడు శ్రీ కృష్ణరాయ విజయమను ప్రబంధము వ్రాసిన కుమార ధూర్జటి పుత్రుడే. పేరు లింగరాజు. వైష్ణవ మవలంబించినాడను తెనాలిరామలింగడు కూడ స్వచ్ఛమైన స్మార్తకుటుంబములో జన్మించినవాడే. ఉద్భటారాధ్య చరిత్ర రచన నాటికే కాక పాండురంగ మాహాత్మ్య రచన నాటికిగూడ నతనికి వంశక్రమానుగతమైన శివభక్తి పోలేదు. ఆ గ్రంథము నాతడు విశ్వేశ్వరజ్యోతిర్లింగ శుద్ధఖనియైన కాశీపురమును వర్ణించుట తోడనే ప్రారంభించినాడు.

రాయల యాస్థానములోని సంస్కృత విద్వాంసులు కూడా ఎక్కువమంది స్మార్తులే. తొమ్మిదితరములుగా మహాపండితు లుదయించిన వంశస్థుడైన లొల్ల లక్ష్మీధర పండితుడు దివాకరపండితుడు రామాయణటీక రచించిన ఈశ్వరదీక్షితులును సంగీతసూర్యోదయకర్త లక్ష్మీనారాయణ కవియు స్మార్తులే. రాయల రాజపురోహితుడు రంగనాథదీక్షితుడు ఆయన కుమారుడు స్మార్తులే.

తమిళ కవులలో హరిహరదాసు "యిరుసమయ విళక్కమ్" అను గ్రంథములో శివ విష్ణువులయందు సమానభక్తి చూపవలెనని వ్రాసి రాయలచే బహూకరింపబడెను. తిమ్మణ్ణ కన్నడములో వ్యాస భారతము పూర్తిచేసి కృష్ణభారతమని రాయలపేరు పెట్టెను.

మాధ్వ గురువులగు వ్యాస రాయలు మాధ్వమత స్థాపనలో శ్రీ మధ్వాచార్యుల తర్వాత పేర్కొనదగిన మధ్వమత స్థాపకుడైన ఉద్దండ పండితుడు. ఆయనను రాయలు తన గురువునుగా పేర్కొన్నట్లు సకల కథాసార సంగ్రహ శ్లోకములనుబట్టి కానవచ్చుచున్నది. రాయలకు జాతకరీత్యా గండము సూచించు కాలములో ఆయనయే రాయల సింహాసన మధిష్ఠించి పాలించెనని వ్యాసరాయచరిత్రములో గలదు.

ఆంధ్రులలో వెలనాటిశాఖకుచెంది విష్ణుభక్తి ప్రధానమైన శాఖను గుజరాతు ప్రాంతములో స్థాపించిన వల్లభాచార్యులు రాయల యాస్థానమునకు వచ్చి ప్రతిపక్షుల నోడించి స్వర్ణాభిషేకము పొందినట్లు వారి గ్రంథములలో గలదు.

జైన గురువగు అభినవవాది విద్యానందుడు రాయల యాస్థానమున నితర మతస్థులతో వాదించి జయించెనని జైన గ్రంథము తెలుపు చున్నది.

ఇట్లు స్మార్తులు, శైవులు, విశిష్టాద్వైతులు, ద్వైతులునేగాక జైనుల గూడ రాయలను తమవాడుగానే ప్రచురించుకొనిరి. రాయలవారి కంత మతసహన ముండెను. ఆయనకున్న మత సహనమును గూర్చి బార్బోసా ఇట్లు వ్రాయు చున్నాడు.

"తన రాజ్యమునకు వచ్చిన వారిని గూర్చి చికాకుపడక వచ్చినవారు క్రైస్తవులా యూదులా మహమ్మదీయులా యని వితర్కించకయే వారి వారి మతస్వాతంత్ర్యముతో నిచ్చవచ్చినట్లు వ్యవహరించుటకును, వచ్చినవారు వారి కిచ్చ వచ్చినప్పుడు స్వదేశమునకు వెళ్లుటకును స్వాతంత్ర్య మిచ్చుచుండిరి."

పై వ్రాసిన దానినిబట్టి శ్రీ కృష్ణదేవరాయలు జగద్విదితుడైన విజేతయేకాక ప్రజారంజకుడైన పాలకుడని నిశ్చయ మగుచున్నది. ఇందరు కవులకు పండితులకు మతాధిపతులకు కళాకారులకు ప్రీతిపాత్రుడైన శ్రీ కృష్ణదేవరాయలు బహు విస్తృతమైన సంస్కారముగల విద్వాంసుడై యుండవలెను. అట్టివాడు కొన్ని సంస్కృత గ్రంథము

లను ఆముక్తమాల్యదను వ్రాసినా డన్నంత మాత్రమున ఆయన గౌరవ మతిశయింపదు. వ్రాయలేదన్నంతమాత్రమున ఆయనను న్యూనపరచు చున్నామని భావింప నక్కర లేదు. ఆయన ఆస్థాన పండితులు కవులును, "మేమే యిత్తుము మే మె యిచ్చెదము, మేమే యిత్తుమంచున్" తిరుపతి వేంకటేశ్వరులకు శబ్దములు వచ్చినట్లే, తమ గ్రంథములను వారియందున్న భక్తిచేతను ప్రేమచేతను వాత్సల్యముచేతను తమకున్న ధనాదిక కాంక్షలచేతను బహువిధములుగా నిచ్చుటకు పంతులు పడియుండుట యసహజము కాదు.

ఓఢ్రదేశములో నొక యాచార మున్నదని వినికిడి. అక్కడ గ్రంథ మొకరికి అంకితము చేయుటన్న నా గ్రంథకర్తగా గ్రంథభర్త పేరుంచుటయే! ఆంధ్రదేశమునకు పొరుగుననున్న ఓఢ్రాచారము ఆంధ్రమునకును కొంత ప్రాకుట యసంభవముకాదు గదా! కళింగ విజయముతో విద్యానగరమునకు ఓఢ్రుల రాక యతిశయించినది.

8

ఇక కోపతాపములు దూరముగా నుంచి ఇంత సర్వమత సహనముగల శ్రీ కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను రచించియుండువాయని శాంతముగా విచారించుకొందము.

శ్రీ కాకుళాంధ్ర విష్ణువు రాయలకు స్వప్నములో ప్రత్యక్షమై చెప్పిన మాట లివి:

"........ ఏ మును దాల్చిన మాల్య మిచ్చు న
ప్పిన్నది రంగమం దయిన పెండిలిసెప్పుము
మున్నుగొంటి నే
వ న్ననదండ యొక్క మగవాడిడ......
.అక్కడున గప్పు ప్రియాపరి భుక్తభాక్కథన్"

గ్రంథనామము కూడ దాని కనుగుణముగానే ఉన్నది. కాని యీ ప్రబంధములో నా కథ చాల కొద్ది భాగములో చెప్పబడినది.

అవతారిక ఆశ్వాసాద్యంత పద్యములు పోగా కథా భాగములో 794 గద్యపద్యము లున్నవి. అందులో 202 పద్యములలో మాత్రమే గోదాదేవి కథ. 43 పద్యములున్న వసంతర్తు వర్ణనమున్న భాగము కూడ 202 లో కలిపితిమి. వసంతర్తు వర్ణనతో కలిపినచో కొంచెము తక్కువగా నాల్గవవంతును, తీసివేసినచో ఐదవవంతుకును గోదాకథా గ్రంథము తేలుచున్నది. తక్కిన గ్రంథ భాగములో 1. విష్ణుచిత్తుడు పాండ్యరాజ సభకుపోయి విరక్తుడైన రాజు సభలో పరసమయముల వాదములు ఖండించి రాజును వైష్ణవునిగా నొనరించిన కథ. 2. యామునాచార్య చరిత్రము 3. చండాల బ్రహ్మరక్షస్సంవాదము 4. ఖాండిక్య కేశిధ్వజుల కథ— ఉన్నవి.

వీనిలో మొదటి రెండును వైష్ణవేతరమతములను దూషించుటకే పుట్టినవి. మూడవకథలో గూడ పరోక్షముగా పరమతనింద చొప్పింపబడినది. ఖాండిక్యకేశిధ్వజుల కథలో విష్ణుపురాణము అనువదింపబడినది. అందులో కొంత వైష్ణవ పక్షపాత చ్ఛాయ చేరినను స్మార్తులకును అంత బాధకము కాకున్నది.

మూల కథయైన గోదాదేవికల్యాణములో గూడ పరోక్షముగా ఇతర దేవతానింద యున్నది. మగవా డిచ్చిన నసను ఏవతో గ్రహించిన విషయమే కవి మరచినట్లున్నది. కాక వ్యాఖ్యాతలు చెప్పుచున్నట్లు కాక విష్ణుచిత్తుడు నిత్యము కైంకర్యము చేయుచుండిన మాలలకే అన్వయించుకొనవలెనేమో!

1. పాండ్యరాజు కథలో ఏ క్రింది భాగములు గమనింపవలెను. అక్కడి కోవిదులు, మోక్ష మిచ్చువాడు,

"హరు నొకఁడన, నుమ నొకఁడన,
హరి నొకఁడన, శిఖి నొకఁడన, నర్కు
నొకఁడనన్,
గరిముఖు నొకఁడన, రజనీ
శ్వరు నొకఁడన, నజు నొకఁడన వాదైన తరిన్"

"...దివాణము న్నెరయ వించిన బ్రేలెడు
దుర్మదాంధులన్
బోడిమి మాన్పి, మన్మహిమముం బ్రకటించి
హరింపు శుల్కమున్

వాడును రోసినాఁ డీహము, వైష్ణవుగా వొన
రింపు సత్కృపన్"

ఆ వాదించిన విష్ణుచిత్తుడు 'ఇతఃపురా పఠిత శాస్త్ర గ్రంథ జాత్యంధుడు' సభకు బోయి వాదించి,

"ముముక్షువున కప్పుండరీకాక్షుఁ డక్క నే వ్యక్తినైన నుపాసింపవచ్చునే...ముముక్షువ కుపాశ్రయణీయుం డధోక్షజుండు...అతనికి మూలమంత్ర పూర్వకంబుగా ద్వయము ప్రసాదించి భాగవత ప్రపదానం గావించిన" ముడుపు తెగిబడినది.

"వేద వేద్య మైన విష్ణుతత్త్వం బిట్లు
వాది గెలిచి తెలిపి వసుమతీశు
భక్తినోం లార్చి భగవత్ప్రపన్నుగా
జేసి లోకహితము చేయుటయును",

అప్పుడు

'ఇవ్వేదధ్యత్వ మగాల్లయం హి కుధియామితం వదత్యిన్నరప్' ఇత్యాది వర్ణనమును దర్వాత '''సెల వులు వాకుచు" ఇత్యాదిక సీసపద్యము గమనింప దగినది.

2. యామునాచార్యుల కథ ఉపక్రమము నుండి యామునుని జయము వరకు గల 37 గద్య పద్యము లన్నియు చాల వరకు పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రములోని వాదప్రకరణమునకు ప్రతిగా నున్నవి. కొంత బసవపురాణములోని బసవదండనాథుని చర్యలను దలపించుచున్నవి. ఈ క్రింద నుదాహరించిన భాగములు ముఖ్యముగా గమనింప దగినవి.

"వెఱ్ఱిశైవంబు ముదిరి మద్విమతి వినఁడు ;
"హరుఁడే పరతత్త్వ మను...
"అశ్రాంత జంగమార్చానక్తి వర్తిలు
"శామ వారపు వీరభద్రుపళ్లెర మిడు....
"షణ్ణవతి శ్రాద్ధచయ మారబెట్టు నం
కర దానమయ్య భక్తిప్రపత్తికి
"జందె ముత్తర శైవంబు జెంది త్రెంచు
బలితు లారాధ్య దేవళ్ల ప్రావ్యలనుమ......
నెండియే జంగమెత్తిన నెఱఁగుపడుమ.

"శివలింగము దాల్చిన జన
వివహం బేమైన జేయు నిది పాపము దా
నవుగా దనఁడు.....
"అప్పు డిప్పుకు ఒగుచు బ్రాహ్మణులు కొంద
ఱాత్మజనిభూమి విడువలే కలికభూతి
గడ్డముల నాన రుదురాక లిడ్డ నంది
సూతసంహిత లిరికించి చొరఁ దొడగిరి...
"ఓడితేనియు బట్టి మ్రొక్కరో యనంగ
లింగమును గట్ట కుడుగము....
"అమ్మనమ్మతమ్ముఁ డోడిన
భస్మము రుద్రాక్షములును బాసి యితనిచే
విస్మయముగఁ దప్తపు ముర
ఘస్మర చక్రాంకితుండ గాఁగల వాఁడవ్.
"ఉవిద, యీ నీదు విద్వాంసుఁ డోడవేని
నీకు నితనికి నన్న పూవికయు...
"ఇట్లు జయించి విష్ణుదేవుండె పరతత్త్వం
బనియు విశిష్టాద్వైతంబె మతంబనియు
"నారాయణుడె పరంబు కొల్వు మతని..
"అప్పలుకులు విని ఖిన్నంబై యుక్కాడిన
పాషండషండంబు దలవంచుకొని పోయిన...
"భుజగశయన చరణ కుశేశయ భక్తి
ఒడమి కృతార్థతం బొంది .."

ఈ పై భాగములలో వీరమాహేశ్వరులే కాక విభూతి రుద్రాక్షధారులై సూతసంహితలువేతలట్టిన స్మార్త బ్రాహ్మణులు కూడ తీసికొనిరా బడినారని వెంటనే స్ఫురింపదేమో యని మేము జ్ఞాపకము చేయుచున్నాము.

3. చండాల బ్రహ్మరక్షస్సంవాదములో గాన మహిమ చెప్పబడిన దనవచ్చును. కాని ఎన్ని శపథములు చేసినను చండాలుని వదలని బ్రహ్మరక్షస్సు ఈ శపథముతో తుదకు వదలెను.

"ఎవ్వని చూడ్కి జేసి జనియించు జగంబు,
వసించు నిజ్జగం
బెవ్వనియందు, డిందు మఱి యెవ్వని యం
దిది, యట్టి విష్ణులో

నివేల నొక్కవేల్పు గణియించిన పాతకి నాదు
నేడ నే
నెవ్విధినైన నిన్నదియనేని యన న్విని
బంధ మూడ్చినన్"

ఇది యొక్కటి చాలు, విష్ణువుకంటె నితరులైన దేవతల నందరిని పరోక్షముగా నిందించెనను టకు. పైగా బ్రహ్మరాక్షసుడు గూడ దాని కొప్పుకొనుటచే నది యొప్పుకొనని వారందరు బ్రహ్మరాక్షసునికంటె గూడ నికృష్టు లన్నమాటగదా!

4. గోదాదేవి చరిత్రములో గోదాదేవిని రంగవిభుడు హరించిన సమయములో విష్ణుచిత్తుడన్న మాటలలో నివి గమనింపదగినవి:

"శివుడు విరించి వాసవుడుఁ జెప్ప వశక్తులు
కొల్చు నట్టి వా
రవుట, నిరంకుశుండఁ వవి యక్కట పాడిఁ
ద్రోలంగఁ జెల్లునే?
భువనము లెల్ల నీవయునఁ బొంత దయానిధి
యమ్మలేదె? భా
గవతులు లేరె? నా కొలకుఁగా వహియించు
కొనంగఁ గేశవా!"

ఇందులో శివుడును విరించియు వాసవుడును భాగవతుల కంటె తక్కువస్థాయి లోనికి దింపివేయబడిరని గుర్తించుకొనవలెను.

పై నాలుగు కథలలోని యుదాహరణముల వలన ఆముక్తమాల్యదలో శివనిందయే కాక సమస్త పరదేవతా మతముల నిందయు కలదని విస్పష్టము కాగలదు. అట్టిది విశిష్టాద్వైతులు చేయవచ్చునా, చేయగూడదా యని కాదు ప్రస్తుత విచారణ. సరిగా నది పాల్కురికి సోమనాథునివంటి స్వమత ప్రచారకులు చేయదగినదే గాని సర్వమతస్థులను వారి దేవతలను సమానాదరముతో చూచి ప్రజారంజకముగా పరిపాలించిన శ్రీ కృష్ణదేవరాయలు అట్టిదిచేయునా యని!

రాయవాచకములోనుండి శ్రీ కృష్ణదేవరాయల పూర్వులవియు శ్రీ కృష్ణరాయలవియు ప్రవర్తనములు ఉదహరించుచున్నాము:

"వీరనరసింహ్మ రాయలవారు బ్రాంహ్మ ముహూర్తాన లేచి ఆరాధ్యుల నామావళులున్నూ అధ్యాత్మ సంకీర్తనలున్నూ... శ్రవణమున్ను... జేసిన పిమ్మట దంతధావన ముఖమజ్జన నామతీర్థనై విభూతి ధరియించి పేరోలగంబై కూర్చుండగాను నూట యెనిమిది తిరుపతుల నుంచిన్నీ తీర్థప్రసాదములున్ను డబ్బై రెండు దేవస్థలాల నుంచి విభూతి గంధ ప్రసాదములున్ను రాగా యెదురుకొని ప్రత్యుత్థానము జేశి అంజలిచే నందుకొని శిరసావహించి స్థలాంతరాల నుంచ్చిన్ని వచ్చిన అయ్యంగార్లనున్ను ఆరాధ్యపీఠం వారల నున్ను వుచితాసనముల యందు కూర్చుండ నియమించి..." (పే 2—3)

ఇంతవరకు వీరనరసింహరాయలది. రాయవాచకమునుండియే ఉత్కళ విజయము తర్వాత శ్రీ కృష్ణరాయల చర్యలు ఉదాహరిస్తున్నాము:

"కలుబరిగ కోట లగ్గబెట్టించ్చి...పట్టుకొని ఆ కోటకు తాణ్యం గుజ్జరి కల్యాణరావును వుంచ్చి తిరుపతికి వచ్చి అలమేలుమంగాసమేతులైన కల్యాణ వెంకటేశ్వరుల దర్శనంబు శేశి రొఖ్ఖరూపాయలు కానుకవేశి సకల భూషణములున్ను స్వామికి సమర్పించ్చి ఆ స్థలాన షోడశ మహాదానాలున్ను శేసి సన్నిధిని నిత్య శేవగా అంజలిపుటులై పూర్వ ద్వారమండలి వుభయ పార్శ్వములా తిరుమల దేవీ చిన్నాదేవీ సహితంగా వుండేటట్టుగా తాంమ్రబాన ప్రతిబింబమున శేయించ్చి స్వామిని యెదురుగా నిలిపి అందుండ్చి కాళహస్తికి వచ్చి స్వామిని దర్శించి కానుకలున్ను నవరత్నాభరణములున్న సమర్పించి శ్రీముఖ సంవత్సరం ఆశ్వీజ శు ౧౫ దినములు రాదిగా గల వస్త్రములున్ను గ్రామాదులున్ను సమర్పించి స్వామి సన్నిధిని షోడశ మహాదానములున్ను శేశి అవ్వారిగా సత్రములున్ను గలుగ శేశి అందుండ్చి త్రిపురుల చేత పూజలు గొన్న మూడు స్థలాలకున్ను పోయిన స్వామి దర్శనం శేశి నంద్రీశ్వర దర్శనం శేశి......మధురకు వచ్చి మీనాక్షిదేవినిన్ని చొక్కనాథస్వామినిన్ని త్రిసంధ్యల యందున్ను సేవించ్చి కానుకలు వేశి అనేక భూషణములు సమర్పించ్చి అంమ్మవార్కి వజ్రాల కంమ్మ

లున్ను వైడూర్యపు పతకములున్ను వచ్చల కంమ్మలున్ను ముత్యపు ముక్కరా మున్ను సమర్పించి త్రిరాత్రుళ్లు వాసము జేసి...శంకర నారాయణ దేవళానకు వచ్చి నాగతీర్థమున స్నానం శేశి గోమతీ సమేతముగా శంకరనారాయణస్వామిని దర్శించ్చి దక్షిణ కాశికి పోయి త్రికూటాచలమంద్ను అకాశగంగ యంద్దలి స్నానం శేశి చిత్రసభ శేవించ్చుక అగస్త్య పర్వతానకు వచ్చి కల్యాణతీర్థమంద్దలి స్నానం శేశి అగస్త్యేశ్వరుని గోపుర గట్టించి...కన్యాకుమారికి జని అమ్మవారికి సేవించ్చుక శ్రీ కందుద్వారికి వచ్చి వల్లి దేవయాన సమేతముగా సుబ్రంహ్మణ్యస్వామిని శేవించ్చి... ఆది సేతువుకు పోయి రఘునాయకుల సేవించ్చి కాళములమీద సముద్రతరణమై ధనుష్కోటిలో ఖడ్గం కడిగి సేతుస్నానం తులాపురుషదానం మొదలైన దానా లాచరించ్చి కాశి విశ్వేశ్వరులనుంన్ను రామలింగ్గస్వామినిన్ని పర్వత వర్ధన అమ్మవారినిని సేవించ్చుకొని చతుర్వింశతి తీర్థముల యంద్దు స్నానం శేశి కోటిగోదానం కోటిబ్రాహ్మణులకు అన్నదానము శేశి స్వామి సంన్నిధిని మూడు తులలు తూగి అంమ్మవార్కి సకలాభరణములున్ను నవరత్నపొడిగా యిచ్చి త్రిరాత్రి వసిఇంచి కోటితీర్థస్నానం శేశి స్వామిచేత అంప్పించుకొని మరలినవారై గోకర్ణ స్థలమునకు వచ్చి... .సుముహూర్తమంద్దలి విద్యా నగర ప్రవేశమై విశలం విరూపాక్షుల సేవించ్చి కానుకలున్ను అనర్ఘ్యమైనటువంట్టి భూషణాదులున్ను సమర్ప్పించ్చి నగరు ప్రవేశమై పెద్దలకు మ్రొక్కి సుముహూర్తమున హజారమునకు విజయం శేశి అప్పాజి మొదలైన సకల సామాజికులనన్ను..." (పే. 111—114)చుక్కలు మధ్య వదలిన భాగములు)

ఇంతవరకు చాలును, శ్రీ కృష్ణదేవరాయలు "విష్ణుతో నివ్వల వొక్క వేల్పు గణియించిన పాతకి" యనుటకు జంకలేదనుటకు. విష్ణునితో సమానముగా శివుని సుబ్రహ్మణ్యేశ్వరుని కన్యాకుమారిని సేవించిన మహా ప్రభువు రాయలు!

కాబట్టి ఆముక్తమాల్యదను రాయలు రచించెనా లేదని నిర్ధారించుటకు శ్రీ నీలకంఠశాస్త్రి చూపించిన మార్గము నిస్సందేహముగా గ్రాహ్యమైనదే! రాయలు కవిత్వము చెప్పలేడనికాని పండితుడుకాడని కాని ఉపపాదించుటకు చేయుచున్న ప్రశ్న కాదిది! రాయ లాముక్తమాల్యద వ్రాయలేదనుటకే ఎక్కువ యవకాశము కలదని బుద్ధిమంతులకు తోపక మానదు. బహుముఖములనుండి చరిత్రకు తెలియ వచ్చుచున్న రాయలకును ఆముక్తమాల్యదాకర్తకును భేదము కొట్టవచ్చినట్లు కనిపించుచున్నది.

9

మరి రాయలు వ్రాయకున్నచో ఎవరు వ్రాసిరి? ఎవరు వ్రాసినను అతడు సంస్కృతాంధ్ర భాషలలో విశేషాధికారమున్న కవీశ్వరుడు. లోకానుభవ మున్నవాడు. కాని విశిష్టాద్వైత సంప్రదాయము లనుగాని శ్రీ మద్రామానుజుల శ్రీభాష్యమునుగాని వారి శిష్యుల రచనల సంగతి నిశితముగా తెలిసిన వాడు మాత్రముకాదు. ద్రావిడవేదముగాని అథమ పక్షము గోదాదేవి అరవములో చెప్పిన 'అండాళ్ తిరుమొళి' చక్కెర పొంగలి రుచి తెలిసిన వాడైనను కాడు!

1. విష్ణు పురాణమునకు గోదాదేవి తండ్రి విష్ణుచిత్తుడు వ్యాఖ్యానము వ్రాయుచున్నట్లు ఆముక్తలో నున్నది. అది పెద్ద తప్పు. విష్ణు పురాణమునకు వ్యాఖ్యానము వ్రాసినది శ్రీ మద్రామానుజుల శిష్యుడగు మరియొక విష్ణుచిత్తుడు.

2. విష్ణుచిత్తుడు రాజసభలో ఇతర మత ఖండనము చేయుటలో అద్వైత వాదమునకు సంబంధించిన సీస పాద మిట్లున్నది:

"పారి 'నీశుండేన' వా భోగమాత్రేత్యాద్య
దాహృతి స్ఫూర్తి మాయావివాది'

ఇక్కడ 'భోగమాత్ర సామ్య లింగాచ్చ' అను సూత్రము సూచింపబడినది. ఆ సూత్ర వ్యాఖ్యానములో 'ఈశుడేను' అను వాదము ఖండింపబడలేదు. ఆ సూత్రము భాష్యములో ముక్తునికి బ్రహ్మయాథాత్మ్యానుభవరూపభోగ మందె బ్రహ్మసామ్యముగాని

జగత్సృష్ట్యాదిక వ్యాపారములయందు సంబంధము లేదని తెలియజేయుననియే ప్రతిపాదింపబడినది. జీవుడు బ్రహ్మము వేరు అని 'ఆనంద మయోఽ భ్యాసాత్' ఇత్యాది సూత్రములను వ్యాఖ్యానించు సందర్భములో చూప బడినది. ఆముక్తలో సూచించినది 4 వ అధ్యాయములో నాల్గవ పాదములోని 21 వ సూత్రము. అది దూరాన్వయముగా తప్ప అద్వైత ఖండనమునకు ఉపయోగపడదు. శ్రీభాష్యములో అద్వైత ఖండనము చేసిన సూత్రములు ప్రథమాధ్యాయములోని ప్రథమ ద్వితీయ పాదముల లోనివి.*

3. ఇక గోదాదేవి పరిణయ కథ వ్రాయదల పెట్టి ఆమె విరహమును వర్ణించిన కవి, ఆమె మహా కవయిత్రియై యుండి విరహగీతములు పాడినది ఎరిగి యున్నచో వానిని తన కావ్యములోనికి తీసికొని రాకుండునా? ఆముక్తదా కర్త యీ పని చేసి యున్నచో నేడు శ్రీమాన్ మాడభూషి గోపాలాచార్యుల వంటివారికి ' చక్కెర పొంగలి' రుచి మనకు చూపెడు నవస్థ తొలగియుండెడిది.

4. శ్రీ వైష్ణవాచారములను పైపైగానే కాని ఆముక్త కవికి లోతుగా తెలియవు.

5. ఆముక్త కవి యామునాచార్య చరిత్రమునకు మూలగ్రంథమైన గురు పరంపరా ప్రభావములోలేని మార్పులు కొన్ని చేసెను. అవి బ్రాహ్మణ శ్రీవైష్ణవులకు సమ్మతము లనుకొనము. యామునుడు శైవుడగు పాండ్యరాజును వైష్ణవుని జేయుట, పాండ్యరాజ సోదరిని వివాహమాడుట, క్షత్ర ధర్మ మవలంబించుట—శిష్ట సమ్మతములుకావు.

కాబట్టి ఆముక్తమాల్యదా రచయిత నున్నుగా విశిష్టాద్వైత ప్రవిష్టుడుకాడు.

పెద్దనయేయని బహుకాలాగతమైన వాడుక యున్నది కావున అయనయే కావచ్చును. శైలిభేదము పెద్ద అడ్డు కాదు. పెద్దన మనుచరిత్ర శైలి కొన్ని భాగములలో ఆముక్తలో లేకపోలేదు. తిక్కన శైలి విరాటపర్వములో నున్నదానికి శాంతిపంచకములో నున్నదానికి నెంత భేదమున్నది?

పెద్దన కాకున్న ఏ చాత్తాద వైష్ణవ పండిత కవియో వైఖానస పండితకవియో వ్రాసియుండ వచ్చును. ఏదైనను ఊహ మాత్రమే.

రాయలు జాంబవతీపరిణయమును రచించి యుండు ననుటకు ఎట్టి విప్రతిపత్తియు లేదు. కాని దాని ప్రస్తావనను బట్టి దానిని రచించిన కవి ఆముక్తమాల్యద రచింపలేదని ధృఢముగా చెప్పవచ్చును. అందలి కల్పనాదులు కూడ ఆముక్తలోని కల్పనలతో సామ్యము కలవి కనపడలేదు.

రాయల కాలములో ఆంధ్రకవులేకాక కన్నడ కవులు అరవకవులు ఎందరో తమ కావ్యములలో రాయల వివాహాదులను వర్ణించినట్లును తమ కావ్యము లాయన కంకిత మిచ్చినట్లును తెలియుచున్నది. కన్నడమునందును అరవమునందును విద్వాంసులయిన యాంధ్రవిమర్శకులు ఆ గ్రంథములను పఠించి క్రొత్త వెలుగు ప్రసాదించువరకు రాయల ఆముక్తమాల్యదా కర్తృత్వమునందు సందేహము సత్యాన్వేషణ పరులకు తీరునట్టిదికాదు.

* శ్రీమాన్ మేడేపల్లి వేంకట రమణాచార్యులు గారు తమ ఆముక్తమాల్యదోపోద్ఘాతములో వివరించినారు.

ప్రాచీన సంప్రదాయం - థామస్ రాబర్ట్ మాల్థస్

డా. ఏ. ఆర్. కె. మూర్తి

ఆడమ్ స్మిత్ రచన Wealth of Nations లో కొన్ని సిద్ధాంతాలు కేవలం సూచనప్రాయంగా మాత్రమే ఉండిపోయినాయి. వాటిని గురించి విపులంగా చర్చించనందువల్ల వాటికి అంత ప్రాముఖ్యం ఇవ్వలేదనే చెప్పవచ్చు. అట్లాంటి వాటిలో జనాభాకు సంబంధించిన సిద్ధాంతం ముఖ్యంగా చెప్పవలసి వుంది. స్మిత్ ప్రధానంగా జాతీయ సంపద పంపిణీ విధానాన్ని గురించి చర్చించినాడనే విషయం మనం ఇదివరకే తెలుసుకొన్నాము. ఈ సందర్భంలో జనాభా పెరుగుదలవల్ల జాతీయ సంపద పంపిణీపైన ఎట్లాంటి ప్రభావం ఉంటుందనే విషయాన్ని సూచించినా, విశదీకరించి, ఒక జనాభా సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు. జాతీయోత్పత్తిని పెంచే మార్గాలను గురించీ, దాని పంపిణి విధానాలను గురించిమాత్రమే చర్చించినాడు. కానీ ప్రస్తుతమున్న జనాభా పరిమాణం, ముందు ముందు ఏర్పడే జనాభా పెరుగుదలరేటు తెలియందే పంపిణిని గురించిన చర్చ అంత సమగ్రంగానూ అర్థవంతంగానూ ఉండదు. జనాభా పెరుగుదలకు ప్రాముఖ్యం ఇచ్చి కట్టుదిట్టమైన, సమగ్రమైన సిద్ధాంతాన్ని చేసినవాడు మాల్థస్.

మాల్థస్ 1766 లో ఇంగ్లండులోని రాకరీ (Rockery) అనే గ్రామంలో ఒక గౌరవ కుటుంబంలో జన్మించినాడు. అతని తండ్రి డేనియల్ మాల్థస్ అంత సంపన్నుడు కాకపోయినా, సుఖంగా జీవించడానికి తగినంత ఆస్తిపాస్తులుండిన వాడే. మాల్థస్ 1788 లో తత్వశాస్త్రం (Philosophy) ఆధ్యాత్మికశాస్త్రం (Theology) లో పట్టభద్రుడయిన కొద్దికాలానికే కేంబ్రిడ్జి కళాశాలలో Fellow గా చేరి కొంతకాలం పనిచేసినాడు. 1799 లో అతడు ఐరోపా పర్యటనకు బయలుదేరినాడు. అనాడు ఐరోపాలో చెలరేగిన యుద్ధం ఫలితంగా ఆ పర్యటన ఆశించిన విధంగా జరగలేదు. 1802 లో కుదిరిన అమీన్స్ సంధివల్ల (Peace of Amiens) ఫ్రాన్సు సందర్శించడానికి అవకాశం కలిగింది. ఆ సందర్భంలోనే స్విట్జర్‌లాండ్‌ను కొన్ని ఐరోపాదేశాలను కూడా సందర్శించే అవకాశం కలిగింది. ఈ పర్యటనలవల్ల అతనికి ఆయా దేశాలలోని ఆర్థిక సాంఘిక పరిస్థితులను తెలుసుకోవడానికి చక్కని అవకాశం దొరికింది. 1805 లో అతను లండన్ సమీపంలో ఉండే హెయిల్‌బరీ కళాశాలలో చరిత్ర విభాగంలో ఆచార్యుడుగా చేరి, అదే వృత్తిలో 1834 వరకు పని చేసినారు.

అతని జీవితకాలంలో ఇంగ్లండులోని ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులు అతని ఆలోచనలను ప్రభావితం చేసినాయి. పద్దెనిమిదో శతాబ్దం చివరిదాకా ఇంగ్లండు సుభిక్షంగా ఉన్నా అప్పటి యుద్ధాల ఫలితంగా ఆర్థిక పరిస్థితి ఎంతో దిగజారిపోయింది. నిరాశా నిస్పృహలు ప్రజలను పీడిస్తున్న రోజులవి. ఇట్లాంటి పరిస్థితులలో అతని రచన ప్రారంభమైంది. అందువల్లే అతని రచనల్లో నిరాశా ఛాయలు ఉన్నాయేమో

అనిపిస్తుంది. ఇప్పుడు అతను ఆర్థిక శాస్త్రాభివృద్ధికి చేసిన సేవ ఏమిటో తెలుసుకొందాము.

మాల్థస్ ఎట్లాంటి పరిస్థితుల్లో జనాభాకు సంబంధించిన వ్యాసాన్ని (Essay on Population) వ్రాసినాడో తెలుసుకుంటేగానీ ఆ సిద్ధాంతం ఉద్దేశం ఏమిటో బాగా అర్థం కాదు. మాల్థస్ వ్రాసే దానికి కొంత పూర్వం దేశంలో గాడ్విన్ (Godwin) కొండొసెట్ (Condocet) రచనలు ప్రచారంలో ఉండినాయి—ముఖ్యంగా గాడ్విన్ రచనకు ఎక్కువ ప్రజాదరణ లభించింది.

మానవునికి స్వేచ్ఛ లభించగానే మనోబలంవల్ల కామేచ్ఛను జయిస్తాడు; అతడు చిరంజీవి అవుతాడు; దేశం భూతలస్వర్గమవుతుందని గాడ్విన్ ఎన్నో పగటి కలలు కనినాడు. జీవితంఆశావహమనీ, మానవాళికిఉజ్జ్వల భవిష్యత్తు ఉందనీ ప్రచారం చేసినాడు. నిరాశ నిస్పృహలకు మానవజీవితంలో చోటులేదని వాదించిన గొప్ప ఆశావాది అతను. ఇందుకు విరుద్ధ భావాలున్న వాడు మాల్థస్. గాడ్విన్ వాదాన్ని ఖండించవలెననే దృఢ సంకల్పం అతనిలో బయలుదేరింది. తన తండ్రి కూడా గాడ్విన్ వాదాన్ని అంగీకరించినాడు. మాల్థస్ తన తండ్రితో ఆ విషయము ఎన్నో పర్యాయాలు చర్చించినాడు. తండ్రి తన కుమారుని విపరీత మనస్తత్వాన్ని గ్రహించి, అతని భావాలను నలుగురికి తెలియ జేయటాన్ని సహృదయతతో ప్రోత్సహించినాడు. దాని ఫలితమే మాల్థస్ తొలి రచన. జనాభాకు సంబంధించిన వ్యాసం (Essay on Population). తొలి ముద్రణం 1798 లో జరిగింది. ఆ గ్రంథం వెలువడగానే సంఘంలో ఒక సంచలనం బయలు దేరింది. గాడ్విన్‌వాదంపట్ల ప్రజలకున్న అచంచల విశ్వాసం కొంత సడలింది. ఇది తన వాదానికి ఘన విజయంగా భావించినాడు మాల్థస్. ఇంతటితో తన రచనావ్యాసంగానికి స్వస్తిచెప్పకుండా కొనసాగించాడు. గాడ్విన్‌పై దెబ్బ తీయడంతోనే తన భావాలకు ఒక నిర్దిష్టమైన రూపాన్నిచ్చి ఒక సిద్ధాంతానికి రూపకల్పన చేసినాడు. అది ఆనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు ఒక సవాలు, భావితరాలవారికి ఒక వెలుగుబాట అయింది. రెండో ముద్రణంలో జనాభా సిద్ధాంతానికి ప్రాతిపదిక అయిన మూడు అంశాలను సూచించినాడు:

1. జనాభాపరిమాణం అందుబాటులో ఉండే జీవనోపాధికి అవసరమైన మార్గాలను అనుసరించి ఉంటుంది.

2. దృఢమైన అవరోధాలు లేనంతవరకూ జనాభా జీవనోపాధులను మించి పెరుగుతుంది.

3. జనాభాపెరుగుదలను అదుపులో ఉంచే శక్తులను నైతిక శక్తులనవచ్చు. వీటికి తోడుగా దుర్వ్యసనాలు, (Vice) దుస్థితి (Misery) జనాభా పెరుగుదలను అదుపులో ఉంచగల్గతాయి.

మాల్థస్ చేసిన జనాభా సిద్ధాంతాన్ని పరిశీలిస్తాము. జనాభా జీవనోపాధులకన్నా త్వరితంగా పెరుగుతుందనీ, అందువల్ల సంఘంలో దారిద్ర్యం దైన్యం అధికమవుతాయని భావించినాడు. జనాభా గుణోత్తర శ్రేఢి (Geometrical Progression) లో పెరిగితే, జీవనోపాధులు అంకగణిత శ్రేఢి (Arethmetic Progression) లో పెరుగుతాయి. ఇట్లా జరగడంవల్ల ప్రతి 25 సంవత్సరాల్లో జనాభా రెండింతలయి పెద్దసమస్యగా పరిణమిస్తుంది. దీని ఫలితంగా అనేక అరిష్టాలు ఏర్పడతాయని మాల్థస్ శంకించాడు. దీన్నే మరికొంత వివరిస్తే, ఇట్లా పెరిగే జనాభాను అరికట్టడం సహజంగా ఏర్పడే క్షామం, అనారోగ్యంవంటి వాటివల్లే సాధ్యమవుతుంది. లేదా ప్రజలు మనోనిగ్రహాన్ని అలవరచుకొని తమ కామ వికారాలను తగ్గించుకొని. నైతిక నిబంధనలను పాటించడంవల్ల సాధ్యమవుతుంది. అట్లా చెయ్యకుంటే ఫలితాలు దారుణంగానూ, భయోత్పాతకంగాను ఉంటాయని భావించినాడు. భవిష్యత్తు నిరాశాజనకంగా ఉంటుందని ఊహించినాడు. ఇట్లాంటి రచనలను చదివిన కార్లైల్ ఆర్థిక శాస్త్రాన్ని నిరాశాపూరిత శాస్త్రం... (Dismal Science) అనినాడు

మాల్థస్ జనాభాసిద్ధాంతాన్ని క్రమ క్షీణ ప్రతిఫలాలు సహజంగా ఉంటాయనే ప్రాతిపదికను ఆధారం చేసుకొని చేసినాడనేది గమనించవలసిన విషయం. ఆహారోత్పత్తి జనాభా పెరుగు

దంకు సమానఅనుపాతంలో ఉండదని అన్నప్పుడు, భూమిలో పండించే ఆహార ధాన్యోత్పత్తి క్రమంగా క్షీణిస్తుందని భావించడంవల్లనే, కొంత కాలానికి దేశంలో సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంటుందని భావించినాడు. ఇట్లాంటి క్రమ ప్రతిఫల సిద్ధాంతాన్ని మొట్ట మొదట ప్రతిపాదించినవాడు మాల్థస్ అనవచ్చు. (Law of Diminishing Returns. మాల్థస్ జనాభా సిద్ధాంతాన్ని వివరించేటప్పుడు జీవనోపాధి లభించేది భూమినుండేకానీ పారిశ్రామికోత్పత్తివల్ల కాదనేదాన్ని స్పష్టంగా సూచించినాడు. అట్లాంటప్పుడు భూమి ఉత్పాదనశక్తి జనాభాపెరుగుదలతో సరితూగగలదా అనే సంశయాన్ని వెలిబుచ్చినాడు. ఉన్న భూమి ఉత్పాదనశక్తి అనంతంకాదనీ, ఒక పరిమితి తరవాత దానినుంచి వచ్చే ఫలితం క్రమక్రమంగా తగ్గుతుందనేదాన్ని సహేతుకంగా నిరూపించడానికి ప్రయత్నించినాడు. ఈ ధోరణిలో ఆలోచిస్తే భూమి ఉత్పాదనశక్తి అనంతమే అయితే భూ విస్తీర్ణాన్ని పెంచవలసిన అవసరం వుండదని, జనాభా పెరగడం వల్ల ఆహార ధాన్యాల కొరత ఏర్పడే అవకాశం ఉండదని అర్థమవుతుంది. కానీ వాస్తవిక ప్రపంచంలో ఇది సంభవంకాదు. ఎందుకంటే భూమి ఉత్పాదన శక్తి పరిమితమైంది. జనాభా అత్యధికమైతే తిండి గింజల కొరత ఏర్పడుతుంది. ఫలితంగా ప్రజలు ఎన్నో ఈతిబాధలకు గురికావలసివస్తుంది. సంక్షోభం ఏర్పడుతుంది. జీవితం దుర్భరమవుతుంది. ఇదీ అతని వాదనలోని సారాంశం. దీన్ని దృష్టిలో ఉంచుకొనే జనాభా పెరుగుదలను అరికట్టడానికి కొన్ని మార్గాలను సూచించినాడు. క్రమ క్షీణ ప్రతిఫల సిద్ధాంతాన్ని వివరించేటప్పుడు ఒక అంశాన్ని ముఖ్యంగా గుర్తుంచుకోవలె—అతడు భూమి ఉత్పాదన క్రమంగా క్షీణిస్తుందనే దాన్ని ఒక సిద్ధాంతంగా ప్రతిపాదించడానికి ప్రయత్నించలేదు. కేవలం తన జనాభా సిద్ధాంతాన్ని సహేతుకంగా నిరూపించడానికి దాన్ని ఒకసాధనంగా మాత్రమే ఉపయోగించుకొన్నాడు. క్రమ క్షీణ ప్రతిఫలాలు సహజంగా ఏర్పడతాయనే దాన్ని ఒక ప్రమేయంగా భావించి తన పరిశీలన జరిపినాడనేది ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన మరొక అంశం. అంతకుమించి మాల్థస్‌కు ఉపాంతవ్యుత్పత్తి (Marginal Product) లేదా ఉపాంతం (Margin) అనే భావనను గురించి ఏమాత్రం తెలియదనే చెప్పవలె.

మాల్థస్ _ మార్కెట్లో వస్తు సంవృద్ధి సిద్ధాంతం: (Theory of Market Gluts)

మాల్థస్ తన......రాజకీయ ఆర్థిక శాస్త్ర సూత్రాలు..(Principles of Political Economy) అనే రచన ద్వితీయ ముద్రణంలో....తక్కువ స్థాయిలో ఉండే వినియోగ సిద్ధాంతం.... (Theory of under consumption) ను పొందుపరిచినాడు.ఇది తరవాత కీన్సుసిద్ధాంతాలకు ప్రాతిపదిక అయింది. అప్పటి దేశకాలపరిస్థితులను, అప్పటి ఆర్థిక శాస్త్ర వికాసాన్నిబట్టి చూస్తే మాల్థస్ చేసిన సిద్ధాంతం అతని వూహాశక్తికీ, సృజనాత్మక శక్తికీ దృష్టాంతం అనవచ్చు.

సప్లై, దానికిఅవసరమైన డిమాండును అదే కల్పించుకొంటుందనేది ప్రాచీనుల ఆర్థిక విశ్లేషణకు మూలాధారమైంది. దీన్ని ప్రతిపాదించినవాడు జె. బి. సె అనే విషయం మనం ఇదివరకే తెలుసుకొన్నాము. మార్కెట్లకు సంబంధించిన అతని సూత్రం ప్రకారం వినిమయం ప్రాతిపదికగావుండేఆర్థికవ్యవస్థలో వస్తుసేవలకున్న డిమాండు దానికి అవసరమైన సప్లైయ్‌ని కల్పించుకొంటుంది. ఇదే రికార్డో విశ్లేషణకు కూడా ప్రధానమైన ప్రాతిపదిక. ఈ పద్ధతి ప్రకారం చివరకు డిమాండు సప్లైలు పరస్పరము ఆధారపడి ఉంటాయనీ, అందువల్ల అత్యుత్పత్తి ఏర్పడడం అసంభవమనీ భావించినాడు. స్వల్పకాలిక అత్యుత్పత్తి ఏర్పడవచ్చునేమో గాని దీర్ఘకాలిక అత్యుత్పత్తి ఏర్పడుతుందనే భయం లేదనే వారి వాదం. ఒక వస్తువు సప్లై ఒకమార్కెట్టులో దానికి ఉన్న డిమాండుకంటే తక్కువగా ఉంటే, మరొకచోట సప్లైకంటే డిమాండు అధికంగా ఉండవచ్చునని వారి అభిప్రాయం. సాధారణంగా దీర్ఘకాలిక అత్యుత్పత్తి ఏర్పడదు కాబట్టి, అట్లే మూల ధన సేకరణ (Capital accumulation rate) రేటు పెట్టుబడిఅవకాశాలకన్నా (Investment opportunities) అధికంగా ఉండడం అసంభవమనే వాదించినాడు.

ప్రాచీన సంప్రదాయం – థామస్ రాబర్ట్ మాల్థస్

పైన చెప్పిన అంశాలను మాల్థస్ ఒప్పుకో లేదు. దానికి కొన్ని ప్రత్యామ్నాయాలను సూచించి వాడు. అర్థికశాస్త్రం ప్రకృతి, భౌతిక శాస్త్రం వలె యదార్థంకాదనీ వాటివల్ల పరిణామాలను ఇద మిద్ధంగా ఉంటాయని చెప్పడం సాధ్యంకాదని మాల్థస్ హెచ్చరించివాడు.

విలువకు చక్కటి కొలమానం శ్రమే అని మాల్థస్ విశ్వసించినాడు. అతను విలువ కిచ్చిన నిర్వచనం ప్రకారం లాభాలు శ్రమతో కలిసి ఉంటా యని (Profits are lumped together with labour), ఆర్థిక వ్యవస్థ నిరాటంకంగా పని చెయ్యాలంటే నష్టాన్ని సృష్టించేటంత అధికంగా డిమాండు ఉండవలెనని, సార్థకమైన డిమాండే (Effective Demand) ఉత్పత్తి వ్యయాలకూ, లాభాలకు సరిపోయేటంత డిమాండని నిర్వచించినాడు. ఉత్పత్తి స్థాయినినిర్ణయిస్తుందని మాల్థస్ అంటాడు. వస్తువులను వస్తువులతో మార్పుచేయడం—వస్తు మార్పిడి పద్ధతి—అంత తరుచుగా జరగదనీ, వస్తువు లను కొనడంలో శ్రమే వినిమయ సాధనంగా ఉంటుం దని భావించినాడు. వస్తువులకువుండే డిమాండుకు సంబంధించినంతవరకూ ఉత్పత్తిలో పాల్గొనే శ్రామి కులు అట్లా పాల్గొనని శ్రామికులు అనే దానితో నిమిత్తంలేదు. ఎందుకంటే శ్రామికులందరికీ వస్తువుల అవసరం ఉంటుంది. వస్తువులకు డిమాండు ఒక ప్రధానాంశంగానూ ఉత్పత్తి అయిన వస్తువులకున్న డిమాండులో కూడా ఒక ముఖాంశ్యంగానూ ఉంటుందని అంటాడు.

ఉత్పత్తిదారుడు శ్రామికులకు ఉత్పత్తి కార కాలలో ఒకట్లైన శ్రమకు వారు ఉత్పత్తిచేసే వస్తువుకంటే తక్కువ వేతనం ఇవ్వడంవల్ల తన గొయ్యి తానే త్రవ్వుకొంటాడు. అంటే శ్రామికులకు తక్కువ వేతనాలు ఇవ్వడం అంటే సార్థకమైన డిమాండు మొత్తాన్ని తగ్గించడమే అవుతుందని అర్థం. సార్థకమైన డిమాండు తగ్గడంవల్ల ఉత్పత్తి అయిన వస్తువుల కొనుగోలు చేయడం తగ్గుతుంది. దీని ఫలితంగా కొంతకాలానికి అత్యుత్పత్తి (Over Production) ఏర్పడుతుంది. మార్కెట్లలో వస్తు సంవృద్ధి పెరుగుతుంది. ఇట్లా జరగకుండా నివారించడానికి మాల్థస్ ఒక ఉపాయాన్ని సూచించినాడు—డిమాండు స్థాయి పడిపోకుండాఉండేటట్లు చూడవలె. ఇది ఉత్పత్తి చేయకున్నా వినియోగం తగ్గకుండా ఉండేటట్లు చూడడంవల్ల సాధ్యమవుతుంది. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేయడానికి కావలసిన శక్తి సామర్థ్యాలు ఎక్కువగా ఉన్నా, ఉత్పత్తి చెయ్యకున్నా వినియోగం కోసం ఖర్చుపెట్టేవారు అధికంగా ఉండడం అనేది సాధారణంగా ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారే ఉత్పత్తి అయిన వస్తు సేవలను అధి కంగా వినియోగిస్తాడని కూడా మాల్థస్ సూచించి నాడు. కాని పెట్టుబడిదారులలోవుండే పొదుపరి తనం, దాచుకోవాలనే ఇచ్ఛ విషయాల్లో అంత దృఢమైన నమ్మకం అతనికి లేదు. క్లుప్తంగా చెప్పాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే ఉత్పత్తి దానంతట అదే సర్దుబాటు చేసుకోలేదు. (Lacks self-adjusting capacity). సార్థకమైన పరిస్థితులు లేనప్పుడు ఉత్పత్తి చెయ్యకపోయినా, వినియోగం చేసేవారిసంఖ్యనుపెంచగలిగే మరోమార్గం ఏదైనా వెతకవలసి ఉంటుందని మాల్థస్ సూచించి నాడు.

మాల్థస్ చేసిన సిద్ధాంతం, రికార్డో చేసిన సిద్ధాంతంతో పోలిస్తే అంత విశిష్టమైందికాదేమో అనిపించవచ్చు. కానీ అప్పటి పరిస్థితుల్లో, ఆర్థిక విజ్ఞాన శాఖలో అప్పటివరకూ జరిగిన అభివృద్ధి దృష్ట్యాచూస్తే, మాల్థస్ గొప్ప ప్రజ్ఞను ప్రద ర్శించినాడనే చెప్పవలె. ఈ సిద్ధాంతంవల్ల, ఇతడు కీన్సుకు మార్గ దర్శకుడు అయినాడనే విషయాన్ని గుర్తుంచుకోవలె.

మాల్థస్—భాటక సిద్ధాంతం :

(Theory of Rent)

భూస్వాములకు దక్కే భాటకం, వారి ఆశ యాలను గురించి మాల్థస్ చేసిన చర్చను పరిశీ లించడం ముఖ్యం. ఈ చర్చవల్ల మాల్థస్‌కు అతని తరువాతి వాడైన డేవిడ్ రికార్డోకు (David Ricardo) వారి దృక్పథాల్లో ఉండే వైవిధ్యం తెలుస్తుంది.

భాటకం అంటే ప్రకృతివల్ల లభించే మిగులు అని మాల్థస్ భావించినాడు. ఇది రికార్డో వాదానికి భిన్నంగా ఉంటుంది. అంతేకాకుండా, భాటకానికీ, ఏక స్వామ్యంలోని ఆదాయానికి ఎటువంటి సామ్యంలేదని అతని వాదం. స్మిత్, సే అను ఈ సందర్భంలో నిశితంగా విమర్శించినాడు. భూమి విస్తీర్ణం పరిమితంగా ఉండడంవల్ల దానిమీద భూస్వామికి ఉండే ఏకస్వామ్యం పాక్షికమైన ఏకస్వామ్యం అనీ (Partial Monopoly), అందువల్ల అతను రాబట్టుకొనే అద్దె (Rent) సాధారణమైన ఏకస్వామ్యవ్యవస్థలో ఉండే ధరలతో పోల్చకూడదనీ పేర్కొనినాడు. ఇట్లా ఉండడానికి మూడు కారణాలను సూచించినాడు.

1. సారవంతమైన భూమి కొరతగా ఉండడంవల్ల దానినుంచి వచ్చే ఆదాయం వ్యవసాయానికయ్యే వ్యయానికంటే ఎక్కువగా ఉండడంవల్ల భూస్వామికి నికరాదాయం ఉంటుందనీ అతని అభిప్రాయం. కానీ అట్లా వచ్చే ఆదాయానికీ ఏకస్వామ్యానికి ముడి పెట్టటం సరియైనదికాదని వాదించినాడు.

2. అట్లాంటి భూమిలో ఉత్పత్తి అయే నిత్యావసరవస్తువులు వాటికి అవసరమయ్యే డిమాండును అవే సృష్టించుకొంటాయి కాబట్టి—ఆదాయంలోని మిగులు, తయారైనవస్తువులను ఉపయోగించే జనాభాను పెంచుతుందని భావించినాడు.

3. నికరాదాయం భూసారాన్ని బట్టి మారుతుందనీ, భూసారంలో ఉండే వ్యత్యాసాలు అద్దె పరిమాణాన్ని నిర్ణయిస్తాయని భావించినాడు.

భూస్వాముల ఆశయాలు సంఘ శ్రేయస్సుకు ఏవిధమైన అడ్డంకులను కలిగించవని అతడు విశ్వసించినాడు.

మాల్థస్—ఆర్థికవృద్ధి సిద్ధాంతాలు :

మిగిలిన ప్రాచీన ఆర్థికవేత్తలకంటే మాల్థస్ ఆర్థిక వృద్ధిని గురించి ఎక్కువగా పరిశీలన జరిపినాడనే చెప్పవచ్చు. అతని గ్రంథంలో ఆర్థికవృద్ధి విషయకమైన చర్చ విపులంగా ఉంది.

సంభావ్య స్థూల జాతీయోత్పాదనానికి (Potential Gross National Product) నికరమైన జాతీయోత్పాదనానికి (Actual or Net National Product) ఉన్న భేదమే ఆర్థికాభివృద్ధి అని మాల్థస్ సూచించినాడు. జనాభా పెరగడం వల్లే ఆర్థికవృద్ధి ఏర్పడుతుందనుకోవడం సరికాదు. నిజానికి జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధి ఫలితాంశం (End Product). ఎందుకంటే జనాభా పెరుగుదల, సంపద పెరుగుదల సామపాతంగాలేకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యంకాదు. ఈ వాదనకు ఆనాడు ఆర్థికంగా వెనుకబడిన దేశాలైన స్పెయిన్, పోర్చుగల్, హంగరి, టర్కీ మొదలైన దేశాలను నిదర్శనాలుగా చూపించినాడు.

జనసంఖ్యవల్ల ఆర్థిక ప్రగతికి కావలసిన ప్రేరణ (Stimulus) ఏర్పడదు. ఆర్థికాభివృద్ధికి అత్యంత అవసరమైంది సార్థకమైన డిమాండు పెరగడం. ఇట్లా చెప్పడంలో తరవాతివారైన కీన్సు, కలెక్కీల భావాలను ముందుగానే మాల్థస్ గ్రహించినాడని చెప్పవచ్చు. జె. బి. సే మార్కెట్లసూత్రాన్ని తిరస్కరించి మార్కెట్టులో వస్తువుల సంవృద్ధి పెరగడాన్ని (Market Gluts) సూచించినాడు. పొదుపు అంటే వినియోగాన్ని కొంతకాలం వాయిదా వెయ్యడం; అంటే సార్థకమైన డిమాండును తగ్గించడమే అని మాల్థస్ భావించినాడు. ఈ విషయంలో ఇతర ప్రాచీనుల వాదానికీ మాల్థస్ వాదానికి ఒక ప్రధానమైన భేదం ఉంది. మాల్థస్ వాదన ఒక వర్తులాకారంలో ఉంటుంది.— జాతీయాదాయం—లాభాలూ వేతనాలు మొత్తానికి సమానమని అతని భావం. దీన్నే కలెక్కీ మరికొంచెం మెరుగుపరిచినాడు.

వేతనాలు సంపాదించే శ్రామికులు పేదవారు కాబట్టి పొదుపుచేసేశక్తి వారికిఉండదు. వాళ్ల ఆదాయం అంతా వినియోగానికే ఖర్చు పెడతారు. పెట్టుబడిదారుడు కొంత మిగులుస్తాడు. ఇట్లా మిగిల్చిన ధనాన్నే వాళ్లు పెట్టుబడి పెట్టడంవల్ల ఆదాయం ఏర్పడుతుంది. ఇట్లా జరిగేదాన్ని ఒక సమీకరణరూపంలో చూపించవచ్చు.

$$R=(I+Cc+Cw)-Cw=I+Cc$$

ఇందులో Cw అంటే శ్రామికుల వినియోగమనీ, Cc అంటే పెట్టుబడిదారుల వినియోగమనీ అర్థం చేసుకోవలె. పై సమీకరణాన్ని కొంత వివరిస్తే, జాతీయాదాయం లేదా జాతీయోత్పత్తి అంటే పెట్టుబడిదారులు తమ వినియోగం కోసం చేసే ఖర్చు మొత్తమూ, శ్రామికుల వేతనాలే అని అర్థం. పెట్టుబడిదారులకు వచ్చే ఆదాయంలో వేతనాల మొత్తం పోగా మిగిలిన జాతీయాదాయం లాభాలకు సమానం. వేతనాలు శ్రామికుల వినియోగానికి అయ్యే మొత్తానికి సమానం. అంటే లాభాలు, పెట్టుబడిధనానికి (Investment) సమానమని మాల్థస్ భావించినాడు. పెట్టుబడిదారులు తమ వినియోగాన్ని కొంతకాలం వాయిదా వేయుటంవల్ల అభివృద్ధి త్వరితగతిలో సాగకపోగా తగ్గిస్తుందని మాల్థస్ అంటాడు.

అంటే పొదుపు, పెట్టుబడుల అవసరాన్ని అతడు గుర్తించలేదని అనుకోకూడదు. లేదంటే వాంఛనీయమైన పరిమితిని సూచించినాడు. (Optimum Propensity to Save). ఒక స్థాయివరకూ పొదుపు అవసరమేకాని ఆ పరిమితి మించితే పొదుపు అవాంఛనీయమైన పరిణామాలకు దారి తీస్తుంది —వినియోగం తగ్గుతుంది. దానివల్ల సార్థకమైన డిమాండు తగ్గుతుంది. ఫలితంగా పెట్టుబడికి తగిన ప్రోత్సాహం ఉండదు. ఎక్కువ ఆదాయాన్ని సంపాదించేవారు తమ వినియోగాన్ని కొంతకాలం వాయిదా వెయ్యడంవల్ల హెచ్చుఅభివృద్ధి రేటు ఏర్పడుతుందని అనుకోకూడదు. గతించిన పొదుపు మొత్తాలు ఆర్థికవృద్ధి జరగడంవల్ల ఏర్పడే ఫలితాలు. బాగా అభివృద్ధిని సాధించిన ఆర్థిక వ్యవస్థలోఏర్పడే, నిలకడగా ఉండే పెరుగుదల (Steady Growth in Advanced Economies) ను సూచించినాడనే చెప్పవచ్చు. అట్లాంటి వ్యవస్థలో పెట్టుబడీ లాభాలు ఒకే రేటులో పెరుగుతూ ఉంటాయి. ఆర్థిక పురోగమనానికి అవరోధాలైన అంశాలను గురించి కూడా మాల్థస్ పరిశీలించినాడు. వీటివల్ల అభివృద్ధిని అందుకొనే దశ (Take-off Stage) నుంచి స్వయంపోషక దశ (Self-sustained Stage) చేరుకోవడం సాధ్యపడుదు.

విమర్శ :

మాల్థస్ సిద్ధాంతం నిశ్చయాత్మక శాస్త్రం (Exact Sciences) ముసుగులో ఉండే భావనాత్మక శాస్త్ర (Speculative Sciences) మైన అధిభౌతికశాస్త్రం (Theology) అనవచ్చు. మనోనిగ్రహాన్ని జనాభాపెరుగుదలను అరికట్టడానికి ఒక సాధనంగా ఒప్పుకుని 18, 19 శతాబ్దాంలోని చరిత్రను పరిశీలిస్తే అతని సిద్ధాంతాలు వాస్తవికాలే అని తోస్తుంది. కానీ 19 వ శతాబ్దారంభంలోని శాస్త్రీయసాంకేతికరంగాల్లో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు జనాభాసిద్ధాంతాన్ని అర్థరహితమైందిగా చేసినాయి. ఉత్పత్తి ఎన్నోరెట్లు పెంచడానికి ఎన్నో అవకాశాలను కల్పించడం సాధ్యమైంది. జనాభా పెరుగుదల మాల్థస్ సూచించినంత ప్రమాదకరంగా పరిణమించలేదు. కానీ రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఏర్పడిన దేశాలలో ఈ సమస్య మళ్లీ తలఎత్తిందని కొందరు భావిస్తున్నారు—ముఖ్యంగా భారత్, చైనా దేశాలలో జనాభా సమస్య తీవ్ర రూపం దాల్చిందని వారి అభిప్రాయం.

1920 నాటికి మాల్థస్ సిద్ధాంతం పూర్వమున్న ప్రభావాన్ని కోల్పోయిందనే చెప్పవలె. నిజం చెప్పాలంటే, మాల్థస్ వూహించిన అత్యధిక జనాభా సమస్య అల్లా కీన్సుకాలంనాటికి అల్ప జనాభా సమస్యగా (Problem of Under population) మారింది. కానీ రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఏర్పడిన దేశాల్లో ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా మాల్థస్ సిద్ధాంతాంకు ప్రాముఖ్యం లభించింది. కానీ నేటి ప్రపంచంలో రెండు విధాలైన సమస్యలు ఉత్పన్నమైనాయి. కొన్ని దేశాల్లో అత్యల్ప జనాభా ఆర్థిక పురోగమనానికి ప్రధాన అవరోధంగా పరిణమించింది. ఈనాడు ప్రచారంలో ఉన్న కొన్ని ఆర్థికవృద్ధిసిద్ధాంతాలు అత్యధిక జనాభాకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చినాయి. మాల్థస్

జనాభా పరిమాణానికీ ఆహారధాన్యంపరిమాణానికి ఉన్న తేడాను అనుసరించి అత్యధిక, అత్యల్ప జనాభాల నిర్వచనంచేస్తే, నేడు జనాభాలో మెరుగైన ఉత్పత్తి సాధనాలను ఉపయోగించి ఉత్పత్తిని నిర్వహించేవారు, మొత్తం జనాభాలో ఎంత శాతం ఉంటారో దాన్నిబట్టి అత్యధిక, అత్యల్ప జనాభాను నిర్ణయిస్తున్నారు. జనాభా పెరుగుదలను గురించి అంత ఆందోళన చెందవలసిన అవసరంలేదనీ, ఆర్థికాభివృద్ధికి కీలకమైంది ఆ వ్యవస్థచేసే వ్యూహరచనే అని భావిస్తున్నారు. జనాభా అధికంగా ఉన్నదేశాల్లో శ్రమనే ఎక్కువగా ఉపయోగించిచేసే ఉత్పత్తి కార్యక్రమాన్నే అవలంబించడంవల్ల ఈ సమస్యను పరిష్కరించవచ్చుననే అభిప్రాయం బాగా ప్రచారంలో ఉంది. జనాభా పెరుగుదలను అరికట్టడానికి కొన్ని దేశాల్లో— ముఖ్యంగా భారతదేశంలో— కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తూ ఉండడం మనకు అందరికీ తెలిసిన విషయమే.

మాల్థస్‌చేసిన 'మార్కెట్లలో వస్తుసంవృద్ధి' (Theory of Market Gluts) సిద్ధాంతం కీన్సు సిద్ధాంతాలకు ముఖ్యమైన ప్రాతిపదిక అయింది. అంతవరకూ జరిగిన ఆర్థిక శాస్త్రపరిశీలన అంతా జె. బి. సె మార్కెట్ల సూత్రం ఆధారంగా సాగిందే. సప్లయే దానికి అవసరమైన డిమాండును సృష్టించుకొంటుందనీ, ఆర్థిక వ్యవస్థలో అత్యుత్పత్తి ఏర్పడడం అసంభవమనీ, అందువల్ల సంక్షోభం ఏర్పడుతుందనే భయానికి తావులేదనీ వారు పేర్కొన్నారు.

మాల్థస్ రచనలు నిరాశావాదం ప్రబోధిస్తున్నాయనీ అందువల్ల అతనితో ప్రారంభమయిన శకం నిరాశావాదశకమని (Age of Pessimism) ఒక వాదం. అతని రచనలవల్లనే ఆర్థికశాస్త్రానికి నిరాశాపూరితశాస్త్రం (Dismal Science) అన్న అప్రతిష్ఠ వచ్చింది.



కవితావాణి

శ్రీ పువ్వాడ నాగసుందరం

సకలలోక నిర్మాణ కౌశలయుతుండు
వాగ్రహితమూర్తిగ జనించెఁ బద్మభవుఁడు
మూఁగవోయిన తొలిమూర్తి ముఖములందు
పలుకు లేదయ్యె వాగ్దేవి భవముదనుక !

కోరిక గూడుకట్టుకొనె కొమ్మసయిన్ విధికిన్; మనోజ తూ
ణీర శరమ్ములన్ పొదివి నింగిఁ జరించెడి శారదాభ్రముల్
భారతి పెండ్లి వేడుక సభమ్మదు పెన్ 'తెరసెల్ల'యూల నా
శారద రాత్రులుజ్వల రసత్తరమై కవితాకృతిన్ గనున్.

రాగమయమ్ము సృష్టి అనురాగమయమ్ము హృదంతరమ్ముగా
నాగమవేది చిత్రణమునందుఁ జరప్రకృతిన్ తనర్చు. నా
రాగము బ్రహ్మమీఁటిన సరస్వతివీణియఁ దోఁపఁ గోకిలా
వాగనురూపగాన సుమవంత వసంతము కైఁతలన్ మనున్.

పూర్వపర్వత సానువుల సొత్తు బాలార్క
సరుణకాంతులలోని యువని సొగసు
ఉదయభానుని ప్రోల నుప్పొంగు పద్మమ్ము
సిగ్గుబుగ్గలలోని చివురుఁదొవలు
కమనీయ కల్హార కలితమౌ కొలనులో
సాలోక్యమొందు శశాంకకళలు
పరభృత మధుమాస పంచమ స్వరగీతి
కలలోని వలపు మేల్కొలుపు తలఁపు

చంద్రికా స్నాత సైకత స్థలము దాల్చు
ప్రకృతి రామణీయత్వ సౌభాగ్యములును
జీవనానందదోహదశ్రీలు గాఁగ
ప్రాకృతికి సలంకార కావ్యమ్ము లయ్యె.

సరసవచః పరిమళ లసత్కవితా సరసీజ మాధురీ
గరిమ మరందధార మునుఁగన్ చను దేరు రసజ్ఞ భృంగముల్
సురుచిరభావసమ్ముదిత శోభనమైన కవోష్ణ కాంతులన్
నిరతపదార్థమార్ద వపునీతములై విహరించి చొక్కగన్.



నృసింహపురాణ పాఠశోధన :

ఒక పాఠ నిర్ణయ సూచన

శ్రీ తాపీ ధర్మారావు

నృసింహ పురాణం ఆరువందల సంవత్సరాలకు పూర్వం భారతకవి ఎఱ్ఱాప్రగడ రచించాడు. దీనికి ఒకటికంటే ఎక్కువ వ్రాతప్రతులు చిక్కలేదట! ఆ ఒక్క ప్రతి గూడా చాల లోపాలతో ఉందని కీర్తికాయులు వేలూరి శివరామశాస్త్రిగారు దానిని తీర్చిదిద్ది పరిష్కరించి 1953 లో ప్రచురించారు. తరువాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు 1968 లో తమ ప్రసిద్ధ కావ్యములలో ఈ నృసింహ పురాణాన్ని ప్రచురించారు. పండిత ప్రకాండులు ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు ఈ ప్రచురణకు సంపాదకులుగా చాలా శ్రద్ధాసక్తులతో పరిష్కరించి 62 పుటల పీఠికతో ఆంధ్ర పాఠక లోకానికి అందజేశారు.

ఆ పీఠికలో ఆచార్య అవధానిగారు "ఈ కావ్యమున సరిగా అర్థముగాని గద్య పద్య భాగము లెడనెడ యున్నవి.....విజ్ఞులు వానిని పరిశీలించి సరియైన పాఠములు సూచింతురని వేడుకొనుచున్నాను" అని వ్రాశారు. వేలూరి శివరామశాస్త్రిగారు గూడా తమ పీఠికలో "ఈ పుస్తకములో అనన్వితములగు పద్యములు కొన్ని యున్నవి. మనసును తృప్తిపరచని కొన్ని పాఠాంతరములున్నవి. యతిభ్రంశము లున్నవి......శోధన చేయగల పాఠకు లందఱును ఈ భారము వహించనిదే ఇది వెలి వేఱదు. అందఱకు తలా యొకటి తోచవచ్చును గాని ఒక్కనికే అన్నియు దోఁచవుగదా" అని తమ ఆసక్తిని ప్రకటించారు.

ఈ ఇద్దరి సూచనల ననుసరించి రసజ్ఞ విమర్శకులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మొన్నటి సౌమ్యనామ సంవత్సర ఉగాది సంచికలో (పుటలు 136—142) 'నృసింహ పురాణ పాఠశోధన' అన్న శీర్షికతో కొన్ని పద్యాలకు తమ సూచనలను ప్రకటించారు.

వాటిలో ఒకటి ప్రథమాశ్వాసంలో ఆరో పద్యం—ఎఱ్ఱాప్రగడ చేసిన సరస్వతీ ప్రార్థన.

కర కమలంబు నందుఁ బటికంపుఁ
గమండలు వచ్ఛకాంతి భా
సురమగు మౌక్తికంపు జప సూత్రము
దాల్చుట, బ్రహ్మవాదియై
పరఁగిన హంసముం బిలిచి బాల
మృణాళముఁ జూపు చందమౌ
సిరిఁ దిలకింప నొప్పు బుధసేవిత
మూర్తిఁ దలంతు భారతిన్.

ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు (శివరామశాస్త్రిగారి పాఠ నిర్ణయం ప్రకారమే అనుకుంటాను) అవలంబించిన పాఠం ఇది.

ఈ పాఠం గురించి శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఉగాది సంచికలో ఏమన్నారంటే "కమండలవు, జప సూత్రము రెండును ఒక్కచేతనే తాల్చియుండవలసిన అక్కర భారతీదేవికేమి?.....'కర కమలంబులందు' అనిగాని 'కరయుగళంబునందు' అని గాని ఉండవచ్చునుగదా" అని అన్నారు. ఇంకా ఇలా గన్నారు: "మరి హంసము 'బ్రహ్మవాది' అనుటేమి? బ్రహ్మ పరివారములన్నియు బ్రహ్మ గొప్పతనమును చర్చించి స్థాపించగలవని భావింపవచ్చునుగాని, ఇక్కడ ఆ ప్రస్తావనచే వచ్చిన విశేషమేమి?......దానిని 'వాణి

యై'గా దిద్దవచ్చును. బ్రహ్మకు వాహనమైనది గనుకనే అతని యిల్లాలు దానిని పిలిచి ప్రీతితో తామర తూడును మేపుచున్నట్లున్నది—అను అందమైన అర్థ భావములు లభించును ...ఇట్లే 'సిరిఁ దిల కింప' అనుటకన్న 'సిరితిలకింప' అను పాఠాంతరమే మేలు'' అని అన్నారు శర్మగారు.

శర్మగారు సూచించిన పై సవరణలతో ఈ పద్యము ఇలాగుంటుంది.

కరకమలంబులందు పటికంపుఁ
గమండలు వచ్ఛకాంతి భా
సురమగు వక్త్రికంపు జపసూత్రము
దాల్చుట బ్రహ్మవాజియై
పరఁగిన హంసమున్ బిలిచి బాల మృణాళముఁ
జూపు చందమౌ
సిరి తిలకింప నొప్పు బుధ సేవిత
మూర్తిఁ దలంతు భారతిన్.

ఈ పాఠంలో నాకు కలిగిన సందేహాలు రెండు మూడున్నాయి :

కమండలువూ జపసూత్రమూ దాల్చడం కర ములతో అని ప్రత్యేకించి చెప్పాలా? అలాగు చెప్పినందువల్ల కలిగిన ప్రయోజనమేముంది? లేనప్పుడు 'కర కమలంబులందు' అనడం కేవలం అనవసరమే అవుతుందిగదా!

కమండలువును 'పటికంపు' అని ఒక్కమాటతో వర్ణించి, జపసూత్రాన్ని 'అచ్ఛ కాంతి భాసురమగు' విశేష వర్ణన చేసినందువల్ల కవి సాధించిన ప్రయో జన మేముంది? పద్యంలో కమండలువూ జపసూత్ర మూ రెండూ సమానమైన ప్రాధాన్యం కలవే. ఇంకా చెప్పవలసివస్తే, కమండలువుకే ఆధిక్యం అవసరం, జపసూత్రానికి కాదు. ఇంత వర్ణన చేయకపోతే ఆ జప సూత్రం బాలమృణాళం లాగుండదా? ఈ వ్యత్యాసం వల్ల సమతూకంలోపించి రచన కుంటుపడదా?

'వాజి' గురించి: బ్రహ్మకు వాహనం కాబట్టి సరస్వతి హంసను మెచ్చుకుంది అని శర్మగారుచెప్పారు. కాని నా సందేహం ఏమంటే బ్రహ్మకు వాహనంగా ఆ వృత్తిలో ఉన్న దానిని 'బ్రహ్మవాజియైన' అన కుండా 'బ్రహ్మవాజియై పరగిన' అనడంలో విశేష మేమిటి? ఒక విద్యార్థి ఉపాధ్యాయుడుగా వ్యవహ రిస్తుంటే 'ఉపాధ్యాయుడై పరగిన' అనడం సమం జసం. నియమితమైన వృత్తిలోనే వ్యవహరిస్తున్న ప్పుడు 'పరగిన' అనడానికి అర్థంలేదు. లేనప్పుడు ''పరగిన'' అన్నది ప్రాసకోసం ప్రబంధ పరమేశ్వరుడు వేసుకున్నాడని అనవలసి వస్తుందికదా!

చేతిలో పటికంపు కమండలువు ప్రత్యక్షంగా కనిపిస్తుండగా కవికి హంస స్ఫురణకు రావడాన్ని గూడా మనం సమర్థించవలసుంటుంది. అది తేలిక అయిన పనికాదు.

ఏమయినా, ఈ పాఠంలో ఈ పద్యానికి సరి యైన అర్థం కుదరలేదనే అనాలి.

నా సూచనలు

ఇంతవరకూ నా సందేహాలను మనవి చేసి, ఇప్పుడు నా సూచనలను సకారణంగా మనవి చేస్తాను. నా దగ్గరున్నది 1897 లో చెన్నపట్నంలో అచ్చ యిన వైజయంతివారి నృసింహ పురాణం.ఈ ప్రతిలో ఈ పద్యం ఇలా గుంది.

కరకమలం బొసంగఁ బటికంపుఁ
గమండలు పంటి కాంతి భా
సురమగు వక్త్రికంపు జప
సూత్రము దాల్చుట బ్రహ్మవాదమై
పరఁగిన హంసమున్ బిలిచి బాల
మృణాళముఁ జూపుచందమై
సిరి తిలకింప నొప్పు బుధ సేవిత
మూర్తిఁ దలింతు భారతిన్.

ఈ పాఠంలో రెండు అక్షరాల మాత్రం దిద్దుకుంటే అన్వయం చాలా సరళమవుతుంది.

1. మొదటి చరణంలోని 'బొసంగ'ను 'బెసంగ' అనీ 2. రెండో చరణం చివరను 'వాదమై'ని 'వాదియై' అనీ మాత్రం మార్చుకోవాలని నాసూచన.

ఈ పద్యంలో సరస్వతి కూర్చొని వుంది.పైన చెప్పిన ఒకటవ మార్పుతో మొదటి చరణం ''కర

కమలం బెసంగఁ బటికంపుఁ గమండలు వంటి కాంతి భా......" అవుతుంది. వచన క్రమంగా వ్రాస్తే "పటికంపు కమండలువు(ను) అంటి కరకమలంబు కాంతి నెసంగ" అవుతుంది. కమండవును 'అంటి' అంటే దానిని తాకి(=దానిమీద చేతినుంచి) చేయి ప్రకాశిస్తూ ఉండగా అని అన్వయం కుదురుతుంది. సరస్వతి ఎడమ చేయి కమండలువుమీద ఉంచింది. దానివల్ల కమండలువు ముఖము మూతబడిపోయింది. తెల్లగా ప్రకాశిస్తున్న కమండులువూ దానిని కప్పినట్లున్న సరస్వతి తెల్లని చేయీ కలిసి ఒక తెల్లని ముద్దలాగ, ఎద్దు మూపురంలాగ కనిపిస్తుంది.

అది హంస శరీరంలాగానూ, S ఆకారంలో ఉన్న కమండులువు తొండము హంస మెడలాగానూ, తొండము చివరను పనివాడు (విశ్వకర్మ) అలంకారంగా ఉంచిన సింహముఖం లేక గోవుముఖం వంటి నిర్మాణం హంస తలలాగానూ, అమోఘమైన భావనాశక్తిగల ఎఱ్ఱాప్రగడకు కనిపించిందంటే ఆశ్చర్యమేముంటుంది?

ఇదంతా హంసగా కనిపించినప్పుడు, ఆమె "భాసురమగు" కుడిచేతిలోవున్న జపసూత్రము బాల మృణాళమనుకోవడం అబ్బురంకాదు.

ఆ హంసకు ఈ తామరతూడు మేపజూప డానికి ఏదో ఒక కారణం ఉండాలి. బ్రహ్మవాజి (వాహనం) అయినందుకు సరస్వతి ఈ ఆదరం ప్రకటించిందనడం నేను మనవి చేసిన ప్రకారం సమంజసంకాదు! 'బ్రహ్మవాదమై' అన్న వైజయంతి వారి పాఠంగూడా పొసగదు. కాబట్టే 'బ్రహ్మవాదియై' పరగిన అన్న పాఠం ఎత్తుకున్నాను. బ్రహ్మవాదిగా పరగడం హంస నిత్య విధులలోని విషయంకాక, అసాధారణంగా, ఆ సమయాన జరిగిన విషయం కావాలి. దీనికి నా సమాధానం ఇలా మనవి చేస్తాను:

బ్రహ్మవాది అంటే వేదాంతి అని శబ్దరత్నాకరం. బ్రహ్మకు వాహనంగా సేవ చేస్తున్న హంస వేదాంతిగా వ్యవహరిస్తూంది. సరస్వతికి కొంచెం దూరంగా అక్కడి పరివారంలోని కొందరికి వేదాంతం గురించి ఏమో చెప్తుతూ ఉంది. అదే విశేషం. కాబట్టే సరస్వతి హంసను 'పిలిచి' మెచ్చవలసివచ్చింది.

మరొక విధంగా చూసినా విశేషం కనిపిస్తుంది. బ్రహ్మ అన్న మాటకు మామిడి వెంకయ్య రచించిన శబ్దార్థకల్పతరు వన్న నిఘంటువులో "చతుర్ముఖే, త్రివేదవిత్.....వేదే విప్రే జ్ఞానే....." అని అర్థాలున్నాయని ప్రౌఢ్యం చెప్తుతూంది. అంతేకాదు. శబ్దరత్నాకరంలో గూడా బ్రహ్మ శబ్దానికి "న. ము. 1. పరమాత్మ 2. వేదము 3. తపము" అని అర్థాలున్నాయి. దీన్ని బట్టి చూచినా బ్రహ్మవాది అంటే 'వేదం గురించి చెప్తుతున్న వ్యక్తి' అని తేటపడుతుంది.

ఈ రెండూ హంస చేయువలసిన కార్యక్రమంలోని విషయాలు కావు. కాబట్టే 'వేదవాదియై పరగిన' అని ఆ సమయానికి వేదవాదిగా వ్యవహరిస్తున్న హంస అని సార్థకంగా కవి ప్రయోగించాడు.

వేదమూ వేదాంతమూ—ఇవి సరస్వతి ఆధిక్యంలో ఉన్న విషయాలు. వాహనంగా ఉంటూ ఉన్న వ్యక్తి తన శాఖ వేదవేదాంగాలను గురించి ఉపన్యసిస్తున్నందుకు ఆమె సంతోషించింది. కొంచెం దూరాన ఉన్న హంసను పిలిచి, వీపున చెయ్యివేసి తట్టి, మెచ్చి, లేతతూడూ (దానికి ప్రియమైన ఆహారాన్ని) ఇవ్వబోతుందని కవి ఊహ. అద్భుతమైన భావనాశక్తి కలవాడుగదా ఎఱ్ఱన! చిత్రకార దృష్టి ప్రశంసాపాత్రం.

'బాల మృణాళము' అనడంలో గూడా శంభుదాసు పదప్రయోగం సొగసు కనబడుతుంది. మృణాళము—తామరతూడు—అంటే తామర పూవుకి తగిలి ఉండే కాడకాదు. నీటి అడుగున తామర తీగలకుండే వేరు. రంగులోనూ, ఆకారంలోనూ. లావులోనూ ఈ మృణాళాలు, ముదిరినవి, ప్రబంధ నాయికల చేతుల్లా గుంటాయని అన్నారు. హంసలకు ఈ తూండ్లు ఇష్టమైన ఆహారమట. సరస్వతి చేతితో తాల్చిన జపసూత్రము ముత్యాలతో చేసినది. సన్నగా ఉంటుంది. కాబట్టి ప్రబంధ నాయిక చేతికి ఉపమానమైన తూడుతో సరి పోల్చడం సమంజసంకాదు. అందు

చేతనే ఉక్తివైచిత్రిగల ఎఱ్ఱన్న 'బాలమృణాళము' అని ఆ స్ఖాల్యం లేకుండా చేశాడు.

ఇంకొక్క సూచన: నాల్గో చరణం మొదట 'సిరి తిలకింప' అని అరసున్న లేకుండా సవరించి 'అందము ప్రకాశించగా' అని అర్థం చెప్పారు అనంత కృష్ణశర్మగారు. తిలకించడమంటే చూడడం అన్న అర్థమే స్ఫురిస్తుందిగాని 'ప్రకాశించు' అన్న అర్థం పాఠకులకు సాధారణంగా స్ఫురించదు. అందుచేత నేను 'సిరితులకింప' అని 'తి' కి బదులు 'తు' ఉంచడం మంచిదనుకున్నాను. 'తులకింపు(=ప్రకాశించు) అనడానికి వసుచరిత్రలో

తళుకు చెక్కులవాని తులకింపు పలుకెంపు
పలుకెంపు లొలయు నవ్వొలుకు వాని...

ప్రయోగముంది.

ఇంతకంటే మనోహరమైన ప్రయోగం విజయ విలాసంలో ఉంది.

వాలెరకు నమృతమే తుల
మే తులకింపుల పిసాళి మిసిమికి క్రొమ్మిం
చే తుల; చేతులకబ్జము
లే తుల; లేతుల వెలందు లీ చెలి తులయే.

ఈ పద్యంలో కవి ప్రతిమాటా సార్థకంగా ప్రయోగించాడు. కరకమలాన్ని కమండలువు కంటించి గొప్ప ప్రయోజనం (హంసలాగుండడం) సాధించాడు.

'అంటి' అన్నమాటే ఈ కల్పన కంతటికీ ఆధారమైంది.

కాంతి వర్ణనలు కమండలువుకూ జపసూత్రానికీ సమతూకంగా పంచాడు.

'బ్రహ్మవాదియై పరగిన' అని అనడంతో హంసనుమెచ్చి ఆదరించడానికి చక్కని కారణంకల్పించు కున్నాడు. 'పరగిన'కు అర్థపుష్టి కలిగించాడు.

'సిలిచి' వల్ల ఈ హంస కొంచెం దూరంగా వేదాంతం గురించి మాటలాడుతూంది. అంటే అక్కడ వినేవారు కొందరుండాలికదా! ప్రభువుల పరివారంలో ఉన్నవారు ప్రభువులు చాటుగా ఉన్నప్పుడు ఏమేమో లోకాభిరామాయణ ఉపన్యాసాలు సాగిస్తూండడం మానవ స్వభావం పరిశీలన చేసిన శంభుదాసు గుర్తించే ఉంటాడు.

'బాల' మృణాళం—ఇక్కడ 'బాల' కల్పన కవసరమైన సార్థకత నిచ్చి 'వక్రోక్తికంపు జవనాలను ప్రత్యక్షం చేసింది.

ఈవిధంగా చూస్తే పద్యంలోని ప్రతిమాటా అర్థగౌరవంతో ప్రయోగించడం రుజు వవుతుంది.

"పరికింపు ప్రబంధపరమేశ్వరుని లీల
ఉక్తివైచిత్రి నొక్కొక్కమాట"

అని కవిసార్వభౌముడు ఆదర్శంగా ఎంచుకొన్న ఎఱ్ఱన ఉక్తి వైచిత్రికి ఈ పద్యం తార్కాణ అనవచ్చుగదా.



మధ్యప్రాచ్యం - ఒక సమీక్ష

"శ్రుతకీర్తి"

1

త్రేతాయుగంనాటి రావణుని కాష్ఠం యింకా కాలుతూనే వున్నదట! కొరవి మాట దేవు డెరుగు కాని మధ్యప్రాచ్యంలో[1] ఏదో ఒక రగడ అడపా దడపా రేగుతూనే వున్నది. ఇస్రాయేలు విమానదాడులు, అరబ్ విప్లవకారుల చర్యలు, కాందిశీకుల దురవస్థ యివన్నీ చూస్తుంటే యీ అరబ్ యూదు సంఘర్షణ కేనాటికైనా పరిష్కారం లభిస్తుందా అని పిస్తుంది.

ఆదిలో మహోజ్జ్వలనాగరకతలకు ఆలంబనలుగా విలసిల్లిన గ్రీసు, బాబిలోనియా, ఈజిప్టు, భారతదేశంవంటి ప్రాంతాలు నేడు వెనుకబడి సమస్యలతో సతమత మవుతున్నాయి. ఈ సమస్యలే ఆదేశాల సంపదను పీల్చి పిప్పి చేస్తున్నాయి. అరబ్బులు, యూదులు పరస్పర విద్వేషంతో కాల్చుకునే ఆయుధాల ఖర్చు సంవత్సరానికి కొన్ని వందల కోట్ల రూపాయ లుంటుంది. ఈ వనరులను సక్రమంగా వినియోగిస్తే ఈజిప్టులో యిసుకమేట వేసిపోయిన ఎడారి భూములను, ఇరాకాయలలో ఉప్పునీట చవుడు బారిన పల్లపు ప్రాంతాలను సస్యశ్యామలం చేసుకొనడం సులభసాధ్యమయ్యేది. కాని అది వారి కిష్టంలేదు. ఆ దేశాల సమాజాలమీద స్వారీ చేస్తున్న చరిత్ర భారం అట్లా చేయనివ్వదు.

పశ్చిమాసియా రాజకీయ చరిత్రనూ, అక్కడ శాంతి నెలకొనకుండా ఆటంకపరుస్తున్న శక్తులనూ పశ్చిమాసియాపట్ల భారత విదేశ విధానాన్నీ పరామర్శించడం యీ వ్యాసం ప్రయోజనం.

2

యూదు మతం (Judaism) చాలా పురాతనమైనది. పాలస్తీనా యూదులజన్మస్థానం. కాలక్రమాన కలహాల వలన, వ్యాపార రీత్యా యూదులు జన్మస్థానం వదలి ఖండాంతరాలు దాటి వివిధ దేశాలలో నివాస మేర్పరచుకున్నారు. వారు వలస వెళ్లని ప్రాంతం ప్రపంచంలో ఏ మూలనూ లేదు. మన దేశంలో కూడా కేరళ, మహారాష్ట్ర ప్రాంతంలో వీరు అధికంగా ఉన్నారు. అయితే ఆదినుంచీ యూదులు మిగిలిన మతాలవారి ఖండనకూ, నిరసనకూ గురయ్యారు. ఇందుకు కారణం యూదుల ఐహికదృష్టి, వ్యాపారనిర్వహణాచాతుర్యమూ. భౌతిక భోగభాగ్యాలను కూడబెట్టడం, విషయ లాలసత్వం తగని పను లని ప్రతి మతమూ మొదటినుంచీ వక్కాణిస్తున్నది. సూది బెజ్జం కుండా ఒంటె దూరవచ్చునేమోకాని డబ్బుకలవాడు స్వర్గానికి వెళ్లడం అసాధ్యం అని బైబిలు చెబుతున్నది. ఆముష్మికచింతనకు హిందూ మతంలోగల ప్రాధాన్యం తెలిసినదేగదా! యూదుల మీది ద్వేషం సాహిత్యంలో కూడా షైలాక్[2] వంటి పాత్ర చిత్రణలో ప్రతిబింబిస్తున్నది. అయినప్పటికీ, పారిశ్రామికంగా ముందడుగు వేసిన అమెరికా, యింగ్లండు, ఫ్రాన్సువంటి చోట్ల నివాసం కల్పించుకున్న యూదులు అశేష ధనసంపద లార్జించి అక్కడ బలవత్తరమైన రాజకీయవర్గాలుగా రూపొందారు. అనేక కీలక పరిశ్రమలు వారి అధీనంలో ఉన్నాయి. అనేకులాయాదేశాల పౌరసత్వాన్ని స్వీకరించారు. మొదటి ప్రపంచయుద్ధంలో యింగ్లండులోని

---

1. 'మధ్యప్రాచ్యం' అన్నది ఆంగ్లేయులు పెట్టిన పేరు. మనకు పశ్చిమాన వున్నది గనుక యీ ప్రాంతాన్ని "పశ్చిమాసియా" అని పిలువ నారంభించారు ప్రధాని నెహ్రూ. ఇక ముం దీ రెండవ పదమే వాడబడుతుంది.

2. షేక్స్పియరు రచించిన 'The Merchant of Venice' లో పాత్ర.

యూదులు ప్రభుత్వానికి విశేషంగా సహాయంచేశారు. అందుకు ప్రతిఫలంగా ఆంగ్లప్రభుత్వం అప్పుడు తమ అధీనంలోవున్న పాలస్తీనాలో యూదు జాతి స్వస్థలాన్ని పునరుద్ధరిస్తామనీ, దేశాలవెంట సాగిపోయిన యూదులు తిరిగి తమ "పవిత్ర భూమి" (Holy Land) చేరుకునేందుకు వసతులు కల్పిస్తామనీ ప్రకటించింది. 1917 నవంబరులో చేయబడిన యీ ప్రకటనకు Balfour Declaration అని పేరు.[3] ఇస్రాయులురాజ్యావతరణ కిది నాంది. పాలస్తీనాలో యూదులు, మహమ్మదీయులు, క్రైస్తవులు ముఖ్య మత వర్గాలు. వలస పోయిన యూదుల పునరాగమనంతో అక్కడవున్న యితర వర్గాల సాంఘిక, పౌరహక్కులకు ఎట్టి భంగం కలుగకూడదని యీ ప్రకటన స్పష్టంగా పేర్కొన్నది. యూదురాజ్యాన్ని (Jewish State) స్థాపించడం కాక మాతృభూమికి తిరిగి వెళ్ల దలుచుకున్నవారికి అవకాశం కల్పించడమే యీ ప్రకటన ఉద్దేశ్యం. అయితే పాలస్తీనా యూదుప్రాంతమనీ, అక్కడ వారి ప్రాబల్యం చలామణి కావచ్చుననీ ఆంగ్లేయులు అంగీకరించారనడం నిర్వివాదాంశం. ఈ ప్రకటన ప్రకారం రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ప్రతి సంవత్సరం నిర్ణీతసంఖ్యలో (Quota) పాలస్తీనాలో యూదులను ప్రవేశపెట్టారు. యూదుల ప్రవేశాన్ని అరబ్‌మహమ్మదీయులు కొంతవరకూ ప్రతిఘటించారు. తత్ఫలితంగా Quota ను తగ్గించవలసి వచ్చింది. ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం రానే వచ్చింది. యూరప్‌లో యూదులమీద ద్వేషం, కసి పెచ్చరిల్లాయి. నాజీల చేతులలో యూదులు పొందిన చిత్రహింస అమానుషం. మానవజాతి చరిత్రకే మాయని కళంకం. పాతిక చతురపు గజాల స్థలంలో వందమందిదాకా క్రుక్కివేశారట. ఒక యూదు గర్భిణి స్త్రీని నేలమీద దేకించి ఆమె మృత శరీరంమీది చర్మం ఒలిపించి తన టేబిలు లైటుకు షేడ్ తయారు చేయించుకున్నాడట హిట్లరు.[4] జర్మనీ, ఫ్రాన్సు, హంగేరీ, చెకొస్లవాకియా, పోలండు దేశాలలో యూదు జాతి చాలావరకు నాశనమైంది.[5] అనేకమంది యూదు మేధావులు, కళాకారులు, విజ్ఞాన శాస్త్రవేత్తలు పడరానిపాట్లు పడి రహస్యంగా విదేశాలకు, ముఖ్యంగా అమెరికాకు తరలిపోయారు. యూదుల దుస్థితిపట్ల ప్రపంచమంతటా సానుభూతి వెల్లివిరిసింది. తత్ఫలితంగా, అంతర్జాతీయ సమితి సర్వసభ్య సమావేశం పాలస్తీనాలో యూదురాజ్యాన్ని, దానితోబాటు ఒక అరబ్‌రాజ్యాన్ని నెలకొల్పాలని తీర్మానించింది. 14 వ మే 1948 న యిస్రాయులు అవతరించింది.

ఇస్రాయులు పొరుగు రాజ్యమైన ఈజిప్టు విస్తీర్ణం, జనసంఖ్య, ఆర్థిక వనరుల దృష్ట్యా ప్రాముఖ్యంకల దేశం. మధ్యప్రాచ్యంలో యూదు వ్యతిరేకభావనకు పాదువంటి దేశం. ఇస్రాయెల్ అవతరణ వలన పాలస్తీనానుంచి పారిపోయిన లక్షలాది కాందిశీకులు ఈజిప్టులో ఆశ్రయం పొందారు. వీరికై గాజావంటి సరిహద్దు ప్రాంతాలలో గ్రామాలు నిర్మించి వసతు లేర్పాటుచేసింది ఈజిప్టు.

ఆదిలో ఈజిప్టుతో కుదిరిన ఒక ఒప్పందం ప్రకారం ఇంగ్లండు సూయజు కాలువ వెంబడి తన స్థావరా లేర్పరచుకున్నది. అలెగ్జాండ్రియా, పోర్టుసయ్యద్‌వంటి రేవులు ఇంగ్లండు నౌకా స్థావరాలుగా

---

3. 'His Majestey's Government view with favour the establishment in Palestine of a national home for the Jewish people; And will use their best endeavourr to facilitate the achievement of this object, it being clearly understood that nothing shall be done to prejudice the civil and religious rights of the existing non-Jewish Communities in Palestine, or the rights and political status enjoyed by Jews in any other Country.. .'—Lett r from the then Foreign Secretary Mr. A. J. Balfour to Lord Rotschild, Chairman of the British Zionist Federation.

4. William Shirer రచించిన "Rise and Fall of Third Reich."

5. రెండవ ప్రపంచ యుద్ధంలో, అప్పటికి యూరపులో వున్న 95 లక్షలమంది యూదులలో దాదాపు 60 లక్షలమంది జర్మన్ల చేతులలో హతులైనట్లు Encyclopaedia Brittanica అంచనా. మిగిలిన వారిలో చాలామంది అమెరికాకు, రష్యాకు పారిపోయారు.

ఉపయుక్తమవుతున్నాయి. ఈజిప్టులో ఆర్థికాభివృద్ధికే విధమైన ప్రయత్నాలు జరుగకపోవడం వలన, వ్యవసాయరంగంలో సారవంతమైన భూములన్నీ కొద్దిమంది చేతులలో వుండటంవలన, పెరిగిపోతున్న విదేశప్రభావం వలన ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి మొలకెత్తింది. ఈ అసంతృప్తి సాకగాగొని కొందరు సైనికాధికారులు ఫరూక్ రాజును పదవీభ్రష్టుణిచేసి అధికారం స్వీకరించారు. జనరల్ నెజీబ్ సైనికపాలనామండలి నాయకుడు. అధికారంలోకి రాగానే సైనిక మండలి వ్యవసాయ సంస్కరణల కుద్యమించింది. కాని అధికారాన్ని కేంద్రీకృతం చేసుకుంటున్నాడన్న ఆరోపణమీద నెజీబ్‌ను తిరగ త్రోసి 1954 లో గమాల్ అబ్దుల్ నాసర్ అధికారంలోకి వచ్చాడు. మొదట ప్రధానమంత్రిగా వున్న నాసర్ 1956 లో అధ్యక్షుడయ్యాడు. అప్పటికే సరిగాలేని ఈజిప్టు పశ్చిమదేశాల సంబంధాలు మరింత బిగిసిపోయాయి. నిర్మాణంలోవున్న అస్వాన్‌డామ్‌కు అమెరికా వాగ్దానం చేసిన సహాయాన్ని కూడా నిలిపివేసింది. ఈ కబురందిన వారం రోజులకు నాసర్ సూయజు కాలువను జాతీయం చేసినట్లు ప్రకటించాడు. అంతకు పూర్వం ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలైన దేశాలకు చెందిన సంయుక్త సంస్థ అధ్వర్యంలో వుండేది. కాలువమీది రవాణామీద పన్నులవలన వచ్చే ఆదాయంతో డాము నిర్మాణం పూర్తిచేద్దామని ఈజిప్టు తలంపు. కాలువ వ్యవహారాలు నిర్వహించే ప్రైవేటు సంస్థలోని వాటాదార్లందరికీ పరిహార మీయబడ్డది. జాతీయకరణవలన ముఖ్యంగానష్టపోయిన ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇస్రాయులు దేశాలు కలిసి ఒకేసారి ఈజిప్టు మీద దాడి సల్పాయి. కెయిరో విమానాశ్రయంమీద బాంబుల వర్షం కురిపించింది. చివరకు అమెరికా రష్యాలు చేసిన హెచ్చరికల మూలాన పై మూడు దేశాలు తమ చర్య నుపసంహరించుకున్నాయి. ఈజిప్టు యిస్రాయులు మధ్య వప్పుడి వేస్తే భగ్గుమనేటట్లుంది. ఇంగ్లండు, ఫ్రాన్సుచేసిన అనాలోచిత చర్యవలన పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం చూపు మేర దాటిపోయింది.

తన స్థానాన్ని గుర్తెరిగిన ఈజిప్టు మొదటినుంచీ అరబ్ రాజ్యాల నాయకత్వం పొందడంకోసం కృషి సాగించింది. యూదులమీది శత్రుత్వం యిందుకు గట్టి పునాదిగా పని చేసింది. 1945 లో స్థాపించిన అరబ్‌లీగ్‌లో అధికారం ఈజిప్టు చేతుల్లోనే వుండేది. అరబ్ జాతీయ వాదాన్ని (Arab Nationalism) వ్యాపింపజేసి ఐక్యతకు కృషి చేయడం లీగ్ లక్ష్యం. అధ్యక్ష ప్రభుత్వాలు (Republicans) రాజరిక ప్రభుత్వాలు (Royalist) కలదేశాలు కూడా యిందులో సభ్యులే. 1955 లో లీగ్ సభ్య దేశమైన యిరాక్‌కు, అరబ్ రాజ్యంకాని టర్కీ మధ్య జరిగిన బాగ్దాద్ ఒడంబడిక అరబ్ లీగ్‌ను బలహీనపరిచింది. మొత్తంమీద కాలక్రమాన సూడాన్, అల్జీరియా, మొరాకో, ట్యునీషియా చేరడం వల్ల లీగ్ నెమ్మదిగా బలపడింది. 1958 లో ఈజిప్టు, సిరియా, ఎమెన్ కలిసి యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ అవతరించింది. ఇది అరబ్ దేశాల మీద నాసరు నాయకత్వానికి మరొక చిహ్నం. అరబ్ దేశాలలో సిరియా మొదటినుంచీ తీవ్రవాద ధోరణినే ప్రదర్శిస్తూ వచ్చింది. ఈజిప్టు సిరియాలు కలయడం ఆ దేశాల ఆధిపత్యాన్ని స్థిరపరిచింది. ఇస్రాయిల్ వ్యతిరేకత యీ మార్పు లన్నింటికీ అంతర్గత లక్ష్యంగా వుంటూ వచ్చింది. రాజ ప్రభుత్వాలు కల్గిన జోర్డాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు పశ్చిమదేశాలతో తమకుగల మిత్రత్వాన్ని పురస్కరించుకుని మొదట ఇస్రాయులు వ్యతిరేకత కంతగా దోహదం చేయకపోయినా సాధారణ అరబ్ ప్రజానీకం యూదురాజ్యంమీద తీవ్రమైన ఆగ్రహంతో వున్నది. ఈ ఆగ్రహాన్ని ప్రస్ఫుటంచేసే ఈజిప్టు విధానాలు మిగిలిన దేశాల విధానాలమీద పరిగణనీయమైన ప్రభావం కల్గివున్నాయి. ఇస్రాయిల్‌పట్ల సామ్యవిధానం అనుసరించే ప్రభుత్వ మేదీ అరబ్ రాజ్యాలలో ఎక్కువ కాలం అధికారంలో వుండలేదన్నమాట వాస్తవం. ట్యునీషియావంటి దేశాలలో పరిహాప్త సంబంధాలు లేకపోవడం వలన కొంతవరకు సామ్యవిధానాలే అనుసరింపబడ్డవి. పై సత్యాన్ని గుర్తించిన జోర్డాన్, సౌదీఅరేబియాలు కూడా నాసరుతో చేతులు కలిపి ఇస్రాయులుమీదయుద్ధం ప్రకటించవలసి వచ్చింది.

ఇస్రాయులు అవతరించినప్పటినుంచీ నేటి వరకూ పశ్చిమాసియాలో మూడు యుద్ధాలు జరి

గాయి. మొదటిది 1948లో,రెండవది 1956 లో, ఆఖరుది (?) 1967 లో. ఈ మూటిలోనూ ఇస్రాయిలు విజయం పొందింది. రాజ్య స్థాపన జరిగిన కొద్ది రోజులకే అరబ్ దేశాలన్నీ కలిసి ఇస్రాయిలు మీద తమ సైన్యాలతో పెద్ద పెట్టున దాడిసల్పాయి. యూదు సైన్యం వారిని నిలువరించడమేకాక తరిమి కొట్టి సమితి తీర్మానం ప్రకారం తనకు లభ్యమైన భూభాగంకంటె ఎక్కువ మేర ఆక్రమించుకున్నది. ఆ భాగం యీనాటికి ఇస్రాయిలు అధీనంలోనేవున్నది. 1956 లో సూయజ్ జాతీయకరణచేసిన తరువాత ఇస్రాయిలు నౌకలకు కాలువలో ప్రవేశం లేదని నాసరు ప్రకటించాడు. ఆ యుద్ధంలో ఇస్రాయిలు మరి కొంత భూభాగం హస్తగతం చేసుకున్నది. 1967 లో జరిగిన తీవ్ర పోరాటంలో ఇస్రాయిలు సూయజ్ కాలువ తూర్పుతీరంవరకు ఆక్రమించుకుంది. సూయజు కాలువ పూర్తిగా సరిహద్దుకు పాతిక మైళ్ల లోపల ఈజిప్టుభూభాగంలోనే ప్రవహిస్తుండేది. అలాగే జోర్డాన్ కూడా ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన జెరూసలెమ్ నగరాన్ని కోల్పోయింది.

సైనిక శక్తితో తమ ప్రభుత్వాలు ఇస్రాయిలును జయించలేవని గుర్తించిన అరబ్ పౌరులు ముఖ్యంగా పాలస్తీనా కాందిశీకులు "పాలస్తీనా లిబరేషన్ ఫ్రంట్" అనే సంస్థను స్థాపించి గెరిల్లా చర్యలు ప్రారంభించారు. ఇస్రాయిలు సరిహద్దు గ్రామాలమీద దాడిచేసి భయోత్పాతం కలిగించడం, వారి విమానాల నపహరించి విదేశాలకు తరలించుకుపోవడం, యూదుజాతీయులమీద దాడిసల్పటం వంటివి వారి కార్యక్రమంలో ప్రధానాంశాలు. మితవాద విధానాలు అవలంబించిన అరబ్ప్రభుత్వాలను ఒత్తిడి చేయడం, అవసరమైతే వారిని దించివేయడానికి తిరుగుబాట్లు సల్పడం కూడా కద్దు. బాహాటంగా గెరిల్లాల నడుపులో పెట్టలేని యూదులు కూడా అలాంటిచర్యలకే పూనుకున్నారు. ఇస్రాయిలు ప్రభుత్వం యీ చర్యలకు పూర్తి సహాయం అందజేస్తున్నది అనటంలో సందేహంలేదు. ఇటీవల ఇరువురు యూదు వైమానికులు హెలికాప్టరు మీద బీరూట్ విమానాశ్రయంలో దిగి అయిదారు విమానాలను నాశనం చేసి సురక్షితంగా తిరిగి వెళ్లారు. తన లక్ష్యం సాధించుకొనడానికి ఇస్రాయిలు ఎటువంటి చర్యలకైనా పాల్పడగలదనీ, ఏ విధానాలనైనా అవలంబించగలదనీ యిందువలన తెలుస్తుంది. అలాగే అరబ్ల నిస్పృహాయత్వం, యథార్థాలను గుర్తించని రాజకీయ పరిమితత్వం కూడా తెల్లమవుతాయి.

తన ఉనికిని గుర్తించి సరిహద్దుల భద్రతకు అరబ్ రాజ్యాలన్నీ హామీ యిచ్చి యూదు వ్యతిరేక విధానాన్ని విడనాడే వరకూ యిస్రాయిలు తాను ఆక్రమించుకున్న భూభాగాన్ని విడనాడ నిచ్చగించదు.

3

చారిత్రకంగా అరబ్లు, యూదులు ఒకే తెగకు చెందినవారు. దీనికే Semitic Race అని పేరు. మొదటినుంచీ పరస్పరం మన్నించుకుంటూ కడు సఖ్యంతో మెలిగారు. విదేశీ దండయాత్రల వలన యూదులు అరబ్లు కూడా నష్టపోయారు. కానీ క్రమేపీ మహమ్మదీయమతం వ్యాపించిన కొలదీ యూదువ్యతిరేక భావన ప్రబలింది. యూదులు వలసపోగా ఖాళీ ఏర్పడిన ప్రదేశాలలో అరబ్లు నివాసం కల్పించుకుని వందల సంవత్సరాలుగా అక్కడ వుంటూ వచ్చారు. మూలంలో తెగ ఒకటే అయినప్పటికీ అరబ్లు యూదులు భిన్న ప్రవృత్తులు సంతరించుకున్నారు. యూదులు ముందు చూపు కలిగి ఉపయోగకరమైన ప్రతిఅంశాన్ని స్వీకరించేవారు. ధైర్యం, సాహసం, పట్టుదల, సూక్ష్మబుద్ధి కలవారు. అరబ్లు సరళ స్వభావులు. సాంప్రదాయిక విధానాన్ని విడనాడడాని కిచ్ఛగించరు. వారి సామాజిక వ్యవస్థ పురాతన పద్ధతులమీద నిర్మింపబడింది. అందువలన సహజంగా అరబ్లకు యూదులంటే ఒక ద్వేషంతో కూడిన అసూయ మొలకెత్తి మహావృక్షమై కూర్చున్నది. పైగా, యూదులమీది కక్షతో వారిమీద వైయక్తికంగానూ, సామూహికంగానూ దాడులు సలిపింది పశ్చిమ దేశాలవారు, ముఖ్యంగా క్రైస్తవులు. ఇతరు లెవరో కావించిన హింసలకు, అపరాధాలకు తాము పరిహారం చెల్లించడం యేమి న్యాయం అని అరబ్బులు ప్రశ్నించడం సహజం. ఇస్రా

యులను బలపరుస్తున్న పశ్చిమ దేశాల వారి ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

ఇస్రాయులు అవతరించిన తర్వాత దేశ దేశాల నుంచీ యూదులు తిరిగి రా నారంభించారు. అయితే యీ విధంగా మాతృభూమికి తిరిగి వచ్చినవారు ఆర్థికంగా వెనుబడిన దేశాలనుంచి వచ్చినవారే. వీరిలో అధికభాగం ఉత్తర ఆఫ్రికా, దక్షిణయూరపు, లాటిను అమెరికా ప్రాంతాలనుంచి వచ్చారు. ఆర్థికంగా ఉన్నతిచెందిన పారిశ్రామికదేశాలలో స్థిరపడిన వారెవ్వరూ తిరిగి రాలేదు. చేతిలోని సంపదను వదులుకొని 'పవిత్ర భూమి' మీది మమకారంతో ఎండ మావులను తరిమే అవివేకులుకారు యూదులు. పైగా వారు విదేశాలలో వ్యాపారాదులు సాగించుకుంటూ ఆ దేశాల ప్రభుత్వాలమీద ఒత్తిడి తెచ్చి ఇస్రాయులు ప్రగతికి భద్రతకూ దోహదం కల్పించిన వారవుతారు. ఈనాడు అమెరికాలోని న్యూయార్కు, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో వంటి ముఖ్యనగరాలలో యూదులు విపరీతంగా వున్నారు. వార్తా పత్రికలు, పెట్రోలియం, మందులువంటి పరిశ్రమలన్నీయూదుల చేతులలో ఉన్నాయి. ఇస్రాయులు అభివృద్ధికి, యుద్ధంలో అయ్యే ఖర్చుకూ యూదు పారిశ్రామికులు ప్రతిపర్యాయం లక్షల కొద్ది డాలర్లు సహాయం చేస్తున్నారు. ఇంగ్లండు బాంకింగ్ వ్యాపారం చాలా భాగం యూదుల చేతుల్లోనే వుంది. ఈ విధంగా పలువురు యూదులు విదేశాలలోనే ఉండిపోయి తమ దేశానికి సహాయపడుతున్నప్పటికీ, ప్రతి సంవత్సరం దేశంలోకి తరలి వచ్చేవారికి ఆవాస సౌకర్యాలు కల్పించాలన్నా, జీవనోపాధులు చూపించాలన్నా ఉన్న భూసంపద, వనరులు చాలడంలేదు. ఇస్రాయులు అరబ్బుల భూభాగాన్ని ఆక్రమించుకొనడంలో ప్రధాన లక్ష్యం పెరిగే తన జనసంఖ్యకు వలసిన ఆధారాలు సమకూర్చుకొనడమే. అంతర్జాతీయ సమితి అనేక పర్యాయాలు ఇస్రాయులు చర్యలను ఖండించినప్పటికీ తామమాత్రం నిమ్మకునీరెత్తినట్లు కూర్చుండటమేగానీ ఆచరణలో చేయుగలిగింది లేకపోయింది.

అయితే నేరం పూర్తిగా యిస్రాయులుమీద ఆరోపించడం పాక్షిక దృక్పథాన్ని ప్రదర్శించడమే! ఇస్రాయులు ఆధునిక రాజకీయ భాషలో చెప్పాలంటే ఒక పరిపూర్ణమైన 'రాజ్యం' (State). అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం తన సీమలను రక్షించుకునే హక్కు, పరుల ఒత్తిడిని నిరోధించే హక్కు, తన ప్రజలకు శాంతి సౌభాగ్యాలు కల్పించే హక్కు ఆ రాజ్యానికి ఉన్నాయి. వీటిని యెవరూ కాదనడానికి వీలులేదు. దురదృష్టవశాత్తు కొంచెం ఆవేశపరులైన అరబ్బులు యీ యథార్థాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. పాకిస్తాన్ అనే దేశం లేదు అని మనం అనడం ఎంత భావ్యమో ఇస్రాయులు దేశం లేదు అని అరబ్బులు అనడం అంతే భావ్యం. ఇస్రాయులు యెడల ప్రగాఢ మైత్రీభావం లేకపోవచ్చు. కాని "ఇస్రాయులు కూడా ఒక రాజ్యం. మనడానికి దానికి కూడా హక్కు వున్నది" అని గుర్తించడం వేరు. అలా గుర్తిస్తే అది రాజకీయ విజ్ఞత అవుతుంది. అరబ్బు దేశాలు తమ అతివాద ధోరణివలన యీ విజ్ఞతకు అంతకంతకూ దూర మవుతున్నాయి. చివరకు యే దేశమూ తన భద్రతకూ, తన ప్రభుత్వపు మనుగడకూ భంగం లేకుండా ఇస్రాయులును గుర్తించ గలిగేస్థితిలో లేదు. కనీసం మాట మాత్రంగానైనా యీ విషయాన్ని సూచించే స్థితిలో లేదు. అందువలన తమ మాటలకూ చేతలకూ తామే బందీలయ్యారు. పదిహేనుకోట్లమంది అరబ్బులు చుట్టూ పరివేష్టించి, వైరంతో యే క్షణాన్నైనా తనను కబళించడానికి సిద్ధంగా వున్నప్పుడు తన్ను తాను రక్షించుకోవాలంటే వారిమీద ముందు దెబ్బ తీయడమే శ్రేయస్కరమని చిన్న రాజ్యమైన ఇస్రాయులు భావించడం సహజం. అందుకే అరబ్బు నాయకులు కయ్యానికి కాలు దువ్వే ప్రసంగాలు చేసినప్పుడల్లా ఇస్రాయులు దాడి చేయడం జరుగుతూ వచ్చింది.

అరబ్బు దేశాలు పొరుగు రాజ్యంపట్ల దూర దృష్టితో తమ విధానాలను రూపొందించుకొనలేక పోవడానికి కారణం ఆ దేశాలలోని రాజకీయ శక్తులను పరిశీలిస్తే తెలుస్తుంది.

4

పశ్చిమాసియా భౌగోళికంగా కీలకమైనదే గాక, ఆర్థికంగా కూడా ప్రాముఖ్యం కలది. నూనె గనులు యిందుకు కారణం. వివిధ దశలలో ఉద్ది

చేసిన నూనె లేకపోతే ఆధునిక నాగరికతే లేదు. చిన్న యంత్రాలు, ఫ్యాక్టరీలు, మోటారు కార్లు, డీసెల్ యింజన్లు, విమానాలు అన్నీ నూనెతో నడిచేవే. అందువలన అక్కడ ఆధిపత్యం సంపాదించిన వారికి ప్రపంచ రాజకీయాలలో మంచి పలుకుబడి లభిస్తుంది. అయితే అరబ్బు దేశాలలో వున్న పరస్పర విరుద్ధ శక్తులు మరెక్కడా లేవు. సిరియాలోని అతివాద బాస్టిస్టుపార్టీ మొదలు ట్యునీషియాలోని లిబరల్ రాజకీయపక్షాలవరకు, మతతత్వం ప్రజ్వలింపజేసే ముస్లిము బ్రదర్ హుడ్ నుంచీ రోమన్ కాథలిక్కులూ ముస్లిములూ సఖ్యంతోవుండే లెబనాన్ రాజకీయ వ్యవస్థవరకూ, పశ్చిమదేశాలతో సన్నిహిత సంబంధాలుగల రాచరికాల మొదలు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించే అధ్యక్ష ప్రభుత్వాలు తిరుగుబాటు సైనిక ప్రభుత్వాలవరకు, సారవంతమైన సిరియన్ భూముల మొదలు యీజిప్షియన్ యిసుక యెడారుల వరకూ..... యిలా ఎన్నైనా వివరించుకుంటూ పోవచ్చును. ఇన్ని వైరుధ్యాలను సమీకరించి తన ప్రాభవాన్ని పెంచుకోవాలంటే ఒకే ఒక ఆధారం వున్నది. అరబ్బు లందరికీ అనువర్తించే సమస్య అది. ఆదే ఇస్రాయలు పట్ల వైమనస్యం. ఇస్రాయలు పట ఎవరెంత ద్వేషం ప్రదర్శిస్తారో మిగిలిన ప్రభుత్వాలన్నీ అదే మార్గాన్ని అనుసరించక తప్పదు. ఇజ్రాయలు పట్ల విరోధం, దానివలని భయమూ లేకపోతే అరబ్బు రాజ్యాలన్నీ అంతఃకలహాలతో మునిగిపోయివుండేవి. ప్రగతిశీలుడైన నాసరు ఈజిప్టులో అటు ముస్లిము బ్రదర్ హుడ్‌నూ, యిటు కమ్యూనిస్టు పార్టీని కూడా నిషేధించాడు. ఆ సంస్థలకు చెందిన అతివాదనాయకులందరినీ చెరసాలలోకి త్రోయించాడు. ఇందువలన నాసరు అటు సౌదీ అరేబియాకు యిటు సిరియాకు కూడా శత్రువైనాడు. కానీ అరబ్బు ప్రజలలో చాలామంది అభిప్రాయానికి ప్రతినిధిగా రూపొందాడు. తమ మధ్య సంఘర్షణ ఎప్పుడు పెరిగే సూచనలు కన్పట్టుతాయో అప్పుడు ఏదో ఒక అరబ్బుదేశం ఇస్రాయలు మీదికి వారి దృష్టిని మరలుస్తుంది. అరబ్బు జాతీయ వాదం (Arab Nationalism) యీ లక్ష్యం సాధించడం కోసమే. ఈ జాతీయవాదం కొంచెం విచిత్రమైనది. సాధారణంగా జాతీయత అనేది ఒక రాజ్యానికి చెందిన పౌరులకు (Citizens of a State) మాత్రమే వర్తిస్తుంది. అనేక రాజ్యాలకు చెందిన వ్యక్తులకు, ఎన్ని సమాన లక్షణాలున్నప్పటికీ, ఒకే జాతీయత అనే భావన వర్తించదు. అరబ్బు జాతీయవాదం పైన చెప్పినట్లు ఒకే లక్ష్య సాధన కోసం నిర్మితమైన సాధనం మాత్రమే. ఇది యెంత విచిత్రమో ఇజ్రాయులుకూడా అంతకంటె విచిత్రమైన వాదాన్ని లేవనెత్తుతుంది. ప్రపంచంలో యే దేశం యొక్క పౌరుడైనప్పటికీ ప్రతియూదు మతస్థుడూ ఇస్రాయులు పౌరుడి క్రిందనే లెక్క అని వాదిస్తున్నది. అంటే ప్రతి యూదునికీ రెండు పౌరసత్వా లుంటాయన్నమాట. ఇస్రాయులు యుద్ధ విమానాలను అమెరికన్లు నడుపుతున్నారన్న విమర్శ బయలు దేరినప్పుడు వారు అమెరికన్లయితే కావచ్చు కాని యూదు లవడం చేత యిస్రాయులు పౌరుల క్రిందనే లెక్క అని ఆ దేశం వక్కాణించింది.

అరబ్బు దేశాలలో లాగానే ఇస్రాయులులో గూడా విరుద్ధ శక్తులు పని చేస్తున్నాయి. పశ్చిమ యూరపు, అమెరికానుంచీ వచ్చిన యూదులు మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చిన యూదుల మీద, స్థానికంగా మొదటినుంచీ నివసిస్తున్న వారిమీద ఆధిక్యతాభావాన్ని ప్రదర్శిస్తుంటారు. అధికారం ఎక్కువగా వారి చేతుల్లోనే వున్నది. విదేశాలలో వారికున్న పలుకుబడి, సంబంధాలవల్లనే ఇస్రాయులుకు రాజకీయ, ఆర్థిక సహాయం లభ్యమవుతున్నది. ఇస్రాయులు సోషలిస్టు పార్టీ (Mapai అంటారు దీన్ని) మితవాద ధోరణిని ప్రదర్శిస్తూ అరబ్బులతో సఖ్యం యీ రోజుకాకపోతే రేపైనా తప్పదు అనే దృక్పథంతో వున్నది. డేవిడ్ బెన్‌గురియన్ వంటి కురువృద్ధు లందరూ యీ పార్టీకి చెందినవారే. చాలా కాలం అధికారంలో వుండి యిటీవలనే పదవీచ్యుత మైంది యీ పార్టీ. ఇస్రాయులులో అతివాద మత ధోరణితో కూడుకున్న సంస్థల పలుకుబడి పెరుగుతున్నది. ఈ శక్తులు గట్టిపడినకొద్దీ అరబ్బుల పట్ల ఇస్రాయులు వైఖరి కూడా బిగియసాగింది. Balfour Declaration లో ఇస్రాయులులో అన్య మతాల వారి హక్కుల కేవిధమైన భంగం

కలుగ కూడదని ప్రకటించినప్పటికీ నిజానికి వారంతా రెండవ తరగతి పౌరులవలెనే జీవించవలసి వస్తున్నదని ప్రత్యక్ష వర్గాలు వివరిస్తున్నారు. ఇస్రాయెలు నిర్మాణానికి ఆధారమైన అంతర్జాతీయ సమితి తీర్మానంలోనే పాలస్తీనాలో మరొక అరబ్ రాజ్యం కూడా నిర్మించాలని పేర్కొనబడింది. ఇస్రాయెలు సమితి తీర్మానంలోని యీ భాగాన్ని పూర్తిగా నిరాదరించి తన కనుకూలమైన భాగాన్ని మాత్రమే అనుసరిస్తూ వచ్చింది. పాలస్తీనా కాందిశీకుల దురవస్థ కిది కారణం. ఆ కాందిశీకుల భారం వహిస్తున్న ఈజిప్టు, యిరాక్, జోర్డాన్ వంటిరాజ్యాల కిది కోపకారణం. ఒక్క జోర్డాన్ మినహా తతిమ్మా అరబ్బు రాజ్యాలలోని పాలస్తీనా కాందిశీకుల కెట్టి పౌరసత్వమూ లేదు. అక్కడి ప్రభుత్వాలుమాత్రం వారికి ప్రత్యేక పునరావాసం కల్పించి వైద్య విద్యా సౌకర్యాలు సమకూర్చారు. స్థానిక ప్రజలతో వారికి సమాన హక్కులేదు. జోర్డాన్ మాత్రం కాందిశీకులలో కోరుకున్న వారందరికీ పౌరసత్వం ప్రసాదించి ఉద్యోగాలలో, సైన్యంలో వారిని చేర్చుకున్నది. బహుశః వారికి అన్ని సౌకర్యాలు కలుగజేస్తే పాలస్తీనాలో అరబ్ రాజ్యం కోసం జరిగే పోరాటం బలహీన పడవచ్చు.

ప్రస్తుతం అరబ్బు గెరిల్లాల కార్యకలాపాలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయి. తమ కాశ్రయమిచ్చి సహాయంచేయడానికి నిరాకరించిన అరబ్బు ప్రభుత్వాలతో కూడా పోరాటానికి తలపడు తున్నాయి, గెరిల్లా శక్తులు. జోర్డాన్ సైన్యానికి గెరిల్లాలకు జరిగిన పోరాటాల ఫలితంగా జోర్డాన్ రాజు రాజీకి వచ్చి గెరిల్లాలు తమ భూభాగంలో స్థావరాలు నిర్మించుకోడానికి అంగీకరించాడు. గెరిల్లా చర్యలను నిరసించినప్పటికీ యీ చర్యలు బహుళవ్యాపకం కావడానికి కారణాలను కూడా ఆలోచించవలసి వుంటుంది... ముఖ్యంగా యిస్రాయెలు.

చారిత్రక కారణాలు, రాజకీయ శక్తులే కాకుండా అంతర్జాతీయరాజకీయాలు కూడా పశ్చిమాసియాలో ప్రముఖ పాత్ర వహిస్తున్నవి. అమెరికా ఇస్రాయెలుకు ఆర్థిక ఆయుధ సహాయం అందజేస్తున్నది. రష్యాకూడా అరబ్బు రాజ్యాలకు, ముఖ్యంగా ఈజిప్టు, యిరాక్, సిరియాలకు పూర్తిగా తోడ్పడుతున్నది. ఒకప్పుడు అగ్ర రాజ్యంగా వరిగ జీతమైన యింగ్లండు 1971 నాటికి సూయజు కాలువకు తూర్పున తన సైన్యాలేవీ వుండకూడదని నిర్ణయించడంవలన పశ్చిమాసియా అగ్రరాజ్యాల దృష్ట్యా "శూన్య ప్రాంత" మవుతున్నది. ఆ స్థానాన్ని భర్తీ చేయడం కోసమే అమెరికా రష్యాల ఆరాటం. కొంతకాలం క్రితం అక్కడ రష్యన్ పలుకుబడి పూర్తిగా తగ్గిపోయింది. దానిని పుంజుకోడానికి ఆయుధ సహాయం నిరంతరాయంగా అందజేస్తున్నది. ఈజిప్టు సైనికులకు శిక్షణ నిస్తున్నది. యుద్ధ వైమానికులకు తర్ఫీదు నివ్వడానికి తన పైలట్లను కూడా పంపింది. ఎంత చేసినప్పటికీ, తన దేశంలో కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన నాసరు రష్యన్ల సైన్యాలు వుండడానికి ఎంతమాత్రం అంగీకరించడని రష్యాకు తెలుసు. పైగా చైనీయుల పక్ష మవలంబించే వర్గం నాసరు సోషలిస్టు పార్టీలో బలమైన వర్గంగా రూపొందుతున్నది. అందుచేత రష్యా కూడా నాసరుపట్ల బేషరతుగా, నిస్సంకోచంగా సహాయం అందించడానికి పూనుకొనడం లేదు. ఆ ప్రాంతంలో మరొక యుద్ధజ్వాలను నివారించడం కూడా రష్యన్ల లక్ష్యం కావచ్చు. అమెరికన్ నౌకా దళం ఒకటి మధ్యధరాసముద్రంలో తిరుగాడుతున్నది. సౌదీఅరేబియా జోర్డాన్లు ఒకప్పుడు అమెరికన్ పక్షమేగానీ ప్రస్తుత పరిస్థితులలో అవి ఆవిధంగా వ్యవహరించ జాలవు. ఇస్రాయెలు అరబ్ రాజ్యాల యెడల కఠిన వైఖరిని అవలంబించిన కొలదీ అరబ్బురాజ్యాలలో రష్యన్ల పలుకుబడి పెరిగే అవకాశం వున్నది. ఇది సహజంగా అమెరికన్ల కిష్టం లేదు. కాని అమెరికా ఎందువల్లనో ఇస్రాయెలు

మీద ఒత్తిడి తీసుకు రాలేకపోతున్నది. కొంతకాలం క్రితం అమెరికా రష్యాలమధ్య పశ్చిమాసియా సమస్య మీద అగ్రస్థాయిలో సంభాషణలు జరిగాయి. తత్ఫలితంగా వారిరువురి మధ్య కొంత అంగీకారం కుదిరినట్లు తోస్తుంది. అదే నిజమైతే అనర్థదాయకమైన మరొక యుద్ధాన్ని నివారించి ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో యిరుపక్షాలమధ్య ఒప్పందాన్ని కుదర్చడమే వారి లక్ష్యం కావచ్చును. అరబ్బులు ఇస్రాయెలును 'రాజ్యం'గా గుర్తించి దానిపట్ల తమ శత్రువైఖరిని విడనాడటం, ఇస్రాయెలు తా నాక్రమించిన భూభాగాన్ని యిచ్చివేసి కాందిశీకులకు పరిహార మీయడం— బహుశః యిలాంటి ఒప్పందానికి మూలాధారాలుకావచ్చును. అయితే అరబ్బులు, యూదులు యిందుకు ప్రస్తుతం యెంతవరకు సంసిద్ధులు అనేది అస్పష్టం. అంతర్జాతీయ సమితి కూడా చేయ గలిగిన దేమీ లేదన్న విషయం తెల్లమే!

5

మన స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లోనే గాంధిజీ హరిజన్ పత్రికలో యూదు మత సంస్థల విధానాలను ఖండిస్తూ వ్యాసాలు వ్రాశారు. మొదటే చెప్పినట్లు యూదుల ధనార్జనదృష్టి, అందుకై వారవలంబించిన విధానాలు కారణం. మన విదేశాంగ విధానం మొదటి నుంచీ అరబ్బులను సమర్థిస్తూ వచ్చింది., ఇజ్రాయెలును ఖండించింది. దీనికి ఆధారభూతమైన అంశాలేవి? అవి నేటి పరిస్థితులలో యెంతవరకు సమంజసం?

చరిత్ర పుటలలో ఉజ్జ్వల ప్రాచీన నాగరికతలో భారతీయులు అరబ్బులు భాగస్వాములే. ఇస్రాయెలు పాశ్చాత్య సామ్రాజ్య వాదాని కొక ప్రతిరూపం అని మన విధాన నిర్ణేతల అభిప్రాయం. విబంధవిధానం ప్రకారం అరబ్బులతోనే మన సంబంధ బాంధవ్యాలు పటిష్ఠం చేసుకోవలసి వున్నది. ఇది అన్ని అరబ్బు దేశాలతో కాదు, ఈజిప్టు వంటి దేశాలతోమాత్రమే! అయితే ఇస్రాయెలు వారందరికీ శత్రువు కాబట్టి ఇస్రాయెలును ఖండించడం అవసరం. అంతర్జాతీయ రంగంలో అరబ్ జాతీయవాద ప్రేరితమైన ఆ దేశాలు మనతో సహకరించి బాసటగా నిలవాలని కూడా మన ఆశయం. మన దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు ఎగుమతి మార్కెట్లు అరబ్బు దేశాలలో విస్తారంగా లభిస్తాయని కూడా ఉద్దేశ్యం. రాజకీయ శక్తుల దృష్ట్యా చూచినా, మన దేశంలో ముస్లిములు అత్యధిక సంఖ్యలో వున్నారు. సహజంగా వారి సానుభూతి అరబ్బుల పట్లనే ప్రవర్తిస్తుంది. వారి అభిమతాన్ని కూడా పరిగణించడం ప్రభుత్వ కర్తవ్యం. "మతరాజ్య సిద్ధాంతం" ప్రకారం భరత ఖండం నుంచీ విడిపోయిన పాకిస్తాన్ మనకు శత్రువుగా నిలిచి వున్నప్పుడు అరబ్బుల పట్ల మన స్నేహ సంబంధాలు మనకు అంతర్జాతీయ వ్యవహారాలలో కొంతబలాన్ని సంపాదించి పెడతాయి. ఈ రీతిగా నైతిక రాజకీయ ఆర్థిక కారణాలను పురస్కరించుకుని మన పశ్చిమాసియా విధానాన్ని సమర్థించవచ్చును.

అయితే, దీర్ఘకాలిక దృష్టితో విధానాన్ని నిర్ణయించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు యింకేవీ లేవా అన్న ప్రశ్నకు సమాధానం ఆలోచించాలి. పైన చెప్పిన కారణాలన్నీ సమంజసమే కానీ అవి ఎంతవరకు యధార్థాలమీద ఆధారపడి వున్నాయి? అరబ్ సమైక్యత అనేది ఒక మిధ్య. సౌదీ అరేబియా, జోర్డాన్‌దేశాలు పాకిస్తాన్‌కు బహిరంగంగా సహాయం అందజేశాయి. సిరియా మన మాటలను పెడచెవిని బెట్టి భద్రతా మండలి సభ్యత్వానికి పోటీ చేసింది. అభివృద్ధి పొందిన దేశాలతో చూస్తే అరబ్‌దేశాలతో మన వ్యాపారం చాలా తక్కువ. ఎటొచ్చీ ఒక్క యీజిప్టు మాత్రం మనకు సహాయం చేసిన మాట వాస్తవం. అందుచేత పశ్చిమాసియా పట్ల మన విధానం యీజిప్టు చేత ప్రభా

వితం కాక తప్పదు. కాని యెంతవరకు? ఆ విధానం నిజానిజాలను విస్మరించ కూడదు. ఇస్రాయులు ఒక రాజ్యం. యూదు రాజ్యం రూపొందించాలని అంతర్జాతీయ సమితి నిర్ణయించినప్పుడు మనం సమితి సభ్యులమే! అందుచేత ఇస్రాయులును రాజ్యంగా గుర్తించి దౌత్యసంబంధాలు నెలకొల్పడం మన కర్తవ్యం. కానీ సమస్యలోని వివిధ అంశాల మీది మన దృక్పథానికి దీనికీ సంబంధం వుండరాదు. మానవతకు సంబంధించిన, కాందిశీకుల సమస్యను యిస్రాయులు పరిష్కరించేటట్లు చూడాలి. అందుకు మనం అరబ్బులను బలపరచక తప్పదు. అలాగే ఇస్రాయులు ఆక్రమించిన అరబ్బు భూభాగం వారికి తిరిగి యిచ్చి వేసేయ వలసినదిగా వత్తిడి చేయాలి. అరబ్బు రాజ్యాలు ఇస్రాయులు వునికిని గుర్తించి దానిమీద కయ్యానికి కాలుదువ్వకుండా చూడాలి. ఇవన్నీ మనం చేయకలిగిన పనులు కాకపోవచ్చు. కాని మన విధానం వీటిని ప్రతిబింబించేటట్లు వుండాలి. మనం అరబ్బులతో పూర్తి తాదాత్మ్యం చెందితే దీర్ఘకాలిక దృష్ట్యా పైన చెప్పిన రీతిగా విదేశ విధానాన్ని రూపొందించుకొనడం మరింత కష్టతరమవుతుంది. మనం వేసే ప్రతిఅడుగూ, ప్రకటించే ప్రతి అభిప్రాయం భవిష్యంలో మన నడకను కట్టివేసేదిగా వుండరాదు.

6

మధ్యప్రాచ్యం లేక పశ్చిమాసియా సమస్యను అనువైన పరిధిలో విశ్లేషించడం జరిగింది. అంతర్జాతీయ దౌత్య సంభాషణలు చాలావరకు యీ మార్గంలోనే నడుస్తున్నాయి. కాని ఏదిముందు, ఎవరు ముందు అనే ప్రశ్నలు తేలడంలేదు. కాష్ఠంలోకి కట్టెలు ఎవరు తోస్తున్నారో?



రెండుచోట్లా ఒకే గాలి

శ్రీ వి. రాజారామమోహనరావు

ఆ పందిట్లో హడావిడి గాలిని కదలనివ్వటం లేదు. బాగా ఉక్కగా ఉంది. అయినా అక్కడున్న అందరూ సంతోషంగా ఉన్నట్టే కనిపిస్తున్నారు. గట్టిగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ అటూ యిటూ తిరుగుతున్న వాళ్ల చూపులు పందిరి మధ్యగా తయారవుతున్న పెళ్లి మండపం మీద పడుతున్నాయి.

అక్కడ.... మండపం దగ్గర జిడ్డుముఖంతో, జారిపోతున్న పంచతో నిలబడి అజమాయిషీ చేస్తున్నాడు వెంకట్రావు. అతనికి సంతోషంగా లేదు. చాలా విసుగ్గా ఉంది. చుట్టూ గోల... పనుల్తోటి హడావిడి తోటి కమ్ముకున్న అలసట.... అతన్ని నిలబడ నివ్వటం లేదు.

లేని ఓపిక కూడదీసుకుని అలా అజమాయిషీ చెయ్యటం చిరాగ్గా ఉంది. దానికన్నా జారిపోతున్న పంచ ఇబ్బందిగా ఉంది. అలవాటు లేదన్నా వినకుండా ... 'ముఖ్యమైన పెళ్లిపెద్దవి, జులాయిగా పేంటు వేసుకోవటం బాగుండదని' కట్టబెట్టారు పంచ. దానికన్నా పనిలేకుండా అస్తమానం తనవేపు చూసే బంధువుల కోసం పలకరింపుగా రాని నవ్వు తెచ్చుకోవటం మరీ యిబ్బందిగా ఉంది.

చాలా రోజుల తరువాత కనిపించిన బంధువులు, స్నేహితులు ఎదురుగా తిరుగుతున్నారు. వాళ్లతో మాట్లాడాలని ఉన్నా మాట్లాడలేక పోతున్నానన్న విషయం వెంకట్రావుకి తెలుస్తూనే ఉంది. నిన్నటి నుంచీ తనచుట్టూ కమ్ముకున్న నిశ్శబ్దం రెండు మూడు సార్లు ఆలోచనని అటు తీసుకు పోయింది.

రెండేళ్ల క్రితం..... ఆ రోజు తను, ఇంకా చాలా మంది యిలాగే నిశ్శబ్దంగా కూచున్నారు. అప్పటి వరకు తమలో ఒకడిగా కలిసి మెలిసి తిరిగిన స్నేహితుడి శవం ఎదురుగా ఉంది. ఏం చెయ్యాలో ఎవరికీ తోచలేదు. పోయిన స్నేహితుడి బంధువుల రాకకోసం ఎదురు చూసిన ఆ గంటా, ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోలేని ఆ నిశ్శబ్దం.... స్నేహితుడు పోయాడన్న బాధ....

నిన్నటినుంచీ ఈ నిశ్శబ్దం ఆ సంఘటనని గుర్తు తెచ్చి బాధిస్తోంది. దాన్నించి తప్పించుకోటానికేనా ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడా లని ప్రయత్నించాడు ఒకటి రెండు సార్లు. ప్రయత్నించిన మాటల్ని పైకిరానీకుండా సాగుతున్న ఆలోచన తినేసింది. 'అది తప్ప.... యింకో దారిలేదా' అన్న ఆలోచన సాగుతూనే ఉంది వెంకట్రావులో.......

మండపం కడుతున్న వాళ్లు గట్టిగా మాట్లాడుకుంటూ పని చేస్తున్నారు. అక్కడో మనిషి లేక పోతే వాళ్ల మాటల్లోపడి పని తొందరగా చెయ్యరని అనుమానం. వాళ్ల మాటలు పెద్ద గోలలా ఉన్నాయి వెంకట్రావుకి. ఇంతలో ఎవరో వెనకనుంచి పిలిచారు, 'మిమ్మల్ని ఓసారి రమ్మంటున్నారండి' అని. అక్కడ నుంచి, ఆ గోల నుంచి కాస్సేపైనా దూరంగా వెళ్లిపోవటానికి ఆ పిలుపు మంచి ఆసరా అయింది.

వంటలు జరుగుతున్నవేపు కదులుతూ వెంకట్రావు కాళ్లు చెప్పాయి, అక్కడేదో అవసరం ఎదురు చూస్తుంటుందని. నిన్నటి నుంచీ అవసరాలు పెరుగుతూనే ఉన్నాయి. పెరిగే ఈ అవసరాలకి కారణంగా కనిపించేది చెల్లెలి పెళ్లొక్కటే. నిజానికి ఆ వొక్కటే కారణం కాదు... దాని వెనుక పేరుకు

పోయిన ఆచారాలు, ఆడంబరాలు.... పెట్టుబళ్లు చాలా ఉన్నాయి.

ఎదిగిన చెల్లెలి బరువు అప్పులో మునిగి పోకుండా దించుకోవాలను కున్నాడు వెంకట్రావు ముందు. నిండుగా జీవితంలో కలిసి బతకాలను కునే యిద్దర్ని చేరువ చేసే పెళ్లయితే అల్లా చేయవచ్చు కాని, ముద్దులు మురిపాలే ఎక్కువ ప్రాముఖ్యం వహించే పెళ్లికి అప్పు చెయ్యక తప్పదని తరువాత గ్రహించాడు. అది తెలిసింతర్వాత తనకొచ్చే జీతం మీద తీర్చ గలిగినంత అప్పే చెయ్యాలను కున్నాడు. నిన్నటివరకూ అంతే చేశాడు. కాని నిన్నటి నుంచీ అనుక్షణం అతన్ని మింగటానికి చూస్తు న్నాయి అప్పులు.

ఖర్చుతో కూడిన ప్రతి పనికీ ఆచారమనో, మర్యాదనో పేరు పెట్టి దేన్నీ కాదనకూడ దంటు న్నారు చుట్టూ చేరిన పెద్దలు. డబ్బుతో ముడి పడిపోయిన ఈ పెళ్లి తతంగంలో చేస్తున్న ప్రతి పనీ అయిష్టంగానే ఉంది. ఖర్చనే కాదు. ఆ ఖర్చుకి తను తట్టుకోలేననే కాదు.... చేస్తున్న వాటిలో చాలా వాటిలో ఆచారమన్న పేరు తప్ప వేరే ఏం అర్థం కనిపించటం లేదు. ఏవేవో అర్థాలు చుట్టూ ఉన్న వాళ్లు చెపుతున్నా, ఈ కాలానికి, నేటి బతుకులకి అవి సరైనవి కావని మనసు చెపుతోంది. అవి యథా విధిగా జరగనంత మాత్రంలో ఏర్పడే లోటేమిటో కనిపించటం లేదు.

వంటలు దగ్గరికి చేరేటప్పటికి...''బియ్యం చాలవు, రాత్రికే ఇంకో బస్తా కావాల''న్నారు.

గాడిపొయ్యి దగ్గర వేడికి, లోపల జరుగు తున్న సంఘర్షణకి... విన్న ఆ మాటకి... తనేదో ఊపిరాడని పెద్ద గోతిలో కూరుకు పోతున్నట్టని పించింది వెంకట్రావుకి.

'సరే' అన్నట్టు తలూపి వెనక్కి తిరిగి మళ్లీ పందిట్లో కొచ్చాడు.

పందిట్లో వాసెల్ని, పైన తాటాకుల్ని, ఆడు కునే పిల్లల్ని, మాట్లాడుకునే బంధువుల్ని అందర్నీ చూస్తూ కదిలాయి వెంకట్రావు చూపులు. అన్నీ ఒకేలా కనిపించాయి.... అరుగు దగ్గర కూచుని స్నేహితురాళ్లతో మాట్లాడుతున్న చెల్లెలు తప్ప... తెల్లటి చీరలో.... గాలికి ఊగుతున్న పువ్వులా అటూ యిటూ కదులుతూ మాట్లాడుతోంది.....

ఎన్నో ఏళ్లుగా అదో కల వెంకట్రావుకి. తండ్రిపోయిన దగ్గర నుంచి తనకున్న ముఖ్యమైన బాధ్యత అదే అనుకున్నాడు. ఏ పెళ్లికి వెళ్లినా కొన్నాళ్లు చెల్లెలి పెళ్లే కళ్లముందు నిలిచేది. చెల్లెల్ని ఎప్పుడు పెళ్లికూతురిగా చూస్తానా అనుకునేవాడు. ఈవాడు కళ్లముందు చెల్లెలు పెళ్లికూతురై ఉన్నా.....

చెల్లెలు కూచునున్న అరుగుమీంచి కావాలనే చూపు మరల్చుకున్నాడు. ఇంక అక్కడ నిలబడా లనిపించలేదు. అక్కడే కాదు. ఆ ఇంట్లో ఎక్కడా ఉండాలనిపించలేదు. ఇల్లు యిదివరకులా కనిపించటం లేదు. నిన్నటినుంచీ..... ఇంట్లో ప్రతి గది, అరుగు... కిటికీ..... ఓ గుర్తుగా, చిన్నతనం నుంచీ ఆ యింట్లో గడిచిన జీవితంలో ఎప్పటిదో ఓ జ్ఞాపకంగా కని పిస్తోంది. ఇప్పుడు వాటి నన్నిటినీ వదులుకోవాలా.... అన్న బాధ.....

డబ్బు మరీ అవసరం అయితే ఏం చెయ్యాలో చూచాయగా ఓ ఉద్దేశం ఉంది వెంకట్రావులో... ఉన్న యింటిని తాకట్టు పెట్టటానికి ఎవరి దగ్గరకు వెళ్లాలో ముందుగానే తెల్సుకున్నాడు. ఇల్లు తాకట్టు పెట్టడమంటూ జరిగితే యింటి మీద ఆశ వదులు కోవటమే అన్న విషయం బాగా తెలుసు.

ఈ పెళ్లికిగాను తీసుకున్న లోను పోను వచ్చే జీతంతో యిల్లుగడవటమే కష్టం మరో నాలు గేళ్లవరకూ. ఇంకా అప్పుచేస్తే ఎంత జాగ్రత్తపడి కూడబెట్టినా తీర్చగలిగేది వడ్డీ తప్ప అసలు కాదనేది తెలుసు.

నిన్నటినుంచీ అదే ఆలోచన. అంతవరక గట్టునే ఉన్నాడు. తను మళ్లీ మామూలుగా నిల దొక్కుకుని, తన మీద ఆధారపడ్డ వాళ్లని నిల బెట్ట గలనన్న ఆశఉంది. కాని యిప్పుడు యింకా డబ్బు కావాలి అన్న ఆలోచనొచ్చినప్పుడల్లా చిరాకు

కదులుతోంది. వచ్చిన బంధువులమీద, జరుగుతున్న ఏర్పాట్లమీద.... పెళ్లి తతంగం మీద విసుగొచ్చి చివరికి తనమీద తనకే అసహ్యం పుడుతోంది.

ఇంక అక్కడ నిలబడలేక అనుకోకుండానే పెరటి వేపు వెళ్లాడు. నీళ్లతో ముఖం కడుక్కుని కూచుంటే ప్రాణం కాస్త కుదుటపడి నట్టని పించింది.

ఆలోచన సాగుతూనే ఉంది ఏం చెయ్యాలా అని... ఆఫీసు లోను కాక చనువున్న స్నేహితులదగ్గర ఇప్పటికే వెయ్యిదాకా అప్పు చేశాడు. ఇంకా అయి దారు వందలు కావాలి. బంధువుల దగ్గర తీసుకో వచ్చు కాని ఎప్పుడు తిరిగి యివ్వగలిదేది?

'చేతిలో ఖర్చుకి తగినంత డబ్బులేక పోవట మేనా ఈ బాధ కంతా కారణం.... సరైన ఖర్చు, అవసరమైందే అనిపిస్తే అప్పు చెయ్యటానికి ఇంతగా తటపటాయింపు ఉండేది కాదు తనలో. పెట్టుబడులని, అనాదిగా వస్తున్న సంప్రదాయాలని ఎన్నో అనవ సరపు పనులు చెయ్యాల్సి వస్తోంది. తనలాంటి సగటు జీవితాలకి ఈ పద్ధతులు సరైనవి కావని తెలియటం వల్ల ఏర్పడుతున్న తపన ఇది....' ఆలోచన తెగక చాలాసేపు అలాగే కూచున్నాడు వెంకట్రావు.

ఆ రొంపిలోంచి, కల్మషంలోంచి బయట పడాలని వెంకట్రావు మనసు గింజుకుంటోంది. ఆడ పిల్ల వాళ్ళు అణుకువగా ఉండాలన్న ఆచారం అతని లోని యువ్వనాన్ని చంపి ముసలాణ్ణి చేస్తోంది. వీటన్నిటికన్నా, ఉన్న ఒక్క చెల్లెలి పెళ్లిలోనూ సంతో షంగా ఉండలేక పోతున్నానే అన్న బాధ వెంకట్రావుని మరీ కుంగదీస్తోంది.

"ఒరేయ్ ఇక్కడున్నావా... నీ గురించి ఇల్లంతా వెతుకుతుంటేనూ..... సరేలే.... లే.... నడు."

బాబయ్య గొంతులో ఆ ధ్వని గ్రహించాడు వెంకట్రావు. ఆలోచన ఒక్కసారిగా తెగిపోయింది. నాలుగడుగులువేసే లోపలే తెలిసింది పెళ్లికొడుకు ఎందుకో కబురు పెట్టాడని.

వెంకట్రావు వెళ్లిం తర్వాత పెళ్లికొడుకు పావుగంటసేపు నవ్వుతూ నట్టుతూ చెప్పాడు. "చూడండి బావగారు... ఏం లేదు. మా చెల్లాయి రేణూలేదు, అది చిన్నప్పట్నించి కొంచం పెంకిది. అందులో ఒక్కత్తే ఆడపిల్లమూలాన్ని మరీ గారంగా పెరిగింది. మీరు లాంఛనాలకోసం తీసుకున్న చీర మరీ నాసిగా ఉందంటోంది. ఏదేనా పట్టుచీర తెప్పిం చండి. ఇంకో ఏవేవో అంది చిన్న చిన్నవి. మీ బాబయ్య గారితో చెప్పానులెండి. మీరు కొంచం దాని మనసు చిన్నబోకుండా చూడాలి మరి."

చెప్పిందంతా విని..."దాని దేముందండి అలాగే చేద్దాం" అంటం తప్ప ఇంకేం మాట్లాడలేకపోయాడు వెంకట్రావు. మాట్లాడాలని లేకకాదు. 'నాకూఉన్నది ఒక్క చెల్లెలే. దాని పెళ్లి నేను నవ్వుతూ సంతో షంగా చేసే అవకాశా న్నివ్వండి. ఈ లాంఛనాల పేరు మీద ప్రాణాల్తో నన్ను చంపి.. ముందున్న నా బతుకులోని ఉత్సాహాన్నంతా ఖూనీ చెయ్యకండి' అని చెప్పాలను కున్నాడు కాని ఆచారం అడ్డొచ్చింది. తలవంచుకుని వెనక్కి వచ్చేశాడు.

గది చేరగానే భుజంమీద కండువా తీసి ఉండలా మూలకి విసిరేశాడు. కాస్సేపు గదంతా కలయ తిరిగాడు. స్థిమితం చిక్కలేదు.

ఓ గంటకి పెట్లోంచి దస్తావేజులు తీసుకుని బయటికి నడిచేవరకూ అతని మనసు, వయసు, ముదిరిపోయిన చాదస్తాలతో దెబ్బలాడుతూనే ఉంది.

* * *

రాత్రి లైట్ల వెలుగులో ·· జారిపోతున్న పంచెతో..... గుచ్చుకుంటున్న కండువాతో చచ్చి పోయిన మనసుతో నిలబడి చెల్లెలి పెళ్లి చూస్తున్న వెంకట్రావు కళ్లలోకి నీళ్లు పొంగుకొచ్చాయి

అక్కడే..... పిరిగ్గా వెలిగే లైట్లచుట్టూ, సన్నాయి చుట్టూ తిరుగుతూ ఆ పెళ్లి చూసినగాలికి మనసు కలుక్కుమంది. 'డబ్బులేక యిబ్బంది పడ్డాడు పాపం' అనుకుంది వెంకట్రావుని చూసి...అను కుని అక్కడుండలేక పందిరి మీదకి నెమ్మదిగా పాకి పూరు చివరికొచ్చి రైలెక్కింది గాలి....

* * *

ఆ పట్టణంలో రైలుదిగిన గాలి రికామీగా బైలుదేరి అక్కడికి చేరింది.

అక్కడ ... ఆడంబరం అటూ యిటూ తిరుగుతోంది. హుందా తీరుబడిగా కూచుని ముచ్చట్లాడుతోంది. బట్టలతో పాటు ఉత్సాహాన్ని తొడుక్కొచ్చిన చాలా మంది గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు.

నాయుడుగారు విశాలంగా ఉన్న షామియానా కింద కలయ తిరిగారు...పలకరించడం అవసరం అనుకున్నవాళ్లని పలకరిస్తూ; పలకరింపుగా నవ్వటం చాలనుకున్న వాళ్లని చూసి నవ్వుతూ.

పెళ్లికి రావాల్సిన వాళ్లు చాలామంది వచ్చారు. స్నేహితులు పెద్ద పెద్ద ఉద్యోగస్తులు; బంధువులు... తోటి పెద్ద చెయ్యి వ్యాపారస్థులు.....

కాని నాయుడుగారికి తృప్తిగా లేదు. ఓచోట నిలబడాలని లేదు. చేస్తున్న సంబంధంమీద ఆయన కంత మక్కువలేదు. కుర్రాడు బుద్ధిమంతుడే. తెలివైనవాడే. కాని అంతస్థు, హోదా తగిందికాదని, నలుగురూ చిన్నతనంగా చూస్తారని ఆయన బాధ.

అలా తిరుగుతుంటేనే ఎవరో అడిగారు ఆయన్ని.... "మీ పెద్దమ్మాయి రాలేదాండీ..." అని. ఏదో సమాధానం చెప్పి మరో మూలకి నడిచారు. కాని మనసులో ఓ మూల కలుక్కు మంటోంది. అది పెద్దమ్మాయి పెళ్లికి యింతవరకూ రానందుకు కాదు. ఇంకాసేపట్లో పెద్దమ్మాయి వాళ్లు ఎలాగా వస్తారని తెలుసు ఆయనికి.

రెండో కూతురి పెళ్లి తతంగం మొదలు పెట్టిన దగ్గర నుంచి, పెద్దమ్మాయి అనగానే కళ్ల ముందు నలభైవేలు కదులుతున్నాయి ఆయనకి. నలభైవేలతో సలక్షణంగా ఏ గొడవలూ లేకుండా తన అంతస్థుకు మించిన వాళ్లతో ఆయన చేసిన ఆ సంబంధం గుర్తొస్తోంది. అది గుర్తొచ్చినప్పుడల్లా చేస్తున్న ఈ సంబంధంమీద చిన్న చూపుగానే ఉంది. ఏమైనాసరే ఈ పెళ్లి ఖర్చు నలభైవేలు దాటకూడదని నిశ్చయించుకున్నారు. దాటితే అది తన అప్రయోజకత్వమే అనిపించింది ఆయనకి.

అందుకని ఈ పెళ్లిలో అవుతున్న ప్రతి చిన్న ఖర్చు నలభైవేలకి దగ్గరగా తీసుకెడుతున్నట్టు ఉంది. డబ్బున్నా, అవసరమైనా ఖర్చుపెట్టలేడాయన యిప్పుడు....

గంట్రకితమే కాబోయే అల్లుడు కనిపించి ముద్దుగా పలకరించాడు నాయుడుగార్ని. మళ్లీ మరోసారి గట్టిగా చెప్పాడు... మర్నాటి రిసెప్షన్‌లో తను చెప్పిన ఎంటర్‌టైన్‌మెంటు ప్రోగ్రాం ఏరేంజి చెయ్యటం మరిచిపోవద్దని.

ప్రోగ్రాంకి అయిదువేలకన్నా ఎక్కువకాదు. కాని నాయుడుగారికి యిష్టం లేదు. పెద్ద పిల్ల పెళ్లిలో యింత పెద్ద ప్రోగ్రాం పెట్టలేదు.

అరగంట గడిచేలోపల అయిదారు వార్తలందాయి నాయుడుగార్కి. కొత్త పెళ్లికొడుకు దగ్గర నుంచి... రాత్రి డిన్నర్‌లోకి ఫలానా డిష్ కావాలని... ఫలానా చోట ఉన్న నూట్సు తెప్పించమని......

ప్రతివార్తకి ఆయన పౌరుషం ఒకో మెట్టు పెరిగింది. ఆయనలో సరైన ఆలోచన అడుగంటింది. ఆస్థి, అంతస్థుల వ్యత్యాసాల ఆసరాగా. అవమానం ఆయన మనసులో నిండుగా చేరింది. అల్లుడు కోరినవన్నీ చేస్తే చిన్నతనం అనిపించింది. అందుకని ఏదీ చెయ్యకూడదనుకున్నాడాయన. కాని ఓ పక్కన జంకుగా ఉంది.... ఏం రభస జరుగుతుందో అని. అందుకే ఎక్కడా ఓ చోట స్థిరంగా ఉండలేక పోతున్నాడాయన....

* * *

షామియానా కింద మూల మూలలకి వెలుగు పాకుతుంటే, చీకటి చాటు చూసుకుని జంకుగా పిరిగ్గా నిలబడి చూశాడాయన కూతురి పెళ్లి.

పేద తండ్రి కన్నకూతురి పెళ్లిచేసి తృప్తిగా విడిచే నిట్టూర్పు రాలేదాయనకి... కళ్లు తృప్తిగా చెమర్చలేదు. పెళ్లయితే అయిపోయింది కాని తర్వాత ఏం రభస జరుగుతుందో అనే భయాన్నే చూశాడాయన పెళ్లికన్నా ఎక్కువగా.

* * *

చూస్తున్న గాలికి 'ఛీ' అనిపించింది. డబ్బుండటం లేకపోవటమే కాదు ఈ పెళ్లిల్లో సమస్య. మనుషులు... వాళ్ల మనసులు, ఆడ.... మగ, ఎక్కువ..... తక్కువ, అన్న వ్యత్యాసాలతో నిండిన ఆచారలు.... ఇంకా చాలా... చాలా ... ఎన్నాళ్లిలా? అనిపించేటప్పటికి కంపర మెత్తి అక్కడ నుంచి కూడా కదిలి పోయింది గాలి.

సాహితీ స్రవంతి

శ్రీ 'శివకుమార్'

కవితా స్రవంతి అనందపుటంచులను స్పృశిస్తూ భావావేగముతో వస్తుసౌందర్యముతో నిండుగా ప్రవహిస్తుంది. రసాత్మకమైన భావం మానవ అంతరాంతరాలలోనికి చొచ్చుకుని పోయి తేనెతుట్టె వలెనున్న రసచేతనను స్పందిస్తుంది. కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యా లంటాడు తిలక్. కవిత్వరహస్యం తెలియక పోతే దాని పరిధి సంకుచితమవుతుంది. కవితా రహస్యం గుర్తెరిగిన కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, తిలక్ మానవలోకంనుండి మనోనంతలోకంవరకూ విహరించ గలిగారు. కృష్ణశాస్త్రిగారి 'స్వేచ్ఛాగానము,' శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా,' తిలక్ 'నాకవిత్వం' శీర్షికలలో వారి వారి కవితా లక్షణాలను స్పష్టంగా వ్యక్తపరిచారు. వారికవిత్వం మానవ మస్తిష్కాలను హత్తుకునే వుంటుంది. పదేపదే చదివినా దాహం తీరదు.

ప్రతి కళాకారుడు తానొక మార్మికుడుగా ద్రష్టగా ప్రవక్తగా మానవజాతికి ప్రతినిధిగా నిలవాలని వాంఛిస్తాడు. కళాస్రష్ట తాను చేస్తున్న పని మహోత్కృష్టమైనదిగా భావించి దానికొక పారమార్థికపు విలువను ప్రసాదిస్తాడు. ఉన్నతమైన నైతికపు విలువను పొందటానికి కళ బాటను ఏర్పరుస్తుందంటారు షెల్లీ రివర్డ్సులు. అతీంద్రియసత్తాకు కళ ద్వారము వంటిదని క్లైవ్ బెల్. కళానుభూతి అతీంద్రియానుభూతికి సహోదరంగా భావించారు మన సంస్కృతాలంకారికులు.

కళ అంటే ఏమిటో తెలియకుండా కళాతత్వం బోధపడదు. కళను తెలుసుకోవాలంటే అలంకార శాస్త్రాలను అవగాహన చేసుకోవాలి. లేకపోతే కవితా కళ గహనమై పోతుంది. సాహిత్య విమర్శ అలంకారశాస్త్రంవేపు తీసుకు పోతుంది. సాహిత్య విమర్శకుడు అలంకారతత్వజ్ఞులను ఆశ్రయించక తప్పదు. ఎందుచేతనంటే తత్వశాస్త్రం శాస్త్రాలకు శాస్త్రం వంటిది. తాత్వికుడు వస్తుసముదాయానికీ కళాసౌందర్యమునకూ వున్న సంబంధబాంధవ్యాలను తెలుపుతాడు. సాహిత్యతత్వాన్ని సదవగాహన చేసుకోవాలన్న విమర్శకుడు తాత్వికుడు కావాలి. తాత్వికుడు విమర్శకుడూ అయివుండాలి. ఇది సాహిత్య విమర్శకూ అలంకారశాస్త్రానికి వున్న సంబంధం. ఈ సంబంధం సైన్సుకూ టెక్నాలజీకి వున్న సంబంధంవంటిది.

నవ్యకవితారీతులలో వచన కవిత్వం ప్రాచీన నియమాల నుల్లంఘించి నూతన సరళిలో భావ ప్రకటనాసారళ్యానికి, యదార్థ జీవితచిత్రణకూ, భావుకతకు మార్గదర్శి అయింది. ఈ మార్పు ఆహ్వానించ దగినది. సమాజశ్రేయస్సు కోరే నవీన దృక్పథం సమాదరణీయమే. కల్లోలాన్ని సృష్టించే నూతనత్వం గర్హణీయం.

నవ్యసాహితీ ప్రపంచమున కవులూ విమర్శకులూ వర్గాలుగా ముఠాలుగా చీలిపోవటం వలన, కృత్రిమరాజకీయసైద్ధాంతిక సులోచనములు తగిలించుకొనటం వలన ఉదాత్తకవిత్వాన్ని వ్రాసిన సమకాలీనులను మెచ్చుకోలేకపోతున్నారు. ఆడెన్, స్పెండరువంటి కవులు, కాడ్వెల్‌వంటి విమర్శకులూ, సమకాలీనసాహిత్యాన్ని గొప్పదైనా మెచ్చలేదు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు బూర్జువా రచయితలైన ప్రూస్ట్, లారెన్స్, ఈట్సు, ఇలియట్‌లలో గొప్పతనాన్ని చూడలేకపోయారు. మన విమర్శకులు కూడా కొందరు కొందరు

కవుల కవిత్వాన్ని హీనమయిందిగా భావించడం, కొందరిని ఆకాశాని కెత్తడంవంటి విమర్శలు అంధవిశ్వాసంతో, రాజకీయ దురభిమానంతో కూడు కొన్నట్టివి. ఇట్టి విమర్శలు వారి పరప్రత్యయనేయ బుద్ధిని వెలికి దీసి చూపుతున్నట్టుగా సహృదయ త్వాన్ని చూపవు. సాహిత్య ప్రక్రియల్ని అవగాహన చేసుకోటానికి తద్భిన్నమైన బౌద్ధికమైన రాజకీయ సిద్ధాంత ప్రమాణాలు పనికిరావు. సాహిత్యంబౌద్ధికం కాదు. బౌద్ధిక కవి లూయిస్ మెక్నీస్ ఏమంటు న్నాడో చూడండి:

> But 1 could cherish existence
> Loving the beast and the bubble
> Loving the rain and the rain bow
> Considering philosophy alien.

ఈతని సమకాలీనుడు డే లెవిస్ కూడా Let logic be the hive/wisdom its content to taste honey అన్నాడు. కనుక కవిత్వాన్ని సాహిత్య ప్రమాణాలతోనే వెలకట్టడం సముచితం.

ఒక కవిని మెచ్చుకోవడంలో అతని స్వీయ సిద్ధాంతం అడ్డు కారాదు. శ్రీ శ్రీ మార్క్సిస్టు అయినంత మాత్రాన కవిత్వాన్ని కొట్టిపారవేయటం అవివేకం. మూఢ విశ్వాసాలను ఖండించవలసిందే. హాప్కిన్స్, ఇలియట్‌లలో మత ప్రభావం లేక పోలేదు. మనకు కావలసింది వారి కవిత్వం. కవియొక్క బాహ్యమైన నమ్మకాలతో దృక్పథా లతో మనకు పనిలేదు. కవిత్వంలో వ్యక్తమయిన నమ్మకం దృక్పథం మాత్రమే మనకు కావలసింది.

కవి లౌకికానుభవపు పరిధుల్ని అధిగమిస్తాడు. అతని ఇంద్రియశక్తి భావనాశక్తి తీక్ష్ణమూ సూక్ష్మమూ అయినట్టివి. కవి కొన్ని ప్రతీక లుపయోగిస్తాడు. అవి విషయనిష్ఠంగా వుంటాయి. లౌకికజగత్తులో దర్శించిన సత్యాన్ని సౌంద ర్యంలో ముంచి అందివ్వడం వలన అసాధారణ మైన అనుభవంగా ద్యోతక మవుతుంది. అది అబద్ధంకాదు. అయినా అందమైన కల్పనగా స్ఫురిస్తుంది. విలియం బ్లేక్ వ్రాసిన 'టైగర్', వర్డ్స్వర్త్ 'వెస్ట్ మినిస్టరు బ్రిడ్జి', ఈట్సు 'స్కూల్ చిల్డ్రన్,' ఇలియట్ 'వేస్ట్‌లాండ్' కవితలు ఊహాచిత్రణలు కావు. వస్తురహితమైన రసభావాలూ కావు. అసామాన్యంగా కన్పించే —యదార్థ దృశ్యాలు. కవిత్వాన్ని భావాలు కాదు రూపొం దించేది, భాష. కవిత్వంలో భాష పారడాక్సికల్‌గా వుండాలంటాడు క్లీన్త్‌బ్రూక్స్. పారడాక్స్ అంటే అర్థం 'Seemingly absurd and really well founded' అని.

దీనికి ఉదాహరణగా వర్డ్స్వర్త్ వ్రాసిన 'అపాన్ వెస్ట్ మినిస్టర్స్ బ్రిడ్జి' చూస్తే తెలు స్తుంది. మానవుడు నిర్మించిన లండన్‌నగరం ఉదయ సౌందర్య వస్త్రాన్ని ధరిస్తుంది. ప్రకృతికి ప్రాణస్నేహంగా పర్వతం వలె నదిలాగా పరుచుకుని నిశ్శబ్దంగా నిద్రిస్తుంది, కవి దృష్టిలో. కృత్రిమ నగరం ఆక్షణం అద్భుతంగా భాసిస్తుంది ప్రకృతి చిత్రం లాగ.

రెండవ ఉదాహరణ పోప్ వ్రాసిన 'ఎస్సే ఆన్ మాన్' కవిత్వ మంతా మానవుణ్ణి గూర్చి చెప్పేదే. శ్రీశ్రీ అంటాడు మానవుడే నాగీతం అని. మాన వుడు ఎటువంటి వాడో పోప్ బాగా చెప్పాడు:

> In doubt his Mind or Body to prefer:
> Born but to die, and reas'ning but to err
> Alike in ignorance, his Reason such
> Whether he thinks too little, or too much.
> Created half to rise, and half to fall;
> Great lord of all things, Yet a prey to all:
> Sole Judge of Truth, in endless error hurl'd
> The Glory, Jest, and Riddle of the World!

ఈవిధమైన ద్వంద్వప్రవృత్తి జగత్తులోనూ వుంది, మనిషిలోనూ వుంది. ప్రపంచంలో ఉత్తమ కవిత్వం అంతా ఈ రీతిగానే వుంది. కవిత్వంలో సత్య దర్శనమంటే యిదే. వాస్తవికత అన్నా యిదే. తద్భిన్నమైనది ఊహాచిత్రణ. వెలుగు నీడలులేని ఈ జీవితానికి రుచీ పచీ లేదు. మహాకవుల కావ్యా లలో ఒక వర్గానికి నివాళి పట్టడం ఎక్కడా

కానరాదు. భారతంలో కూడా పాండవుల స్వర్గానికి సగం ఎక్కినట్టూ నరకంలో సగం చిక్కినట్టూ కనిపిస్తారంటాడు కృష్ణశాస్త్రి. కేవలం వెలుగు చూసినా, కేవలం చీకటిని గురించి పాడినా వాస్తవికతకు భిన్నం.

* * *

నేటి వచన కవులలో ఏవర్గానికీ చెందకుండా సమచిత్తంతో సమ్యక్ దృష్టితో సమకాలీన సమాజం సృష్టించిన అయోమయం చివర విల్చిన ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటూ అర్థరాత్రి నిశ్శబ్దంలో చీకటిలో మెరిసే అక్షరాలను లిఖిస్తున్న వరిగి రాధాకృష్ణ అభినందనీయుడు.

నరాలుపొందే ఉద్రేకాన్ని
చైతన్యమని భ్రమించినంతకాలం
నిజమైన సంగీతానికీ మూలుగుకీ
తేడా తెలుసు కోనంత కాలం
ఆశకీ అత్యాశకీ నడుమ
రేఖగీసి మసలు కోవడం
నేర్చుకోనంతకాలం
నమ్మిన దానికోసం
నిలబడలేక నిలకడలేక
నీళ్ళనములుతూ కూర్చున్నంతకాలం
ఈ అయోమయం తప్పదు

అని నిష్కర్షగా చెప్పి వేశాడు. కవులకు మార్గాన్ని నిర్దేశిస్తున్నాడు. నిరాశతో, కన్నీళ్లతో, దుర్భర దారిద్ర్యంతో జీవించే నేటి మనిషికి బ్రతుకుపై ఆశను రేకెత్తించాలి. నిత్య జీవితంలో లేచిన మరుక్షణం నుండి ఎన్నోప్రశ్నలు గోరుచుట్టులా సలిపే లక్షల సమస్యలు. కవిత్వంలోనూ అవే ప్రత్యక్షమైతే మనిషి కాళ్ళు చాపేస్తాడు. తిలక్ వ్రాసిన స్వేచ్ఛావిహారంలో ఆధునిక మానవుణ్ణి చక్కగా వర్ణించారు. పాఠకుడు కూడా నిత్యజీవితాన్ని కొంచెం సేపు మరచిపోటానికి కవిత్వాన్ని ఆశ్రయిస్తాడు. కనుక కవిత్వంలో ఆశ బలంగా వుండాలి. రాధాకృష్ణ జీవిత ద్వారాన్ని మూయకుండా మానవుణ్ణి సమాజాన్ని దుమ్మెత్తిపోయకుండా స్వీయతాత్త్వికచింతనతో రచిస్తున్నారు. వారి కవిత్వానికి దోహదాలివి:

మహత్తర ప్రేరణకు మూలమైన నిర్మలాంతఃకరణ
మహిమాన్వితమైన జీవితంలోని విలువల స్మరణ
మనసులోని విచిత్రంగా కదిలే ఒకానొక స్ఫురణ
నా గీతాలకు దోహదాలివి.

అంతర్మథనంలోంచి ఉద్భవించిన కవితామృతం సజీవమైనది. అట్టి కవిత్వమే మానవుని మనస్సును రంజింప జేసేది. మార్పించేది. అందుకే అంటారు "నావాక్కు అవుతుంది వజ్రం చెడును ఖండించటానికి; అదే అవుతుంది పువ్వు మంచిని అలంకరించ టానికి" అని.

వచన కవులు ఈవిధమైన తాత్త్వికదృక్కోణాన్ని అలవరచుకుని ఆత్మసంయమనంతో రచిస్తే ఉత్తమ కవిత్వాన్ని సృజించగలిగిన వారవుతారు. మామూలు సాదా మనిషిలాగ సమాజంలోని అవినీతిని దారిద్ర్యాన్ని దౌర్జన్యాన్ని చూచి గుండెలు బాదుకుంటూ గాలిలో చేతులు విసురుతూ పరుషంగా పలికితే ప్రయోజనం శూన్యం. సంక్షోభంలో చిక్కుకున్న నేటి మానవునికి పరిష్కారమార్గాన్ని సూచించాలి రచయిత.

వర్షావేళ

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

ఎగసెడి గర్జాశంపల
నోఁగిబడు వార్షుకపుధార నుర్విరహింపన్
సొగసౌ తౌర్యత్రిక మన
మృగశిర దయచేసె మొయిలు మేళముతోడన్.

ఎండినమ్రోడులం జివురులెత్తిన ఆశలు మొగ్గదొడ్గగా
కొండలఁ బిండిచేసి, శ్రమకోర్చి, విదిల్చిన ఘర్మబిందువుల్
కుండలఁ బోఁతగాఁ గురిసి కూర్మి వహింపఁగఁ గర్షకాళికిన్
పండినపంటగా మెదలి పర్వ మొనర్చుతి వార్షుకమ్మునన్.

ముసిరినచీఁకటుల్ పెసగి మోహతమిస్రజగమ్ము నిండఁగా
విసిరిన గాలులున్, కనులు పీల్చెడి వైద్యుత కాంతి రేఖలున్.
ఎదఁ దొలఁగించి, దైన్యతమవర్తన మిచ్చెడి; వానకాలులో
వినవిన పొఁగిపోవఁగల వేగము మేఘునకైనఁ గల్గునా?

ముత్తెపుజల్లులో! మురిసిపొంగులు వారిన పూల సోనలో!!!
చిత్తము తత్తరింప నవసేందిరహాసవికాసవీక్షలో!!!
మెత్తనిగుండెవాని కిర మేపుఁగ నింపిన దానధారలో!!!
చిత్తుల ముంచుచున్ జగతి చిత్తము ఎంచుతి రేపుమాపులన్

నీలినీడలపైఁ దేలు నీటిజాలు
గాలివంపులఁ బయనించి గంతువేయు,
మొయిలు—పైపైన—పులకలు భూమిపైన,
ప్రకృతి దిద్దిన వర్ణచిత్రాలు గావె!

ఇ. ఎమ్. ఫార్‌స్టర్ నవలా ప్రపంచం

శ్రీ వల్లంపాటి వెంకటసుబ్బయ్య



హెమింగ్వే, స్టెయిన్‌బెక్, హక్స్లీ మొదలైన మహారచయితలు స్వల్పకాల వ్యవధిలో మరణించాక, ఆ కోవకు చెందిన రచయితలు యింకా ఎవరున్నారని ప్రశ్నించుకుంటే ఒక్క ఫార్‌స్టర్ పేరు మాత్రం స్ఫురించేది. తొంభై వసంతాలు చూచిన అతడు నూరూ చూస్తాడన్న ఆశాభావం కలిగేది. కానీ భారతదేశానికి ఎంతో మిత్రుడు, నిజాయితీ మూర్తీభవించిన మేధావి అయిన ఫార్‌స్టర్ 'శతాయుః పురుషః' కాకుండానే వెళ్ళిపోయాడు. అతని మరణంతో పాతతరానికి చెందిన రచయిత లంతా మనల్ని వీడి పోయారన్న దిగులు మనకు మిగిలింది.

ఫార్‌స్టర్ 1879 వ సంవత్సరంలో లండన్‌లో జన్మించాడు. టాన్‌బ్రిడ్జి పాఠశాలలోను, కింగ్స్ కళాశాలలోను చదువుకున్నాడు. అతనికి తన కళాశాల మీద వున్న మమకారం అంతాయింతా కాదు. అండర్ గ్రాడ్యుయేట్‌కోర్సు చదవడానికి అంతకంటే మించిన కళాశాలలేదని అతని అభిప్రాయం. 1907 సంవత్సరంలో 'దేవాస్' సంస్థానంలో ఉద్యోగిగా భారతదేశానికి వచ్చాడు. తర్వాత ఒకసారి స్వాతంత్ర్యానికి పూర్వం, మరొకసారి స్వాతంత్ర్యానికి అనంతరం మొత్తం మూడుసార్లు భారతదేశానికి వచ్చాడు. కానీ మొదటి రెండు యాత్రల ఫలితంగానే 'A Passage of India' అన్న నవల 'Hill of Devi' అన్న యాత్రాగ్రంథం మనకు లభించాయి. ఫార్‌స్టర్ కొంతకాలం మధ్యప్రాచ్యదేశాలలో ఉద్యోగం కూడాచేశాడు. అలెగ్జాండ్రియాను గురించి రెండు గ్రంథాలు రచించాడు. ఉద్యోగాలు విరమించి తనకు ఎంతో ప్రీతిపాత్రమైన కింగ్స్ కళాశాలలో 'ఫెలో'గా జీవితాంతం వ్యవహరించాడు. ఆధునికకాంగ్ల రచయితల జీవితాలతో ఫార్‌స్టర్ జీవితాన్ని పోల్చిచూచినప్పుడు మనకు చాలా తేడా కనిపిస్తుంది వాళ్ల రచనల్లోలాగే! తన 80 వ జన్మదినోత్సవ సందర్భంలో B. B. C. తో యిచ్చిన యింటర్వ్యూలో "నా జీవితంలో ఎటువంటి నాటకీయతా లేదు" అని అతనే స్వయంగా చెప్పుకున్నాడు.

ఫార్‌స్టర్ మొదటినవల— Where Angels Fear to Tread—1905 లో ప్రచురిత మైంది.తర్వాత 1907 లో Longest Journey, 1909 లో A Room with a View, 1910 లో Howards End అన్న నవలలని ఫార్‌స్టర్ ప్రచురించాడు. మళ్లీ 14 సంవత్సరాల దాకా మరొక నవలను ప్రచురించలేదు. 1924 లో అతని కీర్తి పతాక A Passage to India ప్రకటితమైంది. ఈ నవలకుకూడా ప్రచురించిన తక్షణం కీర్తి రాలేదు. మేధావి వర్గాలలో మాత్రం కాస్త సంచలనాన్ని కలిగించింది.

1927 లో Aspects of Novel అన్న విమర్శ గ్రంథాన్ని, 1948 లో Collected Short Stories అన్న పేరుతో మొదటినుండీ తాను వ్రాసిన కథలను ఫార్‌స్టర్ ప్రచురించాడు.

ఫార్‌స్టర్ సాహిత్య సంబంధమైన రచనలలో ప్రముఖంగా చెప్పుకోదగినవి యివి మాత్రమే. అతని ప్రతిభా సంపత్తిని ఎరిగిన వారికి ఈ రచనలు చాలా తక్కువ అనిపించక పోదు.

ఫార్‌స్టర్ రచనలు రాశిలో అల్పమే అయినా గుణంలో అనల్పమైనవి. 1905 లో రచన ప్రారంభించి 1970 దాకా జీవించిన ఫార్‌స్టర్ తన 65 సంవత్సరాల 'రచనా జీవితం'లో వ్రాసింది తక్కువే! A Passage to India తరువాత ఎంత ప్రయత్నించినా మరొక నవల వ్రాయలేకపోయాడు. అతనివద్ద Arctic Summer అన్న నవల అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

"I have not written as much as I'd like to"......అని ఫార్‌స్టర్ ఒక సందర్భంలో తన బాధను వ్యక్తం చేశాడు.

ఫార్‌స్టర్‌ను కలుసుకున్న మిత్రులు, అభిమానులు "మీరు ఎందుకు వ్రాయరు?" అని ప్రశ్నించేవారు.

అతడు నవ్వుతూ "ఎందుకు వ్రాయాలి?" అని ఎదురు ప్రశ్న వేసేవాడు.

"మీరు గొప్ప నవలారచయితలు. మీరు 1924 తర్వాత నవల వ్రాయనేలేదు. ఈ మధ్యకాలంలో మీరు జీవితాన్ని గురించి ఎన్నో విషయాలు వకాలి కంగా ఆలోచించి వుంటారు కదా?" అనేవారు మిత్రులు. అందుకు సమాధానంగా క్రింది మాట చెప్పేవాడు ఫార్‌స్టర్.

"......Life has become less conformtable for the Victorian liberal......Our outlook which seems to me admirable, has lost the basis of golden soverigns upon which it originally rose, How on earth can an outlook which has lost its basis be any longer admirable?......"

తాను గతశతాబ్దపు చివరి భాగానికి చెందిన వాణ్ణని, నాటి విశ్వాసాలు, జీవితదృష్టి వేరని, వాటిని ఈనాడు ప్రజలు గౌరవించటం లేదని, అందువల్ల సమకాలీనజీవితం తనకు అంతుపట్టటం లేదని ఫార్‌స్టర్ Two cheers to Democracy అన్న గ్రంథంలో మాటిగానే చెప్పాడు. నవలారచన భారీపరిశ్రమగా మారిపోయిన నేడు, రచయితలు రచయిత్రులు ఫార్‌స్టర్ లోని నిజాయితీని కొద్దిగానైనా నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

ఫార్‌స్టర్‌కు కీర్తి చాలా నెమ్మదిగా వచ్చిందని చెప్పక తప్పదు. అతడు 1905 లో రచన ప్రారంభించినా తగిన కీర్తి రావటానికి, దాదాపు 40 సంవత్సరాలు వేచివుండ వలసి వచ్చింది. ఈనాడు ఫార్‌స్టర్ గ్రంథాలు అతడు ఆశించిన దానికంటే ఎక్కువగానే ప్రచారం పొందాయి. రచయితే ఒక సందర్భంలో అన్నట్టు, అతని కీర్తిలత అమెరికాలో పెరిగి యితర దేశాలకు వ్యాపించింది. ఫార్‌స్టర్‌ను గురించి మొదటి మంచిగ్రంథం వ్రాసిన ఘనత అమెరికన్ విమర్శకుడగు 'లయొనల్ ట్రిల్లింగ్'కు దక్కుతుంది. తరువాత జేబల్, ఆర్నాల్డ్ కెటిల్, వాల్టర్‌ఆలన్ వంటి విమర్శకులు ఫార్‌స్టర్ రచనల్లో ఎన్నో అందాల్ని చూపించారు. ఈనాడు అతని నవలలు ప్రపంచంలోని ప్రతివిశ్వవిద్యాలయంలోనూ ఆంగ్ల సారస్వత విద్యార్థులకు పాఠ్య గ్రంథాలుగా వున్నాయి. 1967 వ సంవత్సరం వరకు A Passage to India ఒక పెంగ్విన్ ముద్రణ లోనే ఎనిమిది లక్షల ప్రతులు అమ్ముడు పోయింది.

2

ఫార్‌స్టర్‌ను గురించి వ్రాయటానికి కలం పట్టిన ప్రతి విమర్శకుడూ అతన్నెంతో ప్రభావితం జేసిన ఉదారవాదాన్ని (Liberalism) గురించి చర్చించక తప్పలేదు. రోజ్ మెకాలే వంటి వారు దానికి అధిక ప్రాముఖ్యత నివ్వగా, ట్రిల్లింగ్ వంటి వారు పూర్తిగా తిరస్కరించారు.

ఒక విధంగా చూస్తే ఈ వివాదాని కంతటికీ ఫార్‌స్టరే స్వయంగా కారకుడేమో!

"I belong to the fag-end of Victorian liberalism"

......"(I am) an individualist and liberal who has found liberalism crumbling beneath him and at first felt ashamed. Then looking around, he decided there was no special reason for shame, since other people, what ever they felt, were equally insecure. And as for individualism there seems no way of getting off it, even if one wanted to........." అని తనను గురించి వ్రాసుకున్నాడు. కానీ ఫార్‌స్టర్‌వంటి హృదయవాదిని ఏవో కొన్ని సిద్ధాంతాలతో కట్టి వేయటం వీలు కాదు. ఏది యేమైనా ఉదారవాది (Liberal), వ్యక్తి ప్రధానవాది (Individualist), సంశయవాది లేక అజ్ఞేయతావాది (Agnostic) అన్న మాటలు అతణ్ణి అర్థంచేసుకోవటానికి ఎంతగానో సాయ పడుతాయి.

ఫార్‌స్టర్ ఏ రాజకీయ, ఆర్థిక, తాత్విక సిద్ధాంతానికీ పూర్తిగా లొంగని రచయిత.

3

ఫార్‌స్టర్ సాహిత్యరంగప్రవేశం చేసేనాటికి హార్డీ, మెరిడిత్, జేమ్స్‌లు ఏలుబడి సాగుతున్నది. హార్డీ భావామయ జీవితచిత్రణ, మెరిడిత్ మేధా సంపత్తి, జేమ్స్ నైతిక విమర్శ, శైలీవిన్యాసాలు పాఠకుల మెప్పును పొందు తున్నాయి. అలాంటి తరుణంలో ఫార్‌స్టర్ మొదటి నవల 'where Angels Fear to Tread' ప్రచురితమైంది. అందులోని కథా వస్తువు ఒక అంతర్జాతీయ వివాహం; దాని పరిణామాలూను.

ఈ నవలలో ఉన్నతమధ్యతరగతి (Upper middle class) కి చెందిన ఒక ఆంగ్ల కుటుంబం యొక్క కుహనాఅభిజాత్యాహంకారాన్ని ఫార్‌స్టర్ అవహేళన చేస్తాడు. ఇంటి కోడలు నాగరికురాలు కాదని, ఆమెను 'నాగరిక' దేశమైన ఇటలీకి, కెరోలిన్ అన్న ఆవిడను తోడుగా యిచ్చి పంపుతారు. ఆమె అక్కడ హీన వర్గానికి చెందిన 'గినో' అన్న వ్యక్తిని ప్రేమించి వివాహ మాడి, ఒక బిడ్డను కని చనిపోతుంది. ఆ బిడ్డను అనాగరికత నుండీ, పాపం నుండీ, నరకప్రాప్తి నుండీ రక్షించా లని బయలుదేరిన ఆడపడుచు, మరది (ఫిలిప్) ఆ బిడ్డ చావుకు కారణభూతు లవుతారు. ఆ ప్రయత్నాలు, అనాగరికంగా ప్రవర్తించే 'గినో' కంటే ఎంత ఎక్కువ అనాగరికాలో నిరూపిస్తాయి. భంగపడి తిరుగొస్తున్న సమయంలో అభిజాత్యం మూర్తీభవించిన 'ఫిలిప్' 'కెరోలిన్'ను వివాహం చేసుకోమని అభ్యర్థిస్తాడు. ఆ సమయంలో అతని హృదయ దారిద్ర్యం ఎంతో వ్యంగ్యవైభవంతో వ్యక్తీకరింపబడింది.

తన మొదటి నవలలోనే తన మార్గాన్నీ, శైలిని, శిల్పాన్నీ తెలుసుకున్నాడు ఫార్‌స్టర్. ఇలా నవలలోని కథలను చెప్పటం ఫార్‌స్టర్‌కు అన్యాయం చేయటమే అవుతుంది. కథను మించిన వ్యంగ్యం, చక్కగా నప్పే గంభీర సంకేతాలు, అందుకు తగిన కవితామయమైన గంభీరశైలి ఫార్‌స్టర్‌ను వరించి వచ్చిన వరాలు.

4

ఈ గుణాలన్నీ అతని చివరి నవల A Passage to India లో ఉన్నతశిఖరాగ్రాల నందుకున్నాయి. భారతీయులైన మనకు, యితరుల కంటే ఆ నవల ఆత్మీయమైంది కాబట్టి విపులంగా పరిశీలించుదాము.

ఎంతోకాలం ఫార్‌స్టర్‌ను వేధించిన వస్తువుకు ఈ నవలలో సమగ్రమైన ఆవిష్కరణ జరిగింది. ఇటలీ (Where Angels Fear to Tread), కేంబ్రిడ్జి (The Longest Journey), లండన్ (The Howards End) కథాస్థానాలుగా పై నవ

లలు రచించబడ్డాయి. ఈ నవలలతో ఆంగ్లేయ పాత్రలకన్నా యితరులే ఎక్కువగా కనిపిస్తారు. జాతి మతాలకు అతీతమైన వ్యక్తిగత సంబంధాలను చర్చించటానికి, దానింతకు ముందు ఎన్నుకున్న కథాస్థానాలు పాత్రలు ఫార్‌స్టర్‌కు సంతృప్తి నివ్వలేదు. అందువల్ల A Passage to India లో కథాస్థానంగా భారత దేశాన్ని — వర్గ మత వైషమ్యాలకు రంగస్థలమైన చంద్రపూర్‌ను ఎంచుకున్నాడు. కథాకాలం స్వాతంత్ర్యానికి దాదాపు పాతిక సంవత్సరాల పూర్వం.

చంద్రపూర్ పట్టణంలో రెండు వర్గాలు— స్థానిక భారతీయులు, బ్రిటిష్ సామ్రాజ్యభక్తులైన ఆంగ్లేయులు. ఈ సమాజంలోనికి 'అడేలా', "శ్రీమతి మూర్'' అన్న యిద్దరు ఆంగ్ల స్త్రీలు వస్తారు. 'అడేలా' శ్రీమతి మూర్ కొడుకు 'రోనీ'ని వివాహం చేసుకోవాలన్న ఉద్దేశంతోను, శ్రీమతి మూర్, అడేలాకు తోడుగాను వస్తారు. వీరుకూడా ఉన్నత ఆంగ్ల సమాజానికి చెందిన వారే! కానీ, 'భారతదేశంయొక్క అంతః స్వరూపం' చూడాలన్న యిచ్ఛ వున్నవారు. వీరిద్దరికీ స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ 'ఫీల్డింగ్'తోను, సీమచదువులు చదివిన భారతీయుడు 'డాక్టర్ అజీజ్'తోను పరిచయం కలుగుతుంది. అజీజ్ గతించిన భార్యను తలచుకుంటూ, మిగిలిన ముగ్గురు పిల్లల్ని చూచుకుంటూ జీవిస్తున్న వేదనాజీవి. దేశాభిమానం ఒక వైపు, పాలక వర్గమైన ఆంగ్లేయుల సహచర్యంకోసం తపన మరొక వైపు లాగుతుంటే నలిగిపోతున్న విచిత్ర వ్యక్తి. నిష్కల్మషంగా 'అడేలా' వీరిద్దరి స్నేహాన్ని అభిలషిస్తుంది. కానీ శ్రీమతి మూర్‌లో ఆ ఆతురత కనిపించదు. ముదిమి ఆమెలోని ఉత్సాహాన్ని, ఆశలను నాశనం చేసింది. ఆసన్నమవుతున్న మృత్యువును గుర్తెరిగి, ధైర్యంగా ఆహ్వానించగల ఆత్మశక్తిని సమకూర్చు కుంటున్నది. ఆమెకు కూడా వీరి పరిచయం కలుగుతుంది.

ఆంగ్లేయుల సహచర్యంకోసం తహతహలాడుతున్న అజీజ్, మరబార్ గుహలకు ఒక 'పిక్‌నిక్' ఏర్పాటు చేస్తాడు. ఇంతవరకూ నేపథ్యంగా వున్న మరబార్ గుహలు, నవలలోని ప్రప్రధాన సంఘటనకు రంగస్థలంగా మారుతాయి. 'అడేలా' క్రొత్త చోట్లు చూడాలన్న ఉత్సాహంతో వుంటుంది. కానీ శ్రీమతి మూర్‌కు ఆ గుహలు ఆకర్షణ, వికర్షణ రెండూ కలుగ చేస్తాయి. అవి జనన మరణాలకు, మంచి చెడ్డలకూ సంకేతాలుగా భాసిస్తాయి. ఆ గుహలలో "ou boum'' అన్న ప్రతిధ్వని మాటిమాటికీ వింటుంది. ఆ ధ్వని ఆమెలో విచిత్ర పరిణామాలను కలుగ జేస్తుంది. ఇంతకాలమూ ఆమె విశ్వసించిన ఆంగ్లేయ జీవిత లక్ష్యాలను నాశనం చేస్తుంది. ఆలోచనలతో అలసిపోయి, ఆమె ఒక చోట కూలబడి పోతుంది.

గుహల వాతావరణం 'అడేలా' పైన కూడా చిత్రంగా పని చేస్తుంది. నైతికంగా ఆమెలో నూతనమైన పరిణామాలు కలుగుతాయి. వాటి భ్రాంతిలో ఆమె 'అజీజ్' తనను మానభంగం చేయటానికి ప్రయత్నించాడని భావించి గుహల నుండి పారిపోతుంది. కాని గుహలలో ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు—బహుశా 'అడేలా'కు కూడా!

ఈ వార్త చంద్రపూర్‌లో దావాగ్నిలా వ్యాపిస్తుంది. శ్రీమతి మూర్, ఫీల్డింగ్‌లు తప్ప మిగిలిన ఆంగ్లేయులందరూ అజీజ్ అంత పనీ చేసివుంటాడని నమ్ముతారు. అతనికి పెద్ద శిక్షపడాలని అందరూ ఆశిస్తారు. అజీజ్ అరెస్టు చేయబడతాడు.

అజీజ్ నిర్దోషి అన్నందువల్ల ఫీల్డింగ్‌ను ఆంగ్ల సమాజం సాంఘికంగా బహిష్కరిస్తుంది. తల్లిమీద నమ్మకంలేని 'రోనీ', శ్రీమతి మూర్‌ను ఇంగ్లండుకు బలవంతంగా పంపేస్తాడు. ఆమె మార్గమధ్యంలో మరణిస్తుంది. హిందూ మహా సముద్రమే ఆమెకు సమాధిగా మారుతుంది.

కేసు విచారణ ప్రారంభమవుతుంది. నిందారోపణ చేయవలసిన 'అడేలా'లో కూడా, శ్రీమతి మూర్‌లో కలిగిన విచిత్ర పరిణామాలు కలుగుతాయి. ఆమె స్థిర నిశ్చయం క్రమంగా శిథిలీకృతమవుతుంది. ఆమె తన అభియోగాన్ని వాపస్ తీసుకుంటుంది. కేసు

వీగిపోవటంవల్ల అజీజా విడుదల చేయబడుతాడు. చంద్రపూర్‌లోని భారతీయుల ఆనందానికి అవధులు లేకుండా పోతాయి. శ్రీమతి మూర్‌ను ఫీల్డింగ్‌ను బహిష్కరించినట్లే ఆంగ్లేయ సమాజం అడేలాను కూడా బహిష్కరిస్తుంది.

నిరాశతో, విసుగుతో ఇంగ్లండుకు వెళ్లిన ఫీల్డింగ్ మరికొన్ని సంవత్సరాల తరువాత, శ్రీమతి మూర్ కుమార్తెను వివాహం చేసుకొని భారతదేశానికి తిరిగి వస్తాడు. అప్పుడు అజీజా ఒక ముస్లిం సంస్థానంలో ఉద్యోగం చేస్తుంటాడు. ఇంగ్లండు మీద వ్యామోహం అతనిలో నశించిపోయింది. తన వ్యథలకు ఆ వ్యామోహమే కారణమని అతనికి అర్థమైంది. ఫీల్డింగ్ పాత స్నేహితుణ్ణి కలుసుకోవటానికి వెళ్లుతాడు. పాలక పాలిత భావాన్ని, మత వైషమ్యాలను త్రోసిరాజని తా మిద్దరూ సోదర మానవులుగా జీవించటం సాధ్యమా అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

"కాదు. మా దేశంనుండి ప్రతి ఆంగ్లేయుణ్ణి గెంటివేసే వరకూ సాధ్యంకాదు" అంటాడు అజీజా.

"మనం యిద్దరం స్నేహాన్ని అభిలషిస్తున్నాం. అది కూడా సాధ్యం కాదా?" అని ప్రశ్నిస్తాడు ఫీల్డింగ్.

అందుకు అజీజా జవాబు చెప్పడుకానీ రచయిత చెబుతాడు.

"......But the horses did not want it—They swerved apart; earth did not want it, sending up rocks through which riders must pass single file; the temples, the tank, the Jail, the palace, the birds, the carrian, the Guest House, that came into view, as they issued from the gap and saw Mau beneath; they did not want it, they said in their hundred voices, 'No, not yet', the sky said, 'No, not there.'

అన్న వాక్యంతో నవల ముగుస్తుంది. A Passage to India లోని కథ స్థూలంగా యిది. కానీ యిందులో కథే సర్వంకాదు. కథను మించిన విషయాలు ఎన్నో ఉన్నాయి.

ఈ నవల ఉద్దేశమేమిటో రెండవ అధ్యాయంలో స్పష్టంగా చెప్పబడింది. అజీజా, అతని స్నేహితులు ఒక విందులో "ఆంగ్లేయులతో స్నేహం సాధ్యమా కాదా?" అని చర్చిస్తారు. స్థూలంగా చెప్పాలంటే నవలలోని 'వస్తువు' అదే! అంటే వ్యక్తిగత సంబంధం (Individual relationship) దృష్టితో చూచినప్పుడు ఈ నవలకు మూలం అజీజా ఫీల్డింగ్‌ల స్నేహం. కథ, కథలో వచ్చే సన్నివేశాల ప్రయోజనం వారి స్నేహాన్ని వెలుగులోకి తీసుకు రావటమే! Adela పాత్ర, మరబార్ గుహలలో జరిగిన సంఘటన, చివర వచ్చే 'జన్మాష్టమి' ఉత్సవాల వర్ణన ఈ విషయాన్ని తర్కించటానికే ఉద్దేశించబడ్డాయి. ఈ నవలలోని రాజకీయాలు ప్రాసంగికం మాత్రమే.

సుప్రసిద్ధ విమర్శకుడు శ్రీ నీరద్ చౌదరి Encounter (జూన్ 1954) పత్రికలో— ఈ నవల భారతదేశానికి సరైన ప్రతిబింబంకాదని, అందులోని భారతీయులు భారతీయులవలె లేరని, భారతీయులకు ప్రతినిధిగా ఒక మహమ్మదీయుణ్ణి ఎంచుకోవటం తప్పని విమర్శించాడు. శ్రీ చౌదరి ఒక ముఖ్య విషయాన్ని విస్మరించాడని చాలామంది విమర్శకుల అభిప్రాయం. ఫార్‌స్టర్ ఒక్క భారతీయులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఈ నవల వ్రాయలేదు. దేశకాలాతీతమైన తన కథకు భారతదేశం తగిన రంగస్థలం అని భావించి ఎన్నుకున్నాడు.

అజీజా, ఫీల్డింగ్‌లను గురించి రచయిత చెప్పిన విషయాలు సర్వమానవ జాతికి వర్తిస్తాయి. మానవుడు సాటిమానవునికి ఎలా దూరమైపోతున్నాడో, జాతి, మతం, పాలక పాలిత భావం, సామ్రాజ్యవాదం ఎలా మనిషినీ మనిషినీ విడదీస్తున్నాయో చూపటమే ఫార్‌స్టర్ ఉద్దేశం.

శిల్పంలో అనవసరంగా వయ్యారాలు పోతున్న ఆధునిక నవలలతో పోల్చి చూచినప్పుడు A Passage to India చాలా సాంప్రదాయికంగా కనిపించవచ్చు. రచయితే కథను చెబుతూ, పాత్రలను ప్రవేశపెడుతూ వ్యాఖ్యానిస్తూ, ముళ్లు వేస్తూ. విప్పుతూ పోయే "పాత" పద్ధతికి చెందిన నవల యిది.

కానీ యిందులో ఎంతో లోతైన సంకేతవాదం వుంది. అది మనకు అడుగడుగునా దర్శనమిస్తుంది.

కథ మొత్తం భారతదేశంలోనే జరిగే ఈ నవలకు A Passage to India అన్న పేరుపెట్టటం లోనే ఈ ప్రభావం కనిపిస్తుంది. అంతేగాక నవల లోని అధ్యాయాలకు పెట్టిన Masque, Caves, Temple అన్న పేర్లు కూడా తాత్త్విక ప్రతీకలే! ఇలాంటి ప్రతీకలుగాక సాంకేతికసంఘటనలు ఈ నవలలో ఎన్నో వున్నాయి.

ఫీల్డింగ్ యిస్తున్న ఒక పార్టీలో ఆంగ్లేయులు, భారతీయులు ఎంతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వుంటారు. ఆ ఆనందం 'ఆంగ్లో యిండియన్' అయిన "రోనీ" రాకతో అంతర్థానమైపోతుంది.

ప్రొఫెసర్ గాడ్‌బోల్ శ్రీకృష్ణుణ్ణి గురించి పాడుతున్న పాటపైన అందరూ ఎంతో ఆసక్తి చూపుతుంటే 'రోనీ' పూర్తిగా పట్టించుకోడు. ఆంగ్లో యిండియన్ సమస్యను అభివ్యక్తం చేయటంలో ఈ రెండు సంఘటనలకూ ఎంతో సాంకేతిక ప్రయోజనం వుంది.

5

తన ఐదు నవలల్లో ఫార్‌స్టర్ సృష్టించిన పాత్ర లన్నింటిలోనూ శ్రీమతి మూర్‌ను మించిన సంకేతం మరొకటిలేదు. ఆమె హైందవ మార్మిక తత్త్వానికి సంకేతం. ట్రిల్లింగ్ అన్నట్లు ఆమె ఒక్కతే Indian racial secret ను అర్థం చేసుకున్న వ్యక్తి. కానీ ఆ పాత్ర ప్రయోజన మేమిటన్నది చాలామంది విమర్శకులు నేటికీ వేస్తున్న ప్రశ్న. ఏది ఏమైనా ట్రిల్లింగ్ అభిప్రాయం సత్యం. మరబార్ గుహలలో Ou boum అన్న (అది భారతీయుల ప్రణవ నాదమేనా?) ధ్వని మాత్రమే వినిపించటం, కారులో వెళ్తున్నప్పుడు ఎప్పుడో చనిపోయిన ఒక వ్యక్తి ప్రేతాత్మ ఆమెకు మాత్రమే కనిపించటం అందుకు తిరుగులేని ఉదాహరణలు.

అటువంటి శ్రీమతి మూర్‌కు హిందూ మహా సముద్రమే తగిన సమాధి.

శ్రీమతి మూర్ పాత్ర ఫార్‌స్టర్‌కు ఎంతో ప్రీతిపాత్రమైంది. Howards End లోని శ్రీమతి విల్‌కాక్స్ పాత్ర మరింత లోతుగా మార్మికంగా శ్రీమతి మూర్‌గా రూపొందింది.

ఫార్‌స్టర్ ప్రయోగించిన ప్రతీకలు ఒక్క A Passage to India లోనే చాలా చక్కగా నప్పి, ప్రయోజనాన్ని నెరవేర్చాయి.

ఇలా ఎంత ఆలోచించినా యింకా ఎంతో ఆలోచనకు అవకాశం యిచ్చే కావ్యం A Passage to India.

6

ఫార్‌స్టర్ నవలలను అర్థం చేసుకోవటానికి విమర్శకులకంటే నవలను గురించి ఫార్‌స్టర్ వ్రాసిన విమర్శ గ్రంథం Aspects of Novel ఎంతో చక్కగా ఉపకరిస్తుందని నా అభిప్రాయం.

"హెన్రీ జేమ్స్ నవలను గురించి వ్రాసిన గ్రంథాన్ని చదివాను. అది జేమ్స్‌లాగే నవలలు వ్రాయాలనుకున్న వారికి ఉపకరిస్తుంది. తర్వాత ఫార్‌స్టర్ Aspects of Novel చదివాను. ఇది కూడా ఫార్‌స్టర్‌లాగే నవలలు వ్రాయాలనుకున్నవారికే ఉపయోగిస్తుంది"- అని సామర్‌సెట్ మామ్ Summing up అన్న గ్రంథంలో ఈ అభిప్రాయాన్నే ఎంతో చమత్కారంగా చెప్పాడు. A Passage to India భారతదేశాన్నిగురించి సానుభూతితోనే వ్రాయబడిందని నా భావం. ఇలాంటిదే Hill of Devi కూడా. ఈ గ్రంథాన్ని శ్రీ రాజారావు The most Indian book of the century అని ప్రస్తుతించాడు.

ఫార్‌స్టర్ గొప్ప మేధావి. నిజమైన కళాకారుని కుండవలసిన నిష్పక్షపాతమైన మేధాశక్తి, గొప్ప కవితా శక్తి ఒకదాన్ని మించి మరొకటి కలిగినవాడు. ఫార్‌స్టర్ రచనలు హృదయానికీ బుద్ధికీ కట్టిన సేతువులు.

20వ శతాబ్దంలో మెరిడిత్ Social Comedy మార్గానికి ఫార్‌స్టర్ బహుశా ఏకైక ప్రతినిధి.

అన్నిటినీమించి భారతీయులైనమనకు పరమ మిత్రుణ్ణి, మన సంశ్లిష్ట నాగరికతను ఎంతో సానుభూతితో అర్థం చేసుకున్న మేధావిని, ఫార్‌స్టర్ మరణంతో మనం కోల్పోయాము.

అతని ఆత్మకు శాంతి కలుగుగాక.

జుత్తిగ "వాసుకి, రవి, సోమేశ్వరస్వామి" ప్రతిష్ఠాత లెవరు?

శ్రీ తురగా కృష్ణమూర్తి

"భారతి" (సంపుటం 46 సంచిక 4) లో "కరవాల భైరవ మణ్డపం" అనే వ్యాసాన్ని ప్రచురిస్తూ శ్రీ జి. ఆర్. వర్మగారు జుత్తిగ దేవాలయంలో ప్రతిష్ఠింపబడిన యీశ్వరునకు "వాసుకి రవి సోమేశ్వర" నామధేయం వచ్చుట కొక వింతయైన సమన్వయాన్ని సూత్రీకరించారు. ఈ "వాసుకి రవి సోమేశ్వర" అన్న పేరే కొంత వింతగా ఉంటే శ్రీ జి. ఆర్. వర్మగారు దానిని సమర్థించి చెప్పిన తీరు మరింత వింతగా ఉంది. వారి వాదనా సరళిలో డోలాయమాన ప్రవృత్తి ప్రస్ఫుటంగా కనపడుతోంది. ఇదమిత్థమని చెప్పదగిన సావకాశం ఆరచనద్వారా మనకు లభ్యం గావటంలేదు. శ్రీ జి. ఆర్. వర్మగారు దేవుని ప్రతిష్ఠించిన దెవరో చెప్పగల శాసనాధారం లేదంటూ తమ ఊహల సహాయ్యమున ఒక సిద్ధాంతాన్ని వెలార్చ ప్రయత్నించారు. అది చాళుక్య వీర విజయాదిత్యుడు నిర్మిన "కరవాల భైరవ మణ్డప" నిర్మాణమాధారంగా చెప్పబడినది.

దేవాలయ ముఖ మండపం 7 వ స్తంభంపై వి. రా. సం. 13 నాటి

"స్వస్తి సర్వలోకాశ్రయ
శ్రీ విష్ణువర్ద్ధన మహారాజుల ప్రవర్ద్ధమాన
విజయ రాజ్య సంవత్స
రములు 13 యవు నే
ణ్డు ఉత్తిక వాసికి ర
వి సోమీశ్వర దేవర
ముందట శ్రీ విజయాది
త్య జేవళ యెత్తించిన
కరవాల భైరవ మ
ణ్డపము యాచంద్ర తారము"

అన్న అసంపూర్ణ శాసనం ఆధారంగా శ్రీ జి. ఆర్. వర్మగారు యీ వీరవిజయాదిత్యుడు చాళుక్య రాజరాజ నృపతి సోదరుడని, అతనికే "కరవాల భైరవ" బిరుద మున్నందున యీ మణ్డపమునకు "కరవాల భైరవ మణ్డపం" అని తన పేరు పెట్టుకొన్నాడనీ, వీర విజయాదిత్యుని పేరులో సూర్య, రవి ఉన్నారనీ, ఈతని మంత్రి, మాండలికుడు, సేనానాయకుడు, బ్రాహ్మణుడైన భీమరాజు వాసుకి (నాగకుల) నాగ రాజులో వాసుకి ఉన్నాడనీ, వీరవిజయాదిత్యునికి సహాయ పడిన మిత్రుడు కళ్యాణి చాళుక్య సోమేశ్వరునిలో సోమేశ్వరు డున్నాడనీ, అందుచే జుత్తిగ దేవుని పేరు "వాసుకి రవి సోమేశ్వరుడ"ని తమ ముగ్గురి పేరున నామకరణంచేసి, వీర విజయాదిత్యుడు స్వామిని ప్రతిష్ఠించియుండెనా? అని ధ్వనియుక్తంగా ప్రశ్నిస్తూ అదే అత్యంతసంభవమన్న భావాన్ని మనకు అందించారు.

అయితే వారొక ముఖ్యమైన విషయాన్నిమరచి పోయారు యీ సందర్భంలో. వీర విజయాదిత్యుడు "కరవాలభైరవ మణ్డపం"నిర్మించే నాటికే ఆ దేవునకు "వాసుకి రవి సోమేశ్వర" నామధేయం ఉన్నందున, యీ పేరును వీర విజయాదిత్యుడు తన పేరున, తనహితుని పేరున, తనఅమాత్యునిపేరున స్వామికానామధేయముంచా రన్న ఊహాసేత అసంబద్ధమని తేలిపోతోంది! అయితే - స్వామి కీ వింతైన పేరు యెట్లా వచ్చింది? ఎవరు

ఎప్పు డీ దేవుని ప్రతిష్ఠించారు? అన్న సమస్యకు సమాధానం సాధించవలసి ఉంది.

స్థానికులు "వాసుకి రవి సోమేశ్వర" నాను కరణం నా రిచ్చట తపస్సుచేసి దేవుని ప్రతిష్ఠించడం వలన వచ్చిందనీ, లింగ ప్రతిష్ఠాత ఎవరో, ప్రతిష్ఠాపన ఎప్పుడు జరిగిందో తెలియపరచే శాసనాధారం మాత్రం ఏమీ లేదు" అని తెలిపినట్లు శ్రీ జి. ఆర్. వర్మగారు తెలియపరిచినారు. భక్తులు తపస్సుచేసి, తమ తమ పేరున స్వామిప్రతిష్ఠలు చేయడం క్రొత్తగాదు. శ్రీకాళహస్తీశ్వరుని వృత్తాంతాన్ని యెరిగివున్న వారి కీ విషయం వేరే చెప్ప నవసరంలేదు. అయితే—స్థానికులు చెప్పే "వాసుకి రవి సోమేశ్వరు"ని గూర్చి ఏకకాలంలో తపస్సు ఎందుకు చేయవలసివచ్చిందో, ఏ కారణంవల్ల వీరు మువ్వురు కలసి తమ పేరున యీశ్వరుని ప్రతిష్ఠింపవలసి వచ్చిందో తెలియదగు ఆధారాలు లేవు. ఆధారరహితమైన యీ విషయం యెంత విశ్వసనీయమో, హేతువాదబద్ధమో విజ్ఞులకు వేరుగా చెప్పవలసిందిలేదు. అందుచేత స్థానికులు చెప్పే యీ పుక్కిటి పురాణ గాథల్ని లెక్క గొనక, చారిత్రకంగా ప్రతిష్ఠాత లెవరో నిర్ణయించవలసి వున్నది.

నాగులు అనే జాతివారు అనాదినుండీ భారత వర్షంలో నివసిస్తూ, రాజ్యాలేలి, పేరు ప్రఖ్యాతులు గాంచినట్లు బహుఆధారాలవల్ల తెలియవస్తున్నది. ఈ నాగులు దేవయోనులుగా పురాణ కాలంనుండి వర్ణింపబడుతూ వస్తున్నారు. రామాయణంలో సుగ్రీవుడు సీతను వెదకుటకై హనుమదాదుల నియోగిస్తూ ఉరగుల (నాగుల) పట్టణమగు "భోగవతీ పురం"లో గూడా సీత జాడ కనుగొనమని ఆజ్ఞాపించినట్లు తెల్పబడింది. ఆ కాలాన "భోగవతీపురం" వాసుకిచే పాలింపబడుచున్నట్లు చెప్పబడింది. ఆ "భోగవతీ పురం" ఇప్పటి వస్తర లేక బస్తరు రాజ్యము లోనిదని చరిత్రజ్ఞులు తెలుపుచున్నారు.

నేటి అస్సాం సమీపమందలి మణిపురము నందుండియే ఈ నాగవంశజులు కాలక్రమాన దక్షిణా పథాన్ని చేరి, ఆంధ్రవిష్ణువు కాలం నాటికి అనగా క్రీస్తుకు పూర్వమే బౌద్ధమతస్థులై ఉభయ సింధు ప్రదేశవాసులైనారు. అందుచేతనే బౌద్ధ వాఙ్మయంలో యెక్కడ చూచినా వింధ్యకు దక్షిణంగా వున్న జనావాసప్రదేశానకు "నాగ భూమి"యన్న పేరు ప్రసిద్ధమైనట్లు కనిపిస్తోంది. సాతవాహనుల కాలంలో ఈ నాగులు "సింహళద్వీప" వాసులైనట్లు, ఆ ద్వీప చరిత్ర ఉద్ఘాటిస్తోంది. ఆ తరువాతి కాలంలో గూడ నీ నాగవంశజులలో కొందరు మహారాజులై దేశమేలారు. మరికొందరు మహామంత్రులుగా వుండి కార్య, ఖడ్గాల్ని నెరపారు. మరికొందరు సేనాయకులుగను మాండలికులుగను ప్రఖ్యాతి నొందారు. ఇట్లు వివిధ కాలాల్లో, వివిధ ప్రదేశాల నాక్రమించుకొన్న వీరు తామందరమును "క్యాశప గోత్రుల"మనీ, "నాగధ్వజుల"మనీ, సింహ లాంఛనులమనీ" "వాసుకి" వంశజులమనీ చెప్పుకుంటూ వచ్చారు.

పదకొండవ శతాబ్ద ప్రథమార్ధంలో ఈ నాగ వంశానికి చెందిన జగదేక భూషణ ధారావర్ష మహారాజు వస్తర రాజ్యంలోని చక్రకోట్యమండలాన్ని పాలించాడు. ఈతడు వేంగీశ్వరుడైన తూర్పుచాళుక్య రాజరాజునకు, అతని పుత్రుడు రాజేంద్రచోళుడనే నామాంతరం కల్గిన కులోత్తుంగచోడచక్రవర్తికి సమకాలీనుడు. ఈ చక్రకోట్యమండలానికి రాజధాని "చక్రకోట్యమే." "చక్రకోట్య"మే "చక్రకూటం" "చిత్రకూటం" అని కూడా వాడబడుతోంది. ఇప్పటి బస్తరుప్రాంతంలో యింద్రావతి నది ఒడ్డున యీ చిత్రకూటనగరం ఉంది. పూర్వం చక్రకోట్యంగా ప్రసిద్ధికెక్కి చిత్రకూటరాజ్యం అనే నామాంతరమున బరగుచు యీ రాజ్యం దక్షిణకోసల, చేది రాష్ట్రలకు, కళింగాంధ్రదేశాలకు నడుమ ఉంది. దీని కిప్పటి రాజధాని "జగదళపురం".

ధారావర్షుడు చక్రకోట్యమండలాన్ని పాలించు చున్న కాలంలో "భ్రమర కోట్య మండ"లాన్ని మధురాంతకదేవుడనే నాగరాజు, ధారావర్షుని సామంతునిగానో లేక స్వతంత్రుడుగానో పరిపాలన నెరపాడు. తదితర నాగవంశోద్భవులైన చక్రకూట రాజుల వలెనే, మధురాంతకదేవుడున్నూ తాను నాగ వంశోద్భవుడననీ భోగవతీపురవరాధీశ్వరుడననీ, వ్యాఘ

లాంఛనుడననీ, వాగధ్వజిననీ, మహేశ్వర పాదారాధకుడననీ ప్రకటించుకొన్నాడు.

వేంగీశ్వరుడైన రాజరాజు క్రీ. శ. 1022 వ సం. లో వేంగీ సింహాసనాన్ని అధిష్ఠించి పాలన సాగిస్తూవుండగా, అతని సవతి తమ్ముడు వీర విజయాదిత్యుడా రాజ్యాన్ని బల్మిమై ఆక్రమింప రాజరాజు ప్రత్యర్థులతో కూడి పన్నాగాలను పన్నుతూ వచ్చాడు. కుంతల చాళుక్యులకు, చోళ భూపతులకు గల సహజవైరంవల్ల చోళభూపాలకుని అల్లుడైన రాజరాజుపై గూడ కర్ణాటచాళుక్యులు స్పర్థవహించి సమయము వచ్చినచో వేంగీ సింహాసనాన్ని గూడ ఆక్రమింప నుద్యోగిస్తూ వచ్చారు. అట్టి యెడ యేక క్రియాపేక్షులగు వీరవిజయాదిత్య కుంతలచాళుక్య ప్రభువులు మిత్రులై రాజరాజునకు చీకాకు కల్గింప ప్రయత్నిస్తూ అతనిని పదవిచ్యుతుణ్ణి చేయ నుద్యమించుచుండిరి. అందుచే రాజరాజుపై నాతని సామంతుల నుసికొల్పి, రాజ్యంలో అల్లకల్లోలం రేకెత్తింప తీవ్ర కృషి చేయ నారంభించారు.

కళ్యాణి చాళుక్య ప్రభువు "ఆహవమల్లుడు" చోళ దేశ దండయాత్ర దిగ్విజయముగా సాగించి, తన రెండవ కుమారుడు, అతి చండ పరాక్రమ శాలి కుమారవిక్రమాదిత్యుని వేంగీ సామ్రాజ్యంలో విద్రోహాల్ని పురికొల్పి రాజరాజదేవునకు క్లేశాన్ని కల్పింప నియమించాడు. కుమార విక్రమాదిత్యుడు సైన్య సమేతుడై, చక్రకూట రాజ్యాన్ని జయింప ఉత్తరాభిముఖుడై పోయి, మిత్రభేదోపాయమున ఆ రాజ్యాన్ని స్వాధీనపరచుకొని, ఆ రాజ్య మేలుచున్న ధారావర్షుని వేంగీశ్వరునిపై తిరుగుబాటు చేసి స్వతంత్రుడై పరమేశ్వరత్వమును ప్రకటించుకొనునట్లు పురికొల్పి వెడలిపోయాడు. ధారావర్షుడు వేంగీశ్వరునిపై తిరుగబడిన వేళకు, త్రైలోక్య మల్లుడు తన కర్ణాట సేనల్ని ఆంధ్రదేశంమీదకు దండయాత్ర చేయ బంపాడు. ఈ దండయాత్ర వీర విజయాదిత్యుడు వేంగీరాజ్యాన్ని హస్తగతం చేసుకొనుటకు యేర్పాటు చేయబడింది. ఇట్లు రాజరాజు విరుప్రక్కలనుండి దాకి, చీకాకు పరచి, పరాజితుణ్ణి చేసి, వేంగీ సింహాసన మాక్రమించే తలంపుతో కుంతలచాళుక్య ప్రభువు యత్నించుచున్న వేళ స్వలాభాపేక్షులై వీరవిజయాదిత్య, ధారావర్ష దేవులు స్వామి ద్రోహాన్ని తలపెట్టారు.

రాజరాజు తనపై నెత్తి వచ్చిన కర్ణాట సేనల నెదుర్కొన నిశ్చయించి, ధారావర్షుని శిక్షించడానికి తన కుమారుని రాజేంద్రచోళుని చక్రకూటరాజ్యం మీదికి దండు పంపాడు. రాజేంద్రచోళుడు చంద్రాదిత్యుడను తెలుగు చోడ నాయకుని సాహాయ్యమున చక్రకూట రాజ్యంపై దాడిచేసి, ధారావర్షుని జయించి, చంద్రాదిత్యునందు నిల్పి, జయపరంపరలతో వేంగీ ముఖాభిగతు డయ్యాడు. రాజేంద్రచోడుడు చక్రకూట రాజ్యంలో విజయ పరంపరలు గొనుచున్న తరుణంలో రాజరాజు కుంతల చాళుక్య సైన్యములతో విజయమో వీరస్వర్గమో యన్న పట్టుదలతో వేంగీ స్థలిలో యుద్ధం సాగించాడు. రాజరాజదేవుని దురదృష్టవశమున ఆనాటి యుద్ధములు సమయుద్ధములుగా పర్యవసించాయి. చివరకు రాజరాజు కూడ యుద్ధరంగంలో గూలి, వీరస్వర్గ మలంకరించాడు. రాజరాజిట్లు తన బలాన్ని కూడదీసుకొని, కర్ణాటక సేనల్ని మార్కొని యుద్ధం చేస్తుండగా, అతని సవతి తమ్ముడు వీరవిజయాదిత్యుడు రాజమహేంద్రవరాన్ని, వేంగీరాజ్యాన్ని బలాత్కారంగా ఆక్రమించుకొన్నాడు. రాజరాజేంద్రుని మరణం క్రీ. శ. 1061 వ సంవత్సరం నడిమి కాలంలో సంభవించింది. ఆనాటికి వీరవిజయాదిత్యుడు తన్నెదిరించిన రాజరాజు పక్షము వారినెల్ల నోడించి, వేంగీ సింహాసనము ఆక్రమించుకొన్నాడు. దూరదేశంలో కుమారరాజేంద్రచోడుడు చక్రకోట్యమండల దండయాత్రానిమగ్నుడై వుండటం వీరవిజయాదిత్యదేవున కనుకూలించి, రాజ్యప్రాప్తి నొనగూర్చింది.

చక్రకూటాధీశ్వరుణ్ణి సాధించినపిదప, వేంగీ యువరాజు రాజేంద్రచోడుడు "వజ్రఖడం"నుండి అసంఖ్యాకాలైన మదపుటేనుగులను పట్టుకొని వేంగికి తరలించుకొనివచ్చాడు. తండ్రి రాజరాజనరేంద్రుడు యుద్ధరంగంలో మరణించడం పితృవ్యుడు రాజ్య

కాంక్షతో వేంగీ సింహాసనాన్ని ఆక్రమించి, పుత్రప్రేమ వల్ల "ఇమ్మడి శక్తివర్మను" అభిషేకించడం చెవినిబడిన వెంటనే రాజేంద్రచోడుడు విచలితుడైపోయాడు. వేంగిని ప్రవేశించి చూచునరి కప్పటి పరిస్థితి అతనికి ప్రాణసంకటంగా కన్పించింది. దైవవశం చేత చేజారిన పైతృక రాజ్యాన్ని మరల పొందవలెనంటే వీర విజయాదిత్యు నెదిరించి పోరి జయం గాంచాలి. వీర విజయాదిత్యునితో పోరవిన ఇటు కళింగభూపతుల తోను, అటు కర్ణాట భూపతులతోను వైరం పెంచు కొనడమే అవుతుంది. అదీగాక వేంగిపై ఎత్తి వచ్చిన కర్ణాట సేనలింకా వేంగి భూభాగం మీదే ఉండిపోయాయి. అట్టి పరిస్థితుల్లో పినతండ్రితో వైరం దక్షిణాపథంలో తన కొక్క మిత్రుడైనా లేకుండా చేయు ప్రమాదం తెచ్చిపెట్టే పావకాశం వుంది. అదే సమయంలో చోళభూపతి రాజేంద్ర దేవుడు యుద్ధరంగంలో మరణించాడు. చోళ సామ్రాజ్యానికి రాజేంద్ర చోడుడే వారసుడయ్యాడు. చోళసింహాసన మధిష్ఠింప నిచ్చగించి రాజేంద్ర చోడుడు పినతండ్రితో మైత్రి పాటించి వేంగీ సింహాసనాన్ని పితృవ్యునకిచ్చి చోడదేశానికి వెళ్లిపోయాడు.

ఈ విధంగా క్రీ. శ. 1061 వ సంవత్సరంలో చక్రకోట్యమండలాన్ని వేంగీ సామంతుడైన ధారావర్షుడు పాలనం నెరపుతూ వుంటే, రాజేంద్ర చోళుని సేనాని చంద్రాదిత్యుడు "వరశూర పట్టణం" రాజధానిగా ఆ మండలంలోనే స్వతంత్ర ప్రతిపత్తితో నొకచోట ప్రభుత్వం నెరపుతూ వుంటే, మధురాంతక దేవుడు భ్రమరకోట్యమండలంలో రాజ్య పాలన సాగిస్తూ వచ్చాడు. వేంగీసింహాసనంపై వీర విజయాదిత్య దేవుని కొమరుడు ఇమ్మడిశక్తివర్మ పాలన సాగించాడు.

రాజరాజు మరణానంతరం రాజేంద్రచోడుడు చోళరాజ్యాభిలాషియై కాంచీపురం పోవుటతో, వేంగీ సింహాసనం వీరవిజయాదిత్యుని పాలబడింది. ఇమ్మడి శక్తివర్మ క్రీ. శ. 1061, 1062 సంవత్సరములు వేంగీరాజ్యపాలన నెరపుచుండ, శత్రు సేనలాతనిపై దండెత్తి వచ్చి, రణస్థలిలో నాతని తెగటార్చాయి. పుత్ర శోకాకులుడైన వీరవిజయాదిత్యుడు దుఃఖక్లేశజరాభారములచే కృంగియున్నా, విబుధులు కులక్రమాగతులైన ఆప్తులు పలు మారు బోధించడం వలన ప్రజాహితం కోసం, ధర్మ సంస్థాపనార్థం మరల సింహాసన మెక్కి, వేంగీ సామ్రాజ్యాన్ని పాలింప నుద్యుక్తుడయ్యాడు.

అట్లు క్రీ. శ. 1063 వ సంవత్సరం అనంతరం నుండి వీరవిజయాదిత్యుడు వేంగీ రాజ్యాన్ని పాలించే కాలంలో చక్రకోట్య మండలంలో రాజకీయ పరిణామాలు కొన్ని సంభవించాయి. రాజేంద్రచోడుడు కాంచీపుర సింహాసనాభిలాషియై దక్షిణానికేగిన పిదప, వీరవిజయాదిత్యుడు శత్రువులతో నిత్యం రణవ్యాపార నిమగ్నుడై సతమతమవుతూ వున్న సమయంలో, త్రిపురి కాలచుర్యులు, కళింగగాంగభూపతులు విరామ మెరుగక వీరవిజయాదిత్యునిపై గవిసి అలయించు చుండుటను గాంచి, ధారావర్షుడు విజృంభించి, వేంగీ చాళుక్యునకు సామంతుడుగా నుండ నిచ్చగింపక స్వతంత్రత ప్రకటించి, ఆతనికి ప్రతినిధిగా నిల్చిన చంద్రాదిత్యునదిమి, వశంవదునిగా చేసికొని యాతని తనకు సామంతునిగాను, సేనానిగాను నియమించి పాలన సాగింప ప్రారంభించాడు.

ధారావర్షుడు వయోవృద్ధుడై పసివెడి యున్న సమయము చూచి భ్రమరకోట్య మండలాధిపతి మధురాంతకదేవుడు చక్రకోట్యమండలంపై బడి ఆ రాజ్యాన్ని ఆక్రమించి పాలింపసాగాడు. ఆతని ఔద్ధత్యాన్ని ధారావర్షుడు అడ్డుకొనలేక మిన్నకుండిపోయాడు. ఈ విజయదర్పంతో మధురాంతకుడు క్రీ. శ. 1065 వ సంవత్సరంలో భ్రమరకోట్యమండలం లోని "రాజపుర" గ్రామాన్ని మేడిపాత్రుడనే బ్రాహ్మణునకు ధారాపూర్వకంగా దానం చేసాడు.

ధారావర్షుడు చనిపోయిన పిదప, అతని పుత్రుడు సోమేశ్వరుడు మధురాంతక దేవుని, యెదుర్కొని, జయించి, యుద్ధరంగంలో చంపి, మహారాజాధిరాజ,పరమభట్టారక,పరమమాహేశ్వర, సోమేశ్వర దేవుడను పేరుతో సింహాసన మెక్కాడు.ఈ విజయాన్ని చాటించు "కృష్ణపుర శాసనం"లో సోమేశ్వరుడు తాను నాగవంశజుడననీ, కశ్యపగోత్రుడనని

వింధ్యవాసినీదేవత యొక్క యనుగ్రహం వల్ల చక్రకూటరాజ్యాధిపత్యాన్ని లభింప చేసుకొన్నాననీ చెప్పుకొన్నాడు.

నాగరాజులలో మహాబలశాలియైన ఈ సోమేశ్వరుడు, నారాయణుడు మధురాక్షసుని నిర్జించిన విధాన మధురాంతకదేవుని నిర్జించి "పిన్న నారాయణు" డన్న బిరుద నామం వహించి, ఆటుపిమ్మట శత్రువర్గం వైపు దృష్టి మరలించాడు. ఆకాలంలో భూపాలనం చేయుచున్న రాజులు మత్సరగ్రస్తులై ఒండొరుల జయించి, వారి రాజధాని నగరాల్ని దహించడమే ఘనకార్యంగా ఎంచి ప్రశంసించు కొనుచుండేవారు. అట్లనే సోమేశ్వరుడు విజృంభించి శత్రురాజధానులగు కళింగనగరం, రత్నపురం, లవణపురి, వేంగీనగరం, భద్రపట్టణం, వజ్రపురం మొదలైన వాటిని ముట్టడించి, జయించినాడు. వేంగీ దేశంపై దండెత్తి వచ్చి, జయలక్ష్మిని వరించి, విజయచిహ్నంగా వేంగీపురం దహించి నట్లు స్వోత్కర్షగా "కృష్ణపుర శాసనం"లో వర్ణించుకొనియున్నాడు. (Ep. Ind. Vol. X No 4). ఈ వేంగీ విజయం క్రీ. శ. 1065 తరువాత జరిగివుండాలి. అంటే ఇమ్మడి శక్తివర్మ మరణించిన వెనుక, వీరవిజయాదిత్యుడు వేంగీరాజ్యాన్ని పాలిస్తున్న కాలంలో అని చెప్పాలి.

ఈ విజయ యాత్రలలో సోమేశ్వరునకు చంద్రాదిత్యుడు చేదోడుగా నిలిచి కార్యభద్రాల్ని నెరపాడు. నాగరాజగు సోమేశ్వరుడు వేంగీరాజ్యాన్ని జయించి మరలిపోయేటప్పుడు విజయ చిహ్నంగా వేంగీ సామ్రాజ్యాంతర్గత పానారసీమలోని యీ జుత్తిగ గ్రామంలో తన వంశ మూలపురుషుని (వాసుకి) పేరున, తన సేనాని చంద్రాదిత్యుని పేరున (రవి), తనపేరున (సోమేశ్వరుడు) స్వామిని ప్రతిష్ఠించి "వాసుకి రవి సోమేశ్వరు"డని నామకరణం చేసి ఆలయాదులు నిర్మించాడు. ఆ నిర్మాణ కాలంలో వేయించిన శాసనం మరుగుపడి వుండాలి. ఆలయం కాలక్రమేణా శిథిలావస్థలోనికి రాగా ఆయా కాలాల్లో ప్రభుత్వం నెరపు ప్రభువులు పునరుద్ధరించి నిర్మించడం జరిగింది. శ్రీ జి. ఆర్. వర్మగారు నుడివినట్లు యీదేవాలయ నిర్మాణం తొమ్మిది శతాబ్దాలకు పూర్వం జరిగినదన్నమాట యదార్థమనే చెప్పాలి. ఎందుచేతనంటే నాగరాజు సోమేశ్వరుడు యిప్పటికి తొమ్మిది వందల సంవత్సరముల క్రిందటి వాడు గనుక, ఆలయ నిర్మాణం లింగప్రతిష్ఠ ఆతని వలననే జరిగింది గనుక.

ఇందులో ఇంకొక విశేషం కూడా వుంది. ఈ నాగరాజులకు కులదేవత "దంతేశ్వరి". ఈ "దంతేశ్వరి"నే "మాణిక్యదేవి". యని కూడా పిలుస్తారు. సోమేశ్వరుడు తన కులదైవతమగు "దంతేశ్వరి" పేరుననే ఆలయంలోని అమ్మవారిని ప్రతిష్ఠించి వుండాలి. అయితే ఆ "దంతేశ్వరి" జనవాడుకలో "దూతేశ్వరి"గా మారి చివరకు "దూతిక" రూపంలో నిలిచిపోయి వుండాలి. ఈ ఆలయంలో అమ్మవారి పేరు "దూతిక" అనే విషయం సర్వాంగీకారాన్ని పొందిన విషయమే! ఆ తరువాత తరువాత దేవళములు శిథిలములైన కాలంలో భక్తులు, పునరుద్ధరణ కార్యక్రమాల్ని చేపట్టినపుడు చిరుదేవళాల్ని నెలకొల్పడం, పరివార దేవతల్ని ప్రతిష్ఠించడం లాంటి కార్యాల్ని నెరవేర్పడం జరిగివుంటుంది. ఇప్పటికీ ఆలయాదులు లేకుండా భైరవాది విగ్రహాలు యింకా అలా పడివున్నట్లు శ్రీ జి. ఆర్. వర్మగారు తెలుపనే తెల్పుచున్నారు. "దూతిక" ప్రాచీన కాలంనుంచీ అమ్మవారుగా పూజింపబడుతూ వచ్చి వుండాలి. పునరుద్ధరణ కాలాల యందు యెడనెడ ప్రతిష్ఠింపబడుతూ వచ్చిన విగ్రహాలలో ఉమా, పార్వతీ విగ్రహాలు కూడా స్వామి ఆలయంలో చేర్పడంతో సమ్యత్వం ఆపాదింపబడినట్లుయింది.

శ్రీ జి. ఆర్. వర్మగా రూహించినట్లుగా "వాసుకి రవి సోమేశ్వర" స్వామి ప్రతిష్ఠాత చాళుక్య వీరవిజయాదిత్యుడు గాక, నాగరాజగు మహారాజాధిరాజ, పరమ భట్టారక, పరమమాహేశ్వర రాజభూషణ సోమేశ్వర మహారాజగుట గమనార్హం. నాగరాజగు సోమేశ్వరుడు మహేశ్వర పదపద్మారాధకుడు గావున యీశ్వర ప్రతిష్ఠ గావించినాడు. ఈ ప్రతిష్ఠాపన క్రీ. శ. 1065—1075 మధ్యకాలంలో జరిగింది. అందువల్లనే చాళుక్య వీరవిజయాదిత్యుడు తన పేర కరవాల భైరవమణ్డపాన్ని విజయరాజ్య సంవత్సరములు 13 నాటికి (క్రీ. శ. 1074) నిర్మించే నాటికే అచట ఈ "వాసుకి రవి సోమేశ్వర స్వామి" వెలసియున్నట్లు రూఢీ అవుతోంది.

లేఖలు:

'ఆంధ్ర ప్రబంధములలో గ్రంథ గ్రంథులు'

ఆర్యా!

పై శీర్షికతో "భారతి" —70 జనవరి వ సంచికలో శ్రీ కఱ్ఱి సాంబమూర్తిగారి వ్యాసము ప్రచురితముకాగా, ఆ గ్రంథులను విప్పుటకై మరల శ్రీ బండి నాగరాజుగారు మే, 70 భారతి సంచికలో నొక వ్యాసము వ్రాసినారు. మరల నిది దానిపై విమర్శకాదు. కాని చర్విత చర్వణముగా విషయ నివేదనము మాత్రమేనని మనవి చేయుచున్నాను.

శ్రీ బండి నాగరాజుగారు, శాస్త్రిగారి గ్రంథులను చిక్కు దీయుచునే పాఠకుల కొకింత చిక్కు కల్గించినారని నా యుద్దేశ్యము. ఎట్లనగా, "పల్కక యుండు" అను భారత ప్రయోగ వివరణలో శాస్త్రిగారి 'పల్లకయుండు' సరికాదు; దాని వ్యవహారమిట్లు; అని చెప్పుటలో కాస్త ప్రాంతీయతా వ్యవహారము చక్కగా తెలుపలేదు. శ్రీకాకుళము, గంజాము జిల్లాలలోనే కాక, రాయలసీమనడిబొడ్డైన కర్నూలు జిల్లా ప్రాంతమున కూడా, నాటి భారత ప్రయోగానికి మిక్కిలి సన్నిహితమైన వ్యవహారము 'పలగ్గాకు, పలక్కుండి' 'పలగ్గాకండి' అని 'పల్కక ఉండు' పదానికి మారుగా నేటికీ ఉన్నది. పద ప్రయోగ వివరణార్థము, విషయావబోధనమున కొకటి రెండు ప్రాంతముల వ్యవహారశబ్దమే ఉదాహరించుటకన్న నెట్టిది మేలని మనవి.

ఇకపోగా "యువ సైంధవంబు" అను నుద్యోగ పర్వ వచనములోని తిక్కన ప్రయోగ వివరణము: ఇది రెండు విధముల నర్థ వివరణమునకు తగియుండుటను శాస్త్రిగారుకానీ, నాగరాజుగారుకానీ గమనించలేదు. ఆనంద ముద్రాక్షరశాల వారిచే ముద్రింపబడి 1908 వ సం॥ న శ్రీ తంజనగరం తేవప్పెరుమాళ్లయ్యగారి పరిష్కరణముతో వేమూరు వేంకటకృష్ణమసెట్టి అండ్ సన్స్‌వారిచే ప్రకటించబడిన ఉద్యోగ పర్వమున నిదే వచనమున "సులభ యువన సైంధవంబును" అని గలదని అస్మన్మిత్రు డుదాహరించినాడు. నాటి భారత యుద్ధమున 'యువన' సేనా సహాయమున కొక భాగము కలదని భారతమే తెలుపుచున్నది. బహుశా యీమానము యువనసైంధవములు భారత దేశమున కమ్మకమునకు వచ్చెడివేమొ! విరళముగా! నాటి సాంఘిక స్థితిని కొంత గుర్తించవలయును. ప్రథమ ముద్రారాక్షసముగా 'న' అదృశ్యమయి యుండనగు. సాంప్రదాయముగా 'యువ సైంధవము' అనియే వచ్చుచుండును కూడ: ఇది 'సంబంధ వర్జిత' దోషము కావచ్చునన్న శంకకాస్కారము కూడ లేదు. అది తత్సంబంధము కలదే కదా! ఫల సమృద్ధి, ధాన్య ప్రపూర్ణత, హయప్రవృద్ధిం యుద్ధావసరములే! శాస్త్రిగారి యూహ సరియైనదే అయినను, దీనినలె సమీపముకాదు. నాగరాజుగారు కూడా యీ యూహను విస్మరించినారు.

పోగా 'ఉర్విరాల' విషయమునను: దీనికి నిపాతార్థమే శరణ్యమయి యుండగా ఏకాగ్రతగా విషయ వివరణం చేయుటం అనవసరం. వర్షాకాల వర్ణనమిది: పద్యకర్త వికటకవి. అతని హృదయము నిరంకుశము. 'అద్రి గ్రావము లుర్విరాలు చుండగా బలిఘోషాడంబరములు వియోగిద్రోహం బొనరించుచుండగా......వర్షాకాలం వచ్చిం"దనే అతని హృదయం; మన శంకలు కావలెనని మాత్రం కాదు. దీనిని సాగదీయకుండవలసినది నాగరాజుగారు అని నా మనవి. విజ్ఞులు ఆలోచింతురుగాక!

—విద్వాన్ సుమశ్రీ.

* • *

జనవరి 70 'భారతి'లో ఆంధ్ర ప్రబంధములలో 'గ్రంథ గ్రంథులు' అన్న శీర్షికతో శ్రీ కఱ్ఱి సాంబమూర్తిగారు ప్రచురించిన వ్యాసమున కొన్ని సుగమములైన ప్రయోగములను గూడ

గ్రంథ గ్రంథులుగా భావించి వివరింప బ్రయత్నించి రనియు, వారు ప్రదర్శించిన గ్రంథ గ్రంథులం గూర్చి తాము నేర్చినయట్లు కొంత మనవి చేతుమనియు ఉచితజ్ఞులను మన్నింపవేడి, 1. పల్కకయుండు, 2. కలప్పాది, 3. ప్రేమన్నభోవాహినీ, 4. పల్కు లొండొంటికి, 5. యుపసైంధవంబు, 6. ఉర్వి రాల ...ఘోషాడంబరంబుల్, 7. ప్రథమ జామాత, 8. కన్నేలు కాఁదారి, 9. సానిపెండ్లి, 10. ధరణీ ధరపత్ని మనసు దైన్యము ముంచెన్, 11. పట పల్లవంబులు అను పదునొకండు ప్రయోగములను పునఃపరిశీలనముచేసి పెద్దలు చేసినది పెరుమాళ్లు చేసినదని యుపేక్షింపక మే 70 'భారతి'లో బండి నాగరాజుగారు సాంబమూర్తిగారి శీర్షికమీఁదనే వ్యాసమును ప్రకటించి గ్రంథ సందోహమున కాలాంతరమున గ్రంథు లేర్పడిన రీతిని వివరించి, భాషా ప్రియులైన ఆంధ్రావళికిఁ బ్రమోదమును గూర్చిరి. వారికి నా ధన్యవాదములు.

శ్రీ బండి నాగరాజుగారెత్తి చూపిన పూర్వోక్త పద ప్రయోగములలో నాల్గవదియైన "పల్కు లొండొంటికి" నన్న ప్రయోగ సందర్భముపై సాగించిన చర్చ శాస్త్రిగారిదేగాక నాగరాజుగారిదికూడ 'సరిపడిలేదు'. అట్లగుట నాకుఁ దోచిన విషయములు భాషావిదుల ముందుంచుట సాహసమయినచో మన్నింతురుగాక!

4. పల్కులొండొంటికి

భట్టుమూర్తి కావ్యాలంకార సంగ్రహమను నామాంతరముగల 'నరస భూపాలీయము'న గ్రంథాది కృత్యములయందు— నరసభూపాలుని కృతి నాయకుని చేయబూని, 'రవి వంశాధీశ్వరుం డీ నృసింహ భూపాలాగ్రణి కీర్తి వర్ణనము' (1—28) నకు మున్నుగా, కృతి నాయక ప్రాముఖ్యమును తెలుపు సందర్భమున ఈ పద్యము చెప్పెను.

సీ. రామాయణాదిక గ్రంథంబు లనవద్య
నేతృవర్ణనల నన్నియకు నెక్కె
వైశేషికాది నానా శాస్త్రములు శివ
ప్రతిపాదనమున సన్నుతి వహించె
సంధ్యాది మంత్రముల్ శక్త్యదీశ్వర నామ
జప సాధనత ననశ్వరములయ్యెఁ
బలుకు లొండొంటికిఁ బ్రామిన్కులను బర
బ్రహ్మ గోచరములై ప్రణుతిఁ గాంచె
—కావ్యాలం. సం. 1—24.

"ఇందలి "పలుకు లొండొంటికి" అను మాట పూర్వాపరములకు అనువు పడి అన్వయింపకున్నది. ఇది భట్టుమూర్తి చెప్పిన 'సంబంధవర్జితము' (IV. 40) అను వాక్య దోషము. ఈ దోషమును శాస్త్రిగారు సవరించినారు. కాని "పల్కు లొండేటికి" అని సవరించుటవలన 'భిన్న వచన దోషము' (IV. 38) ఏర్పడ లేదా? పల్కులు బహు వచనము. ఒండు—ఏక వచనము. కాబట్టి 'పల్కొకండేటికి' అని యుండదగునేమో? పలు పల్కు లేటికి, పలుమాట లేటికి, పలుకులు వేయేల—ఇత్యాదిగాను సవరణలు సూచించవచ్చును. కాని లిఖిత ప్రతులు సంప్రతించనిదే స్వతంత్రించి సవరణలకు పూనుకొనరాదు" అని వ్రాసిరి.

'పల్కు లొండొంటికి" అన్న యీ ప్రయోగ చర్చయందు నాగరాజుగారు సీసమును మాత్ర ముదాహరించి గీతమును చెప్పక పోవుటచే జిజ్ఞాసువుల కన్వయ సౌలభ్యము సద్యోనిర్ణయము కలుగుట కాటంక మొదవుటయేగాక తమ వాదమే బలమై సమంజసముగ నున్నట్లు తోపజేయుచున్నది. ఈ సందర్భమున ముఖ్యముగ చెప్పదలచుకొన్నదంతయు రామరాజ భూషణుఁడా గీతములోనే—

"తే. ననినఁ గావ్యం బమేయ నాయక వికస్వ
ర స్వరూప నిరూపణ భ్రాజియగుట
వేఱ వివరింపనేల బంగారమునకుఁ
జటుల సౌరభ్య లహరి యబ్బుటయ కాదె!"

అని చెప్పి తన హృదయము నావిష్కరించి యుండెను. ఇట్లు కవి చెప్పిన దానిని సంపూర్ణముగ

గైకొని యుండరి ఔచిత్య విచార చర్చ చేయక అంగాంగములు ఖండించి యన్వయించికొనిన నాగరాజగారు "శాస్త్రిగారు సుగమములైన ప్రయోగములను గూడ గ్రంథ గ్రంథులుగ భావించి వివరింప యత్నించి"రని తాము చేసిన దేమి? ఇంటివద్దకు వచ్చిన యాచకునిఁ బొమ్మని చెప్పుటకు కోడలి కధికారము లేదని, పోయిన వానిని రారమ్మని పిలిచి, అత్తను, పెత్తనము నాది, నేను చెప్పుచున్నాను, పొమ్మని నట్లున్నది.

ఎట్లన;- 5 వది యైన 'యవసైంధవ' వాక్య ప్రయోగ వ్యాఖ్యానమున–"...క్షమాసంబు సౌమ్యంబై శీతోష్ణంబులు లేక పుష్పఫలోపేతంబును సమగ్ర ధాన్యంబును, సులభ యవసైంధవంబును నగుచు నొప్పియున్న యది; యేడెనిమిది దివసంబులకు నమావాస్య వచ్చు నది పుణ్యదినంబు నాడు భండనంబు గావలయును..." (ఉద్యోగ IV. 49) నని యిచ్చిన యుదాహరణము క్రింద—

"ఈ వచనములోని 'యవసైంధవంబు' సందర్భమునకు సరిపడిలేదు. యవలు ఒక రకపు ధాన్యము. సమగ్ర ధాన్యంబును' అని ముందే చెప్పి మరల ధాన్య వాచకమగు యవలను పేర్కొనుట యనుచితము" అని శాస్త్రిగారి 'యవసేంధనంబు' అన్న సవరణము నంగీకరించియు, 'ఈ పాఠమెక్కడిది? వ్రాతప్రతులలోనిదా? శాస్త్రిగారు ఊహించినదా? అని పృచ్ఛ సేసిరి. కాని, నాగరాజగారు "వేఱ వివరింపనేల" యని వెనువెంటనే గీతమునఁ జెప్పబోవుచు సీసమున సమానార్థ బోధకంబగు మఱియొక వాక్యమును పునరుక్తి భూయిష్ఠముగ' 'హనుమత్ప్రసాదలబ్ధ కవితా సారుండును, సారస్వతాలంకారుండును, నిరంకుశ ప్రతిభా బంధురుండును, ప్రబంధ పఠన రచనా ధురంధరుండును, నిరుపమావధాన శారదామూర్తియునైన మూర్తికవి యద్దాని 'ససంబద్ధముగ ప్రయోగించియుండునా?' యని యైన నాలోచింపక, సీస పద్యముక్రింద చూపిన చొప్పున 'యుచితమని' తోప......'శాస్త్రిగారు 'పల్కు లొండేటికిఁ' అని సవరించుటవలన......"కాబట్టి 'పల్కొండేటికి' 'పలు పల్కు లేటికి'....స్వతంత్రించి సవరణలకు పూనుకొనరాదు" అని యాక్షేపించిరి. బాగున్నది. 'పరిశోధకులు స్థితిగతి చింతనము చేయవలయునేగాని స్వారస్యముల కొరకు పాఠములు మార్చవచ్చునా?' మఱి, ఆశయ విరుద్ధమైన యీ సూచనలెందుకు చేసినట్లు?

అలంకార శాస్త్ర ప్రమేయమున భట్టుమూర్తి చేసిన 'పలుకు లొండొంటికి' అన్న ప్రయోగ మీ యుద్దిష్ట పద్యమున 'పూర్వాపరములకు అనువు పడి అన్వయింపకున్నది?' అని వీరన్న మాటలపై నాకు దోచిన యభిప్రాయమును నివేదింతును.

పూర్వోదాహృతమైన సీసము ప్రథమ చరణమున కవి రామాయణాది గ్రంథములు నింద్యముకాని నాయకులను వర్ణించటంజేసి వన్నెకెక్కినవనియు, ద్వితీయ చరణమున వైశేషికాది నిఖిల శాస్త్రములును ఈశ్వరప్రతిపాదనము సేయుట మూలమున స్తుతిపాత్రము లయ్యెననియు, తృతీయ పాదమున సంధ్యాద్యనుష్ఠాన మంత్రములు పౌనఃపున్యముగ నీశ్వర జప సాధనములై నాశనముకానివయ్యెననియు, చతుర్థ పాదమున ఋగ్యజుస్సామాథర్వణంబులం గూర్చి చెప్పుచు, ఇవి క్రమముగ-'ప్రజ్ఞానం బ్రహ్మ'- 'అహం బ్రహ్మాస్మి' 'తత్త్వమసి'—'అయ మాత్మా బ్రహ్మ'మ్మని "నీవే బ్రహ్మము, బ్రహ్మమే నీవు' అని యుద్బోధించి బ్రహ్మమును ప్రతిపాదించెడి 'పల్కు లొండొంటికి' అనగా ఆ చెప్పిన యొక్కొక్క మాట చేతనే వేద చతుష్టయమును పొగడికంగన్నవనియు, నుత్తరోత్తరము బలవత్తరమైన యుదాహరణములు జూపి, ఆ పై గీతమున కేవలము కావ్యమైన తన కృతిం గూర్చి చెప్పుచు.....అమేయ నాయక వికస్వరస్వరూప నిరూపణభ్రాజి యగుట వేఱ వివరింపనేల? అద్దాని కుత్తమ నాయకుం డుపలబ్ధమైనప్పుడు బంగారమునకుఁ బరిమళ ప్రవాహ మబ్బినట్లుకాదా! అని చెప్పియుండెనని భావింపనగును. 'ఈవిధముగ పద్య భావము సరిపడిపోయింది.'

ఇక నిట 'పూర్వాపరములకు అనువు పడి అన్వయింపకున్నది' యేది? భట్టుమూర్తి చెప్పిన 'సందర్భ వర్జితము' అను వాక్య దోషముకాభావించి

సాంబమూర్తి శాస్త్రిగారు సవరించుట యేమి? ఏ తన్మూలమున 'భిన్న వచన దోష' మేర్పడ నేల? సవరించకయే సరియైన సంప్రదాయికార్థము లభించునట్లు కవి కంఠోక్తిగా నింతయు చెప్పియుండ నీక విభిన్నములగు సవరణలు సూచనలు యేల? 'సారస్వతీయు' లిట్లు చేయవలసినది కాదని నా మనవి!

ఈ నా యభిప్రాయము లిట్లు వెలువరించుటకు కారణభూతులైన 'శాస్త్రి—రాజు' గారలకు నా యభివాదములు.

— శ్రీనివాసపురం నరసింహాచార్యులు

లుప్తవిభక్తిక నామ్నీకరణం

పై శీర్షిక గల వ్యాసంలో (భారతి, ఏప్రిల్ 1970) శ్రీ చేకూరి రామారావుగారు "స్వతంత్రః కర్తా" మొదలైన సూత్రాలలో కర్త ప్రాణి వాచకమన్న సూచన ఉందని వ్రాశారు. ఈ విషయంలో స్వల్పమైన నా వ్యాకరణ జ్ఞానాన్ని పురస్కరించుకొని రెండు మాటలు వ్రాయడానికి సాహసిస్తున్నాను.

సంస్కృత వ్యాకర్త లెవరూ కర్త ప్రాణి వాచకమని అన్నట్లులేదు. "స్వాతంత్ర్యం చ ధాత్వర్థ వ్యాపారాశ్రయత్వమ్. ఫలానుకూల వ్యాపారో ధాత్వర్థః' అని సిద్ధాంత కౌముదీ బాల మనోరమా వ్యాఖ్యానం. ఈ స్వాతంత్ర్యం చేతనములలో వాస్తవికమూ, అచేతనములలో ఆరోపితమూ అని మహాభాష్యంలో చెప్పబడింది. అందుచేతనే "స్థాలీ పచతి, అసి శ్ఛినత్తి, భిక్షా వాసయతి, భూతాని కాలః పచతి" మున్నగు ప్రయోగములు జరుగుతున్నవని మహాభాష్యంలో "స్వతంత్రః కర్తా"; "కారకే" అన్న సూత్రాల వ్యాఖ్యానాలలోనూ వైయాకరణభూషణసారంలోనూ చర్చితమైంది. దీపం వెలుగుతోంది, రాయి పడుతోంది. ఇత్యాది ప్రయోగాలు సాధారణంగా ఉండనే ఉన్నాయి.

ఇంతేకాక సన్నంత ప్రకరణంలో 'కూలం పిపతిషతి', 'అశ్మా లులుఠిషతే' మొదలైన ప్రయోగాలలో అచేతనములైన కూలాదులకు ఇచ్ఛ ఎట్లా కలుగుతుందన్న పూర్వ పక్షి శంకకు; చేతనములలో సైతం ఇచ్ఛ ప్రవృత్తినిబట్టే తెలుస్తుంది, చాప అల్లదలచినవాడు 'నేను చాప అల్లబోతున్నానండోయ్' అని చెప్పడు, చాప అల్లడానికి అతడు పెట్టుకొన్న సామగ్రిని చూసి అతడు చాప అల్లబోతున్నాడని తెలుసుకొంటాం, అట్లే మట్టి పెళ్లలు రాలిపడడం, భూమి బీటలు వెయ్యడం మొదలైన కారణాలని బట్టి ఒడ్డు పడిపోబోతున్నదని తెలుసుకొంటాం, ప్రవృత్తి చేతనాచేతనములకు తుల్యమే అని భాష్యకారుడు సమాధానం చెప్పాడు. "సర్వస్య వా చేతనా వత్త్వాత్' అని ఇక్కడ వార్తికం ఉంది. "బొమ్మలు నడుస్తున్నాయి, శిరీష పుష్పం నిద్రిస్తున్నది, అయస్కాంతం ఇనుమును సంక్రమిస్తున్నది" మొదలైన ఉదాహృతులను భాష్యకారుడు పఠించాడు.

"వివక్షాతః కారకాణి భవంతి" అని కారకం గురించి భాష్యకారోక్తి. అర్థం ఒకటే అయినా దేనికి ప్రాధాన్యం ఇవ్వడం అన్న దానినిబట్టి కారకం మారుతుంది. రామః కటం కరోతి, రామేణ కటః క్రియతే; వలాహకా ద్విద్యోతతే విద్యుత్, వలాహకే విద్యోతతే, వలాహకో విద్యోతతే—మున్నగునవి ఉదాహరణములు. అసి శ్ఛినత్తి అని కరణమైన అసిలో కర్తృత్వాన్ని ఆరోపించి చెప్పగా అప్పుడు ఆసియొక్క తైక్ష్ణ్యం కరణ మవుతుందని కైయట వ్యాఖ్యానం.

వక్తృవివక్షని బట్టి కారకం మారుతూ ఉండగా, ఆ కారకాన్ని బహిరంగంగా సూచించే విభక్తి భాషాస్వభావాన్నీ, నుడికారాన్నీ బట్టి ఎన్నోవిధాలుగా ఉంటూ ఉంటుంది. అధ్యయనేన వసతి, రజకస్య వస్త్రం దదాతి, రామే గతే—ఈ ప్రయోగాలలోని విభక్తులు భాషాస్వభావంచేత—అధ్యయనంకోసం ఉంటున్నాడు, చాకలికి బట్టలు ఉతకడానికివేశాడు, రాముడు వెళ్లగా—అన్న అర్థాలను బోధిస్తున్నాయి.

"అతడు కలంతో పరీక్ష రాశాడు" అన్న వాక్యం "అతడు పరీక్ష రాసిన కలం" అని పరివర్తనాన్ని పొందజాలగా, "అతడు జ్వరంతో పరీక్ష రాశాడు" అన్న వాక్యం "అతడు పరీక్ష రాసిన జ్వరం" అని పరివర్తనాన్ని సహించదని రామారావుగారు వ్రాసిన

దానిలో విశేషం లేదనుకొంటాను. 'కలం తో' అన్న మాటలో 'తో' కరణార్థాన్ని సూచిస్తున్నది కనుక ఆ వాక్యం సార గలిగింది. 'జ్వరంతో' లో గల 'తో' భాష తీరునిబట్టి ఉన్నది, కనుక సారజాలకపోతున్నది. వాక్యాన్ని మార్చి వ్రాయడానికే కాదు, ఒక భాష లోని విభక్తులు ఒక్కొక్కప్పుడు భాషాంతరీకరణకు కూడా లొంగకపోవచ్చును. "అక్ష్ణా కాణః" "తస్య పశ్యతః" మొదలైన వాక్యాలను తెనిగిస్తే 'ఒంటి కంటివాడు' 'వాడి కళ్లెదుట వాణ్ణి అనాదరిస్తూ' అని వాక్య నిర్మాణం మార్చడమేకాక వివరణ కూడా ఆవశ్యకమవుతుంది. విభక్తులు ఒక్కొక్క భాషలో ఒక్కొక్క విధంగా ఉంటాయి. నేను వాడితో చెప్పాను, నేను ఊరికి వెళ్లాను, నేను కాశీ వెళ్లాను—ఈ వాక్యాలలో "వాడితో, ఊరికి, కాశీ" అన్న మాటలను సంస్కృతంలో చెబితే ద్వితీయా విభక్తి చేర్చి ప్రయోగించవలసి ఉంటుంది.

నామముగా ప్రవర్తింపజేయడం అన్న అర్థంలో నామన్ శబ్దంమీద చ్వి ప్రత్యయాంతమైనరూపం "న లోపః ప్రాతిపదికాంతస్య" అన్న సూత్రంచేత నకారలోపం రాగా బ్రహ్మీభావము, భస్మీకరణము మొదలైన వాటివలెనే 'నామీ కరణం' అని అవుతుం దనీ, 'నామ్నా కరణం' అనడం పొరపాటనీ తోస్తుంది.

—కాఖూరి హనుమంతరావు.

అప్పకవి నివాసము

1965 భారతి, ఏప్రిల్, మే, జూన్ సంచికలలో అప్పకవి నివాసాదికమును గూర్చి శ్రీ వేంకటాచార్యులవారు—మిత్ర మందారులు—విప్పగుంట రాజగోపాలరావు ఎం. ఏ గారు తర్జన భర్జనలు జరిపి—ఏ నిర్ణయమును గానక—వదలినారు. పిదప అక్టోబరు నెల భారతిలో శ్రీ వి. వి. సుందరరావుగారు అందరు అన్న మాటలనే—మరలా అంటూ 'సారస్వత ముక్తావళి'లో శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారు వ్రాసినట్లు కుందూరివారు అకాడమివారి భూగోళమున మదహరించిరనుచు—షాద్‌నగర్ తాలూకాలోనే అప్పకవి నివాసమని వారన్న మాటలనే వీరు అన్నారు. అంతే— సారాంశము ఎవరి నిర్ణయము వారిదిగనే నిలచిపోయినది.

ఇక నే నీ మధ్య 'కందుకూరు సీమ' చరిత్ర వ్రాయుచు—అనేక పల్లెలు—పట్టణములు కాలికి బలపము కట్టుకొని తిరుగియున్నాను. ఆ సందర్భమున—కొందరు పిన్నలను—పెద్దలను—కవులను—పండితులను— చారిత్రక విమర్శకులను — సందర్శించుట సంభవించినది. ఇందులకై—అనేక గ్రంథములు చూచుటయు తటస్థింపగా—అప్పకవి జన్మ దేశమును గూర్చి కొంత కదలిక కలిగి కలము చేపట్టినాను. అందందు—విన్నవి—కన్నవి—ఉన్నవి మనవి చేయుచున్నాను.

నెల్లూరుజిల్లా—కందుకూరు తాలూకా పాలేటి నదీ తీరమున—తంగెళ్ల యను గ్రామము నేడుకూడా విలక్షణముగ నున్నది. ఒకనాడీ ప్రాంతమునకు 'తంగెడుసీమ' యను పేరు గలదు. రాజులు పరిపాలించిరి. నేటికిని—ఆ చిహ్నములు కనుపడుచునే యున్నవి. అప్పకవి జన్మస్థానమైన—కామేపల్లి—ఈ సీమలోనిదే ననియు (రెండు గ్రామములకు పదిమైళ్లు మాత్రమే కలదుకాన) ఇప్పటికి—అక్షరాస్యులేకాక నిరక్షరాస్యులు కూడ బల్లగుద్ది చెప్పుచున్నారు. ఇక నీ కావ్యభర్తయైన వేణుగోపాలస్వామి—ఆలయము మాత్రము కనుపడుటలేదు.

నా చూచిన గ్రంథములనుండి కొన్ని యుదాహరణలు: నెల్లూరుజిల్లా మాన్యువల్ వ్రాసిన I. B. బ్రస్సెల్-అప్పకవిని గూర్చి ఇట్లు వ్రాయుచున్నాడు. "ఈకవి 500 సంవత్సరములవాడు జీవించియుండెను. చుండి జమీందారిలోని—కామేపల్లి—అతని నివాసము. అతడు కవిత్వాధారమగు అప్పకవీయమను గ్రంథమును రచించెను" అని. దీనిని బట్టి చూడ అప్పకవి కామేపల్లివాడేనని దృఢపడుచున్నదికదా! చుండి జమీందారులు కందుకూరు తాలూకాలో చాల గ్రామములు పరిపాలించిరి. ఆ కాలమున నీ తంగెడు

సీమ* నుండి రాజుల పాలనలో నుండెనుకాన—బ్రస్పెల్ చక్కగ వ్రాసినాడు.

మరియొకటి: ఆంధ్ర విజ్ఞానము 98 వ పారటలో "శా. శ. 16 న కామేపల్లి యను గ్రామమున అప్పకవి యున్నాడు. కామేపల్లికి తంగెడుసీమ యను పేరుండెడిదట." అని అర్థమువచ్చు వాక్యము లున్నవి. ఈ వాక్యములు బ్రస్పెల్ వ్రాతలు సత్య దూరములు కావని చెప్పుచున్నవికదా!

అప్పకవీయ భావ ప్రకాశికకు— భూమిక వ్రాయుచు—ఆచార్య శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు 'అప్పకవి తంగెడుసీమ యందలి కామేపల్లి వాడు. క్రీ. శ. 1656 ప్రాంతమున అప్పకవీయము రచించెను" అని యుక్తియుక్తముగ ముక్తసరిగ కలమును కదిపినారు.

ఇక భావప్రకాశికాకర్తలకు శ్రీ రావూరి దొర స్వామిశర్మగారు "అప్పకవి వైదిక బ్రాహ్మణుడు—ఇంటిపేరు కాకునూరివారు. వీరిది పండితవంశము. అప్పకవి సంస్కృత ప్రాకృతాంధ్రములందు కూలంకషమైన పాండిత్య వైభవము కలవాడు. అప్పకవీయమునకు ముందు మరికొన్ని గ్రంథములు రచించెను. అవియేవో? ఇతని నివాస స్థలము కామేపల్లి. ఇది గుంటూరుజిల్లా—పల్నాడు తాలూకాలో నున్నది. ఈ గ్రంథము కామేపల్లిలో వెలసియున్న కవికి యిష్టదైవమైన వేణు గోపాలస్వామి కంకితము" అని కొంత వివరముగ—వ్రాసినారు. కాని నేడు గుంటూరు జిల్లా అప్పకవినాడు నెల్లూరుజిల్లాగనే యుండినది. అప్పకవి నాటికి గుంటూరుజిల్లా లేనేలేదు. 'తంగెడ' అను గ్రామము పల్నాటిసీమలోనుంటే యుండవచ్చును కాని కామేపల్లి మాత్రము లేదనే. ఇక తెలంగాణము నందలి 'కాకునూర'ని (వనమాలపురి), చిరుమామిళ్ల అని కొందరు విమర్శలు-ఆ ప్రాంతమువాడై యుండు డని కొందరు పెద్దలు నిర్ణయించినారు.

ఒక దేశమున పుట్టినవారు మరొక రాష్ట్రమునకు వలస పోవుట యేనాడును యున్నది. అప్రాంతము చేరిన పిదప ఆ యా యింటి పేర్లతో పిలుచుట సర్వ్వ శరింగినదే! సుప్రసిద్ధ కవి పండిత విమర్శకులు శ్రీ వీరేశలింగముగారు—నెల్లూరి మండలమునుండి—ఏలూరు ప్రాంతము వలస పోయిన వారేనట. వారే స్వీయ చరిత్రలో మా పూర్వు లాదియందునెల్లూరు మండలములోని కందుకూరుపుర నివాసు లయి యుండినట్లును, మహమ్మదీయుల కాలమున—ఉద్యోగ ధర్మమున బట్టి ఏలూరు వచ్చినట్లును చెప్పుచున్నారు. ఇట్లే ఆ ప్రాంతము చేరినపిదప ఈ ప్రాంతము పేరు విస్మరించియుండును.

కావున ఎవరెన్ని యుక్తిప్రయుక్తులు చూపి ఆ యూరు ప్రక్కన ఈ యూరున్నది; ఆ యింటి పేరువా రీ గ్రామమున—ఇప్పటికి ఉన్నారు. అతడు మావాడే యనుచున్నారు. అందున ఆయూరివాడై యుండవోపు—అని. ఆకుకు అందని—పోకకు పొందని మాటలతో గాలిమేడల కట్టుట తప్ప మరేమియు కాదు. ఎందరెన్ని విధములుగ నాలోచించినను—అప్పకవి కందుకూరు తాలూకా కామేపల్లివాడే ననుట నిశ్చయము. చరిత్రకారు లింకను పరిశీలించి తమ తమ నిర్ణయములను లోకమున చాటి చెప్పుదురు గాక.

—కొమాండూరి రామానుజాచార్యులు.

---

*కందుకూరు తాలూకాలోనున్న జమీందారి గ్రామము. దీని వివరములు-విక్రమసింహపురమండల సర్వస్వమున చూడగలరు—

గ్రంథ విమర్శలు

సాహిత్య ప్రయోజనం

(వ్యాసావళి. రచయిత: కొడవటిగంటి కుటుంబరావు. క్రౌను సైజు. 222 పేజీలు–వెల రూ.3–50. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ--2.)

సుప్రసిద్ధ కథకులు, విమర్శకులు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి షష్టిపూర్తి సందర్భంగా విశాలాంధ్ర పబ్లికేషన్స్‌వారు ఆంధ్రదేశానికి ఇచ్చిన కానుక ఈ వ్యాస సంపుటి. 1937 సం. మొదలు కొని 1969 సం. వరకు కుటుంబరావుగారు వివిధ విషయాలను గూర్చి రచించిన వివిధ వ్యాసాలలో కొన్ని శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డిగారి సంపాదకత్వంతోనూ పరిచయవాక్యాలతోనూ ఈ పుస్తకంగా కూర్చబడినాయి.

ఈ వ్యాసావళిలో సినిమాలు, సంగీతం, నాటకాలు గురించి కూడా కొన్ని వ్యాసాలున్నా; అధిక భాగం సాహిత్యం, అందులోనూ అభ్యుదయ సాహిత్యంకి పరిమితమై ఉంది. నలభై సంవత్సరాలుగా అవిరళ సాహిత్యకృషి చేస్తూ అభ్యుదయ రచయితగా పేరు మోసిన కుటుంబరావుగారికి అభ్యుదయ సాహిత్యంమీదా, సాహిత్య ప్రయోజనం గురించీ కల నిశ్చితమైన అభిప్రాయాలను తెలుసుకొందుకి ఈ పుస్తకం బాగా ఉపకరిస్తుంది.

కుటుంబరావుగారి అభిప్రాయాలు ఎంత నిశ్చితమైనవో వారి భాష అంత సూటి అయినది. తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా ప్రకటిస్తారు— "శాస్త్రాలు అస్పృశ్యతను గుర్తిస్తాయని పూరీ శంకరాచార్యుడు అన్నాట్ట.... శంకరాచార్యుడయేది, ఆయన తాత అయేది, గడిచిపోయిన యుగాల సాహిత్యాన్ని ప్రమాణంగా చెప్పేవాడు వంచన చేస్తున్నాడని రూఢిగా చెప్పవచ్చు"—ఈ విధంగా కుటుంబరావుగారి శైలి బలమైనదీ, సహజమైనదీ, చమత్కారయుతమైనదీని. వాక్యంలో ఒక్కమాటని తొలగించి దాని స్థానంలో ఇంకో మాటని పెట్టడం సాధ్యంకాదు.

ఇంత ఉత్తేజంగా విస్పష్టంగా తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నా, ఈ పుస్తకాన్ని జాగ్రత్తగా చదివిన వారికి సాహిత్యం గురించీ, సాహిత ప్రయోజనం గురించీ కుటుంబరావుగారికి ఏకాభిప్రాయం లేదన్న సందేహం రాక తప్పదు.

"కళలన్నీ అభ్యుదయకరమైనవి కాకపోవచ్చు. కాని, కళలను అభ్యుదయానికి వినియోగపరచడం మన అభ్యుదయ రచయితల ఆశయం. అందుచేత రెండు విషయాలు మనం పాటిస్తాం., కళ కాని దానికి మనం కళార్హత ఇవ్వం. కళార్హత ఉన్నప్పటికీ సాంఘికాభ్యుదయానికి పాటుపడనట్లయితే దాన్ని మనం ఆదరించం."

"జీవితాన్ని వాస్తవిక దృష్టితో చూసి, అర్థం చేసుకొని సాహిత్య పరమార్థం సంఘానికంతటికీ వర్తించేటట్లు చేయటం అభ్యుదయోద్యమం ఆశయం."

ఇది సాహిత్య ప్రయోజనం గురించి వీరి అభిప్రాయం.

"చింతామణి నాటకం చూసి భోగంవాళ్ళు తమ వృత్తి మానుకున్నట్లు ఒక్క నిదర్శనమూ లేదు." అని కూడా వీరి అభిప్రాయమే. మరి సాహిత్యం వల్ల సంఘం ఎట్లా ప్రభావిత మవుతున్నది? చింతామణి నాటకం చూసి భోగంవాళ్ళు తమవృత్తి మానుకోనట్లుగానే విప్లవాన్ని ఉద్బోధించే కవిత్వం చదివిన వెంటనే ప్రజలందరూ కర్రలూ, ఈటెలూ పట్టుకొని ముందుకు రోసుకురారు. అయితే, సాహిత్య ప్రయోజన మేమిటి? ఈ ప్రశ్నకు ఈ పుస్తకంలో జవాబు దొరక్కపోదు.

"ఈ నాటి జర్మనుల ప్రవృత్తులకీ హిట్లరు వాళ్లచేత చదివించిన సాహిత్యానికీ, రష్యనుల మనస్తత్వానికీ, వాళ్లు చదువుతూ వచ్చిన సాహిత్యానికీ సంబంధం లేదని ఎవ రనగలరు?"

అని సాహిత్యం చేత సంఘం ప్రభావితం కాక తప్పదని కుటుంబరావుగా రంటున్నారు. కుటుంబరావుగారి ఈ అభిప్రాయాన్ని అంగీకరించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఉదారాచారం, ఆధ్యాత్మిక దృష్టి, గార్హస్థ్య ధర్మం మొదలైనవి ప్రబోధిస్తూ రామాయణ భారత భాగవతాలు మన దేశంలో బహుకాలంగా పురాణాలుగా హరికథలుగా ప్రజలలో వ్యాపించి వారిని ప్రభావితులను చేస్తూ వచ్చాయి. ఇటీవల వీటి ప్రభావం తగ్గిపోయింది.

"ఈ కవులు హృదయ సౌకుమార్యాన్ని వృద్ధి చెయ్య గలుగు తున్నారు.... ఈనాడు ఈ సౌందర్యం కవిత్వాన్ని ఆశ్రయించి ఆమెచేత హృదయాన్ని సంస్కరింప జేస్తున్నది". ఇది కూడా కుటుంబరావుగారి అభిప్రాయమే— శ్రీ కృష్ణశాస్త్రి ప్రభృతుల భావకవిత్వం గురించి. ఈ వాక్యాలలో సాహిత్య ప్రయోజనాన్ని వీరు సరిగ్గా గుర్తించిన ధోరణి ఉంది. పతిత మనస్సును సంస్కరించడం వివిధ జీవితాల లోతులను ఎత్తి చూపి పతిత మనస్సును వికసింపజెయ్యడం., సాహిత్యానికి ఇదే ప్రయోజనం. ఈ పరమ ప్రయోజనాన్ని తెలిసి కూడా పాటించక పోవడం చేత కథకుడుగా, విమర్శకుడుగా కుటుంబరావు గారు చాలా అవక తవకలు చేశారు.

"వ్యక్తులనీ వ్యక్తులమనస్తత్వాలనీ చిత్రిస్తూ సాంఘికపరిణామాన్ని వదిలేసి సాహిత్యం సృష్టించడం చాలా తేలిక. ఒక లాటరీలో పాల్గొన్న లక్షల మందినీ విసర్జించి అందులో లక్ష రూపాయలు సంపాదించిన ఒక్కణ్ణి గురించి రాయడానికి సంఘం గురించి ఏమీ తెలియనక్కర లేదు. ఆ విధంగానే, అబద్ధం ఆడననో, కోటీశ్వరు ణ్ణవుతాననో పట్టుబట్టి జయించిన వాళ్ల కథలు రాయవచ్చు. ఆ కథల్లో ఏదో నీతి ఉన్నట్టు కూడా నటించవచ్చు. కాని ఆ రచనల్లో సాంఘిక పరిణామం ప్రతిఫలించదు. అవి సాంఘిక పరిణామానికి దోహదం చెయ్యలేవు. ఎందుచేతనంటే—ఆ కథల్ని మనస్ఫూర్తిగా నమ్మి వాటి ప్రభావానికి గురిఅయిన వాళ్లలో అత్యధిక సంఖ్యాకులు గట్టిగా దెబ్బ తింటారు. అది ప్రజాసాహిత్యం కాదు" అంటారు కుటుంబరావుగారు.

ఈ అభిప్రాయం చాలా బలహీనమైనది. లాటరీలో లక్షరూపాయలు బహుమతి వచ్చినవాడి జీవితంలో ఒక కదలిక వస్తుంది. ఈ కదలికలో సాహిత్యంగా రచింపదగినది ఏదైనా రావచ్చును. బహుమానం వచ్చిన వాడిని గురించి వ్రాసినందువలన బహుమానం రానివారు దెబ్బతింటారనడానికి ఆధారాలు లేవు. ఎన్నో లాటరీలు ప్రస్తుతం నడుస్తున్నాయి. లక్షలకు లక్షలు బహుమానాలు గెల్చుకొంటున్న వారి పేర్లూ ఫోటోలూ పేపర్లలో పడుతున్నాయి. ఇదంతా లాటరీ టిక్కట్లు కొంటున్న కోట్ల ప్రజల్ని మానసికంగా దెబ్బతీయడం లేదు. నిజంగా జరుగుతున్నదే దెబ్బ తియ్యకపోగా, ఇక దాని గురించి వ్రాసిన సాహిత్యం దెబ్బ తీస్తుందనడం చింతామణి నాటకం చూసి భోగంవాళ్లు తమ వృత్తి మానడం వంటిది.

"దైవికంగా జరిగే సంఘటనలతో పాఠకుణ్ణి రాచి రంపాన పెట్టటం చాల దారుణం. నిత్యజీవితంలో మనుషులకు విధి వక్రించి ఎన్నో అగచాట్లు వస్తాయి. ఒకాయనకు. రెండేళ్ల కాలంలో ఉన్నపిల్లలందరూ పోతారు .... వరదలు వస్తాయి.... రైలు ప్రమాదాలు జరుగుతాయి....కాని, ఆ కష్టాలను కథ రూపంలో చదవటంవల్ల ప్రయోజనం ఏమున్నా ఉంటుందా? ఏమీ ఉండదు. అందులో సామాజిక చిత్రణ ఏమీ ఉండదు" అంటూ అభ్యుదయ సాహిత్యంయొక్క ఇంకొక ముఖ్యలక్షణాన్ని కుటుంబరావుగారు నిర్దేశిస్తున్నారు.

ఇక్కడ కుటుంబరావుగారు పూర్తిగా పొరబడు తున్నారు. అత్యంత విపులమైన సాహిత్య ప్రక్రియ నవలను తీసుకొన్నా, దానిలో ఆ నవల జరిగిన కాలంలోని సామాజిక రాజకీయ పరిస్థితుల

వర్ణన ఎంత ఉన్నా, అంతకన్నా హెచ్చుగా ప్రధానంగా ఆ నవలలోని వ్యక్తుల జీవితాలను చిత్రించి చర్చించడమే ఉంటుంది. నవలకన్నా పరిమాణంలో చిన్నవైన కథలలోనూ నాటకాలలోనూ దాదాపు పూర్తిగా కొందరు వ్యక్తుల చిత్రణమే కనిపిస్తుంది. సాహిత్యం ప్రధానంగా వ్యక్తి విషయమైనది., సాహిత్యగతమైన సామాజిక చిత్రణ సందర్భాన్ని బట్టి వచ్చినదీ, గౌణ మయినదీను. ఏ నవల చూచినా కొన్ని పాత్రల జీవితాలలో కొంతకాలంలో జరిగిన మార్పే కథావస్తువుగా కనిపిస్తుంది తప్ప, ఫలాని పదేళ్లలో ఫలాని వూళ్లో రైతాంగం వ్యవసాయంలోనూ, సమాజ జీవితంలోనూ సాధించిన ప్రగతి—ఇటువంటి విషయాలను తీసుకొని ఎవరూ నవలలు రచించ లేదు.

వరద బీభత్సాన్నిగాని, రైలు ప్రమాదాన్నిగాని వర్ణించే సాహిత్యం ఆ ప్రమాదానికిలోనైన వ్యక్తుల జీవితాలను ప్రతిఫలిస్తూ సాగుతుంది. వూరికే వరదలలో ఎలభై మంది చనిపోయారు అంటే ఆ వ్రాతకు సాహిత్యం విలువ ఉండదు. ఆ వరదను ఎదుర్కొన్న జనుల మనోధైర్యం, సమష్టియత్నం లేదా ఆ వరదలో కొట్టుకుపోయిన జనుల అసహాయత, ప్రకృతి శక్తులముందు మనిషి అల్పత్వం ఇవేవోదానిలో చిత్రితములై ఆసంఘటనను సాహిత్యం చేస్తాయి. దైవికంగా జరిగే సంఘటనలను సాహిత్యంలో రచించరాదంటే, హార్డీ నవలలూ, ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ నవలా, ఇంకా ఎన్నో మనం పోగొట్టుకొంటాం. రామాయణంలో దైవికంగా శూర్పణఖ పర్ణశాల దగ్గరకి రాకపోతే సీతాపహరణా, తర్వాతి రామాయణ కథా జరక్కపోయేవి. ఇది సాహిత్య రచనకు పనికి రాదంటే సీతా రామ లక్ష్మణులను గంగానదిమీద షికారు త్రిప్పి అయోధ్యకు తిరిగి తీసుకు వెళ్లవలసి ఉంటుంది.

కాలాన్నిబట్టి మారిపోతున్న సమాజంలో సాహిత్యానికి నిలకడ ఎట్లా వస్తున్నది? ప్రాచీన సాహిత్యాన్ని మనం ఎట్లా గ్రహించగలుగుతున్నాం? అన్న విషయాలలో కుటుంబరావుగారు ఎంతలోతుగా పప్పులో కాలు వేసినదీ 'సావ' గారి వాదాన్ని వ్యతిరేకిస్తూ వారు వ్రాసిన విమర్శలో తెలుస్తుంది.

'ఏ కాలపు కవిత్వాన్ని ఆ కాలపు విశ్వాసాలనించి విడదీసి చూడ్డం పొరపాటు. విశ్వాసాలకు విలువ మారుతుంది. విలువ మారినంతమాత్రాన ఆ విశ్వాసాలు మొదటినుంచీఅనర్థదాయకమైనవని అనడానికి వీల్లేదు.' అన్న 'సావ' గారి అభిప్రాయాన్ని కుటుంబరావుగారు ఇట్లా వ్యతిరేకించారు—"విశ్వాసాలు మారతవన్నారు గనక విశ్వాసాలవెంట సాహిత్యం గురించి అభిప్రాయాలూ మారాలి. లేనిపక్షంలో అనేక అభిప్రాయాలతోనూ విలువలతోనూ కూడుకుంటూ వచ్చిన అత్యుత్తమసాహిత్యం గంపెడు పెరిగి మనకు వూపి రాడకుండా పోతుంది. అట్లాకాక రచయితయొక్క ఉద్దేశం మనం పాతసాహిత్యాన్ని విమర్శించేటప్పుడు ఈనాటి విశ్వాసాలతో విమర్శించ కూడదని అయి ఉంటే అదీ అట్టే సమంజసంకాదు. ఎందుకంటే—మనం పాతసాహిత్యాన్ని విమర్శించటంలో ఆ సాహిత్యం వెనకఉన్న విశ్వాసాలను తప్ప మరి దేన్ని విమర్శించ గలం" అని.

పూర్వకాలంలో రాజులు తమ అధిపత్యాన్నీ, పరాక్రమాన్నీ నిరూపించుకొందుకి నిష్కారణంగా పొరుగు రాజులతో యుద్ధాలు చేసేవారు, ఇప్పుడు మనం యుద్ధాన్ని సాధ్యమైనంతవరకూ సమర్థించం. అయినా రఘువంశంలోని రఘుమహారాజు జైత్రయాత్ర వర్ణననీ, మను చరిత్రలో కృష్ణ దేవరాయుల యుద్ధాల వర్ణననీ మనం సాహిత్యంగా అంగీకరిస్తాం. బాల చంద్రుడియుద్ధాన్ని వర్ణించిన పంక్తులు సాహిత్యంగా పరిగణించడానికి ఆ యుద్ధ కారణాలు తగినంత బల

మైనవా అనీ మనం ఆలోచించం. దయ్యాల మయమైన షేక్స్పియర్ నాటకాలనీ, ప్రబంధాలలో నాలుగు జాతుల వర్ణనలనీ, సులోచనాదేవి సహగమనాన్నీ మతం సాహిత్యంగా పరిగణిస్తున్నాం. దేశ కాలానిబట్టీ విశ్వాసాలూ, నీతులూ, నియమాలూ, చట్టాలూ మారతాయి. ప్రతి కవీ బహుశః తన కాలం నాటి విశ్వాసాలకి లోనయే ఆలోచిస్తాడు. కాని వీటన్నిటి వెనకా, వీటన్నిటికీ అతీతమైనదీ, మారనిదీ అయిన మానవత్వం ఉంటుంది. సాహిత్యం మనిషిలోని మానవత్వాన్ని నిరూపిస్తుంది. కనుకనే రామాయణకాలంనాటి విశ్వాసాలకీ మన విశ్వాసాలకీ ఎన్నో తేడాలు ఉన్నా రామాయణాన్ని ఉత్తమ సాహిత్యంగా ఆదరిస్తున్నాము.

"ఒక రాజకీయ పక్షానికి చెందిన వాళ్ళ జీవిత రంగంలో తాము సాధించదలచిన పరిణామాలను సాహిత్యంగాని, ఇతర కళలుగాని బలపరచినప్పుడు ఆనందం కలగటంలో తప్పేమీలేదు. అటువంటి దౌర్బల్యం నాకే ఉన్నది. మార్క్సిస్టు సిద్ధాంతాలలో సంపూర్ణమైన విశ్వాసంగల నాకు ఆ సిద్ధాంతాన్ని నిరూపించే, బలపరచే, ఉదహరించే రచన ఎక్కడ తగిలినా ఎంతో ఆనందంగా ఉంటుంది.....కాని, నా విశ్వాసాలను బలపరిస్తే చాలు— అది ఉత్తమరచన అని నేను అనలేను. సాహిత్యకారుడుగా నాకు ప్రమాణం జీవితం. సిద్ధాంతంకోసం జీవితాన్ని వక్రంగా చిత్రిస్తే ఆ రచన ఉత్తమ రచన ఎట్లా అనిపించుకొంటుందో నాకు ఏనాడూ అర్థం కాలేదు" అని కుటుంబరావుగారు వ్రాశారు. కాని, కుటుంబరావుగారి రచనలలో జీవితాన్ని ప్రమాణీకరించిన భావన కన్నా, సమాజపురోగతిని గురించీ, స్త్రీ పురుష సంబంధాన్ని గురించీ తన దృష్టిలో అభ్యుదయాభిప్రాయాల ప్రతిపాదన, నిరూపణ, ఉదాహరణలే చాలా ఎక్కువ. అందుచేతనే వారి రచనలలో అత్యధిక భాగానికి సాహిత్యపు విలువ లేకపోతున్నది. కుటుంబరావుగారి కథలలో పాత్రలన్నీ చాలావరకూ మధ్యతరగతి సంసారానికి చెందినవే. కాని ఇంత సహజమైన పాత్రలనీ కథ సగం గడిచేసరికి ఒక విలక్షణ స్థితిలో నిల్పి కృత్రిమంగా మాటాడించుతారు.

ఆంధ్రప్రబంధాలను గురించి— "ఇవి రాజుల కాలంలో రాజుల సంసారాన్ని కీర్తించడానికి రాజుల అభిరుచులు సంతృప్తిపరచి, వారి నుండి "పురంబులు వాహనంబులున్ సొమ్ములు కొన్ని" పుచ్చుకోవటానికీ వ్రాసినవి. ఇవి ఆయాకాలపు పఠితులకూ, అలగా జనాన్నీ ఉద్ధరించడానికి రాసినవని కలలో కూడా అనుకోలేం" అని వ్రాశారు.

సాహిత్యం ఒక విజ్ఞాన ప్రక్రియ. ఏ విజ్ఞాన ప్రక్రియలోనైనా ఉపజ్ఞకన్నా అనుకరణ హెచ్చుగా ఉంటుంది. శాస్త్ర పరిశోధనలో ఒక డైరక్టర్ దగ్గర రిసెర్చి చేసేవారి ప్రోబ్లమ్స్ అన్నీ దాదాపు ఒకే విషయానికి పరిమితమై ఉంటాయి. దానిలోనే చిన్న చిన్న మార్పులు చేసి రిసెర్చి కొనసాగిస్తూ ఉంటారు. అంతేతప్ప రిసెర్చి చేసే ప్రతి ఒక్కడూ సరిక్రొత్త విషయాన్ని గురించి సరిక్రొత్తవిధంలో రిసెర్చి చెయ్యాలంటె అది శక్యంకాదు. సాహిత్య విషయం కూడా ఇంతే. మన ప్రబంధాలకి దారి చూపినవి సంస్కృత మహాకావ్యాలు. ఉరుదూ కవిత్వం చూస్తే దానినిండా త్రాగుడూ, స్త్రీలోలతా చాలా హెచ్చుగా కనిపిస్తాయి. పోతే, ప్రబంధ కవుల కవిత్వాన్ని మెచ్చి రాజులు వాళ్ళకి పురాలూ వాహనాలూ ఇస్తే అందుకు మన అభ్యంతర మేమిటి? శృంగార వర్ణనలు రాజులకి అంకితమైన ప్రబంధాలలోనే లేవు, దేవుళ్ళకి అంకితమైన ప్రబంధాలలోనూ ఉన్నాయి, రాజులే రచించి దేవుళ్ళకి అంకిత మిచ్చిన ప్రబంధాలలోనూ ఉన్నాయి.

ఇంకా ఈ వ్యాసాలలో కుటుంబరావుగారు రామాయణ భారతాలు, మతం, వేదాలు గురించి చాలా చెణుకులు విసరారు.

"వాల్మీకి శ్రీరామచంద్రమూర్తిని దేవుణ్ణి చేసి పొగిడినందువల్ల అతను ఈనాటి రాజకీయ సూత్రాల ప్రకారం సామ్రాజ్యవాది అనడం అసలైన విమర్శ కాదు. వాల్మీకి విశ్వాసంలో నైర్మల్యం ఉంది. స్వచ్ఛత ఉంది. అందులో గొడవలు ఏమీ లేవు. అతనికి తెలిసిందల్లా రాముడు మంచివాడనీ, అతని ప్రవర్తన లోకానికి మంగళకరమనీ" అన్న 'పాప' గారి అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ కుటుంబరావుగారు— "'పాప' గారికి చారిత్రక దృష్టి లేదం

టాను. రాముడు అనార్యస్త్రీలను చంపాడు. ముక్కులూ చెవులూ కోయించాడు; ఇతర జాతుల సహాయం పొంది వాళ్లలో బలవంతులైన వాలినీ, రావణుణ్నీ చంపాడు. సుగ్రీవుణ్ణి విభీషణుణ్ణి భ్రాతృద్రోహులుగా తయారు చేశాడు; వాళ్ల రాజకీయాల్లో జోక్యం కలిగించుకొని తన ఏజెంట్లకు పట్టం కట్టాడు; ముక్కు మూసుకొని తపస్సు చేసుకొంటున్న శూద్రుడి గొంతు కోశాడు; దక్షిణవాసులను రావణుడి 'బారి'నుండి 'విడిపించినందుకు' పరిహారంకింద రామేశ్వరంలో ఒక ఈశ్వరాలయం— వాళ్లదేవుడికి గుడి కట్టించి తన పేరు ఆ ఈశ్వరుడి పేరుతో జోడించనిచ్చాడు— ఒకప్పుడా ఈశ్వరుడి విల్లే విరిచి తన శాండోతనం రుజువు చేసుకొన్నప్పటికినీ!" అని వ్రాశారు.

రాముడు ఎందరు అనార్య స్త్రీలను చంపాడు? ఎందరి ముక్కులూ చెవులూ కోయించాడు? రాముడు రామేశ్వరాలయాన్ని కట్టించినట్లుగాని, దాన్ని తన పేరున పిలవాలని ఆజ్ఞ పెట్టినట్లుగాని రామాయణంలో ఎక్కడా లేదే! రాక్షసులని చంపాక తిరిగి తిన్నగా విమానంలో వెళ్లిపోయాడు తప్ప, దార్లో దిగి గుడి కట్టించ లేదు. వెళ్తూ వెళ్తూ తను నిర్మించిన సేతువును సీతకు చూపి "ఇక్కడ మహాదేవుడు నన్ను అనుగ్రహించాడు" అన్నాడు. దీన్ని ఆధారంగా, తర్వాత ఎవరో నిర్మించిన శివాలయాన్ని ప్రజలు రాముడియందు భక్తిప్రేమలతో రామేశ్వరమని పిలవ నారంభించి ఉండ వచ్చును. దీనికి కుటుంబరావుగారు బాధపడట మెందుకు? రజకుని మాటకు రాముడు సీతను వదిలేశాడని కూడ ఒక కథ దేశంలో ఉంది. ఇదీ రామాయణంలో లేదు.

ఇంక శంబూక వధ గురించి పరిశీలించుదాం. చాలామందిని ఇది కలవరపెడుతున్నది. రాముడు రాజ్యం చేస్తున్న చివరి రోజులలో ఒక బ్రాహ్మణ బాలుడు చనిపోగా, రాముడు సభలో దీనిని చర్చించగా, నారదుడనే ముని— 'ఒక శూద్రుడు నీ రాజ్యంలో తపస్సు చేస్తున్నాడు. కృతయుగంలో బ్రాహ్మణులకీ, త్రేతలో బ్రాహ్మణ క్షత్రియులకీ, ద్వాపరంలో బ్రాహ్మణ వైశ్యులకీ, కలియుగంలో నాలుగు వర్ణాలవారికీ తపస్సు చేసే అధికారం ఉంది., ఈ త్రేతాయుగాంతంలో నియమాన్ని ఉల్లంఘించి శూద్రుడు నీ రాజ్యంలో తపస్సు చేస్తున్నాడు, కనుక ఈ దోషం జరిగిం'దని చెబుతాడు. అప్పుడు రాముడా శూద్ర మునిని చంపుతాడు. కాని, ఉపనిషత్తులలో చాలామంది క్షత్రియ తపస్వులు కనిపిస్తారు. కృతయుగంలో విశ్వామిత్రుడూ, హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులూ, బలీ, ఇంకా ఎందరో రాజులూ తపస్సు చెయ్యగా వారికి బ్రహ్మ ప్రత్యక్షమయాడు. దశరథుడు ఏనుగనుకొని చంపిన మునిబాలుడు శూద్ర తపస్వి కొడుకు. దశరథుని కాలంలో శూద్ర తపస్వులు ఉండగా రాముని కాలంలో ఉండరాదని ఎవరన గలరు? వాల్మీకి కిరాతకుల జాతుడనీ, తర్వాత తపస్సు చేశాడనీ కథ ఉంది. కాబట్టి నారదుడు రాముడికి చెప్పింది తప్పు. ఈ ఆధారా లన్నిటినీబట్టి శంబూక వధ రచన వాల్మీకి కృతం కాదనీ, తర్వాత ఎవరో రామాయణంలో తగిల్చారనీ మనం విశ్వసించ వచ్చును. రామాయణంలో, ఎక్కువగా ఉత్తర కాండలో ప్రక్షిప్త భాగాలు చాలా ఉన్నాయి. బాల కాండలో అహల్యాశాపవృత్తాంతం ఒకలాగ ఉంటే ఉత్తరకాండలో ఇంకోలా ఉంది. కనుక ఇవన్నీ ప్రక్షిప్తాలు కావచ్చును. అసలు ఉత్తరకాండే వాల్మీకి కృతం కాదని ఒక అభిప్రాయం ఉంది. అది అంత సమంజసమని తోచదు. కవి స్వయంగా తాను ఉత్తర కాండ రచించినట్లు గ్రంథాదిలో చెప్పుకొన్నాడు. కాని మళ్లీ కొందరు, గ్రంథాదిలోని ఆ సర్గలూ ప్రక్షిప్తా లంటారు. ఏది వాల్మీకి రచనో, ఏది కాదో దేవుడికి తెలియాలి.

కాగా, రాముడు కిష్కింధా లంకా రాజకీయాల్లో జోక్యం కలిగించుకొన్నాడనీ, విభీషణుడూ సుగ్రీవుడూ భ్రాతృద్రోహులనీ అనడంలో చారిత్రికావగాహన కనిపించదు. ఫలాని ప్రజలది ఫలాని దేశం అన్న దృష్టి ప్రపంచంలో ఏర్పడి అట్టే కాలంకాలేదు. పూర్వం రాజ్యాలు వ్యక్తిగతంగా వారి వారికి చెంది ఉండేవి. ఇంకొకడు వచ్చి ఆ రాజును ఓడిస్తే రాజ్యం ఆయన దయేది. క్రమంగా రాజ్యాలు మత

ప్రాతిపదిక మీదా, భాషా ప్రాతిపదికమీదా ఏర్పడ్డాయి గాని ఇవి జరగడం ప్రారంభించి వెయ్యి సంవత్సరాలు కాలేదు. పూర్వం యుద్ధాలూ సంధులూ రాజుల వ్యక్తిగత గౌరవాభిమానాలకోసం జరిగేవి. పల్నాటి యుద్ధానికి మూలకారణం కోడి పందేలు. పాండవులకు సహాయం చెయ్యడానికి వస్తూ వస్తూ శల్యుడు పొరపాటున దుర్యోధనుడికి మాట ఇచ్చి వాళ్ళవైపు తిరిగిపోయి తన మేనల్లుళ్ళతోనే యుద్ధం చేశాడు. కృష్ణుడు రెండు పక్షాలవారికీ యుద్ధంలో సహాయం చెయ్యడం విచిత్రమైనది. ఈనాటి రాజకీయాల దృష్టిలో ఇవన్నీ అర్థహీనమైనవి. విభీషణుడూ సుగ్రీవుడూ తమ వ్యక్తిగత కారణాలవల్ల అన్నలను విడిచి రాముడి పక్షం చేరారు. దానిలో రాజకీయద్రోహం ఏమీలేదు.

"వాల్మీకి వ్యాసుడూ వచ్చి రాజకీయాలు రాసేశారు. పైపెచ్చు గెలుపొందిన పక్షాన చేరారు" అన్నారు కుటుంబరావుగారు. వాల్మీకీ వ్యాసుడూ రాముణ్ణీ ధర్మరాజునీ ఆశ్రయించి వచ్చి రాజకీయాలు వ్రాసివుంటే, రావణుడి రాజ్యంలోనూ దుర్యోధనుడి రాజ్యంలోనూ ఆ యా ప్రజలు చాలా కష్టాలు పడ్డారని వ్రాసివుండేవారు. కాని వారట్లా వ్రాయలేదు.

"తిక్కన సోమయాజి సభాపర్వం ఎత్తుకుంటూనే రాజుల మనస్తత్వాలమీద విసిరిన విసుర్లకు మనుమసిద్ధి మొదలైనవాళ్ళు కుళ్ళి చచ్చి ఉండాలి" అన్నారు కుటుంబరావుగారు. తిక్కన సభాపర్వం ఎత్తుకోవడ మేమిటి? విరాటపర్వారంభంలోని రాజసేవాధర్మాలని ఉపదేశించిన రచన తిక్కన స్వంతం కాదు. వ్యాసుడినుండి పంక్తి తర్వాత పంక్తిగా అనువాదం. అయినా ఈ మాత్రం దానికి మనుమసిద్ధి మొదలైన వాళ్ళు కుళ్ళిచస్తారా? ఇంతకీ 'కుళ్ళు' అంటే అభ్యుదయ రచయితలకు ఇంత ఇష్టం ఎందుకు?

"వేదకాల పురుషుల పరిలయిన రచనలే చేశారు." అన్నారు ఒకచోట. వేదసాహిత్యం పశుధన ధాన్యాదులను గురించి ఉంటుంది, కనుక అది అభ్యుదయ సాహిత్యం అనీ, దానిలో మతం వేదాంతం మొదలైన చెత్త లేదనీ ఆయన ఉద్దేశం. కాని కుటుంబరావుగారు వేదాలను గురించి పూర్తిగా తెలుసుకోకుండా ఈ మాటలు వ్రాశారు. వేదాలలో వేదాంతపరమైన ఊహ, భావనాకల రచనలూ ఉన్నాయి.

"నిర్లిప్తత వెంట నిర్లక్ష్యం కూడా ఉంటే వేదాంతం పుట్టుకొస్తుంది". కుటుంబరావుగారి విసుర్లలో ఇదొకటి. జీవితంపై నిర్లక్ష్యం ఏర్పడినవాడు పేకాట్లకీ త్రాగుడికీ వశుడవుతాడు తప్ప వేదాంతి కాలేడు. దేవునియందు తదేకాగ్రత, గాఢ లక్ష్యం కల వాడే వేదాంతి కాగలడు.

"అప్పటికే వేద శాస్త్రాలు చెత్తకుప్పలోకి వెళ్ళిపోవడం చేత" అన్నారు కుటుంబరావుగారు. వివిధ వ్యాఖ్యానాలతో, బహుభాషాంతరీకరణలతో వేద శాస్త్రాలు ప్రపంచ మంతటా నిలిచి ఉన్నాయి. చెత్తకుప్పలోకి వెళ్ళలేదు. కుటుంబరావుగారి 'సాహిత్య ప్రయోజనం' అన్న ఈ రచనా, ఇతర రచనలూ ఏమవుతాయో ఎవరు చెప్పగలరు ?

త్రిశంకుడి స్వర్గం

(నవల. రచయిత: మధురాంతకం రాజారాం. ఎమెస్కో—పాకెట్ సైజు. 236 పేజీలు. వెల—రూ. 2—00. ఎమ్. శేషాచలం అండ్ కో. రాష్ట్రపతిరోడ్డు సికింద్రాబాదు.)

కోదండం అన్న అప్రయోజకుడు భార్యనీ కొడుకునీ ఇంట్లో ఉంచి, ఉద్యోగానికి నగరం వెళ్ళి ఎన్నో కష్టాలుపడి చివరకు విజయరత్నం అనే డాక్టరుదగ్గర కంపౌండరయి, డాక్టరుగారి భార్యను మరగి, ఇంక తన పెళ్ళాంనీ కొడుకునీ తలచకుండా అక్కడే ఉండిపోతాడు. తర్వాత ఆ డాక్టరు చచ్చిపోగా ఆతని కుటుంబాన్ని తానే ఆదుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఆ వూరునుంచి ఇంకో వూరు వెళ్ళిపోయి, తానే డాక్టరు విజయరత్నంగా చలామణి అవుతూ ప్రాక్టీసు వెలిగిస్తాడు. బహుకాలానంతరం తన అసలు కొడుకుని కలుసుకొనడం, అన్ని సంవత్సరాలుగా నిద్రపోతున్న పోలీసులు అతణ్ణి అప్పుడు పరిశీలించడం

జరుగుతాయి. చివరకు డాక్టరు విజయరత్నంగా చలామణి అవుతున్న కోదండం తన దయనీయ గాథను అప్తమిత్రుడికి విశదీకరించి పలాయనం చిత్తగిస్తాడు.

స్థూలంగా ఇదీ కథ. కాని రచయిత, ఇలా సూటిగా చెప్పక, కథని అట్నుంచి నరుక్కొస్తారు. నూట నలభై పేజీలు దాటేదాకా కథకి ఒక పట్టులేక ముసుగులో గుద్దులాటలా అనిపిస్తుంది. ఆఖరి ప్రకరణంలో కథ అంతా విడిపోయి "ఓస్, ఇదా విషయం!" అనిపిస్తుంది.

కోదండంమీద మనకి సానుభూతి కలగదు. తక్కిన పాత్రలు మనక మసకగా ఉన్నాయి. కథలో బలంలేదు. ముప్ఫై పేజీల కథలో ఇముడ్చదగిన విషయాన్ని రెండువందల నలభై పేజీల నవలగా రచయిత సాగదీశారు.

ఈ నవల స్థాయినిబట్టి ఈ రచయితను అసమర్థుడుగా మనం నిశ్చయించకూడదు. అక్కడక్కడ వెలిబుచ్చిన మంచి భావాలూ, రచన తీరూ ఈ రచయిత శక్తిని చూపుతున్నాయి. ఒక భావం. "ఈ సంసారం ఒక రోడ్డు రోలరు. ఈడవ దానికి ఇతరుల సాయంలేదు. ఈడ్చినంతకాలం ఈడవాలి. తరువాత దీనికిందపడి నలిగిపోవాలి."

పటుత్వం కల కథా విషయాన్ని చేపడితే ఈ రచయిత మంచి రచన చెయ్యగలరని చెప్ప వచ్చును.

చిల్లర దేవుళ్లు

(నవల. రచయిత:దాశరథి రంగాచార్య. ఏమెస్కో పాకెట్ సైజు 220 పేజీలు. వెల రూ 2 లు ఎమ్. శేషాచలం అండ్ కో. రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు.)

నిజాం పరిపాలన రోజుల్లో తెలంగాణంలోని గ్రామీణ జీవితాన్ని ఈ నవల వర్ణిస్తుంది: ప్రభువుల నిరంకుశ పరిపాలన, గ్రామాధికారుల గర్వం, క్రౌర్యం, పురుగులకన్నా హీనంగా మనుగడ సాగించిన పేద ప్రజల దయనీయ జీవితాలు—ఇవన్నీ ఈ నవలలో ప్రదర్శితము అయాయి. పూర్తిగా ఇది తెలుగువారి, అందులోనూ తెలంగాణ వారి నవల. పాత్రల సంభాషణలలో తెలంగాణ నుడికారాన్ని ప్రయోగించడం కథకి సహజత్వాన్ని ఇచ్చింది.

సారంగపాణి అనే ఒక గాయకుడు గుంటూరు ప్రాంతం నుంచి వచ్చి తెలంగాణలో ఒక పల్లెలో సంగీత పాఠాలు చెప్పుకొంటూ రామారెడ్డి అనే గ్రామాధికారి ఇంట్లో స్థిరపడడం, ఆ స్థిరపడడం ఆ గ్రామ సమస్యలలోనే ఇరుక్కుపోవడం, వనజ, మంజరి, తాయారు అన్న ముగ్గురుస్త్రీల వలపులో చిక్కుకు పోవడం— ఇది ఈ కథావస్తువు. వనజ అడబాప (భోగంపిల్ల వంటిది) పాణికి తన వంటి నికృష్టురాలు తగదని తలచి తన ప్రేమను ఉపసంహరించుకొంటుంది. మంజరి ముగ్ధ. వలపులో తపించి పోతుంది. కాని, ఆమెలో అధికార గర్వం, అసూయా మిక్కుటంగా ఉన్నాయి. తాయారు కాముకి. ఈ మూడు తరహాల స్త్రీపాత్రలనీ అంత సజీవంగా చిత్రించడంలో రచయిత చూపిన ప్రతిభ చాల గొప్పది.

ఒక వైపున గ్రామీణ జీవితాన్ని పరిపూర్ణంగా వాస్తవంగా చిత్రిస్తూ దానిలో ఈ ప్రేమ కథల కల్పనని చాలా నేర్పులో రచయిత మేళవించారు. కాని కథ చివరకి కల్పనవైపే మొగ్గుతుంది. సారంగ పాణి చిన్నతనంలో బెజవాడలో తప్పిపోయిన చంద్ర శేఖరమేనన్న కథాంతంలో నిరూపణ కథని చాలా అసహజంగా ముగింప జేసింది.

కథ తెలంగాణ ప్రజల జీవితాలని చిత్రిస్తూ మొదలయి రానురాను పాణి, అతని ముగ్గురు స్త్రీల జీవితాలలోకి మళ్లుతుంది. అందుచేత మొదట్లో హిందువులని తురకలు చెయ్యడం, లంబాడీల ముట్టడి మొదలైన వాస్తవ సన్నివేశాలు అప్పట్లో ఎంత బాగా నిర్వహించబడినా చివరకు కథా నిర్వహణలో ప్రయోజనాన్ని పొందలేకపోయాయి. అయినా ఇవి పెద్ద దోషాలు కావు. ఇంత సజీవమైన చక్కని నవలను రచించిన రచయితని మనం అభినందించాలి.

మనోఫలకం, మనక్షోభ— ఇవి వ్యాకరణ దుష్ప్రయోగాలు. అక్కడక్కడ ఉదాహరించబడిన సంస్కృత శ్లోకాలలో అచ్చుతప్పు లున్నాయి. 'రమ్యాణి

వీక్ష్య' అన్న శ్లోకానికి వ్రాసిన అర్థ వివరణలో పొరపాటు ఉందనుకొంటాను. ఇవి వచ్చే ముద్రణలో సంస్కరించవలసి ఉంది.

రెండవ అశోకుడి మూణ్ణాళ్ల పాలన

(నవల. రచయిత: పాలగుమ్మి పద్మరాజు. ఎమెస్కో పాకెట్‌సైజు. 156 పేజీలు. వెల రూ. 2. ఎమ్. శేషాచలం అండ్ కో., రాష్ట్రపతి రోడ్డు., సికింద్రాబాదు.)

ఈ నాటి దేశ పరిస్థితి దృష్ట్యా ఇంకా కొన్నేళ్లు ఇలాగే సాగుతే అప్పటికి మన దేశ స్థితి ఎలా ఉండవచ్చును అని వూహించి రచించిన వ్యంగ్య రచన ఈ నవల. ఎక్కడ చూసినా బంద్‌లు, సేనలు, విద్యార్థుల సమ్మెలు, ఘెరావ్‌లు, పదవులకు రాజకీయ నాయకుల ప్రాకులాటలు, వీటన్నిటినీ యథార్థంగా రచయిత దీనిలో ప్రదర్శించారు.

ప్రధాన మంత్రిగా ఎవరిని నిర్ణయించాలో వాళ్లలో వాళ్లకి తెగక చివరకి ఎక్కడో పెరవలిలో తన మానాన తాను అశోక చక్రవర్తి చరిత్ర వ్రాస్తూ కాలక్షేపం చేస్తున్న అశోకవర్ధనరాజును ఎన్నుకొనడం, ఆయన మూడు రోజులు పాలించి పరిపాలనా బాధ్యతల నుంచి పరుగెత్తి వచ్చెయ్యడం— ఇదీ కథ.

ఇది సరదాగా తమాషాకు వ్రాసిన రచన. తమాషాకు వ్రాసిన రచనను మనం ఆ దృష్టితోనే చదవాలి. ఇందులో కథ ఉత్పన్నమయే ప్రసక్తే లేదు. అయినా శివసేన దౌర్జన్యానికి లోనయిన నాయర్ కుటుంబపరిస్థితిని చూపడంలో చిక్కని కథ అక్కడ ఉత్పన్నమయింది, కాని కొనసాగింపబడలేదు. రచయిత ఉద్దేశం అది కాదు.

రెండవ అశోకుడు రాజ్యానికి వచ్చినప్పటి నుంచీ వ్యంగ్యం నూటితప్పి రచన కొంత అయోమయమైంది. తిష్యరక్షిత నాట్యం చేస్తూ ఉండగా అశోకుడు గుర్రుపెట్టి నిద్రపోవడం, కళింగయుద్ధం తర్వాత అశోకుని మనఃపరివర్తనానికి కారణం తీవ్ర కారుణ్యంకాక, వార్ధక్య దశలో ఒక యువతిని పొందజాలని మానసిక దౌర్బల్యమని చూపడం— ఇవి కొంత వెగటును కలిగిస్తాయి.

పద్మరాజుగారి హాస్యం మనని నవ్విస్తూనే ఆలోచింప జేస్తుంది. "మొగ మూర్ఖులు", 'వృత్తి ధర్మం' అన్న నాటకాలూ, 'క్రూరతనమా, మానవ స్వభావమా!' అన్న కథా ఇందుకు దృష్టాంతాలు. ఆ రచనలు చదివినవారికి ఈ నవల కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. అయినా మొత్తం మీద ఈ వ్యంగ్య రచన పాఠకుడిని ఉల్లాసంగా చివరిదాకా చదివింపజేస్తుంది.

—'పావని'.

భవాని

[రచన: కొలకలూరి. ప్రచురణ: విజయసారథి పబ్లికేషన్స్, విజయవాడ—2; 298 పేజీలు, వెల: సాదా ప్రతి రు. 6-00; మేలు ప్రతి: రు. 7-00)

శ్రీ కొలకలూరి ఇనాక్ శతాధికంగా కథానికలు రచించి పాఠక లోకానికి యిప్పటికే సుపరిచితులు. 'భవాని' కథానికల సంపుటంలో ఉన్న ఇరవైయేడు కథానికలూ వివిధ పత్రికలలో ప్రచురింపబడి చదువరుల దృష్టి నాకర్షించినవి. శ్రీ కొలకలూరి కథలు శతాధికంగా ప్రచురింపబడి గూడ అగ్రశేణి రచయితగా విఖ్యాతి నందకపోవటం చిత్రంగా కన్పిస్తుంది. సాంఘిక న్యాయాన్ని కోరుతూ సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించే రచనలను ఆదరించినంతగా పాఠకులు శైలికోసం వ్రాసేవాటిని, తీసుకున్న వస్తువుకు న్యాయం చేకూర్చే విధంగా వాతావరణాన్ని ఉపయోగించుకొనే రచనలను, కితకితలుపెట్టి నవ్వించి కాలక్షేపాన్ని కలిగించే రచనలను, ప్రేమించుకోవటంతో ప్రారంభమై పెళ్లితో అంతమయ్యే కథలను, మధ్య తరగతి సంసారి ఆర్థిక సమస్యలను పాడిందే పాటగా వ్రాసే రచనలను, కథా వస్తువు తగ్గిపోగా కథలోని వ్యక్తుల దైనందిన జీవిత చర్య నదే పనిగా వివరించే వాటిని, యింకా చిల్లర సమస్యల్ని తీసుకొని పరిష్కార మార్గంకోసం

తడుముకొనే వారి రచనలను పాఠకులు గౌరవించరు. చదువుతారుగాని వాటిని చిరకాలం జ్ఞాపకముంచుకొని తమ జీవితాన్ని అనుభవించినంతగా జీర్ణించుకొని ఆదరించరు. అందుకే మన సాహిత్యంలో కథానికలు విరివిగా వెలువడుతున్నా, పత్రికలు చేటలతో చెరిగిపోస్తున్నా నిలిచేవి కొద్దిగానే వస్తున్నాయి. జనజీవితానికి దగ్గరగా వచ్చినందువల్లనే, సాంఘికన్యాయాన్ని కోరుతున్నందువల్లనే, సామాజిక చైతన్యాన్ని ఏమాత్రంగూడ ఏమరనందువల్లనే రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడవటిగంటి, చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, బీనాదేవి, బలివాడ కాంతారావు, పురాణం వంటి వారికి లభించినంత ఖ్యాతి యితరులకు లభించటంలేదు. కళాత్మకంగా ఉన్నత శిఖరాల నందుకున్న పాలగుమ్మి పద్మరాజువంటి వారి కథల కున్నటువంటి స్థానం వేరు. సామాన్య పాఠకుల హృదయాలలో పీఠం వేసుకొని కూర్చోవాలంటే రచయిత సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించి తీరాలి. సాహిత్య విమర్శకులు కథానిక ప్రయోజనం 'ఆనందమే' గాని సాంఘికన్యాయాన్ని కోరటం కాదని వాదించవచ్చు. కాని మామూలు చదువరులు మాత్రం నేడు సాంఘికప్రయోజనాన్ని కాంక్షించే రచనలను కోరుతున్నారు.

శ్రీ కొలకలూరి కథానికలలో సామాజిక చైతన్యం ఉన్నప్పటికీ సాంఘిక న్యాయం కోసమే వీరు కలం పట్టినట్లులేదు. "కథానిక కాలక్షేపం కంటే ప్రయోజనాత్మకంగా ఉండాలని నా ఇష్టం! అభీష్టం" అంటారు శ్రీ కొలకలూరి. దీనితో ఎక్కువ మందికి భేదాభిప్రాయం ఉండదు. "ప్రతి కథలోనూ ఒక సత్యం, ఒక జీవితం చెప్పాలని నా తాపత్రయం, వాంఛ, భావన, నా ఆలోచన, ఆరాధన, తపన" అంటారు రచయిత. ఇక్కడే అస్పష్టంగా ఉన్నది. నా రనే జీవిత సత్యం సాంఘికన్యాయాన్ని కళాత్మకంగా కోరటం కాదు. జీవితంలోని వివిధ కోణాలను ప్రదర్శించ గలిగిన కథానికలు, జీవితాన్నంతటినీ ఏ ఒక్క కథానికలోనూ మోయలేవుగదా! ఎన్నుకొన్న యితివృత్తాన్ని రచయిత తన దృక్పథంనుండి ఆలోచింపచేసి, తన శైలి ద్వారా పాఠకులను ఆ యితివృత్తంవలన ఒక జీవిత సత్యాన్ని గుర్తెరింగేలాగ చేయాలని ప్రయత్నించటం శ్రీ కొలకలూరి కథానికలలో కన్పిస్తున్నది. "వస్తు వైవిధ్యంవల్ల ఒక కథలా మరో కథ వుండదు. అదొక నియమం" అని చెప్పుకొన్న రచయిత తన నియమాన్ని చక్కగా పాటించి వస్తు వైవిధ్యాన్ని పుష్కలంగా పాటించారు.

మెడుల్లా మెలిక, జీవనం, భవాని, కుమారి ఝాన్సీ వసంత, మగవాడు, కుంకుమ, చాలీ చాలని చేంతాళ్ళు, సాలెగూడులో ప్రమీల-కథలీ సంపుటిలో ఎన్నదగినవి. 'మెడుల్లా మెలిక' అనే కథలో అంజనంవేసి, పోయినవాటిని చూపిస్తానని మోసంచేసే శాంబరిని, ఆకుమీద అంజనం చూస్తూ తన వూహల్లో మునిగిపోయి కుర్రాడు ఏవేవో చెప్పేస్తే వాటిని జట్టి కథ అల్లిన జ్యోతిష్యుని, అసలీ కుర్రాడు అట్లా ఎందుకు చెప్పాడో ఏ మానసిక స్థితిగతు లందుకు దోహదం చేశాయో వాటిని—చక్కని మనస్తత్వ పరిజ్ఞానంతో వర్ణించారు. చిత్రంగా ఉంటుందని తప్ప 'మెడుల్లా మెలిక' అనే శీర్షిక యీ కథ కెలా నప్పుతుందో తెలియడంలేదు.

'జీవనం' కథలో గూడెంలో ఒక విధమైన జీవితాని కలవాటు పడిపోయి దారిద్ర్యానికి తాళలేని బీదదంపతులు పట్నానికి వలస పోవటాన్ని చక్కని శైలితో కళ్ళకు కట్టేవిధంగా ప్రదర్శించారు. రాయలసీమ కఱవునూ, పట్నాలమీద ఆశ పెట్టుకొని కడుపు చేత బుచ్చుకొని పోయే పల్లెవాళ్ళ పాట్లనూ చక్కని భాషలో వాస్తవికంగా వర్ణించారు.

ఈ పుస్తకానికి శీర్షికగా ఎన్నుకొన్న 'భవాని' కథలో 'అనంతలక్ష్మి' అనే మెడిసిన్ చదివే అమ్మాయి తమ పొరుగింట్లో ఉన్న 'భవాని' అనే పాపాయిని చూచి ముచ్చటపడి, ఆ పాప ముఖంలోని పవిత్రతను ఆరాధిస్తుంది. ఆ పాప తల్లిదండ్రులు పాపకు దిష్టి తగులుతుందని ఆ అమ్మాయిని బయటకు కదల నివ్వకపోవటంతో ఆ ఆరాధన పెరుగుతుంది. అనంతలక్ష్మి వివాహితయైనతరువాత పుట్టిన తన

పాపకు కూడ భవానిఅనే పేరు పెట్టుకొంటుంది. ఆ పాపకు మల్లేనే అలంకరిస్తుంది. అనంతలక్ష్మి పాప పెరిగి పెద్దదైన పిమ్మట, మొదటి పాప భవాని తల్లి విశాల, అనంతలక్ష్మి పిల్లను ఆదరంతో దగ్గరకు తీసుకోవటంతో ముగించారు. కొన్ని అనుబంధాలు ఎలా ఏర్పడతాయో తెలీదు. కాని అవి విడని బంధాలే. స్వల్పమైన యీ కథావస్తువును నేర్పుతో కథగా మలిచారు.

'కుమారి ఝాన్సీ లక్ష్మి' కథ కాలాతీతవ్యక్తియైన ఒక అమ్మాయి కథ. హౌరా మద్రాసు మెయిల్లో ఓ యువకుణ్ణి చూచి పరిచయం చేసుకొని ఆకర్షితురాలై అతడితో వాళ్ళింటికి వచ్చేస్తుంది. ఆ అమ్మాయిని ఎలాగో ఊహించుకొని ఆమె చెప్పే మాటల్ని నమ్మక, ఆమె టికెట్‌లేని ప్రయాణీకురాలని భ్రమపడిన యువకుడు, ఆమె హేండ్‌బాగ్‌తెరిచి హౌరా నుండి మద్రాసుకు కొన్న టికెట్‌ను చూపించటంతో విస్తుపోతాడు. నేరుగా తన యింటికే తీసుకుపోతాడు. చిత్రమైన ముగింపు యీ కథకు అందం తెచ్చింది., బలాన్ని యిచ్చింది.

'మగవాడు' అనే కథ శ్రీ విశ్వనాథశాస్త్రి 'విలువలు' కథను జ్ఞాపకం తెస్తున్నది. అదేపద్ధతి. విశాఖపట్నంలో అటువంటిదే మరొక సంఘటన. తాను అనుభవించి మోసం చెయ్యాలని ఎత్తువేసే ఒక యువకుణ్ణి ఒక అమ్మాయి తనకు పాము కరిచినట్లు నటించి పరుగులు తెప్పించి, అతడు భయపడి పారిపోయాక విషాదంగా నవ్వుకొని 'మగవాడు' అని గొణుక్కొంటుంది. ఇది కళాఖండంగా ఎన్నదగిన రచన.

చెప్పలేని దిగులును మనస్సులోనే దాచుకొని రోగుల సేవలో మునిగిపోయి, యాంత్రికంగానైనా సేవనే చేస్తూ కాలంగడుపుతున్న డాక్టర్ పద్మ, తనకులేని శాంతి అందరికీఉండాలని కోరుతుంది. తాను పెట్టుకోని కుంకుమను ఇతరులకు దానం చేసి సంతోషిస్తుంది. రచనా విధానం యీ కథలో విశిష్టంగా ఉన్నది.

'చాలీచాలని చేంతాళ్ళు' కథలో కట్నాల సమస్య యితివృత్తం. కట్నం తీసుకోవద్దనుకొన్న యువకుడికి తన చెల్లెలి పెళ్లి చెయ్యట మెలాగన్న సమస్య ఎదురవుతుంది. తాను చూడవచ్చిన పిల్ల తనకు నచ్చింది. పిల్లతండ్రి రంగారావు దయనీయస్థితికి కరిగిపోతాడు, మూర్తి అనే యీ యువకుడు. అంతలో చెల్లెలు జ్ఞాపకాని కొస్తుంది. బాగా ఆలోచించి, తెగించి, ఆదర్శాన్నే వరించి, కట్నం తీసుకోకుండానే పెళ్ళికి ఒప్పుకొని, బాధలుపడే ఓ కుటుంబాన్ని ఆదుకొంటాడు. ఈ కథ, దీని శీర్షికా యీ పుస్తకానికే విలువ తెచ్చేవిగా ఉన్నాయి.

'పాలగూడులో ప్రమీల' అనేది ఓ అభాగిని కథ. దీనిలోని శైలి విలక్షణమైనది. బెడ్‌మీద పడుకొన్న ప్రమీల అనే రోగి తన గతజీవితాన్ని నెమరువేసికోవటమే కథలో వస్తువు. హాస్పిటల్ వాతావరణాన్ని ప్రతిభావంతంగా చిత్రించారు రచయిత. పరిస్థితులకు బానిసయై పతితయైన ప్రమీల తన ప్రియునికి తగదని కలవరిస్తూ చచ్చిపోతుంది. చనిపోయే ముందు ప్రమీల మానసికమైన ఆలోచనలను, బాధను, ప్రేమను చక్కగా చిత్రించా రీ కథలో.

ఇంకా 'మల్లెమొగ్గ జాగ్రత్త' కొత్త శైలితో వ్రాసిన పాత ప్రేమకథ. ఇటువంటి కథలెన్ని వ్రాసినా శ్రీ కొంకలూరి కలం చేవదేరదు. పనిలేకుండా ఒక కుటుంబం దినచర్యలను వర్ణిస్తూ రాత్రి, మధ్యాహ్నం—సాయంత్రం అంటూ శీర్షికలు గూడా పెట్టి ఎంత చమత్కారంగా వ్రాసినా వస్తువులోలేని బలాన్ని శైలి ఎప్పుడూ ఇవ్వలేదు. 'తప్పు జరిగింది' అనే కథలో గూడ మాటలగారడీ ఉన్నంతగా కథగాని కథనంగాని లేదు.

“కథానికేతివృత్తంలో ప్రత్యేకత, విశిష్టత, సామాన్యాతీతవిభిన్నత వుంటేగాని రచన చేయలేదు.

“వస్తు స్వీకారంలో, భావన వ్యక్తీకరణలో, భాషా ప్రయోగంలో వడపోత సంక్షిప్తత అత్యవసరం—అది నేను గురిపెట్టుకొన్న లక్ష్యం”— ఇవి రచయిత 'ఆత్మ' అనే తన ముందు మాటలో చెప్పినవి. రచయిత ఆశయాలు కొంతవరకే పాటింపబడినాయని ఆయా కథల్ని చదివినప్పుడు తెలుస్తుంది.

ఈ సంఘాన్ని ఒక మహారచనగా భావించే యీ రచయిత తన పరిధిని విస్తృతం చేసుకోవ

టానికి తానెప్పుడూ చదువుతూ ఉండే పుస్తకం ఈ లోకమని పేర్కొనడం చాల బాగున్నది. ఈ లోకాన్ని చదివితేనే చాలదు. ఆ పుస్తకంలోని అచ్చుతప్పుల్ని సవరించి, అర్థమయ్యే భాషలో అందించాలి. ఈ లోకపు నడవడిని మంచి మార్గానికి మలుపు తిప్పే రచనలను చెయ్యటానికి యీ రచయిత ప్రయత్నం చెయ్యాలి. అందుకు సాంఘిక న్యాయాన్ని తన రచనల ద్వారా కోరటం ఎంతైనా అవసరం.

నల్ల రేగడి

(నవల., రచన: పాలగుమ్మి పద్మరాజు. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో— మచిలీపట్నం— మద్రాసు— సికింద్రాబాదు., 176 పేజీలు., వెల: రూ. 2.)

పాలగుమ్మి పద్మరాజుగారీ దశాబ్దంలో నవలారచయితగా బయటికి రావటం హర్షదాయకం. 'చచ్చిపోయిన మనిషి' 'వచ్చి సాధించాడు' వంటి అనువాద, అపరాధ పరిశోధక నవల లాయన ఏనాడో వ్రాసినా, యిటీవల ఆయన వ్రాసిన 'బ్రతికిన కాలేజీ'— 'రెండవ అశోకుడి మూణ్ణాళ్ల పాలన' అనే నవలలు ప్రయోగాత్మకమైనవి. బ్రతికిన కాలేజీ హాస్యప్రధానంగానూ, రెండవ అశోకుడి మూణ్ణాళ్ల పాలన వ్యంగ్య ప్రధానంగాను వ్రాయబడినవి. 'నల్లరేగడి' అనే యీ నవల కమ్మని తెలుగు నుడికారంతో, చక్కని పల్లెటూరి జీవితాల చిత్రణలో, పల్లెటూరి పట్టుదలలనూ, తగాదాలనూ, కోర్టుల కెక్కటాలనూ, మళ్లీ దొమ్మీలకు దిగటాలనూ వర్ణించటంలో గొప్ప ప్రజ్ఞను కనబరచింది. ఊరచెరువు లాగే గ్రామ జీవితం ప్రశాంతమైనది. చెరువులో మట్టిపెళ్లను పడవేస్తే వలయాలనంతంగా ఏర్పడినట్లు, పల్లెటూరి పెద్దల్లో కలహాలొస్తే అవి ఊరిని ఒకంతు చూసి గాని వదిలిపెట్టవు. మునసబు రామయ్య—సుబ్బయ్య కాపు కుటుంబాల మధ్య ఉండే ఆత్మీయత, మాట పేచీలతో కలహాలకు దిగి ఊరినెలా కలగుండు పరచిందీ 'నల్లరేగడి' నవలలో వర్ణించారు.

పద్మరాజుగారి వచన రచనా శైలి విలక్షణమైనది. కవనానికుండే కమ్మదనమూ, లోతైన భావనా, కదలించేశక్తి పద్మరాజుగారి వచన రచనకున్నాయి. పద్మరాజుగారు రసవంతమైన కవిత్వ వ్రాసినట్లే నాటి యువతరానికి తెలియకపోవచ్చు. కాని భావకవిత్వము దేశాన్ని ఉర్రూత లూపిన దినాలలోనూ, అభ్యుదయకవిత్వోద్యమపు తొలి నాళ్లలోనూ పద్మరాజుగారు రసవంతమైన కవిత్వం వ్రాశారు. 'వకాస్రబలి', 'లోన—బయట' వంటి కావ్యఖండికలు ప్రతిభలోనూ, 'పురిటి పాట' 'కల్పన'లోనూ చదివిన రసజ్ఞులు వాటిని స్మరించుకుంటూ ఉంటారు. వారి కవితలు పుస్తక రూపం దాల్చకపోవటం తెలుగు కవిత్వానికి వెలితి. ఆయన కథలతో పరిచయమున్న వారందరికీ ఆయనలో కవి దాగి ఉన్నట్లు తెలుసు. పుస్తక రూపం పొందకపోయినా ఆయన రచించిన రేడియో నాటికలు శ్రోతల కెందరికో శ్రవణానందాన్ని కల్గించినాయి. "నేటి ఉత్తమ నాటికలు" అనే సంకలనంలో వచ్చిన 'రాధాకృష్ణ' అనే పద్మరాజుగారి నాటిక స్వచ్ఛందమైన కవిత్వంలో నిండినదే. పద్మరాజుగారి వచన రచన కృష్ణశాస్త్రిగారి కవిత్వాన్ని, వచనాన్ని తలంపుకు తెస్తుంది.

'నల్లరేగడి' నవలలోని మొదటి అధ్యాయాన్ని చదివితే పద్మరాజుగారు ప్రకృతి నెంత నిశితంగా పరిశీలించి, సూక్ష్మమైన అంశాలను గూడ వర్ణించి రసవత్తరమైన కవితగా మార్చగలరో తెలుస్తుంది. "పిల్లలకీ రేగడికీ పొత్తు, పిల్లలూ మెత్తన, రేగడీ మెత్తన—మనసు చల్లగా ఉన్నప్పుడు, వాన కురిసినప్పుడు." "మెత్తని ఎండ ముదురుతుంది. రేగడి బీటలు తీస్తుంది. మెత్తని రేగడిలో మనుషులూ పశువులూ కాళ్ళ ముద్రలు వేస్తాయి. ఆ ముద్రలు పగులుతాయి. సూదుల్లా— ఆకారంలేని ఇనప గడ్డల్లా బిగుసుకు పోతుంది రేగడి."

"పగిలిన నల్లరేగడి దాహంగా నోరు తెరుస్తుంది, ఆకాశం వంక. దాని నాలుక ఎండిపోయి ఎక్కడో లోపలికి లాక్కుపోయింది. మొక్కల వేళ్లని తన దాహంతో కాల్చేస్తుంది రేగడి—మొలకలు లేనప్పుడు. మొలిచినవి చచ్చిపోతాయి—కాని

రేగడి చచ్చిపోదు. ఎప్పటికీ చచ్చిపోదు. ఎప్పుడో అమృతం తాగింది రేగడి. అంచేత దానికి మృత్యువు లేదు. రేగడి ఆకాశం వంక నోరు తెరిచి ఘోర తపస్సు చేస్తుంది. ఆ తపస్సు వేడికి లోకమంతా అట్టుడికి పోతుంది. తాపోగ్రత దుర్భరమై పోయి జీవరాశులు విలవిలలాడి పోతాయి. అప్పుడు ఫలిస్తుంది—రేగడి తపస్సు. చల్లని వాన కడవ పోతగా కురుస్తుంది. ఆబగా తాగుతుంది రేగడి వాన నీరు—మరో ఏడాది పంటలకు ప్రాణం పోస్తుంది. మనుషులికీ పశువులికీ ప్రాణం పోస్తుంది.

"పిల్లలకు రేగడికీ పొత్తు. మరిచేవాడి చేతిలో రేగడిముద్దలు పిల్లలు"–తెలుగు నేలను—నల్లరేగడి నేలను యింత చక్కగా కవితాత్మకంగా వర్ణించిన వచన రచయిత లేరనటం అతిశయోక్తి కాదు. తెలుగు పల్లెల యితివృత్తాలను తీసుకొని నవలలు వ్రాస్తున్న రచయిత లీవాడు నల్లపూసలై పోతున్నారు. నవలా రచయితలలో చెక్కుమందికి పట్టణ జీవితమూ, నగర జీవితమూ పరిచితమై నంతగా పల్లెపట్టులతో పరిచయం ఉండటంలేదు. ఏ ఒకరిద్దరికో ఉన్నా, వారైనా పల్లెటూరును దూరంగా చూచి, పైపైన వర్ణిస్తున్నారే తప్ప, పల్లెలలోని భాషనూ, దానిలోని జీవాన్ని, వాళ్ల మనస్సులనూ ఒడిసి పట్టుకొని నవలగా మలచు కోగలిగిన వాళ్లు మిక్కిలి అరుదు. 'నల్లరేగడి' నవలలోని భాష పశ్చిమ గోదావరి జిల్లాలోని పల్లెటూళ్ల భాష. ఇది ఎంతో సహజంగానూ, ఇంపుగానూ, వాళ్ల మనోభావాలను వెల్లడించేదిగానూ, వాళ్ల సంబంధాలను సరిగ్గా తెలియజేసేదిగానూ ఉన్నది. నవల ఆసాంతమూ పల్లెటూరి మనుష్యుల భాషతో నిర్వహించటం చాల కష్టమైన పని. అట్లాగని నవలలోని కథావస్తువు పలచబారి పోతే దానివలనగూడ ప్రయోజనం అంతగా ఉండదు. 'నల్లరేగడి' నవల కొంత సినిమా వాతావరణాన్నీ, సినిమా దృశ్యాలనూ కూర్చుకొన్నప్పటికీ తెనుగుదనాన్ని పూర్తిగా మాత్రం కోల్పోలేదు.

సాధారణంగా పల్లెటూళ్లలో కన్పించే తంపుల మారి కరణం; మనుష్యుల్ని ప్రేమించటం తప్ప ద్వేషించటం ఎరగని అమాయక హృదయాలు గంగప్పా, అతడి చెల్లెలు మల్లీ; ముసలి రామయ్య కాపు అండచూసుకొని ఆకతాయి వేషాలేసే రంగడూ; తమ కాపులు చెయ్యమంటే ఏ పనైనా చేస్తూ, ప్రాణాలు తియ్యమన్నా వెనుకాడనిపాలేళ్లూ, పొలం పనులలోకి వచ్చే కూలీలు; యింకా ఎందరినో పల్లెల వాస్తవ జీవితాన్ని మరుగున పడి పోకుండ, నవలా శిల్పానికి భంగం రాకుండ వర్ణించారు. ఎటొచ్చీ యీ నవలలోని కథానాయకుడు రాజా వంటి ఆదర్శయువకులుగానీ, మల్లిలాగ తెగించి ఆదర్శం కోసం, ప్రేమకోసం తెగించే ఆడపిల్లలు గానీ తెలుగు పల్లెటూళ్లలో కాగడా వేసి వెదికినా కన్పించకుండ ఉన్నారు. బహుశా యీ పాత్రలు సినిమాలలో నుండి ఊడిపడి ఉండవచ్చు. నిజ జీవితంలో నుండి పాత్రలు సినిమాలకు వెళ్లక పోవటం, సినిమా రచయితలే ఊహామాత్రమైన పాత్రలను సృష్టించి ప్రేక్షకులను చిచ్చుకొడుతూ ఉండటం చూస్తూనే ఉన్నాం. పద్మరాజుగారి వంటి రచయితలు సినిమా పాత్రలను సాంఘిక నవలలలోనికి దింపబూనటం శోచనీయం.

సుబ్బయ్య కాపు కొడుకు రాజా చదువుకొని వ్యవసాయంలో దిగి ట్రాక్టర్ తెచ్చి సాగు మొదలెట్టిన ఆదర్శయువకుడు. తాను పెళ్లయ్యాక వేరే యిల్లు ఆధునిక పద్ధతులలో, పూలతోటలతో సహా కట్టుకొని తన వేరింటి కాపురాన్ని స్వర్గంగా మలచుకోవాలని కలలు కంటాడు. కట్నం తీసుకోక పెళ్లి చేసుకోవాలనీ, గట్లు దున్ని పారేసి సహకార వ్యవసాయం పెట్టాలనీ అనుకొన్న ఆదర్శవాది. అతడి కలలు కల్లలుగా మారిపోతాయి. రాజా వంటి యువకులు పల్లెటూళ్ళలో ఉన్నారను కోవటం కేవలమూ భ్రమ. సినిమా హీరోని సాంఘిక నవలలోకి దింపటమే. ఊరి అమ్మవారు మల్లమ్మ గుడికి, విత్తనాల ధాన్యాన్ని సమర్పించి దీవనలు పొందటానికి వస్తారు ప్రజ. పెద్దకాపులైన సుబ్బయ్యా రామయ్యలు కూడ వస్తారు. రామయ్య కాపు బంధువు రంగడూ, సుబ్బయ్య కాపు పని కొచ్చిన పద్దాలూ గుడి మీద ఎదురై పోటీలు పడి కొట్లా

టకు దిగుతారు. అక్కడి నుండి ఆ రెండు కుటుంబాల మధ్య సఖ్యం వైరంగా మారిపోతుంది. వాళ్ల తగాదాలో ఊరు భగ్గుమని, రెండు పార్టీలుగా తయారై క్రమంగా బూడిదగా మారుతుంది. ఈ నవలలో కీలకమైన పాత్ర కరణం ధర్మరాజా. పద్మరాజుగారీ పాత్రను సృష్టించటంలో అసాధారణమైన ప్రతిభను కనబరచారు. కరణానికీ, ఆ ఊళ్ల మాసె గానుగాడే తెలకుల మంగమ్మకీ ఉన్న సంబంధం దగ్గర నుండీ, తంపులమారి కరణపు బుద్ధినీ, తన కేలాభం లేకపోయినా తగాదా పెట్టి సర్వనాశనానికి దారితీసే ధర్మరాజా బుద్ధినీ చక్కగా చిత్రించారు. ముఖ్యంగా కరణం భాషను పద్మరాజుగారు వ్రాసినంత సొంపుగా వ్రాయటం అనితరసాధ్యమనటం అతిశయోక్తి కాదు.

పల్లెటూళ్లలో సాధారణంగా జరిగే మరొక దృశ్యం— ఒక భూస్వామి కొడుకు ఎవరైనా హరిజన స్త్రీల పైన కన్నేసి, చెయ్యి పట్టుకొని అవమానిస్తే, ఆ హరిజనులకు పట్టరాని ఆవేశం వచ్చినా, ఆ భూస్వామి కొడుకును చంపాలని అనిపించినా ఏమీ చెయ్యలేని వాళ్ల అశక్తతనీ; తన వాడు చేసింది తప్పని తెలిసినా కూలివాళ్ల రెచ్చిపోవటాన్ని సహించలేని భూస్వాముల మనస్తత్వాన్నీ; భూస్వాముల్నే సమర్థించే ధర్మరాజు లాంటి దళారీలనూ కళ్లకు కట్టేలా వ్రాశారు. అట్లాగే హరిజన స్త్రీల పాతివ్రత్యాన్ని పనిగట్టుకొని 'సామ్యవాద' రచయితల మాదిరి పొగడలేదు. సుబ్బయ్య కాపు బంధువు గంగప్పకూ, పద్దాలు కూతురు రావికీ మధ్య ఆకర్షణ—సంబంధమూ కూడ బయట పెడతారు. పెద్దవాళ్లు తమ వ్యసనాల్ని చాటుగా కొనసాగిస్తూ తమ పిల్లలు వ్యసనపరులైనా మనస్సులో ఏమీ బాధ పడకపోవటాన్ని, వాళ్ల పిల్లలు వ్యసనాలతో రగడ తెచ్చుకొంటే మాత్రం మందలించబోయే పెద్దల బుద్ధుల్ని ధర్మరాజు, రామయ్యకాపుల లోను సున్నితంగా వర్ణించారు.

పంచాయతీ ఎన్నికలు ప్రజల నీతి నియమాల నెంత ధ్వంసం చేస్తున్నాయో విపులంగా వర్ణించారు. ఎన్నికలలో గెలవటాని కెంత పనికైనా వెనుదీయని రైతుల మనస్తత్వాన్ని చక్కగా వివరించారు. రెండు కుటుంబాల మధ్య ప్రారంభమైన తగాదాలు చినికి చినికి గాలివానై అమాయకులైన రాజుమేనగోడలు మల్లిని బలి తీసుకోవటంతో నవల ముగుస్తుంది. ఈ నవలలో ప్రధాన పాత్ర వహించిన గణాచారి కూడ యీనాటి సామాజిక వ్యవస్థలో మిక్కిలి అరుదేనని చెప్పాలి.

'నల్లరేగడి' నవల ద్వారా పద్మరాజుగారు తమ ప్రత్యేకమైన వచన రచనా శైలితో సాంఘిక నవలా రచయితలలో విశిష్ట స్థానం సంపాదించుకొన్నారు. గ్రామ జీవిత యితివృత్తాన్ని స్వీకరించి సాంఘిక నవలలు వ్రాయగలిగిన మంచి రచయితలు మిక్కిలి అరుదైన యీనాడు పద్మరాజా గారు గ్రామీణ జీవితేతివృత్తాన్నే చేపట్టి యింత చక్కని నవల వ్రాయటం మెచ్చదగినది. తెలుగు సినిమా ప్రభావం యీ నవల పైన అనవసరమైనంతగా చోటు చేసుకొన్నది. పాలగుమ్మి పద్మరాజు గారి కమ్మని, తెనుగు నుడికారంతో కూడిన వచనంలో కవిత్వ మనదగిన మంచి భాష కోసమైనా యీ నవలను రసజ్ఞు లెల్లరూ చదవాలి. పద్మరాజు గారి పాత్ర చిత్రణా నైపుణ్యం కూడ—రాజు—గణాచారి—వంటి కొద్ది పాత్రల్ని మినహాయిస్తే, చదువరులను ముగ్ధుల్ని చేస్తుంది. ఇతివృత్తం పట్ల మరింత శ్రద్ధ తీసుకొని ముగింపును మరీ సినిమాటిక్‌గా తయారు చెయ్యకుండా ఉంటే యిది తెలుగులోని ఉత్తమ నవలలలో ఒక్కటిగా ఎన్నిక చెయ్యటానికి వీలయ్యేది.

—రామమోహనరాయ్.

ఆంధ్రపద్య గీతాంజలి

(ప్రథమ ముద్రణ)

(ప్రకాశకులు : శ్రీ సరస్వతీయ బుక్ డిపో, రాజంపేట—కడప జిల్లా. మూల్యము 3—00. అనువాదము : డా॥ వే-ఆ-శర్మ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాల—తిరుపతి.)

విశ్వకవిగా ప్రఖ్యాతి గాంచిన రవీంద్రనాథ ఠాకూరుకు నోబెల్ బహుమానము వందించినది

ఆయన 'గీతాంజలి'. అప్పటి నుండి దీనిని తమ తమ భాషలలోకి కొందరు పరివర్తన చేసినారు. ప్రప్రథమముగా (1913 లో కావచ్చు) ఆదిపూడి సోమనాథరావుగారు దీనిని తెనుగులో తేటగీతులుగా నందించినారు. రవీంద్రుని బెంగాలీ మాతృకకు దగ్గరగా ఆంగ్ల పరివర్తన జరిగినది. వంగ— ఆంగ్ల— రచనలను ఆధారముగా చేసుకొని ఎవరికి వచ్చినట్లు వారు అనువాదములు చేసినారు. నేటి వరకు సుమారు అరడజనుకు పైగా ఈ యను వాదములు వచ్చినా— వారి వారి రచనా విదగ్ధత ననుసరించి కీర్తి—ప్రతిష్ఠలు వచ్చినవి.

1969 సంవత్సరమున శ్రీ శర్మగారి యను వాదము ముద్రణమైనది. సరిగా ఈ వత్సరము లోనే వరంగల్లు వాస్తవ్యులై యుండిన శ్రీమాన్ చిలుకమర్రి రామానుజాచార్యుల వారి 'గీతాంజలి' బయలుదేరినది. ఆచార్యులవారి రచన బెంగాలీ మాతృకకు చాలా దగ్గరగా నున్నది. శర్మగారి రచనయేమో 'వంగమూలము పరిశీలించు నపుడు ఆంగ్ల పరివర్తనములోనే కొన్ని నూతన భావములున్నట్లును— వంగ మాతృక ననుసరించి, అనువాదము నందు స్వాతంత్ర్యమంతగా నుండనట్లు దోచినది. కనుక ఆంగ్లమునే యనుసరించితిని—' అని తెల్పినారు. దీనివలన కొన్ని కొన్ని స్థలము లలో పెరుగుదల, మరికొన్ని స్థలములలో సంక్షిప్తను కన్పించును. ఇది బాగుగా పరిశీలించిన వ్యక్తమగునట్టిది. అనువాదము చేయునపుడు ఇట్టి పద్ధతి తప్పనిసరి. వీరి రచనయందు బిగువు కలిగి, పద్యరచన యందు సంయమనము, చక్కని భావుకత— వినయము— అనునవి ప్రతి ఖండికలోను ప్రస్ఫుటమగుటయే గాక— పాఠకుడు ఆనందించు పద్ధతిగా సాగిన దీ రచన—అనువాదకుల యందు ఏ కొద్దిమందికి మాత్రమో యిట్టి పద్ధతి సాధ్యము. ప్రతియొకరిదృష్టికి మూలము నందలి అందచందాలు వేరు వేరుగా స్ఫురించు నమట— అనుభవపూర్వకమైన విషయము. ఒక్కనికే యివి యన్నియు స్ఫురించుననుట నమ్మరాని సత్యము

అనువాదకునకు— మూలరచనపై అభిమా నమే గాక రచయిత మీద భక్తి యుండుట యవ సరము. వీటికి తోడు— మూలగ్రంథాంతరములగు వివిధ భావనలను గ్రహించు శక్తి యుండుటయు తప్పనిసరి యవసరము. ఇట్టి మహాత్మును లక్ష్య ముతో సాగిన రచన ఈ 'గీతాంజలి'.

రవీంద్రుని గీతాంజలిలో 'నీవు' 'నేను' అను పాత్రలు రెండు మాత్రమే. పాఠకుడు దీనిని తత్వ సంహితయా— లేక కావ్యమా అని భావించుట మామూలు. మానవతావాది (Humanist) యగు రవీంద్రుడు, త్యాగరాజు— కబీరుల వలెనే తనదైన యనుభూతి తనదిగా పాడుకున్నవాడు. సాధకుడైన కవి తత్త్వాన్వేషణకు ఎంత దగ్గరగా ఉన్నది తెలుపునట్టి నిజవ్యక్తిత్వావిష్కరణము ఈ గీతాంజలి యనవచ్చును.

దీనిలో భక్తి, నాయికా నాయకుల ప్రేమ, స్నేహము, వాత్సల్యము—ఇవియే గాక, నిష్కామకర్మ, అద్వైతజ్ఞానము, నిర్జీవ సంప్రదాయములు, ఆచార ములు, ఆడంబరములు, విప్లవాత్మక గీతములు— మొదలైనవి గలవు—

మూలముతో సరిపోల్చి— తులనాత్మకముగా తెలుపుట యనునది కొంతవరకు అనావశ్యక మన వచ్చునేమో! పరివర్తనములకీ పద్ధతి యొక మహా గుణముగా నుండును. శ్రీ శర్మగారి యనువాదము—

'లెక్కలేనన్ని సిరులు ఫలింపజేసి
యెండ్ల పర్యంత మిచ్చెద వింక నీవు
పరిలఘువులైన నాకర పల్లవములు
కలదు గొనుటకు చోటును వలసి నంత'

(ఖండిక—1)

దీనియందు భక్తిభావము స్పష్టమగుచున్నది. ఈ పద్ధతిలోనే 38, 45, 56, 65, 103 సంఖ్యగల ఖండికలు—

'అపుడు వచ్చితి వీవు నీ యడుగులైన
వినబడవైలేదు నీ క్లాంత వీక్షణాలు
నాపయింద్రవాకె ప్రశాంత హీన స్వరాన
'నేను పాంథుడ డప్పి జనించె' నంటి
నపుడు నా ఘటికలల నాపి నీదు
దోసిటంబోసితిని ఘటతోయములను!

ఖండిక—54

ఇది నాయికా నాయకుల ప్రేమను చిత్రించే గీతము— 'నీ యడుగులైన వినబడనె లేదు' అని నపుడు— అడుగుల చప్పుడు— సవ్వడి—వినబడనే లేదని పాఠకుడు గ్రహించవలసియుండును.—ఈ వాక్యము నందు—అసంపూర్తిగా భావమున్నది. ఇట్టి స్థలములు మరికొన్ని గలవు. 'దోసిటంబోసితివి ఘటతోయములను' అను వాక్యము చదువునపుడు— గాథాసప్తశతిలోని సన్నివేశము జ్ఞప్తికి రాకమాన దనుకుందును. 'ఒక బాటసారి పిపాసాతురుడై రాగా ఆయన దోసిట ఒకకన్య నీరు బోయుచున్నది. దోసిటిలోని నీరు కారిపోవునట్లు వ్రేళ్లను సందు చేసి— ఆమె సౌందర్యమును చూచుచు పరవశు డయినాడట.' ఇది యందులోని భావము. ఈ పద్ధతి గీతాంజలియం దీ సందర్భమున కొంత తొంగి చూచినది.

దీనికన్న చిలుకమర్రివారి అనువాదములో భావము చక్కగా నున్నది.

'నమ్రుతరి నీదు కాలి సవ్వడిని గూడ
నేను వినలేదు—ఖేదము నిండియున్న
చూపు నాపయి వ్రాల్చి సంతాపదీన
మైన క్షీణ స్వరమ్ముతో 'నయయొ దప్పి
గొన్నపథికుడ ' నంచు నీవన్న యపుడె
పగటి కల నుండి నే త్రుళ్లిపడుచు లేచి
కడవ లోపలి విమలోదకములు నీ క
రాంజలిం బోయదొడిగితి నపుడు.' (చిలుక
మర్రి...')

ఈ క్రింది గీతములో విప్లవాత్మకభావము గన్పించును—

ఎండవానల లెక్కింపకుండ దొడగి
కఠినవగౌ మేదినిం జీల్చు కర్షకులను
గండశిలలు పగిల్చి మార్గములు వేయు
కష్ట జీవుల పరమాత్మ గాంచవోయి!
....
దమ్ము గుడి బాసి యవకుంఠనమ్ము దీసి
వారు కష్టించి జీవించు వసుధ కైకి
(ఖం. 11)

అనువాదకులు— 'పల్వల సమీపమున గూల బడితి నేను' (ఖం. 48) అని వ్రాసినారు. దీనికన్న

నీటి చేరువ పచ్చిక నేల మీద
బడలుపడి యున్న నా యొడల్ వాల్చుకొంటి'
(చిలుకమర్రి ఖం. 48)

అనిన పద్ధతి సుగమంగా కన్పించును.

పల్వలముకన్న— జలమనుట మంచిది కదా!

ఈ విధముగా కొన్ని కొన్ని చోట్ల అనుమానములు కలిగించినను రచన యందు వైవిధ్యము చూపినారు.

'జనకు డుగ్రత దాల్చిన సమయమందు
జనని బరపెడు సాశ్రువీక్షణమువోలె'

చాలాచక్కని భావముతో బాగుగా సాగిన రచన. ఇట్లే చాలాభాగము. కవి తన రచన ద్వారా ఉపదేశము, రసానందమును చేకూర్చునని ప్రాచీనుల మతము. అట్టి పద్ధతి యీ యనువాదమున కన్పించును. రవీంద్రుని 'గీతాంజలి'కి వలె— 'ఆంధ్ర పద్య, గీతాంజలి' ప్రసిద్ధి నందవలయునని యాశింతము.

ఆంజనేయ రామాయణము

(వచనము 3 సంపుటములు)

[రచయిత: ధర్మవరపు సీతారామాంజనేయులు. వెల: సంపుటి ఒకటికి 3—00. ప్రచురణ:— డి. వి. యస్. పబ్లికేషన్సు— కారంచేడు (P. o); చీరాల (Via); గుంటూరు జిల్లా]

వాల్మీకి మహర్షి దివ్యవాణీనిసృతమునైన శ్రీమద్రామాయణము— సంస్కృతవాఙ్మయమునకు ఆదికావ్యము—. శిరోధార్యము. దీనిని తమ తమ మాతృభాషలలోనికి పలువరు పరివర్తనము చేసినారు, చేయుచున్నారు. వాల్మీకి లేఖనీ ప్రభావము, రాముని దైవత్వము— అట్టివి.

భాస్కర— రంగనాథ— మొల్ల— గోపీనాథ— రామాయణముల వలెనే కవినామాంకితముగా వెలువడిన రామాయణములలో నిదియొకటి. కవిపేరు సీతారామాంజనేయులు; రాముని భక్తుడు ఆంజనేయుడు గలడు; ఈ రెండు విధములుగను గ్రంథ నామము అన్వర్థమైనది.

శ్రీ సీతారామాంజనేయులుగారు కృతికర్తగను,

కృతిభర్తగను సాహితీలోకమునకు పరిచితులు. విశ్వనాథ వారి భ్రమరగీతలను వీరు కృతి నందిరి.

పద్య— గద్య— చంపూరూపములనే గాక అనేకవిధముల రామాయణము తెనుగు చేయబడినది. అద్యతనాంధ్రసాహితీ కాలములో పురిపుండవారి రామాయణము, రాజాజీ రామాయణము సులభ శైలిలో వచనముగా వ్రాయబడినవి.

శ్రీ సీతారామాంజనేయకవిగారు సులభశైలిలో సర్వజనగ్రాహ్యముగా— ఆడంబర రహితముగా దీనిని వచనములో చేసినారు. ఇది ఈ మధ్య వచ్చిన వచన రచనలలో శ్రేష్ఠముగా నుండగల దనవచ్చును.

పద్యరచనకన్న— గద్యరచన కవికి శ్రమ కలిగించును. చక్కని— చిక్కని తేట తెనుగు వ్రాయ గలవారు చాలా తక్కువ. 'గద్యం కవీనాం నికషం వదంతి' గదా!. ఈ కవిగారి వచనము కాఠిన్య రహితముగా నున్నది:

శ్రీనివాసస్వామికి అంకితముగా రచింపబడిన ఈ రామాయణమును 'కారంచేడు సాహితీ సమితి' స్వర్ణోత్సవ ప్రచురణము చేసి ప్రచురము గావించి సాహితీలోకముచేత అభినందలకు పాత్రు లయినారు. మూడు సంపుటములుగా రచింపబడిన ఈ గ్రంథము వివరములు—

ప్రథమ సంపుటము:— బాల— అయోధ్య కాండలు. 300 పుటలు; అభిప్రాయములు— పీఠికతో 60 పుటలు.

రెండవ సంపుటము:—అరణ్య— కిష్కింధ— సుందర కాండములు, (38+344=382 పుటలు).

మూడవ సంపుటము:— యుద్ధ కాండము. (36+278=314 పుటలు). మొత్తము 1003 పుటలలో 134 పుటలు అభిప్రాయములకు పీఠికలకు ప్రశంసలకు కేటాయింపబడినవి.

సులభశైలిలో వ్రాయబడిన యీ రామాయణమునందు మధ్య మధ్య ముఖ్యములైన శ్లోకము లను చేర్చి, వాని భావములను వివరించినారు. కాని వీ రుదాహరించినవి ముఖ్య శ్లోకములో కావో, కాని (వారి యభిప్రాయముగా) ప్రసిద్ధములైన కొన్ని శ్లోకములే చేరలేదు—

కవిగారు— అవాల్మీకీయ విషయములకు తావొసంగ లేదు. అహల్యను శిలగా మారునట్లు శపించుటయు— రావణుని ఉదరములో అమృత భాండము గలదనుటయు— అవాల్మీకీయ విషయము లలో కొన్ని. (మూలములో శిలగా గమ్మని అహల్యను శపింపలేదు. కాని మన తెనుగువారు శిలను చేసినారు.) వచన రచనలో వ్యావహారికములుగా నున్న రూపములు కొన్ని స్థానము చేసికొనినవి. అయినను— అవి 'సంకుసబోసిన తీర్థము'గా మార్పు చెందినవి.

ఆంజనేయ రామాయణము ప్రథమ సంపుటమునందు రామాయణమును గూర్చిన 'దివ్య సూక్తులు' చేర్చి 'ఇదం రామాయణం కృత్స్నం గాయత్రీ బీజ సంయుతమ్'' అనే గాయత్రీ రామాయణం (25 శ్లోకములు) చేర్చినారు.

'ఊన షోడశ వర్షో మే
రామో రాజీవ లోచనః
నయుద్ధయోగ్యతా మస్య
పశ్యామి సహరాక్షసైః'—(బాల).

అను శ్లోక భావము:—'రాజీవలోచనుడైన రాముడు నిండుగా పదునారేళ్ళ యీడువాడు కానివాడు. రక్కసుల సంహరించు శక్తి వానికెక్కడిది?' అని కవిగారు వ్రాసిరి.

'ఊనషోడశవర్షః'— అనగా ''పదునారు వత్సరములకు కొద్ది తక్కువవాడు''— అని ఒక సుప్రసిద్ధ విమర్శకుల వ్రాత.

అరణ్య— కిష్కింధ— సుందర కాండములతో నున్నది రెండవ సంపుటము. అరణ్య— కిష్కింధ ములతో సుందరము చేర్చక ప్రత్యేకముగా సంపుటీకరించినచో బాగుగా నుండెడిది.

''చంద్రబింబ సమాకారం
వాంఛితార్థ ప్రదాయకం—
హనుమత్సేవితం ధ్యాయేత్
సుందరే కాండ ఉత్తమమ్''— అనిగదా.—

అంతేగాక— రామాయణమునంతటికిని ముఖ్యమైనది సుందర కాండము—ఇది మంత్ర శాస్త్రయుక్తమైనది: (చూ. రామాయణ రహస్యములు— షోడశి. శ్రీ గుంటూరి శేషేంద్రశర్మ— రచన)

'తతోరావణనీతాయాః సీతాయాశ్శత్రుకర్శనః
ఇయేష పదమన్వేష్టుం చారణాచరితేపథి'—అను సుందర

కాండ ప్రారంభ శ్లోకమును చేర్చి— రచయిత కాండను వచనము చేసినారు.

మూడవ సంపుటమైన యుద్ధకాండము ప్రత్యేకముగా గలదు—(యుద్ధరంగము ప్రత్యేకముగా నుండవలెను గదా!) రాముని పట్టాభిషేకముతో ఈ కాండమును పూర్తి చేసినారు. 'ఆదిత్య హృదయము'లోని కొన్ని శ్లోకములు ఉదహరించనైనవి:

'సులభాః పురుషా రాజన్
సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య
వక్తా శ్రోతా చ దుర్లభః' అనునట్టి కొన్ని

శ్లోకముల భావము రమణీయముగా వివరింపబడినది— కవిగారి వచన రచనకు మచ్చు—

'అదిగో పరమ పావని హిమవంతుని జ్యేష్ట పుత్రికయగు గంగాదేవి— నదీ రూపమున సకల జనులను పావన మొనర్చుటకు దిగివచ్చుచున్నది—. అవిగో స్ఫటికము వలె స్వచ్ఛమై ఏనుగు తొండముల ప్రమాణము గల్గి భయంకర ధ్వనులతో క్రిందికి వచ్చుచున్న పవిత్ర గంగానదీజలధారలు—'(బాల— 65 పుట).

ఈ ప్రకారముగా రచన గలదు:—

'పండితాభిప్రాయములు'— 'అభినందనలు' మొదలగునవి ప్రతి సంపుటము నందును హెచ్చుగా గలవు. ఈ గ్రంథములేగాదు—కొంతకాలము నుండి తెనుగు సాహిత్యములో బయలు వెడలుచున్న ప్రతి రచనకును (ఏ ఒకటి రెండో దప్ప) ఈ అభిప్రాయముల పిచ్చి మరీ హెచ్చయినది. ఈ వ్యాధి ఎంత త్వరలో మాయమైన (కనీసము తగ్గినా) సాహిత్యకులకు అంతమంచిది కావచ్చును.

ఈ రచన(ల)కు అచ్చు తప్పుల పట్టికలు లేవు. చెప్పుకోతగిన ముద్రారాక్షసులను కనిపింపరు. కాని— 'మండోదరి' వంటివి గలవు—('మందోదరి' గదా). 'చూడామణి' 'చూడమణి'గా గలదు—

ఇవి ఏ విధముగానైన పాఠువులుగా అయినచో అగునేమో!

వెయ్యి పుటలకు హెచ్చుగా నున్న ఈ (వచన) రామాయణము పాఠకునకు స్వల్పమూల్యమునకే లభించునట్లు చేసిన సాహితీసమితి కృతజ్ఞతా పాత్రము.

'కాలముబట్టి దేశమునుగాంచి—' రచనయందలి గుణము ననుసరించి సాహితీలోకమున వ్యాప్తినందగలదు— హనుమ రామునితో—

'దేహబుద్ధ్యాస్మి దాసోఽహం
జీవబుద్ధ్యా త్వదంశకః
స్వాత్మబుద్ధ్యా త్వమేవాహం
ఇతిమే నిశ్చితామతిః'— అనినాడు.

'జలాల్ నామా'

(అక్బరు చరిత్ర)

(రచన—షేక్ బుడన్ సాహెబ్, బి. ఏ. బి.ఎడ్. పబ్లిషర్స్—యల్. అబ్దుల్ సలాం. 18/78 మియ్యా సాబ్‌వీధి, కడప. వెల: 4—00)

మొగలు సామ్రాజ్యమును పరిపాలించి చరిత్రలో సుప్రసిద్ధుడైన 'జలాలుద్దీన్ అక్బరు పాదుషా' చరిత్రను దెలుపు అయిదాశ్వాసముల పరిమితిగల పద్య కావ్యము. దీనియందు అన్నియు పద్యములే. (సుమారు 772 గలవు.) రచయిత శ్రీ షేక్‌బుడాన్ సాహెబ్‌గారు 'ఖుతుబ్‌నామా' యను నొక రచనతో సాహిత్య లోకమునకు భూత పూర్వ పరిచితులు. ఈ రచనతో మరింత విశ్రుతకీర్తులు.

చరిత్ర రచన చేయుట యనునది కష్టసాధ్యము. ఏదేని యొక విషయమును గైకొని స్వకపోలకల్పితముగా కావ్యము వ్రాయుట సులభము కావచ్చును. కాని చరిత్ర—యందున పద్య రచన యనునది 'కత్తిమీద సాము' వంటిది.

అధునాతన భావ పరామృష్టములైన రచనలు మనకు స్వల్పము. 'శివ భారతము, రాణాప్రతాప చరిత్ర' ఈ యొండు రెండు మిక్కిలి వ్యాప్తములైన పద్యమయ చారిత్రక రచనలు—వానితోపాటు ఈ 'జలాల్ నామా' యు స్థానము సంపాదించుకొనగల్గునేమో!

'జలాల్ నామా' యను పేరు కన్న 'అక్బరు చరిత్ర' యను పేరులో సంపూర్ణత గోచరించును. కొంతకాలము క్రితము ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'అక్బరు చరిత్ర'ను వచనములో వ్రాసినారు. చరి

త్రలు చదువుటకు ఓపికయే ముఖ్యము. దానికి తోడు వానిపై యభిలాష యవసరము. ఇట్టి విషయములను పద్యములలో తెలిసికొనుట చాలా మందికి 'ద్రావిడ ప్రాణాయామము'గా నుండగలదు. అయినను చదువువారు చదువుదురు.

మొగలు రాజులకు ముందు 'షేర్‌షా' ప్రసిద్ధుడు. ఇతని పుత్రుడు 'సలీకుషా' వీ రుభయులును అక్బరు తండ్రియైన హుమాయూనుకు ప్రతిస్పర్థులు. 1554 నందు సలీకుషా మరణించుటతోనే పర్షియా రాజు పంపిన 14 వేల సైన్యముతో హుమాయూను హిందూ స్థానముపై దండయాత్ర సాగించి ఢిల్లీ–ఆగ్రాలను వశపరచుకొనును. 1556 లో కాలవశమున గ్రంథాలయపు మెట్లపైనుండిపడి యసువులు వీడినవాడు హుమాయూను. తండ్రి మరణము వరకు అక్బరు 13 సంవత్సరముల వాడు. ఈ విపత్కర పరిస్థితిని అదునుగా చూచుకొని 'హేమూ' అను హిందూరాజు ఢిల్లీ—ఆగ్రాలను వశము చేసుకొని 'రాజా విక్రమజిత్' బిరుదము ధరించెను. (సూర్ వంశపు వాడైన ఆదిల్షాకు సేనాని హేమూ). అక్బరు తన సంరక్షకుడైన బైరంఖానుతో బయలుదేరి హేమూను ఓడించి మరల ఢిల్లీ—ఆగ్రాలను స్వాధీనము చేసుకొనును (1556). ఇది రెండవ పానిపట్టు యుద్ధము. దీనితో మొగలు సామ్రాజ్యము స్థిరపడినది.

అక్బరు మొగలు రాజ్య విస్తరణకు 40 ఏండ్లు జైత్రయాత్రలు సాగించినాడు. మాళ్వా (1561) గోండ్వా (1564) చితోడ్ (1568) గుజరాతు (1573) బెంగాలు (1576) కాబూలు (1585) కాశ్మీరు (1586) సింధు (1591) ఒరిస్సా (1592) బెలూచిస్థాన్ (1595) కాందహారులను ఆక్రమించినాడు. ఈ విషయములయందు కొన్ని యీ జలాల్‌నామాయందు తెల్పబడినవి. కొన్నిటికి మాత్రము జయించిన వత్సరములు సూచించిరి. కాని వానిలో కొన్ని హెచ్చు తగ్గు లున్నట్లున్నవి.

అక్బరు జయము, గొప్పదనము మాత్రమే రచయిత యందు తెల్పినారు. కాని యాతని కుయుక్తులు మాయోపాయములు మొదలైనవి తెలుపక పోవుటకు కారణము తెలియదు. ఇట్టి అసమగ్రత వలన పాఠకునకు అన్యథాభావనలు కలుగు ఆస్కారమున్నది.

1595 లో ఖాన్‌దేశ్‌పై దండయాత్ర చేసి అసీర్‌గర్ కోటను పట్టుకొనజాలని అక్బరు సంధికొరకు సుల్తాను నాహ్వానించి మోసముతో బంధించి చెరసాలయందు వైచి దుర్గరక్షకులకు లంచమిచ్చి కోటను స్వాధీనము చేసుకొనును. ఇది చరిత్రలో సుప్రసిద్ధము. ఇదియేగాక మరికొన్ని విషయములను వదిలి యసమగ్రతకు ఆస్కార మొసంగినారు రచయిత.

హిందూస్త్రీని పెండ్లి యాడిన అక్బరు సర్వ మత సహనము గలవాడని ప్రసిద్ధి. సకల మత గురువుల రావించి ఫతేపూర్‌సిక్రీలోని ఇబాదత్‌ఖానా (House ot Worship) యందు మత చర్చలు జరిపించెడివాడు. ఈ విషయమును

ఉ. జైనులు క్రైస్తవుల్ ద్విజులు
సర్వమతస్థులు స్వీయధర్మముల్
తేనియ లొల్కు మాటలను
తెల్లముగా నరనాథు చెంగటన్
పూనిక దెల్ప సర్వమును
బుద్ధి దలంచి మతంబు లన్నియున్
మానవ సేవకే బోడమె
మత్సరముల్ వలదంచు నిట్లనున్.
క. విద్యుచ్ఛల మీ జీవిత
మాద్యుని చింతించు విధుల నరమర లేలా
హృద్యమగు సర్వ మతముల
మిథ్యా వాదంబు లుడిగి మెలగిన యెడలన్.
ఉ. కాం మలిమ్లుచుండు మన
కాయములం గొన బొంచియుండు న
ద్వేల వివాద సంగతుల
దేహి పురోగమ మార్గ దూరవౌ
బాలవధూధనావళుల
భ్రాంతిని బోవిడి, ముక్తికన్యకా
వాలము నాశయించుటయె
ప్రాజ్ఞుల కిద్దర నొప్పు నెంతయున్
ఈ విధముగా సరళముగా సాగిన దీ రచన.

'ఐదు సమాజుల పూజ' చేయు అక్బరు 'అల్లా కృప విజయంబులు పెల్లుగనా కొదవె ననుచు' (172 వ) భావించినవాడు. ఐనను అగ్ని సాక్షిగా

వివాహము, దేవతల యాశీస్సులు, బ్రాహ్మణాశీర్వచనములు—మొదలగునవియు 'జలాల్ నామా' యందు గలవు.

పదునైదు నూర్లపై యే
బదియారవ వత్సరమున బాలకు డగ్బర్
పదునాల్గ ఫిబ్రవరి తరి
బ్రథితాఖిల భరత భూమిపాలకు—' డయినాడు.

(14–2–1556). ఇతనికి విదురునివలె బైరంఖాన్ గలడు.

'పావనంబగు నట్టి యీ భారతభూమి'— సంకుచిత దృష్టిమంతుల జగతి గా'దని భావించిన వా డగ్బరు. అక్బరు జననమునుండి మరణము వరకు జరిగిన చరిత్ర కన్నులకు గట్టునట్లు వర్ణించిన యీ కావ్యమునందు పద్యరచన పరాకాష్ఠ నందినది. ఆధునికుడైన కవి ప్రాచీనసంప్రదాయమును పుడికి పుచ్చుకొన్నట్లు పద్య రచన చేసినారు.

ఫేటీసమరూప బృహ
ద్ఘాటీ ముఖ భద్ర కుంభి దానాంబు నరి
ద్వాటీ బహుధాటీ కన
ఘోటీ తుంగోర్మి తతుల గొమరగు సేనన్
(పు. 112)

ఈ విధమైన పద్యములు మిక్కిలిగా గలవు. సీసపు నడక శ్రీనాథుని పద్ధతిగా చేసినారు. మూల మూలలయందలి ఛందస్సు లేదు. సులభముగా తెలియును.

'ఆహవ త్రియంబకుడు' (పు. 22) అనునది కావలయునని చేసిన ప్రయోగముగా గన్పించును. పిచ్చలించు (పు. 125) భిస్సా (పు. 142) మలిమ్లుచ (పు. 174) ఇత్యాది శబ్దములు సార్థకములుగా ప్రయోగించినారు. అయినను 'పాలపయోధి' (పు. 99) వంటి సమాసములు దొర్లినవి.

సప్పంబు పడగ నీడను
కప్పగతిం....' అన్నారు. సర్ప—కప్ప సుమతి శతకములోని పద్యము. దాని ప్రాస సరిగా ఉపయోగించినారు. శతకమునందును 'సప్పంబు' అనుపా ము క్వాచిత్కముగా గలదు. వర్ణనలయందును, పాత్ర రస పోషణయందును మిక్కిలి నేర్పు చూపినారు. చారిత్రక కావ్యములు రాయలసీమనుండి పద్య రూపముగా వచ్చుటలో ఇది మూడవది.

పద్యములలో చరిత్ర చదువగోరు వారి కీ గ్రంథ ముపయోగించుగలదు.

—శ్రీ రంగాచార్య.

కమ్మ తెమ్మెర

[కథల సంపుటి. రచయిత: మధురాంతకం రాజారాం. ప్రతులకు : విశ్వప్రభ ప్రచురణలు; నేంద్రగుంట. చిత్తూరు జిల్లా. వెల : రూ. 4/-లు.]

శ్రీ మధురాంతకం రాజారాం కథలు ఆంధ్ర పాఠక మహాజనంలో భిన్నతరగతుల వాళ్లకు నచ్చుతాయి.

ప్రపంచ సాహిత్యంలో ఉత్తమ కథ అయినా పాఠకులలో అన్నితరగతుల వాళ్లకు నచ్చదు!

ఈ కథలు నచ్చుతాయి!

కారణాలు అనేకం!

ఒకటి హృదయ బలం. రెండు వ్యక్తీకరణ. మూడు భాష. ఇంకా ఇంకా

రచయిత హృదయంలోని కోమలోహ పాఠకుల హృదయాంతరమందిరావరణంలో హాయిగా కదులుతుంది.

కథ చెప్పే పద్ధతి, పాత్ర చిత్రణ, ఉపసంహారోచితంగా సాగే రచనావిధానం ఆలోచించే వాళ్లకు ఆనందం కలిగిస్తాయి.

ప్రాచీన భాషా సంస్కారంలో పుట్టి, ఆధునిక భాషా రూపంలో ఆవిష్కృతి పొందే కథ అటు ఆ భాష వాళ్లకూ, ఇటు ఈ భాష వాళ్లకు మధ్యే మార్గంగా వుంటుంది.

ఇంకా అనేక సల్లక్షణాల వల్ల ఈ రచయిత కథలు అనేకులకు నచ్చాయి.

ఈ సంపుటి సంవత్సరం క్రితం చదవటం జరిగింది. అప్పట్నుంచి గుర్తున్న కథలు. 'కమ్మ తెమ్మెర': చలిలో మునగర దీసుకు పడుకొన్న యువకుడి కప్పబడ్డ దుప్పటి కథలో పట్టయిన సన్నివేశం. మరువురాదు.

'ఘనసన్మానం' లో భర్త గొప్పవాడు కావటానికి భార్య కారణం అనే ఆలోచన నుండి పుట్టిన కథాంశం, విస్తరింపబడింది. రచయితను గౌరవించటం అంటే, కార్యం కంటే కారణం బలమైంది కాబట్టి రచయిత భార్యను గౌరవించ

మని అనుకొన్న ఊహ చక్కగా అల్లుకుపోయిన కథ 'ఘనసన్మానం'.

'కార్బ్టాన్' మంచికథ. కార్బ్టాన్ గీయబోతే చక్కని చిత్రం అయిందని రచయిత కథలో ఎక్కడో పలికిన మాట బహుపర్యాయాలు గుర్తుకు వచ్చింది.

'తలుపులు—తాళాలూ'. ఇళ్లకూ వాకిళ్లకూ వేసుకోవలసిన తలుపులూ తాళాలూ గుండెకూ నోటికీ వేసుకోవలసి రావటం వింతయిన విషయం!

'ఖాళీఘటా' ఏదో హిందీ సినిమా పేరును గుర్తుకు తెచ్చేదే అయినా, హృదయబలం ఉన్న కథ. కాళీ జాకీ చూచి ఏవరయినా ఏమను కొంటారు? గుండెల్లోని సజీవవిగ్రహాలను చూచి మండిపోయే కథ

ఇచ్చిన రాజీనామా ఇవ్వనట్లయి, పోయిందను కొన్న ఉద్యోగం పోకపోతే కలిగే ఆనందం కనబరిచే కథ 'బెరామీటరు'. సామాన్య ఉద్యోగి జీవితంలో కలిగే ఆందోళనల అంతరార్థం ఈ కథ.

లోకంలో ఎన్నో విషయాలు గుడ్డిగా నమ్మాలి. నమ్మకం—పోనీ ఎదుటి మనిషిని అను మానించకపోవటం— ఈలోకంలో హాయిగా జీవించ టానికి ఒక్కొక్కప్పుడు తప్పకుండా ఉండాలి. జగన్నాథం డబ్బు—గొలుసు— వ్యవహారంలో రామ లింగం తెలుసుకొనేటట్లు చేసిన కథ 'జాగరూకుడు'.

'మెత్తని పులి' తిక్కన మాట. ఇదొక కథ. ధర్మరాజు లాంటి వాడో పాత్రగా ఉండాలని పాఠ కులకు అనిపిస్తుంది. కాని అటువంటి పాత్ర ఏమీలేదు. అన్న తమ్ముణ్ణి అన్యాయం చేయబోతే, తమ్ముడు దైవికంగా న్యాయం చేసుకొన్న కథ 'మెత్తని పులి'.

డబ్బు మనిషిని ఎలా ఆడిస్తుందో తెలిపే కథ 'నమ్మరానివాడు'. పల్లె జీవితం ప్రత్యక్ష మయిన కథ. ప్రత్యక్షమయిన ప్రబుద్ధుడు విచిత్ర పాత్ర!

'రామారావు చతుర్లోకాలు'లో రచయిత జీవితం ఏమయినా చోటు చేసుకొందా అని పాఠ కులు అనుమానిస్తారు. అంతటా ఉన్న సంసారాల గొడవ కథ, పల్లె జీవితం ప్రదర్శించింది.

అమ్మాయిని పెళ్లాడుతా 'డనుకొన్న అబ్బాయి అన్యాయం చేసిపోతే అన్యాయం అయి పోయి లీలావతమ్మ, అబ్బాయి ఉత్తరం చదివి, ఏమయినా సరే ఆ అబ్బాయినే పెళ్లాడుతానని 'అపరసావిత్రి'లా అమ్మాయి అన్యాయమయి పోతే, మళ్లీ అన్యాయ మయి పోయిన లీలావతమ్మ లీల 'సర్వీసు రిజిష్టరు'. ఈ కథ కంటే కథ పేరు ఎంతో నచ్చింది.

'బ్రతుకనేర్చిన మనిషి' ఉద్యోగి— బంట్రో తుల కథ— సామాన్య కథ.

'రంగయ్య తమ్ముడు' మంచికథ. చదివి ముగించిం తర్వాత హృదయం మూలుగుతుంది. ఇంత కార్కశ్యం, ఇంత కోమలత్వం ఒక్క తల్లి పిల్లల్లో ఎలా సాధ్యమా అని ఆశ్చర్యం కలుగు తుంది. రెండు భిన్న కారణాలు ప్రదర్శించిన కథ. ఉత్సుకత రేకెత్తుతుంది.

సంసారయాత్ర సగందూరం చేసిన వాళ్లకు, అప్పుడే ప్రారంభించిన వాళ్ల (రైలు ప్రయాణం లాగా) కలిస్తే ఏర్పడే దశలలో ఒకటి పరికించిన కథ 'సహజీవనం.' ఇటువంటిదే శ్రీ వానమూర్తి కథ ఒకటుంది.

బాగా గ్రాంథిక భాషావాదుల కీ పుస్తకం నచ్చనట్లే, బాగా వ్యావహారిక భాషావాదులకూ నచ్చదు. ఈ అతివాదులు అల్పసంఖ్యాకులు. కాబట్టి చింతలేదు.

కథ తాపీగా సాగుతుంది. తొందర ఉండదు. కొందరు వేగం లేదనుకోవచ్చు.

సన్నివేశమూ, పాత్రలూ బాగా వర్ణింపబడ తాయి. ఎక్కువ వర్ణన లున్నాయి. కథాగమనం ఆపేంతగా అధికంగా వర్ణన లున్నాయని ఎవరి కయినా అనిపించవచ్చు.

కథకు పేరు పెట్టటంలో రచయిత తగి నంత జాగరూకత, సామర్థ్యం, ప్రదర్శించటం పాఠకులు గమనిస్తారు.

శ్రీ మధురాంతకం రాజారాం ఆంధ్ర సాహిత్యం లోని బహ్వల్పసంఖ్య కథా రచయితలలో పేర్కొనదగ్గ దగ్గ రచయిత.

ఈ కథల సంపుటిలో రెండుమూడు కథలు తప్ప, మిగతావి రచయిత గౌరవం నిలుపగల కథలు.

కలకంఠి

(కథల సంపుటి. రచయిత : రాచకొండ విశ్వనాథశాస్త్రి. ప్రతులకు : విజయ బుక్స్; మొగల్రాజపురం, విజయవాడ—2. వెల : రూ. 2—50.)

ఇందులో ఎనిమిది కథలున్నాయి. ఈ రచయితవి ఇంకొన్ని కథలున్నాయి. అన్నీ చదివిం తర్వా తనిపిస్తుంది:

శ్రీ రా వి శాస్త్రి కథా రచయిత. విశిష్ట కథా రచయిత. విశిష్ట కథా విశిష్ట రచయిత.

కథల్లో కథా వస్తువు రెండు విధాలు. ఒకటి పరిచితం. మరొకటి అపరిచితం.

పరిచితాపరిచిత కథావస్తు రచనా ధోరణిలో అపూర్వానంద ప్రదర్శన సామర్థ్యం రచయిత వైశిష్ట్యం.

'సృష్టిలో' కథా వస్తువు— అందరికి పరిచితం కాదు.

కోడికత, పీరన్న కత, నక్కతల్లి కత, పిల్ల నక్కలకత, పీరివాయుడు కత, పోలీసు జవానుకత— వెరసి సర్వసృష్టి సంభావన 'సృష్టిలో' పాఠకులకే కాదు, రచయితలకే అపరిచిత కథ.

అంచేత, నూత్న వస్తు దర్శనాసక్తమనస్వి రచయిత.

'ముగ్గురు గుమాస్తాల కథ'లో కథావస్తువు అనేకులకు అపరిచితం కాదు.

బీదతనంతో సతమతమయ్యే రవి, పెళ్లిగిళ్లీ లేకుండా సుఖంగా ఉండాలనుకొన్న సుధాకర్, ఉరఫ్ సుధ, చాలే జీతం లేక, చాలినంత పెళ్లాం వుండి, వచ్చే రాబడి లేక, వచ్చే పిల్లలుండి, తిండిలేక తిప్పలుండి, పగలులేక, రాత్రి వుండి, జీవించే బాబులు, ప్లస్ సుశీల ఈజీక్వల్‌టూ నలుగురు గుమాస్తాల కథను తవచుట్టు తిప్పు ముప్ఫయి రూపాయల మొత్తం— ఎంతో పరిచితమైన కథ.

అందువల్ల, పరిచిత వస్తు ప్రపంచనాసక్త మనస్వి రచయిత.

మనిషి అమాయికత్వంమీద మంచితనంమీద శోకాలేని నమ్మకం రచయితకు వుంది.

ఉదాహరణ : 'మూరిబాబు నవ్వు'.

గిరిబాబు అమాయిక వ్యక్తి.

మూరిబాబు మంచివ్యక్తి.

గిరిబాబు రమ దృష్టిలో, శ్యామ దృష్టిలో కాలేజీ భామ దృష్టిలో, అమాయికుడు.

మూరిబాబు గిరిబాబు దృష్టిలో మంచి వాడు. మరొకరి దృష్టిలో మాట్లాడ్డానికి పీల్లేడు.

కనుక, అమాయికుడు, సన్యాసి అయినా సరే, మంచివాడి పుణ్యమా అని గడిచి గట్టెక్కి కాలు మీాద కాలు వేసుకొని, నోట్లో వేలు పెట్టుకొని కూర్చుంటాడని రచయిత నమ్మకం.

'నల్లమేక'లో మేక కథ—ఏదో—ఒకపేరు. 'ది స్మోకింగ్ టైగర్ అను పులిపూజ'లో పులి కథా— ఏదో—ఒక—పేరు.

మేకలు పుల్లు ప్రధానపాత్రలుగా వెలువడిన సాహిత్యంలో ఉత్తమశ్రేణి సాహిత్యం ఏమాత్రం?

'నల్లమేక'లో సమాజ పరిశీలన, 'ది స్మో... పూజ'లో సోషల్ సెటైర్ కనిపిస్తాయి.

మేక తీసిన ప్రాణం చిందించిన రక్తం రుచికానీ, జనం గుండెల్లో పొంగిన మాటల్లో వినిపించిన చప్పుళ్లు కానీ, తెలుసుకోవాలంటే, 'నల్లమేక' చదవాలి.

మహారాజాతో పోనీ మహామినిష్టర్‌తో, కూర్చుని విందు భోజనం తినాలంటే సామాన్య సైనికుడికి పోనీ అతిసామాన్య ఓటర్‌కు మొదట ఉండాల్సింది గుండె ధైర్యం. తర్వాత తిన్నది జీర్ణం చేసుకోగల ఓపిక.

ఈ రెండూ ఉంటే తప్ప 'ది స్మో— పూజ', చదవకూడదు.

గ్రే మార్కు సిగరెట్లు పులి మార్కు సిగరెట్లు మధ్య మనిషి పొందే మానసిక వ్యథ అవకాశ వాదనలు ప్రధానం కావు.

కొత్త వింత పాత రోత! నిజమే!

అయినా గ్రే మార్కు సమాజం పులి మార్కు సమాజం— నిజమే— పుడతాయి! వింతలూ మోజులూ ఉంటాయి. అయితే ఒక చేప మరో చేపను మింగినట్లు ఒక సమాజం మరో సమాజాన్ని రూపం లేకుండా చేయగల్దు! హెచ్చరిక!!

చూడండి! చిరివకి పులి ఏం చేసింది? ఏమయినా చేస్తుంది! ఈ రోజుల్లో పడిపీథుల్లో

జరిగే నాజూకయిన హింసలో ఆదీ ఓ లేచిపోయిన ప్రాణ హంస!

నాణెం రెండు ప్రక్కలా బొమ్మా బొరుసు వుంటాయి. 'ఎండ', 'వర్షం' ఒక నాణెం బొమ్మ బొరుసులు.

వాన తగ్గి ఎండ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూచే పసిఆశ కథ 'ఎండ'.

వాన తగ్గి ఎప్పుడు తెరిపిస్తుందా ప్రయాణం వీలు కలుగుతుందా అనే యువకధైర్యం కథ 'వర్షం'!

కురుస్తున్న వర్షం నాణెం. గుండెలు మండేలా కురుస్తున్న వర్షం!

"(విశాఖ రచయితలని సంఘంవారు తమ సభ్యు లందర్నీ "ఓ పేదవాడూ ఒక ధనికుడూ ఒకే స్త్రీని కాంక్షించుట" అనే ఇతివృత్తం తీసు కొని కథ రాయమన్నారు. అందు గురించి రాసిన కథ ఇది.)"

అందు గురించి రాసిన కథ ఇందు కని పించు 'కలకంఠి.'

ఏం అంత చిత్రంగా వుంది భాష! 'కాం క్షించుట' ఏమిటి? 'వారు' ఏమిటి?

"స్త్రీని పాత్రగా తీసుకోమంటే యువతిని పాత్రగా తీసుకోవటమేమిటి?

ధనవంతుడు, ధనహీనుడు వీళ్లిద్దరిలో యువతి ధనవంతుణ్ణి మెళ్లో వేసుకొంటుందని ఏమిటి గ్యారంటీ! పోనీ ఇదో చిత్రీకరణ—ఒక చాయ. ఒక రీతి. ఒక తోవ! అంతే!

కథ వ్రాయటం ఎంత కష్టమో, దాని పేరు పెట్టటం అంత కష్టం అని ఎవరో ఒక రచయిత ఇంగ్లీషులో అనటం చదివినట్టు గుర్తు!

కాకపోతే, కథ వ్రాయటం ఎంత సుఖమో దానికో పేరు పెట్టటం అంత సుఖం! అని అయినా అనవచ్చు.

కాని, శ్రీ రా వి శాస్త్రి కథ సుఖంగా వ్రాసి కష్టంగా పేరు పెడుతున్నట్టు అనిపిస్తుంది.

'వల్లమేక', 'ఎండ' నామకరణం బాగా జరిపించుకొన్నాయి.

'సృష్టిలో' కథ బాగుంది. అనుమానం లేదు. అయితే కథ పేరు 'సృష్టిలో' అయ్యేసరికి సృష్టిలో జరుగుతున్న ఎన్నో ధర్మాలు అంటే ఎన్నో సృష్టి ధర్మాలు రచయిత చెప్పవచ్చునని పాఠకుడు ఆశ పడతాడు. సృష్టి ధర్మాలలో నిరం తర హింస ఒకటి! అయితే అది ఒక్కటే సృష్టి కాదు.

'సూరిబాబు నవ్వు'లో సూరిబాబు నవ్వు మాత్రమే కథకు ప్రాణంకాదు. గిరిబాబు బాధ!

'ది స్మోకింగ్ టైగర్ అను పులిపూజ'. 'టైగర్' అనవచ్చు. 'స్మోకింగ్ టైగర్' అనవచ్చు. ఇంకా అనదలిస్తే 'ది స్మోకింగ్ టైగర్' అనవచ్చు. లేదా 'పులి' అనవచ్చు. కాదంటే 'పులిపూజ' అన వచ్చు. కాని 'దీ స్మోకింగ్ టైగర్ అను పులిపూజ' అననక్కర లేదనిపిస్తుంది. కథా హృదయం బరు వును కథాశీర్షిక వ్యక్తం చేసేలా లేదు, సరికదా కథాగౌరవం పోగొట్టేది లాగా వుంది.

ఒక కథల పుస్తకానికి పేరుపెట్టవలసి వస్తే ఏంపేరు పెట్టాలి? ఒక కథ పేరు పెట్ట వచ్చు! ఏ కథ పేరు? సాధారణంగా మంచికథ పేరు! ఈ సంపుటిలో మంచికథలు ఏమిటంటే 'ది స్మో...పూజ' అనో, 'సృష్టిలో' అనో ఎవరైనా ఇంకేమయినా అనో చెప్పవచ్చు. కాని కలకంఠి అని మాత్రం ఎవరైనా చెబుతారో లేదో తెలి యదు. ఆ కథ ఎంత గొప్పదో, ఆపేరు అంత గొప్పది. ఆ పేరు పుస్తకం పేరు అయిందేమో అని బాధగా వుంటుంది.

ఇటువంటి పేర్లు ఉన్న పుస్తకాలు బాగా అమ్ముడుపోయాయి, ఇక పోతాయి అన్న ధీమా ఏమన్నా ఉంటే, వ్యాపార దృష్టితో ఇటువంటి పేరు పెట్టటం తప్పు అని ఎవరనగలరు!

కథ పేర్లు కథ, ఎలా వున్నా, కథా రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి పేరు మాత్రం సాహిత్య చరిత్రలో శాశ్వతమయింది!

—కె. ఇనాక్.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street. Madras-1. Editor : S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/–	రు. 150/–
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/–	రు. 125/–
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/–	రు. 100/–
అర పేజి	....	రు. 65/–	రు. 55/–
పావు పేజి	...	రు. 40/–	రు. 35/–

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	..	రు. 12–00
6 మాసముల చందా	....	రు. 6–06
విడి ప్రతి	...	రు. 1–00

మేనేజరు, భారతి
మద్రాసు–1.